భారతి

సాహిత్య మాసపత్రిక

ఆంధ్ర సాహిత్య పరిషత్తు, కాకినాడ. TELUGU ACADEMY, COCANADA

★

సంపాదకుడు

శివలెంక శంభుప్రసాద్

ఆంధ్ర సాహిత్య పరిషత్తు, కాకినాడ. TELUGU ACADEMY, COCANADA

ఫిబ్రవరి 1957

సంపుటము 34 : : సంచిక 2

విడిపత్రిక వెల ఒక రూపాయి

1. [illegible]
2. [illegible]
[illegible]

విషయానుక్రమణిక

ఫిబ్రవరి 1957

నీ డ వ య్యా రి

శ్రీ నండూరి వెంకటసుబ్బారావు

ఏనాటికిని మరపురానీని బాధ
ఎంకి నను చేపట్ట శంకించు గాథ !
పరమిండకె తా మరలి
ఇలు చొరబడిన రేయి—
గోడ దన నీడైన
చూడనే పొంచుంట
ఏనాటికిని...

నీడవయ్యారి నడ
యీడ నామేనిదడ,
నీడతలలో తలపు
జాడ గన నా తపన !
ఏనాటికిని...

నీడ నిశ్చింతగా
నిదురింప నావంత,
కదలె నానీడ—నా
కలలె యను నా జాలి !
ఏనాటికిని...

నీడోకలె—కనుచెదిరి—
జోడువలె నగపడుట
నీడలనె పట్టి తును
మూడ నే నెగబడుట !
ఏనాటికిని...

నీడలనె నమ్మి వ్రే
లాడు చిత్తక్షోభ !
ఏనాటికిని...

మంజు

శ్రీ అరిపిరాల విశ్వం

"మంజూ! మంజూ! నేను వచ్చానమ్మా నిన్ను తీసుక వెళ్ళటానికి. అవును నీ వివ్వాళ తప్పకుండా వస్తావనే చాల పెందలాడే వచ్చేశా! అయ్యో—ఏదీ?...ఈ పెట్టెలో వుందేమో?" అంటూ ఒక మనిషి ప్రతిపెట్టెదగ్గరకూ హడావిడిగా తిరుగుతున్నాడు. ఇంతలోనే రైలు పెద్దగా కూతవేసి గుప్పున పొగవిడుస్తూ వెళ్ళిపోయింది. పాపం అతనూ ఒక పెద్ద నిశ్వాసాన్ని వదలి రోజూమాదిరిగానే యీ వేళ కూడా నిశ్శబ్దంగా వెళ్ళిపోతున్నాడు.

ప్రపంచ దృష్టిలో అత డొక పిచ్చివాడు. నిజమే అచిరిగిపోయిన గుడ్డలూ పెరిగిపోయిన గడ్డాలూ మీసాలూ అతనికిచ్చే యోగ్యత అంతే. ఎవరు మాట్లాడించినా మాటాడడు కాబట్టి, తనలో తనే ఏమిటో యెప్పుడూ ఏదో చెప్పుకుంటూ వున్నచోట వుండక అంతటా తిరుగుతాడు కాబట్టి అతన్ని లోకం పిచ్చివాడనే పిలుస్తోంది.

కొందరు అదృష్టవంతులు మేడల్లో జన్మిస్తారు. మరికొందరు దురదృష్టజీవులు ఆ మేడల నీడల్లో అడుక్కుంటూ బ్రతికే అభాగ్యులకు అత్యంతభారంగా పుట్టుతారు. పుట్టిన ప్రతిజీవికీ ఆశ అనేది వుండటం సహజమే కావచ్చు. ఆ ఆశనే తమ ఆశయంగా కలలుగంటూ తమ జీవితంలో దాన్ని పొందగలిగేవారు కొందరు, చివరి క్షణందాకా దానికై బ్రతుకంతా బలియిచ్చి ఏమీ మిగులక బరువు గుండెతో మరణించే అనాథులు కొందరు.

జీవితంలో ఆశించింది లభించకపోవచ్చు, ఆశించనిది హఠాత్తుగా సంభవించి, భావించని రీతిగా అదంతా మాయమైపోవచ్చు. కాని దానితాలూకు ఛాయలు ఆ జీవిని అనవరతం వెంటాడుతూనే వుంటయ్. ఎండమావుల్లోని నీటితో, తన దాహం తీర్చుకోవాలని తీరని కోర్కెతో పరుగెత్తుతూ వుంటాడెక్కడికో అంతు తెలియని చోటికి. దానితో ఎప్పటికీ దాహం తీరదని తెలుసు కాబట్టి మనమంతా మామూలుగానే వున్నాము. ఆ యథార్థాన్ని తాను నమ్మలేడు కాబట్టి అతను పిచ్చివాడై తిరుగుతాడు.

ఈనాడు పిచ్చివాడైపోయిన అతనూ ఒకనాడు జన్మించింది సంపన్నగృహస్థుల యింట్లోనే. నాన్న దయాగుణం కలవాడు కాబట్టి అందరి కష్టాల్నీ తనవిగా భావించేవాడు. ఎంతో ఉదారుడైన వ్యక్తిగా జీవిస్తూ, తన ఏకైకపుత్రుణ్ణి చాల గొప్పవాడిని చేయాలని ఉవ్విళ్ళూరేవాడు. అమ్మ తనకు ఒక్కడే ఒక్కడని అబ్బురంగా పెంచుకుంటూ ఆశలన్నీ అతనిపైనే పెట్టుకొని బ్రతికేది. నాన్న ఒకనాడు వేలమైపోయేందుకు వచ్చిన ఆవూరి ఆసామి ఆస్థిని తానడ్డంవుండి కాపాడాడు. పాపం పిల్లా జల్లా నిలువ నీడలేని నిరాధారులై పోతారని కనికరించాడు. దుఃఖంవెంట సుఖం, వెలుగువెంట చీకటీ—అలాగే కృతజ్ఞతను కృతఘ్నతా ఎప్పుడూ ఛాయలాగా వెంటాడుతూనే వుంటయ్. ఇంతెందుకు యీ సృష్టి సమస్తం పరస్పరవిరుద్ధశక్తుల సంఘర్షణా స్వరూపమైనది. అదే సర్వవిఘ్నాలకు సంగమతీర్థము.

సృష్టి పరిణామశీలమైనది. అందులోని ఉపాంగమైన జీవితమూ అంతే. ఆ జీవితముపైన బాహ్యపరిస్థితుల బహుళమైన ప్రభావం చాలా వుంటుంది. దానికి లొంగక జీవింపగలిగేవారు చాల తక్కువ.

ఎవరిని ఒకనాడు తాను కనికరించాడో ఆ వ్యక్తులు యీ రోజున తనను కరుణించవలసినవారుగా మారిపోయారు. తత్ఫలితమే యావదాస్తీ బాకీదారుల పరమైపోవటం. ఈ అవమానాన్ని సహించలేని నాన్న ఒక చెడ్డరోజున బలవంతంగా బ్రతుకు నంతమొందించుకొన్నాడు.

ఎప్పుడూ బయటిముఖం చూడని అమ్మ పొట్టకూటికోసం రహస్యంగా గౌరవనీయుల యిండ్లలో పని చేసి తనకు చదువు చెప్పించింది. ఆ ఊరిలో వున్న అయిదు తరగతుల చదువే గొప్ప అని అనుకొనేవాడతను.

నాన్నపోయిన దిగులుతోను, దుర్భరదారిద్ర్యంతోను, అవమానంతో క్రుంగిపోయే అమ్మ మంచమెక్కింది. అయినా తనను గొప్పవాడివి కమ్మని ఆశీర్వదించేది. సంవత్సరం తిరుగకముందే ఆ మహాసాధ్వి

* ఉస్మానియా విశ్వవిద్యాలయం జరిపిన పోటీలో ప్రథమ బహుమతి పొందినకథ.

పరలోకగతురాలైంది. ఉద్దేశరహితంగా అనాథలాగా అందరి విమర్శలకు గురౌతూ ఈ పల్లెటూళ్లో వుండలేక ఉద్యోగంకోసం దాపునవున్న బస్తీ చేరాడు గంపెడాశతో.

2

'దయగలబాబులు! ఓ కానీ ధర్మం చెయ్యండి స్వామీ! మీకు పుణ్యముంటుంది' అంటూ ఒక ఆరేళ్ళపిల్ల అందరిదగ్గరా అడుక్కుంటోంది.

బాగా బొజ్జలు పెంచి తిన్నది అరిగేవిధమేమిటా అని విచారపడే మహనీయులు పాపం ఆ పిల్లకు ఏమీ రాల్చలేదంటే అతిశయోక్తి కాకపోవచ్చు. జానెడు పొట్టకోసం యెలా బ్రదకాలా అనుకొనే అనేకమంది గుండెల్లో జీవిస్తున్న కనికారమే అప్పుడప్పుడూ ఆ చిన్నిపిల్లచేతిలో ఓ కానీ, అర్థణాయో రాలిపిస్తోంది.

ఆ బస్తీప్రక్కనే పార్కే పదిబల్లున వేయబడిన బెంచీలపై కూర్చొని సాయంత్రం చల్లగాలికి కాలక్షేపం చేయటానికి అనేకమంది చేరుతూవుంటారు. చెట్లుకూడా బాగా పెంచబడినవి.

అప్పుడే చంద్రుడు ఆకాశంలో తన కిరణాలను ప్రకాశింపజేస్తున్నాడు. ఎక్కడో ఓమూల బెంచీపైన చిరిగిపోయిన గుడ్డలలో, రేగిపోయిన జుట్టుతో మోకాళ్ళపైన తలపెట్టి విచారంగా కూర్చున్న మన 'రామూ' దగ్గఱకు వచ్చిందాపిల్ల.

'బాబూ! ఓ కానీ యివ్వు బాబూ! ధర్మప్రభువులు' అంటూ బిగ్గరగా అనేసరికి ఉలిక్కిపడి తలెత్తిచూచాడు.

'మిమ్మల్నే సామీ! దరమంచెయ్యండి బాబూ!'

'నేను బాబునుకాదు. ధర్మం చెయ్యటానికి నా దగ్గరేమీ లేదు.'

'మీరు మహారాజులు, బీదపిల్లకు ధర్మం చెయ్యండి' అంది.

'ఏయ్ పొమ్మంటే నీకుకదూ!' అని రామూ మరల మోకాళ్ళపై తల ఆన్చి విచారంలో మునిగిపోయాడు:

పొమ్మంటే పోని ఆ కొంటెపిల్ల అంతకుముందే తాను కొనుక్కున్న మరమరాలు తింటూ కాళ్లాడిస్తూ, ఆ బెంచీపైన చతికిలబడి మెల్లగా కూనిరాగాలు తీస్తోంది.

ఇంతలోకే రామూ తలెత్తిచూచాడు. ఆ పిల్ల ఆకాశంలో చందమామనుచూచి మురిసిపోయి మరమరాలు తింటూ పాడుకొంటోంది.

'ఏయ్ నీ పేరేమిటి?' అన్నాడు.

ఆ అమ్మాయి ఉలిక్కిపడి.......మెల్లగా 'మంజూ' అంది.

'అయితే మీ యిల్లెక్కడ?'

'పూలబావి దగ్గఱ.'

'మీ అమ్మా నాన్నా ఏం జేస్తూంటారు?'

'మా నాన్న చచ్చిపోయాడు' అంది.

'మరి మీ అమ్మో!'

'మా అమ్మ దగ్గుమనిషి. ఎప్పుడూ మంచంలోనే పడివుంటుంది.' అన్నది.

'అయ్యొ పాపం' అంటూంటే అతని కన్నుల్లోకి నీరు దానంతటదే వచ్చింది.

'అదేంటి బాబూ! కన్నుల్లో నీరెందుకు?'

'ఆ, ఏమీ లేదులే యేదో జ్ఞాపకంవచ్చి' అని మరిపించబోయాడు.

'మనది యీ వూరేనా బాబుగారూ' అంది.

'కాదు యిప్పుడు నాది అనేది యేవూరూ లేదు.'

'అదేంటి బాబూ? మీ అమ్మగారూ నాన్నగారూ ఎక్కడున్నారు?'

'స్వర్గంలో'.

'అంటే...అదేంటి బాబూ? ఎక్కడది?' అంది,

'అంటే...చచ్చిపోయారులే' అన్నాడు.

'మరింకా ఇప్పుడెవరున్నారు బాబూ?'

'నేనొక్కణ్ణే...యింకెవరూ లేరు.'

'మీ యిల్లెక్కడ బాబూ?'

'ప్రస్తుతం యిదే నాయిల్లు'.

'మరి అన్నం ఎక్కడ తింటారు సామీ?' అంది.

'అన్నంతిని అయిదురోజులైంది. పోనీలే... రేపటినుంచీ నాకుగూడా అడుక్కోటం నేర్పుతావ్? నిజంగా...' కంఠం గద్గదమైంది అతనికి.

'బాబూ? యీ మరమరాలు కాసినీ తినవ్?' అని వాటిని తనముందు పెట్టింది.

'ఆహా...అక్కర్లా...అక్కర్లా.'

'పోనీ మాయింటికెల్దాం అంది.'

'వద్దులే' అన్నాడు.

'అక్కడ మాకు బండీ ఎద్దూ వున్నయ్' అంది.

'మరి నీవు అడుక్కుంటున్నావెందుకు?'

'నాన్నపోయిన తరువాత తోలేవాళ్ళులేక... అమ్మకేమో జబ్బు...' అంటూ ఆ అమ్మాయి తుర్రున పారిపోయింది.

'అబ్బ! ఎంత తెలివైనపిల్ల. ఎంత అందమైనదీ... అయినా అడుక్కుంటోంది'. అనుకున్నాడు తనలోలోపల. తనూ బహుశా రేపటినుంచీ అదే పనిచేయాలేమో' అని ఒక్కసారి జ్ఞప్తికి వచ్చి ముఖానికి చేతులు కప్పుకొని ఏడుస్తున్నాడు.

3

డాక్టర్ సరోజినీదేవి అప్పుడే హాస్పిటల్‌కు వెళ్ళేందుకు తయారౌతోంది. ఇంతలో బయట ఎవరో పాటపాడుతూ పెద్దగా 'బిచ్చమెయ్యమ్మా!'.అని అరుస్తూంటే వళ్ళుమండి చర్రున బయటికి వచ్చింది కోపంతో.

'జాలిగల్లాతల్లి జాణైన పోయమ్మ!
కాలే కడుపుకు యింత గంజైన చాలులే—
అమ్మగారీయిళ్ళు దరమలోగిళ్ళు'

అంటూ జాలిగొలిపే గొంతుతో పాడుతూ యింటిముందర నిలుచుంటే కోపమంతా ఏమయిపోయిందో—'అయ్యోపాపం చిన్నపిల్ల' మన ఉమ యీడుకే. ఎఱ్ఱగా ఎంతచక్కగావుంది!' అనుకుంటూ నిలబడింది.

ఇంతలోనే పాట ఆపి 'అమ్మా! ఇంత బిచ్చమేయమ్మా!' అంది మంజూ.

'ఏయ్ అప్పుడే తెల్లవారిందీ బయలుదేరావ్!' అంది సరోజినీదేవి.

'తల్లి గారూ! దయగలవారు, ఓ చినిగిపోయినదో, పాతదో, మీ బిడ్డలు దొడిగేసింది ఓ గౌనో, పరికిణో దర్మంచెయ్యండి అమ్మా!' అంది.

'ఆ...ఎంత తెలివిగలది', అనుకుంది డాక్టర్.

'అమ్మా నాన్నా లేరూ? అడుక్కోటానికి బయలుదేరావ్ అప్పుడే' అంది.

'కాసిని బిచ్చమేయమ్మా' అంది మంజు.

'ఏయ్ సరేగాని అడుక్కు తినకపోతే మా అమ్మాయికి నౌకరుగా ఉండగూడదూ' అంది. 'రేపు మా అమ్మని అడిగిచెప్తానండీ!' అంది మంజూ.

*   *   *

ఆరోజు సాయంత్రం మామూలు వేళకు 'రామూ' అక్కడకు వచ్చేసరికి 'మంజూ' వచ్చి, మోకాళ్ళపైన తలపెట్టుకొని కూర్చుంది.

'ఏమిటి మంజూ! ఎందుకట్లా వున్నావ్?' అన్నాడు రామూ. తలెత్తి, 'అమ్మకు బాగా ఎక్కువగావుంది. ఏమైనాసరే ఇవాళ నీవు నాతో రాకపోతే యిక నేను యిక్కడనుంచి కదలను. నిజం, ఎందుకో భయంగావుంది' అంటూ అమాయికంగా అతని భుజాల పైన తలపెట్టి ఏడుస్తోంది.

'ఛా...ఒచ్చిపిల్లా ఏడుస్తారా? పద వెళ్దాం' అంటూ మంజూను అనుసరించాడు రామూ.

తను ఆ పూరిపాకలోకి ప్రవేశించబోతూంటే దగ్గు వినిపించింది.

ఇంతలోకే మంజూ 'అమ్మా! కళ్ళెత్తిచూడవ్' అంది.

అమ్మ లేచింది మెల్లగా. నుంచున్న రామూను కూర్చోమని చేతితో సంజ్ఞ చేసింది. మంజూ చిన్న కుండలో నీరు తేవటానికి పోయింది.

అమ్మ చెప్పటం ప్రారంభించింది. 'నాయనా! మూడు నెలలనుంచీ రోజూ మంజూ నిన్నుగురించి చెప్పని రోజులేదు. ఇవేళటికి చూడగలిగాను. ఏం చేస్తాను నాయనా! తోటి పిల్లలంతా బడిలోకి పోతూంటే దాన్నేమో ఊరునిండబడి బిచ్చానికి పంపుతున్నాను. వాళ్ళ నాన్నే వుంటే యీ పాటికి ఎంత చదువు నూరిపోసేవారో! ఆయన ఎప్పుడూ అంటూండేవారు—'మంజూని పెద్దడాక్టర్ చేయాలని.' ఏదీచూడకుండానే ఆయన వెళ్ళిపోయారు, ఓబండినీ, ఎద్దునూవదలి. ఆయన బడిచెబుతూ యీ బండినీ ఎద్దునీ ఎవరిచేతనైనా తోలించేవారు. సంపాదించే నాథుడు పోయినట్టే మా అదృష్టం కూడా వెళ్ళిపోయింది ఆయనతోపాటే. ఈ సంవత్సరంనుంచి సరైన మనిషి లేక ఆబండి ఎద్దూ అట్లాగే వున్నయ్.

'ఆ బండి నేను తోలి సంపాదించి యిస్తా. నాకింత తిలదాచుకోనేందుకు చోటివ్వండమ్మా!' అని అడిగాడు రామూ. ఇంకే మనాలో తెలియక అట్లాగే ఉన్నాడు.

'నాయనా! యీ వేళనుంచీ యీ యింట్లో బిడ్డలాగా వుండిపో' అంది. ఇంతలోకే నీళ్లుతెస్తున్న మంజూ! 'ఏయ్‌బాబూ! లే అన్నంతిందాం.' అన్నది.

'ఇక నన్ను బాబూ! అని పిలిస్తే వూరుకోను.'

'మరి యేమని పిలవాలి?'

'అన్నా! అని పిలువమ్మా!' అంది మంజూతల్లి.

'ఓ అయితే యింకేం? అన్నా! అన్నా!' అని భుజాలుపట్టుకొని అడుతోంది మంజూ ఆనందంతో. ఈ క్రొత్త అన్న కన్నుల్లోని నీరు ఎంత ప్రవహించిపోతోందో చీకటిలో యెవరికీ కనుపించి యుండదు. అవి బహుశా ఆనంద బాష్పాలేమో?

4

'ఏయ్ మంజూ! నిన్నే ఎక్కడికి వెళ్ళావ్? తొందరగా రా, పెళ్ళివాళ్ళు అలిగిపోతున్నారు!' అని కేక వేసింది ఉమ.

'వస్తున్నా యిప్పుడే గుడ్డలు ఆరేస్తున్నా!' అంటూ మంజూ ప్రవేశం.

'చూడమ్మా! యీ పెండ్లివారికి లాంఛనాలు సరిగా జరగలేదట. బాండు మేళాలు, పల్లకీలూ, పాట కచ్చేరీలూ, భరతనాట్యాలూ కావాలిట.' అని సాగదీసుకుంటూ చెబుతోంది ఉమ.

'మరేమిటనుకున్నావ్ పెళ్ళి అంటే. పెళ్ళి కూతురు వారన్నింటికీ తలవంచాలిసిందే' అంది మంజు.

అప్పటికు సాయంత్ర మయింది.

'ఏయ్! ఇంకా ఎంతసేపు పెళ్ళికూతురికి చీర సింగారించటం. ఇక్కడ పేరంటాళ్ళంతా కూర్చుంటే?' అని కేక వేసింది మంజు.

'వస్తున్నా అయిపోయిందమ్మా! అంత తొందరైతే ఎట్లా?' అంటూ పెళ్ళికూతురిని తీసుకొని వచ్చింది ఉమ.

ఎట్లాగో మేజువాణీ అయింది. వెంటనే ఊరేగింపు. ఓ కారులో వధూవరులు కూర్చున్నారు. ఎట్లా అయితేనేం నాలుగు బజార్లూ తిరిగి వచ్చామని పించారు.

ఇక భరతనాట్యం ప్రారంభమైంది. ఉమ భరత నాట్యం చేస్తోంది. మంజూ పిచ్చి పిచ్చి తాళం వేస్తూ.

సానిస ధనిపాము పధా
నీనిస రిపగమ రిపా—
రాముని పద పంకజములు
రంజిల్లగ కొలిచి మనసా—

అంటూ పాడుతోంది. 'భేష్! భేష్! బాగుంది.' అంటూ చాలాసేపటినుంచీ చాటుగా యీ పిల్లల బొమ్మలపెళ్ళి వేడుకల్ని, తిలకిస్తున్న సరోజినీదేవి ఒక్కసారిగా సంతోషం పట్టలేక వచ్చి ఉమని కౌగిలించి ముద్దాడుతోంది.

ఆ యిల్లంతా ఆనంద పారవశ్యంలో మునిగి పోయింది.

5

'అయ్యగారూ! కూలండీ!'

'బాబుగారూ! బండి తీసుకురానా!'

'అయ్యగోరూ! రిచ్చా అండీ!'

'నా గుఱ్ఱం రాజాలా పోతుంది సార్! ఒక్కసారి ఎక్కితే మీకే తెలుస్తుంది' అంటూ కూలి వాళ్ళు, బండివాళ్ళు, రిక్షావాళ్ళు, జట్కావాళ్ళు ఊరికే గొడవ చేస్తున్నారు.

ఇదే ఆఖరుబండి అవటంచేత చెప్పుకోతగ్గ జన సమ్మర్దం లేకపోయినప్పటికీ ఒక మోస్తరుగా ఉన్నారు ప్రయాణీకులు. స్టేషన్లో వెలిగించిన గుడ్డిదీపాలు క్రమ్ముకున్న కారుమేఘాల్నీ చీకటినీ ఏమీ చేయ లేక పెద్దపెద్ద పొగలు విడుస్తున్నయ్. అందర్నీ చేర చూడి ఎవరూ కుదరక ఆఖరికి 'ఏయ్ ఒంటెద్దు బండీ వస్తావా?' అని పిలిచాడో దీర్ఘకాయుఁడు.

అయన పత్ని ఒక అర్థ పర్వతాకారంలో నిలు చొని ఆవులిస్తోంది.

'చిత్తం బాబయ్యా' అంటూ ఆశగా ముందుకు వచ్చాడు.

'విజయలక్ష్మీపురానికి ఏమి తీసుకుంటావ్?'

'అర్ధరూపాయి దయచెయ్యండి బాబూ! వెళ్ళి పోదాం.'

'పావలాకంటే ఒకదమ్మిడీ యివ్వను. ఇష్ట ముంటేకట్టు, లేకపోతేలేదు.'

'ఇంకో అణా దయచెయ్యండి. చాలాదూరం పోవాలె.'

'ఏమీ లాభంలేదు' అన్నాడాయన.

'సరే తమదయ. ఎక్కండిబాబూ!' అన్నాడు బండివాడు రామూ.

ఈ యుభయుల బరువుకు ఎద్దుకుంగిపోయింది.

'ఏమోయ్! త్వరగా పోనీ, పైనవానకురిసేట్టుగా వుంది' అన్నాడు.

'అయ్యా! చిత్తం' అని ఎద్దుని అదిలిస్తున్నాడు.

బజారు దీపాలు వాటిఉపయోగాన్ని కోల్పోయి నిప్పులులాగా వెలుగుతున్నవి. అసలే వెధవగతుకుల రోడ్డు. అందులో అసామాన్య భారంగల ఆలిమగలు ఎక్కారు. ఇక మాడండి 'రామూ' బండిదిగి నడపాలిసి వచ్చింది ఎద్దును.

ఇదంతా చాలదన్నట్లు సన్నగా తుంపరలు సాగినయ్.

'తొందరగా పోనీ, వాన దంచేట్టువుంది' అన్నాడాయన.

వానజల్లు పెద్దదైపోయింది. 'రామూ' అలాగే తడుస్తూ బండి తోలుతున్నాడు. 'ఇంతలోకే' వెధవ బండి ఎరక్కపోయి యెక్కాం; బండిఅంతా వానే' అంటోంది సాధ్వి.

'అయ్యా! ఆ గుడిసె కొద్దిగా చిరిగిపోయింది ఉండండయ్యా!' అని తలపంచె దానికి అడ్డంకట్టాడు. అదీ చినిగిపోయిందే కాబట్టి ఆశించినఫలితాన్నీయలేక పోయింది. అమ్మగారుపెట్టే శాపనార్థాలు వాన జోరులోకలిసి రొదచేస్తున్నయ్.

'అయ్యో! అయ్యో! బండిపడిపోతోంది' అని ఆమె గోలచేస్తోంది. నిజంగానే ఎద్దుకాలు మడత బడిపోయి గోతిలో కూలబడింది.

'బాబుగారూ! ఒక్కసారిదిగండి. ఎద్దును లేపిన తర్వాత ఎక్కుదురుగాని' అన్నాడు. చేసేదేమీ లేక విసుక్కుంటూ దిగాడాయజమాని. ఎట్లాగో నానాఅవస్థలూపడి ఎద్దునిలేపాడు. మళ్ళీ యథాప్రకారం పోతోంది.

ఎడాపెడా కొట్టేవానకు వంగివంగి అతిప్రయాస పైన నడిపగలుగుతున్నాడు రామూ. వళ్ళంతా తడిసి

పోయింది. కట్టుకున్న పంచెనిండా బురదనీళ్ళు చింది మరకలైంది. మోకాళ్ళదాకా బురదఅయింది.

'ఏయ్; యిక్కడఆపు, ఆపెట్టె అదీ లోపల పెట్టు' అంటూ ఆయిద్దరూదిగి యింటిలోకి వెళ్ళారు. తానూ వెంబడే పెట్టెతీసికొని వెళ్ళాడు.

'ఏయ్ ఇదిగో బాడుగ' అని పావలాబిళ్ళ ముఖాన వేశాడు.

'చాలాకష్టపడ్డాను దొరగారూ! ఒక్క అణా...' అన్నాడు చలికి వణికే రామూ. ఏమనుకున్నాడో పాపం ఓ బేడబిళ్ళ తీసియిచ్చి పొమ్మన్నాడు. ఆడబ్బులు కళ్ళకద్దుకుని చెంగునకట్టుకున్నాడు. తిన రోజు సంపాదనంతా అదేకాబట్టి.

కడుపులో ఆకలి దహించివేస్తోంది. ప్రొద్దున ఇంటిదగ్గర బయలుదేరటం. ఇవ్వేళ అమ్మపని మరీ అధ్వాన్నంగావుంది. ఎట్లావుందో ఏమో? మంజూ ఏమైందో? భయపడుతోందేమో అనుకుంటూ బండి యింటివైపు మళ్ళించాడు.

ఎద్దు ఇంటిముఖంపట్టి గబగబానడుస్తోంది.

ఆపేటఅంతా ఉండేది పేదవాళ్ళే. ఎక్కడా పెద్దగా చడీచప్పుడూ కనిపించటంలేదు. అవును! అర్ధరాత్రివేళ ఏముంటుంది?

ఇల్లు దాపౌతున్నది. గుండెలు వేగంగా కొట్టుకుంటున్నయ్. చలికి పెదవులు గడగడా వణుకుతున్నయ్.

ఏమిటబ్బా! కాస్త గల్లంతుగా వుంది! అయినా అలాగా జనానికి అది పరిపాటేగా చీటికీమాటికీ, కాస్తకీ, కూస్తకీ దొమ్ములాడుకోవటం అనుకుంటూ వస్తున్నాడు. అరె! మనయింటిదగ్గరే. ఏమయిందో? 'భగవంతుడా రక్షించు'అని రెండుచేతులూఎత్తి దణ్ణం పెట్టాడు. బండి అక్కడ విప్పి పరుగెత్తాడు. చుట్టుప్రక్కలవాళ్ళంతా గుమిగూడారు. వారందరినీ తోసుకుని పాకలోకివెళ్ళాడు.

మంజూ బావురుమని కాళ్ళకి చుట్టవేసింది. అప్పటికే అంతా ఆయిపోయింది.

'అమ్మ చచ్చిపోయింది అన్నా!' అంటూ మంజూ యేడుస్తోంది. అన్న గుండెవ్రీలి కుప్పలా కూలిపోయాడు. 'ఊరుకోండి' అని అందరూ సముదాయించినా తల నేలకువేసి బాదుకొంటున్నాడు.

రెండేళ్ళనుంచి బిడ్డకన్న మిన్నగా చూచుకొనే అమ్మ యీవేళ తనతో చెప్పకుండా వెళ్లిపోయింది.

6

'ఏయ్ మంజూ! యీ చొక్కా గూడుమీద చిరిగిపోయింది. కాస్త కుట్టిపెట్టు' అని తాను ఎద్దుకు మేత వేయటానికి వెళ్ళాడు రామూ.

పాపం మంజూ చేతయీ, చేతగాక దీక్షగా ఆ చినుగు కుట్లతో నింపేసి కనిపించకుండా చేయాలని నానాబాధా పడుతోంది.

అమ్మ పోయి ఆరునెలలు దాటినయ్. కాస్త దుఃఖంనుంచి తెప్పరిల్లారిద్దరూ.

'తొందరగా కానీ...వెళ్ళాలి' అని నుంచున్నాడు రామూ.

'అంత తొందరైతే నా చేతగాదు' అంటూ కూనిరాగాలు తీస్తూ యింకా కుట్టుతూనే వుంది మంజూ తలవంచుకొని.

'ఓహో! యీసంగీతం ఎక్కడ పట్టుకున్నావ్?' అన్నాడు నవ్వుతూ.

'మా డాక్టర్ గారి అమ్మాయికి భరతనాట్యం సంగీతం చెప్పటానికి ఓ మాష్టరుని పెట్టారు. ఆయన ఉమకు చెబుతూంటే విని నేర్చుకున్నదే. నాబొంద సంగీతం యిదో సంగీతమా?' అంది పెద్ద నాపసాని లాగా.

'ఓహో! అట్లాగా?' అన్నాడు.

'నిజంగా నన్నాయ్. నేను చదువుకోవద్దూ. నన్ను గనక బడికి పంపితే ఉమకన్న బాగా చదువుతా' అంది గర్వంగా.

'ఓ యింకేం నీవు కూడా డాక్టరమ్మదాకా చదువుతా నంటావ్,' అన్నాడు.

పాపం యీ కాస్తమాటకే ఆ లేతగుండె ఉప్పొంగిపోయింది.

'మరచిపోయా. వెళ్ళాలన్నాయ్ తొందరగా; ఉమకి చాల పెద్దజ్వరం వచ్చింది. అది నా కోసం కలవరిస్తూంటుంది. ఇందాకెప్పుడో వచ్చేయమన్నారు అమ్మగారు' అంటూ పరుగెత్తుకొని వెళ్ళిపోయింది.

'ఎంత అమాయికపు పిల్ల' అనుకుంటూ అటువైపే చూస్తూ నిలిచి నిట్టూర్చాడతను.

7

కాలం కళ్ళెంలేని గుఱ్ఱంలాగా పరుగెత్తిపోయింది చాలదూరం.

'తానొకటి తలచిన దైవమొకటి తలచు; తలచినా తలనొగ్గవచ్చు అది మానవాతీత మనుకొని' విధి చేసే పరీక్షలో మాత్రం వివశులైపోతారు మానవులు. అది పాంతం పట్టి బంధించగల బలంకలది కాకపోయినా, పట్టి తప్పక పీడించగలదు కొంతకాలం. కారణం అది కూడా సంకల్పాతీతశక్తిచేత ప్రేరేపబడుటవలన.

మంజూ అప్పుడే చదువుతూ చదువుతూ కుర్చీలోనే పడి నిద్రపోయింది. అప్పుడే సరోజినిదవి

వైద్యశాల నుంచి యింటికి వచ్చింది. ఆమె ముఖం ఎక్కువ అశాంతిమూలాన ముడతలు పడింది. ఏ ఉమకు పనికత్తెగా యీ యింటిలో 'మంజూ' ఒకనాడు ప్రవేశించిందో ఆ ఉమ అయిదేళ్లవాడు అమ్మవారుపోసి అకస్మాత్తుగా యీలోకం నుంచి నిర్గమించింది. అమ్మ గుండెల్లో అగ్గిరగిల్చింది. ఆ ఉమకోసం తినకన్నా ఎక్కువగా ఏడ్చి, అన్నంమానేసి ఆఖరికి జ్వరపడి నెలరోజులు మంచంమీదే ఉండిపోయింది. అప్పుడే 'మంజూ' తన హృదయంలో స్థానాన్ని సంపాదించింది.

తన బిడ్డ పోవటంవల్ల ఏర్పడిన అనంతమైన దుఃఖాగ్నిని 'మంజూ' ప్రేమహృదయం క్రమక్రమంగా చల్లార్చగలిగింది. అనాడు తాను బిడ్డలేనితల్లి, యీ 'మంజూ' తల్లిలేని బిడ్డ. కానీ యీనాడో 'మంజూ'కు తను తల్లి, మంజూ తన బిడ్డ అయిపోయింది.

'అమ్మగారల్లా...ఇప్పుడు 'అమ్మ' అయింది సరోజినీదేవి మంజూకు. ఇంకా ఆమెకున్న ఆశలల్లా యీ బిడ్డపైనే. సృష్టివైచిత్ర్యం సాధ్యాసాధ్యాల నధిగమించిపోయినప్పుడు తనను తానే నమ్మలేడు మానవుడు.

తను నమ్మగలిగింది మాత్రమే సాధ్యమని భ్రమించే మానవునిలో తుదకు నిరాశా, నిస్పృహో, నిస్సహాయతా స్థానాన్ని నెలకొల్పుకుంటయ్.

8

'మా మంజూ తెలుసునా? ఇవేళ బడికి వచ్చిందా?' అంటూంటే ప్రతిపిల్లా 'ఏమో లోపలికి వెళ్ళి కనుక్కోరాదూ? ఎంతమందో 'మంజూ'లు వున్నారు. ఎవరో అందులో మాకేమి తెలుస్తుంది?' అంటూ వెళ్ళిపోయింది. అమ్మో! ఇంత పెద్ద దీంట్లోకి ఎట్లా వెళ్ళేది. ఎవరన్నా ఏమన్నా అంటే' అనుకుంటూ బండివిడిచి అట్లాగే ఎదురుచూస్తూ నిలిచిపోయాడు రామూ.

ఇంతలోకే అల్లంతదూరంలో ఓ పిల్ల గబగబా వచ్చినిలుచుని, 'ఏయ్! రిక్షా!' అని కేక వేస్తోంది. అప్పుడే తనయెద్దుకు గుప్పెడుపరకలు రాలుస్తున్నాడు. బండి అడ్డంగా వుండటంచేత కన్పించటంలా సరిగా. 'సరే యీ పిల్లన్నా చెప్పకపోతుందా' అని వెళ్ళాడు రామూ.

'అన్నా!' అంటూ పరుగెత్తుకుంటూ వచ్చింది. ఎవరో కాదు తన 'మంజూ'యే.

'బండెక్కమ్మా! నిన్ను దిగబెట్టి నేను స్టేషన్కు పోతాను!' అన్నాడు.

'వద్దులే అన్నాయ్, నేను రిక్షామీద వెళ్తా గా.' అంది.

'ఏమయినా సరే బండెక్కాలిసిందే!' ఎద్దుని లేపి బండికట్టాడు రామూ.

మంజూ! నీకోసం తెచ్చానమ్మా! తిను' అంటూ తన చినిగిపోయిన పంచెలో ఒకమూల భద్రంగా మూటగట్టుకొని తెచ్చిన బటానీలు, శెనగపప్పూ, చేతిలో పోశాడు.

'ఇటువంటి వెధవచెత్తంతా తింటే జబ్బుచేస్తుందన్నాయ్. అయినా యిప్పుడు నే నేమీ తినను' 'పోనీలే జబ్బుచేసేటట్లయితే వద్దులే తినకమ్మా! నీకోసం ఏదో పెద్దలాయం కొనితెద్దామని అనుకున్నా. కాని యింతకన్నా ఏమీ తేలేకపోయినానమ్మా!' అంటుంటే అతనిగొంతు బొంగురుపోయింది.

'అదేమిటన్నాయ్! అట్లావున్నావ్? ఒంట్లో బాగాలేదా?' అంది ఆదుర్దాగా.

'నాలుగురోజులకు యీ దినమే కాస్త లేచి బండికట్టానమ్మా!' అన్నాడు.

'అయ్యో! ఊరికే అన్నాను అన్నాయ్! ఇదుగో చూడు ఇప్పుడే తినేస్తున్నా' అంటూ తినటం ప్రారంభించింది.

'అమ్మగారు బాగుందా అమ్మా!' అన్నాడు.

'ఆ బాగానే ఉన్నారు. అది కాదన్నాయ్. ఏన్నాళ్ళని యిట్లా. ఒంట్లో బాగాలేకపోతే ఎవరినైనా కబురుచేస్తే అమ్మవచ్చి మందిచ్చేదిగా, ఇదేం బాగాలేదన్నాయ్. నేను అమ్మతో అంతా చెప్పేస్తా!' అంది.

'నామీద ఒట్టు, నేను చచ్చిపోయాననుకుంటే నన్నుగురించి ఆమెతో చెప్పు' అన్నాడు.

'మందు లేకుండా ఉంటే జబ్బు ఎక్కడైనా నయమౌతుందా?' అంది.

'పేదవాళ్ళ రోగాలకి పెద్దపెద్ద మందులు పని చేయవు మంజూ!' అన్నాడు.

'రోగానికి ఎవరైనా ఒకటేగా' అంది.

'ఉన్నవారికి వచ్చిన చిన్నచిన్న రోగాలకి కూడా పెద్దపెద్ద మందులు— లేనివాళ్ళ పెద్ద పెద్ద జబ్బులకు బహుశా ఏమందూ దొరక్కపోవచ్చు. ఒకవేళ ఉన్నా పంచకోలకషాయాలు! అంతే. ఉన్నవాళ్ళు జబ్బులు నయమైనా భయపడతారు. ఎందుకంటే వారిప్రాణం విలువైనది కాబట్టి. మరి లేనివాళ్ళు జబ్బు ఎంతపెద్దదైనా, నయమైనా, కాకపోయినా ఏమంత భయపడరు. ఈ మొండి ప్రాణం అంత తేలిగ్గాపోదని వాళ్ళనమ్మకం. దాన్నిగురించి వారికేమీ భయములేదు' అన్నాడు.

నిన్ను చూడకుండా వుండలేకన్నా. అసలీ కాలేజీలో చేరిన తరువాత అదివరకటిలా రోజూ రాకపోగా, ఎన్నాళ్ళకో యీ వేళ వచ్చావ్?' అంది.

'అది గాదమ్మా! ఇదివరకు బడి నా దారిలో వుండేది కాబట్టి రోజూ వస్తూవుండేవాణ్ణి. ఇదేమో ఎక్కడో ఓమూల విసిరిపారేసినట్టుగావుంది. అందులో కొత్త, ఇక రాకేంచేస్తాను. వస్తాగా' అన్నాడు.

'ఇంకా ఎప్పుడన్నయ్యా! మనం మళ్ళీ ఒకచోట వుండేది!' అంది.

'ఓ దానికేం; నీవు డాక్టరమ్మవయి, పెళ్ళి చేసుకుని బిడ్డని కనేసరికి నేను యింకా అప్పటికి నిన్ను విడిచి వుండనమ్మా! ఎప్పుడూ నీబిడ్డని ఎత్తుకొని ఆడిస్తూ కూర్చుంటా' అన్నాడు నవ్వుతూ.

'పో! అన్నాయ్, నీదంతా...' అంది సిగ్గులో.

'నిజంగా మంజూ, నేనుమాత్రం నిన్నువిడిచి ఉండగల్గుదునా?' అన్నాడు.

'ఇంక యిటునుంచి స్టేషన్కువెళ్ళు అన్నాయ్. దగ్గిరేగా ఇక నేను వెళతాలే. యికనుంచీ నీవు రాక పోతే ఊరుకోను చెబుతున్నా. రెండురోజులకైనా కనిపించాలి తప్పకుండా' అంటూ మంజూ బండి దిగింది.

'సరే అయితే వస్తానమ్మా!' అంటూ బండితోలుకొని వెళ్ళిపోయాడతను. కనిపించేమేరవరకు ఆ బండిలోని అన్నను చూస్తూ 'అన్న' ఎంత మంచివాడు. తనను వెతుక్కుంటూ వచ్చి, లోపలకు రాలేక, ఎంత మందిని బయటే నుంచుని అడిగాడో తనను గురించి. ఛీ, పాపిష్టిదాన్ని అన్నదగ్గర వుండలేక ... అనుకుంటూంటే బండి చాటయి వెళ్ళింది.

అయ్యో! యీ శెనగపప్పు యింకా చేతిలోనే వుందే?' అని చేయి విప్పేసరికి అప్రయత్నంగా ఆమె కన్నుల్లోని బాష్పాలు చేతిలో కురిసినై.

'అన్నయ్య ప్రేమగా తెచ్చియిచ్చినవి తానెందుకు తినసాలి. పాపం అన్న మనసుకి అనవసరంగా కష్టం కలిగించానని లోలోపల తనని తానే శపించుకుంటూ వెళ్ళిపోయింది మంజూ.

9

'అవును, అన్నా! నీవు రోజూ యిట్లా నన్ను బండిలో తీసికెళుతూంటే అమ్మ చూస్తే ఏమనుకుంటుంది. ఇప్పటికే రోజూ పిల్లలంతా వెక్కిరిస్తున్నారు. ఆరోజున అమ్మగారు పెంచుకుంటానన్నది అని చెబితే—

'సరే మంజూ నీవు తప్పకుండా వెళ్ళమ్మా! నీ అదృష్టం చాలా మంచిది. గొప్పవారింటికి బిడ్డవై పోతున్నావు.' 'కానీ—నీ అన్నను గురించి ఎప్పుడూ ఎవరికీ చెప్పకూడదు అన్నావు. అయినా మంజూని పెంచుకున్నంత మాత్రాన, మా అమ్మ, అన్నయ్యను ఇక నీవు ఏమాత్రం చూడకూడదు. మాట్లాడకూడదు. నీ విప్పుడు యిదివరకు 'మంజూ'వి కాదు. నీఅన్నను ఎప్పుడూ కలుసుకొనేందుకు ప్రయత్నించకు మన హోదాకు భిన్నం అని అనలేదుగా ఒకవేళ అన్నట్లయితే చచ్చినా నిన్ను విడిచి నేను పోయేదాన్ని కాదు.'

ఇలాంటి వాదనలతో జరిగిపోయిన చాలా రోజులు మంజూని యీ నాడు డాక్టరీ చదవటానికి తీసికొని పోతున్నయ్. రేపే వెళ్ళిపోతుంది.

తను చిన్నతనంలో చాల గొప్పవాణ్ణి కావాలని ఎన్నెన్నో కలలు కనేవాడు. అమ్మకూ, నాన్నకూ తన పైన ఎంతో వుండేది ఆశ. కానీ—తనకు చివరకు ఆశించినది, ఆశించనిది అకస్మాత్తుగా ఒకనాడు సంభవించింది. అదీ ఒకందుకు మంచిదే అన్నట్లయింది.

ఆనాడు జీవితదీపమే ఆరిపోయేందుకు ఆఖరిసారిగా నిశ్చయించింది. ఇంత నిరాశల పెనుగాలి తాకిడులకు ఎక్కువకాలం మనలేనని తెలిసికొని.

అటువంటి సమయంలో తనకీ అదృష్టం పట్టింది. దాని బలంచేతనే ఇంకా జీవించివున్నాడతడు. ఇక తనకే ఆశాలేదు.

"నావంటి అదృష్టవంతులు ఎవరూ కావద్దు." తనని చూచి తనచరిత్ర విని ఎవరైనా జాలిపడాలని తన ఉద్దేశంకాదు. అలా జాలిపడలేక హేయంగా చూచే మానవుల బారినుండి విస్మృతంగా జీవితయాత్ర గడపటం తన ఉద్దేశం. అందరి హృదయాలూ తనలాగే వుండవనే యథార్థాన్ని తానెప్పుడో గ్రహించాడు గనుక.

'మంజూ! నీమూలంగానే నేను బ్రతికివున్నా' అందుకే నిన్ను దేవుడు కరుణించాడు. నీవు తప్పక గొప్పదానివి కావాలి?' యిలా ఆలోచించుకుంటూ, ఆవేళ చాలరాత్రివరకు నిద్రపట్టక మేల్కొని గతాన్ని కళ్ళముందు కట్టించుకుని వున్నాడు రాము.

10

'అబ్బ! ఎంతజనం, ఎంత కోలాహలం! ఎవరో? ఆ వెళ్ళేది? ఏంచేయటానికో' అని తమలో తాము చర్చించుకొనే ప్రయాణీకుల గుంపుల్ని చీల్చుకుంటూ, అప్పటికే వచ్చివున్న బండిదగ్గరకు హడావిడిగా పరుగెత్తాడు రాము.

'నిజంగానే ఎంతమంది వచ్చారబ్బా పంపించటానికి' అనుకుంటూ ఆ జనం చేరిన పెట్టెదగ్గరకు

పోయి నిలిచాడు. ఎవరికోసం తన కళ్ళు వెదుకుతున్నాయో అతను వచ్చేసరికి ఒక్కసారి 'మంజూ' గంతువేసి రాబోయింది. 'వద్దని' వారించాడు.

అంతే. మంజూ ముఖంలో సంతోషం మాయమైంది. 'అమ్మా! మంజూ శ్రద్ధగా చదువుకో!' అని తన దగ్గరకువచ్చి చెబుతున్న అమ్మను కౌగిలించుకొని బావురుమని చిన్నపిల్లలా ఏడ్చింది.

'ఇటువంటి సమయాన ఏడుపువచ్చా! పిచ్చి పిల్లా!' అని సరోజనీదేవి ఓదారుస్తుంటే అందరూ 'అబ్బా' పెంపుడు బిడ్డైనా ఎంత ప్రేమ. అలా వుండాలి' అని మెచ్చుకొన్నారు.

కానీ యీ మంజూ గుండెలో గుబులుకొన్న దుఃఖం నిశ్శబ్దంగా దాచి సహించే 'రామూ' కోసమని అతనికి తెలుసు.

వచ్చిన బండి వెళ్లకవుంటుందా? రైలు కదలబోతూంటే చేతులాడిస్తూ సాగనంపారు. మంజూ చేతిరుమాలు ఊగిస్తూ అన్నవంకే చూస్తూ వెళ్లిపోయింది, కన్నుల్లో ఆణిముత్యాలవంటి అశ్రుమాలికలను నింపుకొని చాల దూరదేశానికి.

11

సుఖంగావున్నప్పుడెవ్వరూ కాలము ఎలా గడిచిపోయింది? అనే విషయాన్ని ఆలోచించరు. అత్యంత ఆప్తులనుండి విడిపోయి ఒంటిగా బ్రతికేవారికి యీ కాలంయొక్క విలువ తెలుస్తుంది. అది ఎంత బరువుగా గడిచిపోతుందో వారొక్కరికే అనుభవమైన విషయం.

అయిదు దీర్ఘమైన సంవత్సరాలు అతి సుదూర దేశంలోవున్న మంజూనుండి తనను వేరుచేస్తూ వెళ్లిపోయినవి. మరచిపోలేని ఒక సంఘటన తాలూకు మందచ్ఛాయలు తన్నావరించి విడువకుండా వున్నవి. అదే చేతిరుమాలు విసురుతూ, కన్నుల్లో నీరుండగా జాలిగా ఆనాడు వెళ్లిపోయిన 'మంజు'యొక్క మహిత మంగళమూర్తి. ఆమె యీనాడు ఏ రూపంలో తిరిగివస్తాయున్నదో అనే విషయాన్ని గురించిన తర్జనభర్జనలెన్నో చేసుకుంటూ స్టేషన్ చేరాడు రామూ.

అవును ఉత్తరం వ్రాసినా స్టేషన్‌లో కనిపించకపోతే 'మంజూ' తప్పకుండా బాధపడుతుంది. కోపం కూడా వస్తుంది.

ఆఖరి బండి వచ్చింది వెళ్లింది. కాని ఎవరికొరకు వెదుక్కుంటూ వచ్చాడో ఆ వ్యక్తి అగుపించలేదు. ఎంత ఆలోచించినా ఏమీ బోధపడటంలేదు. ఈ అదృష్టహీన అభిశప్తజీవి అజ్ఞాతహృదయాంతరాల్లో ఆ అగంతుక వ్యక్తినిగురించిన అశుభశంక పొడసూపింది. 'ఛా! ఎంత పిరికివాడిని. ఆమెకు శుభాన్ని కలిగించు' అంటూ భగవంతుని ప్రార్థించాడు.

కాళ్ళీడ్చుకుంటూ ఆ చీకటి రాత్రి డాక్టరమ్మ యింటి దాపుకు చేరాడు. ఏడుపులూ, పెడబొబ్బలూ వినిపించి గుండె లవిసిపోయినవి. అయినా ఉండబట్టలేక బయట ద్వారంవద్ద నిలుచున్న దర్వాన్‌ని సమీపించి దీనంగా'

'అయ్యో! యేమిటి?' అన్నాడు రామూ.

'ఏమైతేనీకెందుకుపోరాదూ నీదారిని?అందరూ పుట్టెడు దుఃఖంలో వుంటే నీకేమో ...' అంటూ విసుగ్గా చడామడా అంటూంటే—తను మనస్సులో కల్పించుకొని—'కోపమువస్తే అడగనులే బాబూ! ఊరుకోలేక అడిగాను. ఎవరికష్టమైనా ఒకటేనని అన్నాడు.

'ఆఁ...ఏం చెప్పను...డాక్టరమ్మగారి అమ్మాయి అని యింకా చెప్పబోతూంటే...'ఏమయింది? చెప్పు' అని ఆ దర్వాన్ని పట్టి గట్టిగా ఊపేశాడు.

'ఏం చెప్పను...ఆదెక్కడో రైలు...'అంటూ ముఖానికి చేతులు కప్పుకొని చతికిలబడ్డాడు వాడు.

అంతే.....భూమ్యాకాశాలు ఒక్కసారి నెత్తిమీద విరిగిపడినట్లయింది. ఆ కటికచీకటిలో గుండె బాదుకుంటూ 'మంజూ! మంజూ! అంటూ' పిచ్చివాడై పరుగెత్తిపోయాడతను.

విగ్రహారాధన

శ్రీ జి. టి. అక్కులయ్య దీక్షితులు

భారత సంస్కృతిలో విగ్రహారాధన గలదు. ఆరువేలేండ్లకు పూర్వమున సైతము విగ్రహము లున్నట్టు మొహంజదారో భూగర్భ పరిశోధన రుజువుపరచినది. నర్మదలోయ పరిశోధనలనుండి అంతకు పూర్వముననే విగ్రహము లున్నట్టు తెలియవచ్చినది.

మనదేశమందలి విగ్రహ రచనలో నర, వానర, అశ్వ, గజ, సింహ, వృషభ, నాగ, గరుడ ముఖములు గలిగి మానవుల కరచరణములు గల్గియున్నట్లు రూప రచనలుగల పలువిధ విగ్రహములు గలవు. మరియు ఒకటి మొదలు పదితలలు గలిగియు, నూరారు చేతులు తీర్చిన విగ్రహములును, సాధు,క్రూరరూపములుగల విగ్రహములును వివిధాయుధములు, వివిధ వాహనములు, స్త్రీ పురుష అర్ధనారీశ్వరాది ఆకారములు గల విగ్రహములు గలవు. నాలుగు వేదములందును చెప్పబడిన పురుష సూక్తమున వేయితలలు వేయికన్నులున్న పురుషుడు వర్ణింపబడినాడు. శతపథ బ్రాహ్మణము (1-8-16) న మత్స్యరూపమును; తైత్తిరీయారణ్యకము(1-3-5-7)న కూర్మరూపమును ; ఋగ్వేదము (1-22-17-18) వామనరూపము వర్ణింపబడియున్నది.

విగ్రహములలో స్వామిత్వము, దాసత్వ పరివార కత్వము, పతీత్వము, వాహనత్వము గలవియుగలవు.

విగ్రహముల నిర్మించుటను దెల్పునట్టి శిల్పశాస్త్రములు అనేకము రచితములైయుండినవి. ఆయతత్త్వం, కాశ్యపశిల్పం, చక్రావళి సంగ్రహం, దేవతామూర్తి ప్రకరణం, బుద్ధప్రతిమాలక్షణం, భద్రమార్తాండం, మనుష్యాలయచంద్రిక, మయమతం, మాతంగలీలా, రూపమండనం, విశ్వకర్మప్రకాశ, శిల్పదీపకం, శిల్పరత్నం, మానసారం, మొదలగునవి యిప్పటికిని యున్నవనుచున్నారు. మానసారమను శిల్పశాస్త్రమునకు ఆంగ్లేయ అనువాదము జరిగినది. వీనిలో విగ్రహ నిర్మాణపు కొలతలు, రూపురేఖల రీతులు చెప్పబడినవి.

విగ్రహముల పుట్టుకనుగురించి పలువిధములైన భావము లున్నవి. ప్రాకృతములగు పదార్థములే పురుష విధానమొంది దేవతారూపమున పూజింపబడినవని, ఏ. మాక్డనల్ గారు (హిస్టరీ ఆఫ్ సాన్స్క్రిట్ లిటరేచర్ అండ్ సైన్స్) తెల్పిరి. భారతీయులు అజ్ఞానదశలో యుండి క్రూరములు, భయంకరములు అయినట్టివాటిని జూచి అవి తమకు హానిగల్గించునను భయముచే వాటిని వాటి రూపములను పూజింపుచు వచ్చిరనీ, తద్విధముగ విగ్రహారాధనగల్గినదని మరికొందరు పాశ్చాత్యపండితులు దెల్పిరి. అట్లైన భయంకరత్వ, క్రూరత్వములలో బుట్టియుండినయెడల రాక్షస పిశాచవిగ్రహములుపుట్టి వాటి ఆరాధనలు జరుగుచుండవలసినది. అట్లు జరుగుచుండలేదు. అదియే సరియైన ఊహయైయుండిన బ్రతికిన నాగుపాములను చంపుచు శిలలోతీర్చిన నాగుపాములను పూజింపుచుండరు. కనుక యీవిధమైన నిర్ణయములు అర్థరహితము లవక తప్పదు.

భాగవత పురాణము 1 స్కంధము 3 వ అధ్యాయమునందు పృథుచక్రవర్తి, కపిలాచార్యుడు, వ్యాసుడు, మొదలగువారు అవతారమూర్తులుగా చెప్పబడియుండిరి. అవతారమూర్తుల విగ్రహములను పూజించుట మనము జూచుచున్నాము. పెక్కురు మహారాజులు, తత్వవేత్తలు, శూరులయొక్క యలౌకిక గుణములనుజూచి యితరుల కట్టిగుణములు లేకపోవుటచే, యమానుష విషయములనియు, ఈశ్వరాంశజులనియు దలంచి వారి మరణానంతరము క్రమముగ వారియద్భుత చర్యలనుగురించి గాథలు పెరుగుచు వారుదేవత్వమును బొందియుందురు. వారి రూపచిత్రములు విగ్రహములై ఆరాధింపబడుచున్నవని కొందరి భావనగలదు. కాని, యిట్టివారి చరిత్రలనుదెల్పు (పురాణములు) గ్రంథముల రచన అంత ప్రాచీనముగాదనియెదరు. ఇంచుమించు క్రీ॥ శ॥ 500 నుండి 1200 వరకు పురాణ రచనా కాలమై యుండునని హిందూదేశ కథాసంగ్రహ గ్రంథకర్త అభిప్రాయ మొసంగినారు. ఆరువేలేండ్లకు పూర్వమె విగ్రహము లుండినవని తెలియవచ్చుటయు, ఋగ్వేదమున (6.24-10; 7-1-5) ఋషులు విగ్రహారాధన జేసియుండిరనుటకు ఆధారములు గలవనుటవల్లను, మరియు దక్షిణఅమెరికాయందలి పెరూ, మెక్సికో ప్రాంతములందు జరిపిన భూగర్భ పరిశోధనలలో గణేశవిగ్రహము చిక్కినదని పరిశోధకులు తెలుపుట, ఐరోపాఖండమున 'డీగ్లానది సముద్రములో గలియుచోటునగల అష్ట్రికాన్, అనునగరమున గౌరీశంకర విగ్రహములు తీర్చబడినవని చరిత్రములు తెల్పుట, శివలింగ విగ్రహములు ప్రపంచమున పలుస్థలములలో గలవని పరిశోధకులు దెల్పుచుండుట, భారత పౌరాణిక ధర్మాచరణ నెరుగని యీప్రదేశములలో విగ్రహము

లగపడుచుండుటవలన విగ్రహసృష్టి, చనిపోయినమహాత్ములను పురస్కరించుకొని పుట్టినది గాదని ధృవపడును.

విగ్రహనిర్మాణములో మహాకాయుడగు గణపతికి అల్పజంతువగు ఎలుకయు, అనంగుడగు మన్మథునకు చిలుకయు, అబలయగు పార్వతికి క్రూరమగు సింహమును, సర్వము దహించు అగ్నికి పొట్టేలును వాహనములుగా నిర్మితములైనవి. ఇట్లు అస్వాభావికములు అనుపమయోగములు అసాధ్యములైన రీతులు గల్గియుండుటయు, "దర్శయేత్ ప్రతిమాముద్రాం కల్పయిత్వా చ సన్నిధిమ్." విగ్రహారాధన వేళలో ప్రదర్శింపవలయునని దెల్పు ముద్రలలో బ్రహ్మముద్ర, విష్ణుముద్ర, రుద్రముద్ర, శివలింగ ముద్ర, దశావతార ముద్రలు మరియు ఇతర దేవతలను, వాహనములను, పూజోపచారములను దెల్పు ముద్రలు అనగా చేతితో చూపు సైగలు విధించియుండుటయే గాక ఆయా విగ్రహారాధనలో ఆయా దేవతలకై సంకేతముగా కల్పించిన ముద్రలనే ప్రదర్శింపవలెనని విధించియుండుటయు ఆరాధనాకాలమందు పోయుముగ్గులు కేవలము అలంకారములే గాక "తత్త్వమండలము" మొదలైన పేర్లు గలిగిన ముగ్గులు పోయవలెననుటయు వాటిలో తత్త్వము ఎఱింగించు లక్షణములు గలిగియుండుటయు, ఆరాధనలో అర్చన ఉపచారము లనేక విధములు గల్గియుండుటయు, యొక్కొక్క కోరిక గలవారు యొక్కొక్క రూపము గల దేవతనారాధింపవలెనని జెప్పియుండుటయుగలదు.

శిల్పమునుగురించి దెల్పుచు, స్మృతిచిత్రము అనగా జీవితమును పరిశీలించిన పూర్వజ్ఞానమననుసరించి మూర్తి కల్పన జేసుకొనుట అనాదినుండియు భారతీయ శిల్పమునకు ముఖ్యసూత్రమైన పునాది. భారతీయ శిల్పములో బాహ్య ప్రకృత్యనుకరణకు ప్రయత్నము లేదు. భారతీయ శిల్పమెప్పుడును సర్వానుభూతి సంగ్రహదృష్టి స్వరూపము. ఈ దృష్టి ప్రథమములో యుద్భవించి సహజముగా రాను రాను అత్యంత సమగ్రమైన శాస్త్ర రూపము దాల్చినది యని శిల్పములలో అధికానుభవము బొందిన ఆనంద కుమారస్వామివారు వ్రాసిరి. దీనినుండి భారత సంస్కృతికి చెందిన విగ్రహములు ఇప్పుడు మనలోని కొందరు భావించు విధముగ పుట్టినవి గావని తెలియ నగును. అయితే మరేవిధముగ విగ్రహరూపరచన, ఆరాధనగల్గినదను ప్రశ్న యుదయించును.

మానవులు అనాగరికదశలో నుండిన మొదటి రోజులలో వారికి భాష లేకుండెననియు ఆస్థితిలో వారి మనోభావములను ఒండొరులు సంజ్ఞ (సైగ) లతో తెల్పుకొనుచుండిరని పరిశోధకులు, తెల్పుచున్నారు. ఆగమశాస్త్రములలో దెల్పినముద్రలు, నాట్యశాస్త్రములలో దెల్పిన అభినయముల నన్నిటిని ఏక మొనర్చి ప్రదర్శించినంతట భారతీయధర్మ సంస్కృతి వ్యవహారము లన్నిటిని నోటమాటలేకనే చేసైగలతో నెఱింగింప నగునని తెలియును. భరతనాట్యమును చూచిన వారికి ఈవిధానము గొంత పరిచయమై యుండును.

ఎదుటనుండువారి మనోభావములను ఒండొరులు తెలిసికొనుటకు ఈ హావభావము లనుకూలించినవి గాని పరోక్షమున నుండువారికి ఈ విధానములు ఉపయోగింపకపోయినవి. అందుచే వారు మరొకపద్ధతి అవలంబించిరి. దానినే బొమ్మలవ్రాత యనుచున్నారు. ఇదియే శిల్పము. దీనినుండియే అక్షరసమామ్నాయము పుట్టినదని పరిశోధకులు నిర్ణయించిరి. 'మనిషి' అని తెల్పుటకు, 'ఆజీలియన్' శిలల చిత్రములలో యొక నిలువుగీత దానిపై రెండు చిన్న అడ్డగీతలు చిత్రించబడినవి. చీనాదేశపు భాషలో దేవుని  ఈ గుర్తుచే పూర్వమున వ్రాయుచుండిరి. ఇప్పుడు =|= ఈ విధముగ వ్రాయుచున్నారు. చీనాదేశమువారి లిపిచూచిన చిత్రలేఖనము (బొమ్మలవ్రాత) అక్షరలిపికి మూలమని తెలియగలదు.

శిలాచిత్రములందు కథ వస్తువిన్యాసముగూడ నతిసంగ్రహముగ చూపబడినది. ఇట్లు సంగ్రహముగుట వలన విషయములను చాలవఱకు వదలివేయుటయేగాక సమయబద్ధులై సాంకేతికపద్ధతి నుపయోగించిరి. ఇట్లు సంకేతముల నేర్పరచుటవలన చిత్రితమైన కథావస్తువు ఆ కాలమువారికి సుబోధకమైనను ఏ విషయమున కేవిసంకేతితము (గుర్తు)లో తెలియక ఇటీవలి వారికా చిత్రరంగములు దురవగాహములైనవని పరిశోధకులనుచున్నారు.

బుద్ధశిల్పములను పరిశీలించి అందలి చిత్రములలో ఉపయోగించిన సంకేతములనుగుఱించి దెల్పుతూ బుద్ధజననమునకు పాత్రిక్యలో బుద్ధపాదములు లేక పద్మము, బుద్ధుని సర్వభోగ వర్జనమునకు రౌతులేని పట్టిజీనుతో నుండు గుఱ్ఱము, బుద్ధుని ధర్మబోధకు బోధివృక్షము, దానిక్రింద బుద్ధపాదములు, బుద్ధుని మొదటిబోధకు చక్రమును దానిక్రింద మృగములను, ఆయావిషయములను బోధించు సంకేతములుగా చిత్రించినారని పరిశోధకులు తెల్పినారు. ఇట్లు సంకేతము లేర్పరచుకొని చిత్రరచనలు చేసియుండుటచే వీటిని జూచి ఊహలతో విషయములు నిర్ణయించుట మిగుల ప్రమాద భరితమగును.

"దేవాలయములు మొదలగునవి నిష్ప్రయోజన మనుట సులభమే. ఆధునికకాలమున ప్రతిబాలకుడు

నిట్లు చెప్పుచున్నాడు. కాని విగ్రహముల నారాధించు వారికిని ఆరాధింపనివారికిని పెక్కు విషయములలో భేద మున్నదని జనులు బాగుగా గుర్తింపవలయును. విధులు కొన్ని మతధర్మములతో సమన్వయించుటచే ఆయా మతధర్మముల నవలంబించువారలకు ఆరూపములు దేనికి సంబంధములై యున్నవో ఆ భావముల స్మరింపజేయునని స్వానుభవముపొంది ఖండాంతరములలో అఖండ గౌరవమొందిన స్వామి వివేకానంద 'కర్మయోగము' అను గ్రంథమున దెల్పిరి. అందరికిని స్వానుభవములో ఇది నిజమని తెలియును.

పాఠశాలలో భూగోళమును బోధించుటకై గోళాకారముగల బొమ్మ నొకదానిని ఉపయోగింతురు. దీనికి గ్లోబ్ (Globe) అనిపేరు. ఇది భూసాకారములలో నిర్మించిన సంకేతము. అయినను పాఠశాల ముఖ మెరుగని నిరక్షరాస్యునకు దీనిని చూపి ఇది యేమని అడిగిన ఏమి చెప్పగలడు. బొమ్మ అనిమాత్రం చెప్పగలడు. లేక మరికొంత తెలివిగలవాడైయుండిన ఇది పచ్చనిబొమ్మల తయారీలో చేసిన సుమ్మడిపంపన వచ్చును. త్రిప్పితిరుగుటను చూచిన యిదేవో (మిషన్) యంత్రము అనగలడు. దీనినే విద్యార్థికి చూపి ఇది ఏమని అడిగిన ప్రపంచము గోళముగా యుండుటను దాని భ్రమణమును, అందులోనికొండలు నదులు దేశముల రూపములను వివరించిచెప్పి ఇది భూగోళమునకు సంకేతమనును. కనుక దేని కేది సంకేతమో తెలిసికొనిన గాని విగ్రహరూపరచనకుగల కారణములు తెలియవు. పాఠశాలల నెఱుంగని నిరక్షరాస్యునివలె మనము దేవతావిగ్రహములను విమర్శించుచున్నాము. తాంత్రికాగమశాస్త్రములలో నొకటగు వాతులాగమ మను గ్రంథమున తత్త్వభేదపటలమున ఈశ్వరుడు ధరించు ఆయుధముల ప్రశంసగలదు. అందు త్రిగుణములకు త్రిశూలము, కర్తృత్వమునకు పరశువు, ప్రతాపమునకు ఖడ్గము, ఆభేద్యులకు వజ్రము, విధులకు నాగము, మాయకు పాశము, అనుగ్రహమునకు అభయహస్తము, వివర్తములకు అంకుశము, నాదమునకు గంట, సర్వ సంహారశక్తికి అగ్ని, ఈశ్వర విగ్రహమున ఆయుధములుగా జూపబడినవని వివరింపబడినది. అనగా యీ భావము గల్గించుటకు వీటిని సంకేత మొనర్చి ఈశ్వరునిచే ఆయుధములుగా ధరింపజేసినారనుట తెలియనగును.

ఇటువలెనే విగ్రహములందలి శిరస్సులు వాని నవరసభావములు నేత్రములు చేతులు చేష్టలు ఆయుధములు, వాహనములు అన్నియు వివిధ విషయములను తెల్పు సంకేతములై యున్నవి.

విగ్రహారాధనను ఎక్కువగా ప్రతిపాదించిన గ్రంథములు తంత్రశాస్త్రములు. వీనికే ఆగమశాస్త్రములను పేరు సైతము గలదు.

ఈ తంత్ర, ఉపతంత్రశాస్త్రములు పెక్కులుండినవి. 'సమ్మోహనతంత్ర' మనెడి గ్రంథములో శాక్తేయ ప్రతిపాదితములైన తంత్రములు 64, ఉపతంత్రములు 327, శైవ ప్రతిపాదితములు 32, వాని ఉపతంత్రములు 127, వైష్ణవ ప్రతిపాదితములు 75, వాని ఉపతంత్రములు 205 ఉండినట్లు చెప్పబడినది. మరియు బౌద్ధాది ప్రతిపాదితములును ఉండినవి. వీటి రచన 2000 ఏండ్లకు పూర్వమనుచున్నారు. వాటిలో ఏకొద్దిపాటి గ్రంథములో ఇప్పుడు లభ్యమగుచున్నవి. అవిసైతము అసంపూర్ణములుగనే యున్నవి. వాటిని చదివి సంకేతముల విషయము ఎఱింగిన వారుగూడా మనలో చాల తక్కువని తెలియును. ఈ స్థితిలో విగ్రహముల రూపరచనలను విమర్శింప బూనుచున్నాము.

ఒకే దైవమును భావించువారిలోనే ఈశ్వరునకు ఏ ఆకారము రచింపని లింగము, గౌరీశంకరుడు, అర్ధనారీశ్వరుడు, యోగమూర్తిగ దక్షిణామూర్తి, నాట్యభంగిమలలో నుండు నటరాజు, పంచముఖుడు, త్రిముఖుడు, గల విగ్రహములున్నూ విష్ణువునకు ఏ ఆకారము రచింపని సాలగ్రామము, దశావతారరూపములు, నిలుచున్న వెంకటేశ్వరుడు, కూర్చున్న లక్ష్మీనారాయణుడు, పరుండిన అనంతపద్మనాభస్వామి, మొదలుగాగల విగ్రహములు, స్త్రీ దేవతలకు యిదే విధముగ అనేకవిధ రూపములు గల విగ్రహములు కల్పించి శిలలో శిల్ప మొనర్చినారు. ఇట్లు ఒకమూర్తిని పలువిధములైన రూపములతో, శిల్పమొనర్చుటకు అనేక భావములను దెల్పుటకొఱకై కల్పించిన సంకేతములే కారణములగుచున్నవి. కనుక విగ్రహ నిర్మాణము అనేక భావములను ఎదుట జూపింపగల సాంకేతిక సముదాయమనియు, ఇది మొదట బొమ్మల వ్రాతగా బుట్టి శిలలో శిల్పమొందివిగ్రహములు, ప్రతిమలు అనబడుచున్నవని తెలియనగును.

ఏ సంకేతము ఏ విషయబోధనకై కల్పింపబడినదో తెలిసికొనిన కొన్ని క్షణములలో ఒక విగ్రహమునుండి అనేక విషయములు గ్రహింపవచ్చును. నటరాజనృత్యము ప్రపంచ సృష్టిహేతుభూతమైనది, నటరాజ విగ్రహమును చూచి ఎడ్వర్డు కార్పెంటర్ (Edward Carpenter) మొదలగు పాశ్చాత్య పండితులు సైతము విస్మితులయి వ్రాసిన వ్రాతలు సాక్ష్యమిచ్చుచున్నవి. భారతీయ సంస్కృతి వారి ఆచార వ్యవహారము లెరుంగని పాశ్చాత్యులే విగ్రహములనుండి ఇట్లు విషయములను గ్రహింపుచుండ భారతీయులు ప్రయత్నించిన ఇంకను ఎక్కువగా గ్రహించగలరనుట సువిదితము. అనేక విషయము తెలిపించు సాంకేతిక సముదాయముగా విగ్రహము రూపొందింపబడి కట్టెదుటనుండి కనుమాపుతో గ్రహింపగలదగుటచే విధుల సులభసాధ్యమగును.

దాంపత్యం

శ్రీ జి. కె. మూర్తి

పాత్రలు:

రఘు	శారద
సుందరయ్య	నరసమ్మ
శంకరయ్య	చంద్ర

★

రంగము: 1

* * సుందరయ్య ఇంట్లో వసారా. గోడ దగ్గరగా ఒక బెంచీ. మధ్యనే ఒక బల్లా, దానిచుట్టూ మూడుకుర్చీలు, టేబిలుమీద పూలు అల్లిన టేబిలు గుడ్డ, పైన రెండు బౌండు పుస్తకాలు, ఆనాటి తెలుగు పత్రికా వుంటాయి. శారద బెంచీమీద పడుకొని ఏదో ఇంగ్లీషు నవల చదువుతుంటుంది; సుందరయ్యగారి పెద్దమ్మాయి; వయస్సింకా ఇరవై దాటలేదు. ఇంట్లోంచి నరసమ్మగారొస్తారు. పూలదాన్‌లో క్రోటను రెమ్మలూ, పూలూ పేర్చి బల్లమీద ఉంచుతుంది. ఇల్లంతా అలంకరింపబడకపోయినా శుభ్రంగా ఉంటుంది. సమయం మధ్యాహ్నం రెండు గంటలు చూపిస్తుంటుంది గోడనున్న గడియారం.

నరసమ్మ: అమ్మాయ్! లేవడం, తలదువ్వుకోవడం ఏమయినా ఉందా...లేక ఆ వెధవ నవలపట్టుకొని ఏడవడమేనా?

శారద : వెధవ నవలకాదమ్మా! నాన్నగారు చదువుకున్నదే! (లేచికూచుంటుంది)

నర : మా దొడ్డనాన్నగారు! కావాలని మీ అందర్నీ యిలా తయారుచేస్తున్నారు... తరువాత చదువుకోందువుగాని లే—సంగతీ సందర్భం లేకుండా ఎప్పుడూ పుస్తకాలేనా? అయితే చదువూ, లేకుంటే రాతా! మరేం అక్కర్లేదూ?

శార : అబ్బ! ఏమిటమ్మా! పనులన్నీ తీరినతరువాత చదువుకుంటున్నా తప్పేనా?

నర : నిన్ను చదువుకోవద్దు అనలేదు నేను...అన్నా మానావా నువ్వు!...కానీ...వాళ్ళు వచ్చే వేళయిందీ, పుస్తకం కొంచెం మూసి, ఆ తల కొంచెం దువ్వుకొని చీరమార్చుకోమని అంటున్నాను...అంతే!

శార : మీకు మతులుపోయాయమ్మా?

నర : పోలేపోయాయిలే!...నువు ముందువెళ్ళు!

శార : నోరుమూసుకొని, మీరు చేస్తున్న ఈ పెద్దరికాన్నంతా చూస్తూ ఊరుకోమంటావు! అంతేనా?

నర : ఏమిటమ్మా! ఆ చేయరానిపనులు ఏం చేస్తున్నది?

శార : తెలియనట్టు అడగడమెందుకు?...నీమనస్సుకి తెలియదూ?...యిప్పుడెందుకమ్మా పెళ్ళి?

నర : మరి?

శార : రోజులు కలిసొస్తే...

వర : ఆ! యీజన్మలో కలిసిరావనమే!...రోజు రోజుకీ ఎలకతోకవాటం తేలుతూ ఉంది సంసారం!

శార : అది తెలిసుండీ మరి నాన్నగారి నలా వేధిస్తావేం?

వర : నేను వేధిస్తున్నానా?...సాటివారిలో తలెత్తి తిరగలేకుండా నేను చిమిడి పోతుంటే...నువ్వూ అమాటే అన్నావ్?

శార : ఎందుకు తలెత్తి తిరగలేకపోవడం? మనం ఏం అపచారంచేశామే?

వర : మనఖర్మ! ... లేకపోతే మీ ముగ్గురిలో ఒక్కరికైనా పెళ్ళికాకపోవడం ఏమిటి? యింట్లో నామాట ఏం నిలుస్తున్నది గనుక... అనేవాళ్ళు నన్నంటారు!

శార : అమ్మా! అలాఅంటే నేనొప్పుకోను. మేమేమయినా హద్దుమీరి నడిచామా చెప్పు?...మాకుమాత్రం తెలీదూ...మావల్ల మీరు తలదించుకోవలసిన పనులేమయినా చేశామే! ఎందుకలా అంటావ్?

వర : దేవునిదయవల్ల యింతవరకూ లేదు ఏమచ్చా!

శార : నీబిడ్డలమీద నీకే నమ్మకంలేదమ్మా!...మాకు వయసొచ్చింది...నిజమే!...అది నేరమా?... నేరమేఅయితే పెళ్ళి దానికి పరిహారమా?... ఈ ఆడబ్రతుక్కి ఒక్క వివాహమేనా పరమావధి?......అందుకోసమేనా ఈజన్మ ఎత్తింది?

వర : ఒసే, కాస్త మెల్లగామాట్లాడు...మీ నాన్న గారి చెవిలోపడితే ఇకేవుంది...అసలే శెంగ పెట్టుకున్నారు.

శార : ఆ బెంగే ఒద్దంటున్నా! పెళ్ళి మాకుగాని మీకుకాదుగా...వద్దమ్మా...మాకిప్పుడు పెళ్ళి అక్కర్లేదు!

వర : బాగుంది! బాగుందేవ్!... అలాఅయితే లోకంనోరు ముయ్యగలమంటే?

శార : లోకం! వెధవపిరికిలోకం! ప్రతియింట్లో విషయం లోకానికే కావాలి!...ఎవరెలా చస్తే దానికేం?...అణుమాత్రం సహాయం, సానుభూతి చూపించలేదు కాని అభాండాలు విసరగలదు. ఎందుకమ్మా మనకీ భయం నా విషయమై మీరు తలబ్రద్దలు చేసుకోవద్దు! కట్నాలకోసం తీర్చలేని ఋణాలుచేసి చితికిపోవద్దు! ఏమవుతుందో చూద్దాం.

వర : ఇలా మాట్లాడి కొంపకి అగ్గిపెడ్తావ్. నాకు తెలుసును! నువ్వల్లాంటిదానివే!

శార : నువ్వేమయినా అనమ్మా!.....ఈ వెధవ కట్నాల పెళ్ళి నాక్కర్లేదు. గొంతుక్కి ఉరిపోసుకు చచ్చిపోతా గాని యిందుకు ఒప్పుకోను!

వర : పిచ్చిమాటలు మాట్లాడకు. ఈ రోజుల్లో కట్నం లేకుండా వరుడెవడొస్తాడే?

శార : రాకపోతే పోనీ...ఇలానే ఉండిపోతా!... నాకేం పెళ్ళి కాలేదని చింతలేదు.

వర : బాగున్నాయే మాటలు?...మేమందరం కావలిసే చేసుకున్నామంటే?...మరీ వొచ్చిం దమ్మా కాలం!

శార : మీ రోజులు వేరమ్మా! చంకలో చంటి పిల్లల్ని పెట్టుకొని పెళ్లి చేసినట్టు ఈ రోజుల్లో ఎలా అవుతుంది? ఆ పని ఏనాడో చెయ్యవలసింది మీరు...యిన్నేళ్ళు ఎదగ నిచ్చారు, చదువు చెప్పించారు... ఇంకా చంటిపిల్లలనే భావిస్తున్నారు. మేమేమి బొమ్మలమా? ముక్కూ, మొగ మెరుగని వాణ్ణెవణ్నో పట్టుకొచ్చి కట్నా లిచ్చి కట్టబెడ్తామంటే మాట్లాడకుండా ఊరుకో డానికి?

వర : చదవేస్తే ఉన్న మతి పోయిందట...మర్యాదా మంచీ తెలిసినవాళ్లు అనవలసినమాట లివా?.. నాన్న విన్నారంటే పీపుబ్రద్దలు కొడ్తారు... భద్రం.

శార : ఏం భయంలేదు. అందుకైనా సిద్ధమే! కాని కట్నంయిచ్చి అల్లుణ్ణి తెస్తామంటేమాత్రం.. ఇప్పుడే చెప్తున్నా నేనొప్పేదిలేదు.

వర : నా దగ్గర అంటే అన్నావుగాని, ఆ కూతలు ఆ కుంకలదగ్గర కుయ్యకు! వాళ్ళూ ఆ

కూతలే కూస్తే నేను ఏ నుయ్యో గొయ్యో చూసుకోవాలి! యిదండీ బ్రతుకు!

శార : వాళ్లకి మాత్రం విచక్షణ లేదూ! వాళ్లకి మాత్రం మంచి చెడూ విభేదం తెలీదూ? నేను చెప్పాలా అమ్మా! పాపం పాలుతాగే చంటిబిడ్డలా! ఒక్క రెక్కమీద వొచ్చే జీతం కుటుంబ పోషణకే చాలకపోతుంటే ఈ పెళ్లిళ్లకోసం వేలకు వేలు ఖర్చు చెయ్యడం! ఉంటే చెయ్యండి! ఒద్దన్నా రెవరు? అప్పులకు పరిగెత్తేకూడా మేం నోరు కదపకూడదేం?

నర : నిజమేనే! నీవన్నది నిజమే! లోకంలో అందరూ ఉంటేనేనా పెళ్లితలపెడుతున్నారు? రోజు లెల్లప్పుడూ ఈలాగే ఉండి పోతాయటే?

శార : అదే నేనూ అంటున్నది. రోజులు మారి నాలుగు డబ్బులు చేతిలో ఉంటే అప్పుడే తలపెట్టండన్నా!

నర : చాల్లే! నీతో వాదించలేను...నీఈడువాళ్లు అప్పుడే నలుగురు బిడ్డల తల్లులై సంసారాల్ని దిద్దుకుంటుంటే......

శార : ఇతర్ల విషయం పోటితెస్తా వెందుకు? అందరిలా మనం వున్నామా? మన విషయం మనది. ఎవరిలోనో మన కెందుకు సాటి? మనకి చెందిన సమస్యల్ని మనం మనకు నచ్చి నట్టు ఎదుర్కొంటాం!..అంతేగాని లోకాని కోసం అని...

నర : సరేలే! నువ్వెళ్ళు!...నీతో మాటకిమాట పెంచలేస్తే ఈ రోజు పనులైనట్లే!...లే... వెళ్ళు.

శార : కాదమ్మా! నామాట విను. ఈ యేడాదితో నా చదువై పోతుందా... నేను ట్రైనింగుకి పోతే నాగోడవుండదుగా!...యిక...

నర : ఒసేవ్! చెఱుకు తీపని ఎవరైనా మొయ్య నవుల్తారటే! దేనికైనా ఒక హద్దూ పద్దూ ఉండక్కర్లే?...ఈ వెధవ చదువుకే నా బుఱ్ఱమీది వెంట్రుకలు లేచిపోతున్నాయి! యిక ఉద్యోగంకూడానా? ... ఊరొదిలి పోవాల్సిందే! అయినా యింటా వంటా లేని పనులు చేస్తానంటావేమే?

శార : అలాఅయితే మమ్మల్ని చదివించడంలో మీ ఉద్దేశం ఏమిటమ్మా?

నర : ఉద్యోగాలుచేసి ఊళ్లేలుతారని!...నన్నడిగి చదువుతున్నట్టే...వెళ్లు! వెళ్ళు! మాటలకేం? నాన్నగారు వచ్చేవేళయింది. ఆయన నా మీద విరుచుకుపడ్తారు యింకా సిద్ధంగా లేరా అని...అన్నింటికీ నేను దొరికాను చవగ్గా!

శార : బాగున్నాయమ్మా నీమాటలు...యీమాత్రానికే...

నర : అదుగో ఆయన వొచ్చేశారు.

శార : ఈవేళ వేగం వచ్చేశారే నాన్నా!

సుంద : (ప్రవేశిస్తూ) ఏమిటి తల్లీకూతురూ మహా నింపాదిగా కూడున్నారు...ఏమిటో విశేషం వుంది!

నర : అబ్బే! ఏమీ లేదు...మీరు త్వరగా వచ్చేశారని...

సుంద : మరి రాకపోతే ఎలా చెప్పు?...వాళ్ళొస్తున్నారా...ఏమమ్మా శారదా!...ఏమిటలా చూస్తున్నావ్?...ఏమిటే?

నర : ఏమీ లేదండి!

శార : చెప్పడానికి జంకుతావేమమ్మా? చెప్పు!

సుంద : ఏమిటే?

నర : ఏమీ లేదన్నాగా! ... దాని మాటలకేమిటి లెండి!

శార : అమ్మా! అలా నువ్వు కప్పిపెడ్తే లాభం లేదు; నీకు చెప్పడానికి భయమైతే...

నర : భయం దేనికే! నువ్వెళ్ళు! చెప్తాలే!...వెళ్లు.
[శారద లోపలికి పోతుంది. సుందరయ్య కోటు విప్పుతాడు]

సుంద : ఏమిటే సంగతి?

నర : దానికి వికారం ఎత్తింది...అంతే!

సుంద : అంటే?

నర : పెళ్ళి పెటాకులూ ఒద్దట!...యింకా చదువు కుంటుందట!...ఉద్యోగంచేసి మనల్ని ఉద్ధరిస్తుందట!

సుంద : మంచిదే!

వర : మీరలా అంటారని నాకు తెలీదూ? నా కొచ్చిందికాదు చావు!...

సుంద : నరసూ నామాట వింటావా?

వర : అందరి మాటలూ వినడానికే నేనున్నాను. నా మాట పాటించే వాడు లేడు!

సుంద : అబ్బ! చెప్పింది వినవు పూర్తిగా...శారదకి ఈ సబంధం ఖరారైనట్టే.

వర : ఆ! నిజమే!...హాస్యమాడుతున్నారా?

సుం : నిన్ను చూస్తే హాస్యమాడాలనే వుంటుంది మనసులో!

వర : చాల్లెద్దురూ...కట్నం విషయం?

సుం : అదే యింకా ఏమీ తేలలేదు.

వర : కట్నం యిచ్చారంటే ఉరిపోసుకుంటానంది తెలుసా?

సుం : ఎవరు? శారదే!...అదెప్పుడు?

వర : మీరొచ్చేటప్పటికి ఆ గొడవే జరుగుతుంటే!

సుం : హుం...

వర : ఏం అలా అన్నారు?

సుం : పసిదానికున్నంతి వివేకం యితర్లకెందుకు లేదా అని!

వర : ఆచారం అలా ఒస్తుంటే ఒద్దనగలరా? మీకు మాత్రం మా నాన్న యివ్వలేదూ?

సుం : ఆ!...అదంతా నే నేతి వేశాను. నీకూ పెట్టారుగా బంగారం ఆ కట్నంమీద వెయ్యి హెచ్చు వేసి!

వర : అదంతా మా వాళ్ళింటికేగా నేను పట్టుకుపోయింది! మా వాళ్ళంటే మీకు కోప మొస్తుందేమో!

సుం : కోపం కాదే...ఎంతయినా పుట్టింటి అభిమానం పోతుందీ?

వర : సరేలెండి...కుఱ్ఱవాడి విషయాలు చెప్పండీ! మంచి సంప్రదాయమేనా?

సుంద : కాకుంటే మనకెందుకు?...మంచి సంప్రదాయమే! ఒక్కడే కొడుకు.. ఆస్తిపాస్తులు లేకట్టే...మొన్ననే పాతికేళ్ళు దాటాయి. ఎమ్మే పాసయి కాలేజిలో పనిచేస్తున్నాడు ...మూడువందల జీతం...ఒక్క ముసలితల్లి మాత్రం వుంది. శంకరయ్యగారి అన్న కుమారుడు.

వర : శంకరయ్యగారా?...ఆయనే కదూ...మన చంద్రా...

సుంద : ఆ! ఆ! వాళ్ళమ్మాయి మన చంద్రా ఒక్క క్లాసే చదువుతున్నారు.

వర : మంచి సబంధమండీ! తప్పిపోనివ్వకండీ!

సుంద : మన చేతిలో ఏముందీ—ప్రయత్నిస్తున్నా ...నాకు వచ్చా డన్ని విధాలా!...కానీ...

వర : ఏమిటి సంశయం......శంకరయ్యగార్కి మీకూ బాగా పరిచయం ఉందిగా!

సుంద : అవుననుకో!...కాని కట్నం విషయమే... ఏమీ తేలలేదు!

వర : ఇంత మంచిసంబంధం ఒదులుకుంటామండీ! ఎలా అయినా సరే ఈ యేడు పెద్దమ్మాయి పెళ్ళి అయి తీరవలసిందే!

సుంద : ఒక్క నీకే ఉంది తొందర!...నాకు లేదనుకుంటున్నావు కదూ ఈ విషయంలో!

వర : అదికాదండీ! మన పరిస్థితుల్ని చూచి అలా అంటున్నదిగాని...దానికి మాత్రం మొగుడూ పిల్లలూ అన్న ఆశలేదనుకుంటున్నారా? దానితోటివాళ్ళు అప్పుడే సంసారాలు దిద్దుకుంటున్నారు...దాని వేపుచూస్తుంటే..

సుం : నరసూ! నాకి వేమీ తెలియదనుకున్నావా? నే నేం మనిషిని కానూ?...యేం చేయను... నీకు తెలీనిది ఏముందని? నాస్వంతంకోసం ఒక్కరూపాయికూడా తీసుకోకుండా తెచ్చిన జీతం నీచేతిలో పోస్తున్నాను. నీ వెరుగని ఆదాయం ఉందా చెప్పు?

వర : నెలనెలా అప్పులు చెయ్యడమే తప్ప దమ్మిడీ మిగిల్చే ఆస్కారం లేకుండాపోయింది. ఈ వడ్డీలకే తూగలేకపోతున్నాం. ఎన్నాళ్లో ఈ దరిద్రం?

సుం : ఏంచెయ్యమంటావునన్ను? ... నా మనసులో ఎలా ఉందో తెలుసా?...నీ ఒంటిమీద ఒక్కనగకూడా ఉంచలేకపోయాను. నేను యివ్వటం పోయింది— నీదగ్గర్నుంచి ఒక్కొక్క నగ తాకట్లపాలు చేశాను. అవి విడిపించె ఆస్కారం కూడా కనిపించదు..

సర : పోతే పోతాయి! మీరు విచారించకండి! ఒంటినిండా మాత్రం కడుపునిండుతుందా? అవసరాని కక్కరకు రానిది ఉంటే మాత్రం లాభం ఏమిటి? మీరేం దుబారా చేశారు గనుకనా? ఇంటికోసమేగా వాడారు! ఈ వేళ కాకపోతే రేపొస్తాయి. దానికి విచారం ఎందుకు?

సుంద : విచారం కాదు సరసూ! ఆ మిగిలిన కొంచెం పల్లం అమ్మితేగాని పెద్దమ్మాయి పెళ్ళికాదు. అదే ఆలోచిస్తున్నా! ఇక వచ్చే ఆ గింజలు కూడా కరువై పోతాయి. అంతటిలో మన బాధలు తీరితే బాగానే ఉండును. ఇంకా యిద్దరున్నారు. తయారుగా!...ఏమిట్లో సరసూ! బ్రతుకింత బ్రద్దలై పోయి ఇంత చేతకానివాడినయి పోతానని ఏనాడూ అనుకోలేదు.

సర : మన దినాలు బాగులేవు. ఊరుకోండి!...ఈ కష్టాలు కలకాలం ఉండిపోతాయా? మీరిలా అధైర్యపడకండి! ఇన్ని యిబ్బందుల లోనూ ఇంట్లో లోటు రాకుండా చూస్తున్నారు. ఏ విషయంలోనూ...

సుంద : ఆ! చూస్తున్నాను! ఎందుకొచ్చిన మాటలే! వెళ్ళు! వెళ్ళు! మన కష్టాలు ఎప్పుడూ ఉన్నవే. వాళ్లు వచ్చేటప్పటికి కాఫీ కావలసి ఉంటుందేమో చూడు. అన్నట్టు వాళ్లిద్దర్నీ కూడా కొంచెం తల లవి దువ్వుకుని మంచి బట్టలు కట్టుకోమని చెప్పు...ఏమి కానీ...పైన భగవంతుడున్నాడు.

సర : ఇప్పుడే వస్తారా? ...అయితే యింత సేపూ చెప్పరేం? ఇల్లంతా అడివిలా వుంది. ఒసే చంద్రా! (అని పిలుస్తూ లోనికి పోతుంది, సుందరయ్య కుర్చీలో చేరగిలబడి ఆలోచిస్తూంటాడు. శారద మెల్లగా వచ్చి తండ్రి వెనక నిల్చుంటుంది.)

శార : నాన్నా!

సుంద : (తల తిప్పకుండానే) ఏమమ్మా!

శార : ....

సుంద : ఏమిటమ్మా!...చెప్పు!

శార : నేనింకా చదువుకుంటా నాన్నా!

సుంద : ఆలాగే నమ్మా!

శార : ......అమ్మ మీతో యింకేం చెప్ప లేదూ?......

సుంద : అన్నీ చెప్పిందమ్మా!......ఆలా కూచో. (కుర్చీలో ఎదురుగా కూర్చుంటుంది.) నీ కెందుకమ్మా యీ గొడవలన్నీ! చూడూ! పెద్దవాళ్లం మేమున్నామా? మా బాధలేవో మేం పడ్తాం...నీవేం బాధపడకు!

శార : అది కాదు నాన్నా!......

సుంద : ఏమిటమ్మా?...చెప్పు...సంకోచించకు!

శార : ఈ ఏడాదీ అయిపోయినతరువాత ట్రైనింగుకి పోతా నాన్నా!...ఉద్యోగం చేసి...

సుంద : సంపాదించి యిల్లు గడపడంలో సాయం చేద్దామని వుందా?

శార : అవున్నాన్నా!

సుంద : అంతకన్నానా అమ్మా!...కొడుకులు లేని లోటు నీవైనా...

శార : కోపమొచ్చిందా నాన్నా?

సుంద : నీ మీద కోపమా?...పిచ్చినాన్నా!...... ఈ వయసులో, ఉత్సాహంగా ఏ చింతా, చీకూ లేకుండా గడపవలసిన ఈ వయసులో, నీమనసులో యిల్లాంటి ఆలోచనలు పుట్టించే పరిస్థితిని కలిగించిన నా చేతకానితనానికి...

శార : మీరలా అనకండి నాన్నా! అలాఅంటుంటే మాకెంత బాధగా ఉందో మీకు తెలీదు. మీరు మాకు ఏంలోటు చేశారు?...మేం దౌర్భాగ్యులం! ... వృద్ధాప్యంలో మీకు గడ్డు సమస్యలపై కూర్చున్నాం. మీరు విచారించకండి...మాకోసం మీరు ఇలా కృంగి పోతుంటే, మాకు బ్రతుకుల మీద అసహ్యం పుడ్తూవుంది!

సుంద : శారదా! ఏమిటామాటలు? అనవసరంగా మీ రెందుకు బాధపడాలి తల్లీ!...పరిస్థితులు ప్రస్తుతం బాగులేవు...నిజమే! ... దెబ్బ యిరుకున పడింది! అయితే మాత్రం?... రోజు లెల్లప్పుడూ యిట్లానే ఉండి పోతాయా?...

శార : అదికాదు నాన్నా! తీర్చలేని అప్పులు...

సుంద : ఎందుకు తీర్చలేం? మనకీ ఆస్తులున్నాయిగా! నాకింక మీముగ్గుర్నీ తప్పించి ఎవ

రున్నారే? మీసుఖాల కోసం ఆపాటి కష్టం సహించలేమా మేము?...నువ్వు విచారించకు. నీకోసం ఎలాంటి అల్లుణ్ని తెచ్చానో తెలుసా?...వెళ్ళు! తలదువ్వుకో! మంచి చీర కట్టుకో! ఏదీ మొన్న కొన్న నీలం జాకెట్టు...వాళ్ళొస్తున్నారు...వెళ్ళు!

శార : నాకిప్పుడు పెళ్లి అక్కర్లేదు నాన్నా!

సుంద : ఆమాట అల్లుణ్ణి చూచిన తర్వాత చెప్పుదువు గానిలే!

సిగరెట్టు కూడా త్రాగే అలవాటు లేదట! ...తెలుసా!

శార : మీ కెప్పుడూ యింతే నాన్నా! మాట విని పించుకోరు!......అప్పులు సప్పులు చేసి కట్నాలుపోస్తేమాత్రం నా ఆశ వొదులు కోండి! అంతే! ముందే చెపుతున్నా తర్వాత విచారించి లాభంలేదు!

సుం : అమ్మాయి! ఒక మాట చెపుతాను వినూ... యిచ్చే కట్నం ఎవరికమ్మా యిస్తున్నాను?

శార : ఎవరికొ్కాని! యివ్వటానికి వీలులేదు!

సుంద : అల్లుడికేగా యిస్తుంట! అంటే నీకే అన్న మాట! తల్లితండ్రులు కోరేది పిల్లల సౌఖ్యం కాదూ?

శార : డబ్బిచ్చి కొనుక్కునే ఆ సౌఖ్యం నాకక్కర్లేదు.

సుం : ఆస్థిపాస్తులు యివ్వలేని తండ్రి అంతకంటే యింకేమి యివ్వగలడమ్మా కూతుళ్ళకు?

శార : ఉంటే యిచ్చుకోవచ్చు మరి!...

సుంద : శారదా! నీ అభ్యంతరం ఏమిటి?...నిజం చెప్పు!

శార : కట్నాల పెళ్లి నా కవసరంలేదు.

సుంద : ఎవరికిమాత్రం యిష్టం ఉందమ్మా కట్నాల పెళ్లి? నాకిష్ట మనుకున్నావా?...ఇన్ని వేలు కట్నం యిచ్చానని గొప్ప చెప్పుకోవాలని నే నుబలాటపడుతున్నానని అనుకుంటున్నావా?...ఆలోచించు...ఏం చెయ్యడం? విధిలేదు...

శార : ఎందుకు లేదు?..చెప్పానుగా నేను ఉద్యోగం చేస్తానని...

సుంద : పిచ్చినాన్నా! యింత అందం, యింత చలాకీ ఉద్యోగంకటే! ఇల్లు......అదుగో వాళ్ళొచ్చారు!

[శారద లోపలికి పోతుంది ముఖం ముడుచుకుని. సుందరయ్య వెలుపలకి వెళ్ళి ఆహ్వానిస్తాడు. లోనికి సుందరయ్యతో శంకరయ్య, రఘు వస్తారు. శంకరయ్య వయస్సు 50 దాటింది. రఘు వయస్సు 26 సంవత్సరాలుంటుంది. పరస్పర నమస్కారా లయిన తర్వాత అందరూ కూర్చుంటారు]

సుంద : మీ కోసమే ఎదురుచూస్తున్నా! ... అమ్మగారు రాలేదేం బాబూ?

శం : ఆవిడ దొక పిచ్చిమతం...

రఘు : అదికాదండీ! ... రావాలనే అనుకొంది ...

శం : శుభమా అంటూ తలచెడ్డ తనెందుకు రావాలని నన్నే అన్నీ చూడమని కబురెట్టింది... పాతకాలం ఆచారాలు యింకా ఆవిడలో వున్నాయిగా!

సుంద : అలాగా!...దాహోని కేమయినా...ఏమేవ్! శంకరయ్యగారు వచ్చారు!...కాఫీ పట్రా!

శం : అబ్బే! యిప్పుడేమీ అక్కర్లేదయ్యా! ఎందుకు శ్రమ?

సుంద : అహా! అలా అంటే ఎలా చెప్పండి! శ్రమకేం ఉంది?... ఏం బాబూ కాఫీకావాలా టీ కావాలా?

రఘు : ఏమీ అక్కర్లేదు. మంచినీళ్లు తెప్పించండి చాలు!

[తొందరగా సుందరయ్య లోపలికి వెళ్తాడు]

శం : ఏమిట్రా మతిగాని పోలేదుకదా?

రఘు : ఏం బాబాయ్?

శం : ఆయన తెస్తాననడం, నీవు తెమ్మనడం... బాగుంది! కలిస్తే అతికదంటారు పెద్దలు?

రఘు : నిజంగా దాహం వేస్తోంది నాకు..అంచేతే...

శం : చాల్లే! సమయాసమయాలు చూడవూ?... ఇంకా మాటా మంతీ లేకుండానే ... వస్తున్నట్టుంది.

[శంకరయ్య భార్యతో ప్రవేశం. ట్రేలో రెండు కప్పుల్తో కాఫీ తీసుకొస్తుంది చంద్ర, ఆఖరమ్మాయి. టేబిలుమీద ఉంచి పోబోతుంటే]

సుంద : ఇదే ఆఖరిది! చంద్ర...

శం : మా శశితో చదువుకుంటున్నదేగా! బావను చూడగానే సిగ్గొచ్చినట్టుంది!

నర : ఏమిటో అంతా మీ చేతుల్లో వుంది.

సుంద : చూశారా! మన స్నేహాలు బంధుత్వం క్రింద మార్తున్నాయి! మీ ద్వారా!

శం : మనలో ఏముంది చెప్పండీ!...భగవంతుడు కలపాలేగాని మనలో ఏముంది!

నర : కాఫీ పుచ్చుకోండి! చల్లారిపోతుంది!

శం : ఫరవా లేదమ్మా! (అంటూ తీసుకుంటాడు)

రఘు : (అయిష్టంతో కాఫీ పెదవులకు తగిల్చి ట్రేలో పెడ్తాడు)

నర : పదిసెగారు కులాసాయేకదండీ! దంటివాడి కీమస్య...

శం : ఏమిటోలే తల్లీ! వాడి నక్షత్రం అల్లాంటిది! దానికీ వాడికీ ఒకటే వలతలు!...ఆ! ఒక సారి అమ్మాయిని పిలుస్తారా? మళ్ళీ ముహూర్తం జారిపోతుంది! సరిగ్గా నాలుగు నలభై అయింది. కొంచెం తొందరగా!...

[నరసమ్మగారు లోపలికి పోతారు.]

సుంద : ఇప్పుడే వొస్తుంది! వొస్తుంది...(అంటూ భార్యవెంబడి లోపలికి పోతాడు. చంద్ర గ్లాసుతో మంచినీళ్లు పట్టుకొస్తుంది. టేబిలు మీద ఉంచి కప్పులు తీయబోతుంటుంది.)

శం : బుద్ధిగా చదువుకుంటున్నావే?

చంద్ర : (నవ్వి ఊరుకుంటుంది)

శం : మీ అక్క యింకా ఏం చేస్తున్నదే?

చంద్ర : ఏ అక్కకి...

శం : ఆ! ఏం నంగనాచివే! తెలీదూ నీకూ... బావ నచ్చాడా నీకు?

చంద్ర : మధ్య నన్నడుగుతారేం! నేనా పెళ్ళాడేది?

శంక : ఆరోజూ రానీ నువ్వూ పెళ్లాడ్తావు!

[చంద్ర కూడా గ్లాసు తీసుకొని లోపలికి పోతుంది.]

రఘు : చలాకీగా ఉందే...

శంక : నీకూ తెలుస్తుందిలే దాని చలాకీతనం అదలాంటి పెంకి ఘటమే! మహా పెంకి ఘటమట! మన శశీ యిదీ ఒకే క్లాసు చదువుతున్నారు.

రఘు : అలాగా!

శంక : చాలా తెలివైందికూడా ! ... ఏరా ! ... అన్నట్టు కాకినాడ నించి ఏదో సంబంధం వచ్చిందికాదూ!...

రఘు : ఆ! వచ్చింది! పదివేలు కట్నం కూడా!

శం : మరి?

రఘు : పిల్ల నాకు నచ్చలేదు బాబాయి!

శం : ...ఏమిటో ఈ రోజుల్లో ఈ రోగాలు!... అందం కొరుక్కుతింటార్రా! పదివేలు ఒదులుకున్నా వన్నమాట!

రఘు : డబ్బుమాత్రం కొరుక్కు తింటారేమిటి బాబాయి! నేను కాదనేసరికి అమ్మ నామీద అగ్గయిపోయింది! తను మాటకూడా యిచ్చేసిందట!...

శం : కాదుమరీ! ... ఈయనమాత్రం ఏమంత కట్నాలకని యివ్వగలడు? మనిషంటావా మంచి మనిషే !...చితికిపోయాడీమధ్య మరీన్ని!...అటు ఆ బేంకు దివాలా తియ్యడం...యిటు ఈ కేసు ఓడిపోవడం.. పాపం అతన్ని చూస్తే జాలివేస్తుంది నాకు! ఏదోవిధంగా సాయంచెయ్యాలనే వుంది నాకు!

రఘు : అమ్మ ఎటువంటిదో మీకు తెలుసుగా... ఆవిడ మాట కెదురు చెప్పడం నా కిష్టంలేదు.

శం : అవును చచ్చేకాలానికి ఆవిడ మన సెందుకు కష్టపెట్టడం! మంచిదికాదు కూడా!

రఘు : మనసుకష్టంతో తీరితే బాధేలేదు. ఎన్నిసార్లో చెప్పిచూశాను కూడా ! లాభం లేదనిపించింది. అసలు నాకూ యీ కట్నాల పెళ్ళిళ్లు యిష్టం లేదు-కానీ గత్యంతరం లేదు. అమ్మ వినదు—మాట కొట్టిపారెయలేను.

శం : నిజమే!... అదిగో అమ్మాయి వొస్తున్నట్లుంది! ఏమయినా అడగాలని ఉంటే బిడియపడకు. అడుగు !

రఘు : అలాగే లెండి !

సుంద : (ప్రవేశిస్తూ) క్షమించాలి ! ఆలస్యం అయిపోయింది !

[ఆయనవెంటనే తల వంచుకొని శారద వొస్తుంది. తొందరలో ముస్తాబైనట్లుంటుంది.]

శంక : ఇలారా అమ్మా. ఫరవాలే! మనవాళ్లే!

[కొంచెం ముందుకొచ్చి శంకరయ్యగారికి నమస్కరిస్తుంది. ఆయన ఆశీర్వదిస్తాడు. చాటునుంచి యిద్దరు చెల్లెళ్ళూ, తల్లీ చూస్తుంటారు]

శంక : కూచో తల్లీ!

శార : ఫరవాలేదండీ!

రఘు : (నమస్కారం చెయ్యబోయి లేవబోయి కుర్చీలో ఆమెనుచూస్తూ కూర్చుంటాడు. తలవంచుకొని అట్లానే నిలుచుండిపోతుంది శారద. కొంచెంసేపు నిశ్శబ్దం. ఎవరి నోటంటా మాటపెగలదు.)

శం : రఘూ!

రఘు : అఖ్ఖర్లేదు బాబాయ్!

[అందరి మొఖాలు వెలవెలబోతాయి.]

సుంద : (నిరాశతో) ఆ!

శంక : (తీవ్రంగా) ఏమిట్రా?

రఘు : (సర్దుకుంటూ) యేంలేదు బాబాయ్! అన గాల్సింది ఏమీ లేదు!

సుంద : ఓహో! అలాగా!

రఘు : ఇక లోపలికి వెళ్ళొచ్చుని చెప్పండి... కాని ముఖ్యంగా మరీమరీ అడిగి కనుక్కోండి ఈ పెళ్ళి యిష్టమేనా కాదాఅని!

శంక : అది నువ్వే అడగరాదటోయ్! ఎదుట్నే ఉందిగా.! ఏమమ్మా! చెప్పు వరుడు నచ్చాడా?

[క్షణం నిశ్శబ్దం. ప్రక్కనుంచి తొంగి చూస్తున్న చంద్ర]

చంద్ర : మామయ్యగారూ! ముందు అటునుంచి నరుక్కురండి!

శం : ఏమిటమ్మా! నరకడ మేమిటే?

చంద్ర : ముందు అక్క నచ్చిందో లేదో కనుక్కోండి.

రఘు : (శారదను చూస్తూ) నచ్చకపోతే మనం నచ్చామో లేదో అన్న ప్రశ్న ఎందుకు వస్తుందీ?

[శారద చిరునవ్వు నవ్వుతుంది. తల ఎత్తడంలో యిద్దరిచూపులూ కలుస్తాయి! ఆమె సిగ్గుతో తల దించుకొంటుంది.]

శంక : బాగుంది! ఎటూ తేలని కథ అయిపోయింది. ఎంతసేపని యిలా కూచుంటాం!... చెప్పరే ఎవ్వరూ?

చంద్ర : మా అక్కమాత్రం తనకి నచ్చకపోతే ముఖం మీదే చెప్పేస్తుంది ఆమాట!

శం : నచ్చితేనేవా చెప్పడానికి సంకోచం? మా మంచి ప్లీడరుని దొరికావే మీ అక్కకి!... సరే వెళ్లమ్మా లోపలికి!

[శారద లోపలికి వెళ్తుంది. రఘు అటువేపు చూస్తూ కళ్లు మూసుకుంటాడు.] ఏంరా! అలా మన్నుతిన్న పాములా కూర్చున్నావేం? ఏమేమి అడిగదలచుకున్నావో?

రఘు : ఏమడిగాలి బాబాయి! ఏక్లాసు చదువుతున్నావు?... హిందీ వచ్చా?... ఎంట్రాయిడరీ వచ్చా?... వంట చెయ్యగలవా? ఈ సర్వీస్ కమీషన్ ప్రశ్నలేగా?

సుం : అవి తెలియకపోవడం ఎక్కడైనా ఉంటుందా? అందులో మాయింట్లోనా?

రఘు : అందుకనే అడగలేదుగా మరి?

శం : అయితే. ఒకే!... నువ్వు యింటికెళ్లు... కొంచెం విషయాలు మాట్లాడుకొని వస్తున్నా.

రఘు : అలాగే బాబాయ్...మరి...

శం : ఏమిటా సందేహం?

రఘు : వెళ్ళొస్తున్నానని...

సుం : ఓ!... యిదిగో అమ్మాయి చంద్రా! అమ్మకి చెప్పు యిలా రమ్మని...

నర : (ప్రవేశించి) పిల్చారా?

రఘు : వెళ్ళొస్తానండీ!

నర : మంచిది! అలాగే నాయినా!

[రఘు నిష్క్రమణ]

శంక : కూచో అమ్మా! నించోబడి పోయా వేం?... నాదగ్గిరే యీ మర్యాదలన్నీ!

నర : ఫరవాలే దన్నయ్యగారూ!

శంక : నీకు అబ్బాయి నచ్చినట్లేనా?

నర : అలా అంటారేమిటండీ అన్నయ్యగారూ! లక్షణంగా చక్కని ఈడూ జోడూ...

శంక : మీరేమంటారు బావగారూ!

సుం : చెప్పండి మీరే!... అంతా మీచేతిమీదుగానే నడవాలి.

శంక : అదికాదు. చూశారూ!... మా వదినెగారున్నారే!... అదో పాత తరహా మనిషి... మొన్న కాకినాడనుండి పదివేలతో వచ్చిన పిల్లని కాదన్నాడని నానామాటలూ అందట!

నర : పదివేలా!

సుం : ఏం ఎక్కువైపోయిందా? ఉన్నవాళ్లు కదో లెఖ్ఖ! మనకి తలకిమించినదిగా ఉంది గాని!

శంక : మన సంబంధం ఎలాఅయినా కలవాలనే నా కోరిక!... అంచేత మీరు...

సుం : అంత పెద్ద మొత్తానికి తూగలేమండీ బావగారూ...

శంక : మరి?

సుం : చూశారూ!... శారద ఒక్కత్తే అయితే నా తల తాకట్టుపెట్టి అయినాసరే మీరు కోరిన మొత్తం యిచ్చేవాడిని.

నర : అబ్బాయిని చూస్తే అలానే అనిపిస్తుందండీ! ...కాని ... యింకా దానివెనక యిద్దరున్నారు మరి!...

శం : అయితే ఎంతకి మీరు తూగగలరు?

సుంద : అదయినా చూశారూ!...మీకు తెలియని రహస్యాలు లేవు...ఆ మిగిలినపల్లం పదకొండలూ అమ్మి దీనిపెళ్లి చేయాలనుకుంటున్నా!...మీరన్నదాంట్లో సగం...

శం : అయిదువేలా?......అనుమానమే! ఆవిడ ఒప్పుకోరు!...మాటిస్తే మళ్ళ నన్ను ఆడిపోస్తుంది!

సుంద : అంతకు మించి యిచ్చుకోనే శక్తి మాకు మరి లేదు. ఉంటే మీ కిన్ని చెప్పాలటండీ?... ఇప్పటికే తలకిమించిన ప్రయత్నం యిది... మిగిలిన ఆ యిద్దరిగతి ఏమవుతుందో... ముందు ఈ బరువు తీరనీ అనే ఆ అయిదు వేలు కట్నం యిస్తానంటున్నాను!

శం : అంతే అంటారు!

సుంద : మీరే ఆలోచించండి! మీ రెరుగని బండారమా మాది!...మొదట్లో అయివుంటే...

నర : సరే! యిప్పుడెందుకా పాతవన్నీ.

శంక : సరే! నేవస్తా! త్వరలోనే ఏదో తెలియచేస్తా.

నర : మరి మీదే భారం! ఏదో మీ పుణ్యముంటుంది.

శం : మీ రింత చెప్పాలటమ్మా!

సుంద : బావగారూ! మీరు చెప్తే ఆవిడ కాదనలేరు! మీ మేలు మరచిపోను.

శం : అంత చెప్పాలటయ్యా నువ్వుకూడా!... నిశ్చింతతో ఉండండి మీరు. నాపాట్లేవో నేను పడ్తాగా; అన్నట్టు!...ఒక్కమాట... కట్నం తీసుకోవడం రఘుకి అసలు యిష్టం లేదు. స్నేహితులకు తెలిస్తే గేలిచేస్తారన్న భయముంది. అటు కొట్టలేడు తల్లిమాట! అంచేత కట్నంవిషయం కొంచెం లోలోపల ఉండడమే మంచిది. పైకి పొక్కనివ్వొద్దు!

సుంద : అవశ్యం అలాగే చేద్దాం! ఆ మూడుముళ్లూ పడితే అదే పదివేలు.

నర : నలుగురితో చెప్తే మా గ్రతం ఒరిగిపోయేదేముంది?

శం : ఏమీ లేదు. అయితే మరి నేనువోస్తా.

సుంద : మంచిది. (యిద్దరూ లేచి వీధిలోకి నిష్క్రమణ. లోనించి శారద వొస్తుంది. చేతిలో పుస్తకం).

శార : వెళ్లిపోయా రేమిటమ్మా?

నర : మళ్లీ పుస్తకం సువ్వూ తయారు...ఏం?

శార : ఏమీ లేదు.

నర : ఏమి టలా ముఖం పెట్టావ్?

శార : ఎన్నివేలు నిర్ణయించారు?

నర : ఏమిటే?

శార : ఏమిటంటా వేమిటే?

[సుందరయ్య ప్రవేశం...ఆలోచిస్తూ]

సుంద : ఏమిటమ్మా ఆ కేకలు?

నర : చూడండీ ఆ పొగరుమోతుతనం!...బాగా నెత్తి కెక్కించుకున్నారు కూతుర్ని!

శార : నామాట అసలు వినిపించుకోరేం మీరు?

సుంద : అబ్బాయి నచ్చలేదేమిటమ్మా?

శార : అదికాదు నాన్నగారూ!

సుంద : ఓ! కట్నం సంగతా?

శార : (బో నన్నట్లు తలూపుతుంది.)

సుంద : అబ్బాయికి కట్నం పెళ్ళి యిష్టం లేదట!

శార : (ముఖం విప్పారుతుంది) ఆ! నిజమే!

సుంద : నిజమమ్మా! అమ్మనడుగు. ఏమన్నారే శంకరయ్యగారు?

[శారద సంతోషాన్ని అపుకోలేక లోపలికి పోతుంది.]

నర : అదేమిటండీ! అలా చెప్పారు. తర్వాత కొంపలంటుకుంటాయి!

సుంద : నేనేం అబద్ధం చెప్పలేదే!

నర : అబ్బాయికిష్టం లేకపోయినా పుచ్చుకోవటం మానుకున్నాడా?

సుంద : బాహాటంగా కాదుగా! ఎవరికెందుకు తెలియాలి?

నర : ఎంత ఆలోచనండీ మీది?

సుంద : ఏం లాభం? ఈ దరిద్రాన్ని, కష్టాల్ని తప్పించలేక పోతున్నాంగా!

నర : చాల్లెండి! యథాస్థానం ఆపాలేనా! [తెర]

రంగము: 2

* * సారెగది. బాగా అందంగా అలంకరించబడి వుంటుంది. రఘు నిండు ఉత్సాహంతో ఉంటాడు. పాన్పు అంచున కూర్చొని మిఠాయి తింటుంటాడు. గదినిండా సువాసన. పాన్పు నిండా చల్లిన మల్లెలూ, సన్నజాజులూ, గులాబీ రేకలూ మత్తెక్కిస్తుంటాయి. కిటికీలోనుంచి నూరు వరాలతీగ సందులనుండి చంద్రుడు కనిపిస్తుంటాడు. చక్కని శోభనపు రాత్రి. గడియ వేయని తలుపులకు చేరువగా శారద నిల్చొని ఉంటుంది. ముఖంలో అణచిపెట్టబడిన కోపం, దుఃఖం కనిపిస్తూనే ఉంటుంది. క్రింది పెదవిని పంటితో నొక్కి నేలను చూస్తుంటుంది నిశ్శబ్దంగా. రఘు కొంచెంసేపు ఆగి తలెత్తి శారదవేపు చూస్తాడు. తినడం ఆపి, మంచం దిగి, చేతులు దులుపుకుంటూ శారద దగ్గరికి వస్తాడు. శారద చూడదు.

రఘు : (ఆమె కళ్ళల్లోనికి చూడాలని ప్రయత్నిస్తూ భుజంమీద చేయి వేసి) ఏం...అలా నిల్చుండి పోయావ్? (ముందుకి లాగి తలుపు గడియ వేస్తాడు.)

శారద : (మాట్లాడదు.)

రఘు : (శారదను మంచంవేపు లాగుతాడు. ఆమె కదలదు. నెమ్మదిగా నడిపిస్తూ మంచం చేర్చి) కూచో!

శారద : (కూచుంటుంది మంచానికి ఒకప్రక్కగా.)

రఘు : (బల్లమీది ద్రాక్షపళ్లు రెండందుకొని, ఒకటి నోట్లో వేసుకొని, రెండోది ఆమె నోటిదగ్గర పెట్టి) ఆ అనూ.

శార : (తలతిప్పివేసి నోటిని దాచుకుంటుంది.)

రఘు : అందని ద్రాక్షపళ్లు పులుపన్నారు. (అని అదీ నోట్లో వేసుకుంటాడు. ఆమెప్రక్కనే కూర్చొని భుజమ్మీద చేయివేస్తాడు. ఆమె ఆ చేయి తీసివేయాలని ప్రయత్నించి ఊరుకుంటుంది. ఆమె శరీరం వణుకుతుంటుంది.)

రఘు : ఏం అలా ఒణికిపోతున్నావ్?

శార : ....

రఘు : భయమా?... నేనేం పులిని కానుగా?

శార : ....

రఘు : మాటలురావూ? చూడూ ఎంచక్కని రాత్రో! ఈ పువ్వులూ, ఈ అగరొత్తులూ, యీ చల్లనిగాలీ...వెలుపల నిండువెన్నెల.. కంటెదురుగు అందాలరాణీ...ఈ పాన్పూ, ఈ పళ్లూ...మిఠాయీ...నిజంగా కవిత్వం చెప్పాలనివుంది. జన్మకల్లా యీ దినమేకదూ మనం మరిచిపోలేనిది! నా హృదయం ఎలా వుందో చెప్పేదా? అంచులంటిన ఆనందం.. ఉరకలేస్తున్న ఉద్రేకం...ఊపివేస్తున్న ఉత్సాహం, నిలువంతా నిండిపోయి

తుఫానులోని సముద్రంలా వుంది. నిజంగా ఆనందంలో కూడా ఎంత భరించలేనిబాధ! చూడూ!...నిన్నేమని పిలవాలి? శారదా అని పిలవాలంటే యీ మూడక్షరాలే ఎంతో పెద్దపేరులా అనిపిస్తోంది.

ముద్దుగా శారీ అని పిలిచేదా?...ఏం?

శార : (మాట్లాడదు. కంటినుంచి నీరు కారుతుంటుంది)

రఘు : నన్ను కూడా నీవు అందరిలా "ఏమండీ" అని పిలుస్తే నేను ఒప్పేదిలేదు..."రఘూ" అని పిలవాలి. ఆపేరే నాకు అమిరి నట్టుంటుంది... (ఆమె కన్నీటిని చూచి) అరె!...ఏం?... ఏమిటయింది?...ఏంఅలాఉన్నావ్? (గడ్డం పట్టుకొని ముఖం పైకెత్తి) ఎందుకేడుస్తున్నావ్?...చెప్పవూ?...ఛీ! ఏమిటది?... ఎందుకు కన్నీళ్ళుపెట్టుకుంటావ్?...నాతో చెప్పకూడదా?...పోనీలే!... (రుమాలుతో కన్నీళ్లు ఒత్తి) ఎందు కేడుస్తున్నావో చెప్పేదా?...నాకు తెలీదనుకున్నావ్ కదూ? చెప్పేదా?

శార : (తలెత్తి చూస్తుంది)

రఘు : ఎందుకు విచారిస్తున్నావో చెప్పేదా... ఈనాటినుంచీ నీదగ్గరనుంచి వెళ్లిపోతున్న ఒంటరితనాన్ని తల్చుకొనికదూ ఏడుస్తున్నావ్?...కాదూ...పోనీ... నేటినుంచీ ఎంతో జాగ్రత్తగా, ఎంతో ఆప్యాయంగా కాపాడుకున్న...హుం!... నేనెందుకనాలి ఆమాట! అంటే నీదృష్టిలో నేనొకదొంగని అన్నమాట! అంతేనా?...సరే!... దోషి నీముందర చేతులుకట్టుకొని నిల్చున్నాడు ఏమిశిక్ష విధిస్తావో విధించూ!...యింకా ఏడుపే?...చెప్పవూ ఎందుకలా బాధపడ్డావు? (నడుంమీద చెయివేసి దగ్గరిగా తీసుకుంటాడు. శారద చేతినివిప్పి లేచి నిల్చుంటుంది. రఘుచేతిలో ఆమె చెయి వుంటుంది. ఆమెవేళ్ళలో పరధ్యానంగా ఆడుకుంటుంటాడు) ఏమిటిది శారదా? (తానులేచి నిల్చుంటాడు) నేనంటే నీకిష్టం లేదూ?...ఎందుకలా కంగారుపడ్డావ్? ఎంత ఆశపెట్టుకొని ఈదినంకోసం కాచుకొని ఉన్నానో తెలుసా?...ఆనాడునిన్ను చూచిన క్షణంలోనే నామనస్సు హరించావ్!... నిన్నుతప్ప యింకెవ్వర్నీ పెళ్ళిచేసుకోకూడదనే నిశ్చయించుకున్నాను...నీకు నేను నచ్చలేదేమో అని భయపడ్డాను...నచ్చినాననీ, నీకీపెళ్ళి యిష్టమేనని చెప్పారువాళ్లో! నీకు ఈపెళ్లి యిష్టంలేదని ముందుగానే తెలిసివుంటే, ఎందుకు తెలియచేయలేకపోయావ్ ముందుగానే? నీజీవితం,...నాజీవితం యిక నరకంకాక యింకేమిటి?...మాట్లాడవేం?... నీకుయిష్టంలేని భర్తతో నీవూ...యిష్టపడని నీతో నేనూ...యీజీవితం యిలా వెళ్లవలసిందేనా?...చెప్పుశారదా...ఏడుపు ఆపి నిజం చెప్పు?...

శారద : (నిట్టూర్పువిడిచి) ఏమిటి చెప్పమంటారు?

రఘు : (గొప్ప బరువు దిగినట్లు) అబ్బా! ఎంతసేపటికి ఆనోటిలోంచి ముత్యాలు జారాయి!... (ఆమెకళ్లలోకి ప్రేమగా చూస్తూ) నిజంగా గాభరాపెట్టి విడిచావ్!

శార : (చూపు తప్పించుకుంటూ) ఒద్దు! నావేపలా చూడవద్దు! నాకుభయం వేస్తుంది. (ఏడుస్తూ) బాధగా ఉంటుంది!

రఘు : మరెలా చూడమంటావ్?...పిచ్చి దానా! బాధ ఎందుకు?...నా చూపులో నీ కఠినత్వానికి కొట్టుకుంటున్న నా హృదయం కనిపించడం లేదూ?

శార : అతిస్పష్టంగా కనిపిస్తుంది...అందుకే భయం వేస్తుంది...(కళ్లు మూసుకుంటుంది.)

రఘు : అంత బాధ కలిగించేటంత భయంకరంగా ఉందా? (ఆమె వేళ్ళను పెదవులకు తాకించి చెక్కిలిపై ఉంచుకొని) ఎంత అందంగా ఉన్నావో నీవు తెలుసా? ఎటు చెక్కినా నీకళ్లలో ఆకర్షణ (కళ్ళను ముద్దు పెట్టుకోబోతుంటే)

శార : (వారిస్తూ) ఒద్దు! నన్ను తాకవద్దు! నా మనసేం బాగు లేదు. గుండెల్లో బాధగా వుంది!

రఘు : బాధా?...

శార : క్షమించండి!...చెయితీయండి!...

రఘు : (చిన్న బుచ్చుకొని దూరంగా పోతాడు అభిమానం దెబ్బతిన్నట్టుబాధతో) మనస్సులో ఏదో పెరపెట్టుకొని వచ్చేందుకిలా అడిస్తావ్ ?... ఏమిటిదంతా ? లోపల ఏముందో చెప్ప కూడదు ?...నా లాంటి అదృష్టవంతుడు లేడనుకున్నాను...విద్య, అందం అనురాగంతో కూడిన లక్షణమైన భార్య దొరికిందని పొంగిపోయాను! యిలా అవుతుందని అనుకో లేదు...ఎంతరా నీ తెచ్చు కుంటే అంతే!...

శార : అదికాదండీ!

రఘు : మరి?

శార : ఒక విషయం అడుగుతా కోపంరాదు కదా?

రఘు : ఏమిటి?

శార : అబద్ధాలన్నా...దొంగతనం, కపటం, మోసం అన్నా నాకు అసహ్యం...నా వాళ్లే ఆ పనులు చేస్తే నాకెలా ఉంటుందంటారు?

రఘు : ఏమయింది?

శార : మీరు అందరికీ తెలిసేటట్టు, బాహాటంగా కట్నం ఎందుకు తీసుకున్నారు కారు?

రఘు : మన యిద్దర్నీ అందరూ చూచేటట్టు బాహాటంగా వడివీధిలో వొదలక ఈ నాలుగు గోడల మధ్య ఎందుకు మూసి పెట్టారు?

శార : ఇదా నా ప్రశ్నకి జవాబు!

రఘు : అదికాదు శారదా! చూడూ! అది వలుగురికీ తెలిస్తే తలెత్తి తిరగ్గలనా?

శార : అయితే కట్నం తీసుకోవడం అవమానకరం అని నమ్మి కూడా రహస్యంగా తీసుకున్నారేం?

రఘు : బావుంది...వొస్తున్నది వదులుకోవాలా?

శార : ఇచ్చే వారి శక్తీ, సామర్థ్యాలూ, స్థితిగతులూ చూడ నక్కర్లేదన్న మాట !...అవతలి వారు వీధి పాలయితే నేం అడుక్కు తిరిగితే నేం... మీకట్నం మీకు ముడితే సరి ! పైపెచ్చు హృదయం దొంగిలింపబడిందని నమ్మ విలువ లేని మాయ మాటలా! కట్నం కోసంగా పెళ్ళాడింది నన్ను? మీ కిచ్చిన దానికంటె ఎక్కువ కట్నం యిస్తే నన్ను విడిచి పెట్టేస్తారు కదూ?

రఘు : శారదా!.. బావున్నాయి నీ మాటలు! అయినా ఆకట్నం నేనొక్కణ్ణీ మోసుకు పోతానా చెప్పు! యిప్పుడు నాదీ నీదీ అన్న భావనకి తావేది? నా సంపాదనంతా ఎవరి కోసం?

శార : ఏమో!

రఘు : తెలియనట్టుమాట్లాడకు. మనకోసం—నీ కోసం—మనకి పుట్టిన బిడ్డలకోసం... యిప్పుడు పిల్లలులేరుగనక నీ కోసం అన్న మాట!

శార : మీ అమ్మగారి కోసం అని కూడా ఎందు కనరు?

రఘు : అదీ నిజమే!...అసలు నిజం చెప్పేదా? నాకూ ఈ కట్నాలు, గిట్నాలూ అంటే అసహ్యమే! కట్నం లేకుండానే పెళ్ళి చేసుకుందామనే ఆశగా వుండేది...కాని ఏం చేసేది? కాటికి కాళ్లు చాచుకుని ఉన్నదీఅమ్మ...కని, అష్టకష్టాలు పడి, పెంచి, పెద్దచేసి, విద్యాబుద్ధులు చెప్పించి యింతవరకూ రావడానికి కారణమైన... అమ్మమాట ఎలా కాదని కొట్టి పారేయ గలను?...అసలు పది వేలుకట్నం యిస్తామంటూ వచ్చే సంబంధాలే అక్కర్లేదని అన్నాను. డబ్బంటే నాకు వ్యామోహం వుంది గనుకే అక్కర్లేదన్నాను కదూ?

శార : అయితే మా నాన్నగారు ఎంతిచ్చారు?

రఘు : ఏం?...నీకు తెలీదూ?

శార : నాకా!...నాకు మొదట్లో తెలిసి ఉంటే...

రఘు : తెలిసుంటే?

శార : మన పెళ్ళి కాకపోయుండేది!

రఘు : ఏం?

శార : కట్నం యిస్తే నా మీద ఆశ ఒదులుకోమన్నాను ! నిజానికి ఒట్టు పెట్టుకున్నాను. కట్నంతో పెళ్ళిచేసుకోనని......

రఘు : ఓ!...అదా సంగతి...బోధపడింది!

శార : ఏమిటి?

రఘు : మామగారు రహస్యంగా కట్నం యివ్వడానికి అంగీకరించడం అందుకేనా!

శార : ఇంతికీ ఎంతముట్టిందో చెప్పారు కాదు?

రఘు : అయిదువేలు!

శార : మీకు ఎవరో యిస్తామన్నదాంట్లో సగం అన్నమాట!...హుఁ!

రఘు : ఏమలా అన్నావ్?

శార : ఏమీ లేదు! ఆడపుట్టుక ఎంత నీచమైందో ఆలోచిస్తున్నా!

రఘు : నీచమా? ఆడవాళ్లలో యింత అందం ఎందుకుందో నేను ఆశ్చర్యపోతున్నా! అందం అంతా మీలోనే ఉంచాడు దేవుడు!

శార : ఏంలాభం!...తలకిమించిన దక్షిణ కూడా కావాలంటున్నారుగా పూజారులు!

రఘు : శారదా! (దగ్గరగా తీసుకుని) నాకే దక్షిణా అక్కర్లేదు!...నీవిలా నాలో కలిసిపోతే చాలు.

శార : (మైకంతో కళ్లు మూస్తుంది...వెంటనే తేరుకొని) వదలండి! వదలండి! నా నిశ్చయాన్ని చెదరగొట్టకండి! మీ పాదాలు పడ్తాను. దూరంగా ఉండండి!

రఘు : (విభ్రాంతితో) ఏమిటి శారదా! యిది?

శార : నానోటినో చెప్పించకండి!...కాదు...నేను చెప్పలేను...అటు విచారంతో కృంగిపోలేను...ఇటు ఆనందాన్ని అనుభవించలేను!... నేటివరకూ ఏ యింట్లో పెరిగానో ఆయింటిని కూలదోసి, ఆ కుటుంబాన్ని వీధిపాలుచేసి, యిక్కడ మీతో కులుకుతూ, ఈ యింట్లో పంచభక్ష్యపరమాన్నాలు ఎలా తినగలను?...చెప్పండి! మీరే చెప్పండి! నేనేం చేసేది?...

రఘు : ఏమిటీ ఉద్రేకం...కాస్త స్థిమితపడు?

శార : నా మనస్సు విచారంతో కృంగిపోతూ ఉంది ...నా హృదయం అవమానంతో కుమిలిపోతూ ఉంది...

రఘు : శారదా!

శార : ఈ దౌర్భాగ్యపుజన్మ ఎత్తి కుటుంబంలో అరిష్టాల్ని నింపా! ఆడపుట్టుక పుట్టి యింటిని అగ్గిలో కలిపి...

రఘు : ఎందుకలా బాధపడ్తావ్?

శార : ఈ పెళ్లికోసం...ఈ కట్నంకోసం...నాన్న ఆ పొలంకు, ధాన్యంగింజలూ వచ్చేభూమిని అమ్మేశారు ... యిక ఎలా గడుస్తుందో ఏమిటో!

రఘు : ఇప్పుడేమయింది?

శార : ఇంకా ఏంకావాలి? మీ కట్నం మీకు ముట్టిందిగా!

రఘు : శారదా! ఏమిటామాటలు? లోకంలో అందరూ చేస్తున్న పనేగా!... నేనేం తగని నేరం చెయ్యలేదే!...అందుకోసం యిలా నానాగల్లంతుచేసి అల్లరిచేస్తావా?

శార : ఎవర్నీ నిందించడంలేదు...నా కర్మకి ఏడుస్తున్నా ... కానీ ... మీకొకమాట చెప్పదలచుకొన్నా! ... మీరెలా భావించినా భావించుకోండి!...నన్ను మీరేమనినాసరే ...నా నిశ్చయాన్ని మార్చుకోలేను.

రఘు : ఏమిటది?

శార : మీరు బలవంతంచేసినా లాభంలేదు...బెదిరించినా సరే!...చివరికి మీరు అసహ్యించుకొని తిట్టినా, కొట్టినా, ముక్కలు ముక్కలుగా చీల్చినా నా అభిప్రాయం మార్చలేరు.

రఘు : ఏమిటో చెప్పకుండా అలా అయిపోతున్నావేం?

శార : మీరు చేసింది మీకు నేరంగా కనిపించకపోవచ్చు! అది దోషంగా తోచకపోవచ్చు! ...దోషం కాకపోయినా...నాకు మట్టుకు అది హృదయం ఉన్నవాళ్ళు చెయ్యవలసిన పనిగా కనిపించదు. ప్రేమా, అభిమానం, గౌరవం, కనికరం, స్నేహం కల మనుష్యులు అలాంటి పనులకు పాలుపడలేరు! మీరు... నాకు అతి సన్నిహితులైన మీరు, భవిష్యంలో నేటినుంచీ సర్వస్వం కావలసిన మీరే అంత హృదయహీనంగా, కనికరం లేకుండా...

రఘు : ఏమంటున్నావో నాకేం అర్థం కావడంలేదు!

శార : అర్థం చేసుకోవద్దు!...అర్థమైతే మనుష్యులవలె ప్రవర్తించే అవసరం వస్తుంది!

రఘు : అయితే నేను అమానుషంగా నడిచానంటావ్?

శార : ఆ ప్రశ్న నన్నడగవద్దు...మీ అంతరాత్మనడగండి!

రఘు : కట్నం తీసుకోవడం అంత పెద్ద నేరమన్న మాట?

శార : పెద్ద-చిన్న ఆ తారతమ్యాల విభేదాలు మీకు చెప్పగలిగినంత సామర్థ్యం నాకు లేదు. చదువుకున్న వారు, విజ్ఞానులూ—హృదయం ఉంది, ఇంగిత జ్ఞానం ఉంది ఆలోచించండి! ఆడపిల్లల్ని కన్న తల్లిదండ్రుల స్థితిని మనసులో ఉంచుకొని ఆలోచించండి! రేపు మనకూ పిల్లలు పుడతారు...ఆడపిల్లలూ పుట్టొచ్చు! ఈ పరిస్థితులే ఎల్లకాలం ఉంటే...మీకు ఎదురు చెప్తున్నానని భావించకండి!

రఘు : సరే! అయితే నన్నేం చెయ్యమంటావ్?

శార : ఏది చెయ్యాలో, ఏది చేయకూడదో తెలియని పసిపాపలు కారు మీరు. నా దొక్కటే ప్రార్థన! నాకూ హృదయం ఉంది. నాకూ ప్రేమించే బలహీనత ఉంది. నా నోటంట మిమ్మల్ని ప్రేమిస్తున్నానని చెప్పను. అది గొప్ప కాదు-అది నా ధర్మం! అగ్నిసాక్షిగా మీరు చేపట్టిన భార్యను! కానీ! నావాళ్లు నాకు తలపుకు వస్తున్నన్నాళ్లు నేను ఆనందంలో ఉండలేను!...అలా చేస్తే కావాలనే పాపం చేస్తున్నట్లు భావిస్తున్నా! నా హృదయం మీ ఒళ్లో తలదాచుకోవాలని ఉరుకు లెత్తుతూంది!...మనస్సు పగ్గాల్తో పట్టి నిరోధిస్తోంది! మీ కర్థం కాదు. నేను పడే యాతన...ఈ సంఘర్షణలో నాకు పిచ్చెత్తేటట్టుంది!

రఘు : అసలు విషయం చెప్పవేం?

శార : అసలు విషయం!...ఆదిలో మీరు కట్నం తీసుకున్నారని తెలియగానే నన్ను నేనే నమ్మలేకపోయాను! మీరు అంత నీచానికి ఒడిగడతారని అనుకోలేదు. మిమ్మల్ని ఆదర్శం క్రింద లోకం తీసుకుంటుందని మురిసి పోయాను!...ఇది కళంకంలా కనిపించింది! సహించలేకపోయా! చచ్చిపోదా మనిపించింది! ఆ విషయం నాకు ఇంకా ఈ నిమిషం వరకూ తెలియదనే మా యింట్లో అందరూ అనుకుంటున్నారు. అంతా అయిపోయింది! చేయి జారిపోయింది. నేను మీ సొత్తునయి పోయాను. ఏం చెయ్యగలను? కసిదీర మీకు అనుతాపం కలిగించి చద్దామనుకున్నా!... ఏం లాభం...ఎలాగూ కష్టాల్లో మునిగి పోడానికే తెగించిన మావాళ్ల కష్టాలు గట్టెక్కవు...నేను చస్తే యింకొకర్తె మరో పదివేల కట్నంతో మీకు భార్యగా వస్తుంది.

రఘు : శారదా! ఏమిటా మాటలు? మతి ఉందా లేదా?

శార : మతి ఉండబట్టనే యీ నాడు మీతో యిలా మాట్లాడుతున్నా...యిన్నాళ్లూ ఆతురతతో ఈ రోజు కోసమే కాసుకొని ఉన్నా!....యీ మాటలు చెప్పడానికే! నా హృదయ పూర్వకంగా, నా మనస్ఫూర్తిగా, మీరు కోరే ఆనందాన్ని నే నివ్వలేను...యిది మన శోభనం గది కాదు! ...యిది ఆ పర్వదినమే కాదు....

రఘు : ఏమిటా పిచ్చివాగుడు?

శార : మీ రేమనుకోండీ! మనసులో మాట చెప్పా!...మీ యిష్టం!...మీరు బలవంతం చేసి నన్ను బాధించరనే నమ్మకం ఉంది నాకు!...మీరు నన్ను ప్రేమిస్తున్నారన్న మాటకూడా తెలుసు...కానీ...

రఘు : అన్నీ నువ్వే అను...యిక మరి నేను వింటూ తల ఆడిస్తుంటాను.

శార : కోప మొచ్చిందా?

రఘు : రాదా?...ఎంతకాలం వృధాచేశాం?..... ఈ రోజుకోసం ఎంత ఆతురతతో నిరీక్షించాను...ఎన్ని కలలు కన్నాను!...

శార : మీ రలా నిస్పృహ పడొద్దు!...నేను దగ్గిరే ఉన్నాగా!

రఘు : ఎందుకు?...ఊరిస్తూ బాధ పెట్టడానికా?... అసలు నీ అభిప్రాయం ఏమిటి?...దగ్గరకు రావొద్దు అంటే వెళ్లిపోతాను...బలవంతం చేసి నిన్ను బాధపెట్టడానికి నే నేం రాక్షసుడిని కాను.

శార : నేను కోరేదీ అదే.

రఘు : ఎంతకాలం?...ఎంతకాలం దేవిగారి అనుగ్రహానికి ఈ భక్తుడు తపస్సు చెయ్యాలి?

శార : ఏమో !...భర్తనిహృదయం పరిపక్వమైతే... లేదా హృదయంలో పరివర్తన కలిగితే.....

రఘు : బాగుంది! బాగుందీ వేషం! ..... అయితే కట్నం తీసుకున్నావని, నీవు నాకు భార్యగా ఉండడానికి యిష్టపడడం లేదన్నమాట ?... అంతేనా ?

శార : మీ రలా అంటే నే నే మనగలను ?

రఘు : చివరికి తేలిందదేగా !...నీ మాటమీద నేను నడవాలన్నమాట ? అంతేకదూ ?

శార : నే నలా అనలేదే !

రఘు : అనకపోయినా అర్థం అదే!...ఈ బెట్టు సరి ఎన్నిటో నేనూ చూస్తా !

శార : అదుగో పంతాలుదేనికి చెప్పండీ! ఎందు కంతకోపం ?

రఘు : కోపంకాదూ ?... నే నేం మనిషి నను కున్నావా మాను ననుకున్నావా ?...సరే!... నీ యిష్టం కానీ !...ఎన్నాళ్లో యీనాటకం చూద్దాం!...యిదుగో యిప్పుడే చెప్పు తున్నా... నేనయిదేహీ అని నీదగ్గరికి వస్తా నన్నమాట కల్ల!...ఆ ఆశ జన్మలో పెట్టు కోకు!...నాకూ అభిమానం వుంది!...పట్టిం పులో నేనూ గట్టివాడ్నే!

శార : (కన్నీటితో) ఏమండీ!...అంత హృదయం లేకుండా మాట్లాడకండీ!...యింత చిన్న విషయానికే మీరింత కొనవిరిచి మాట్లాడతా రనుకోలేదు.

రఘు : అసలు మాట్లాడనే దలుచుకోలేదు! నేను పోతున్నా!...

[తలుపు దగ్గరకు వెళ్లిపోతాడు]

శారద : (గాభరాతో ఆపి) నామీద ఒట్టు!...తలుపు తియ్యవద్దు;..బైటివాళ్ళందరికీ మన గొడవ ఎందుకు తెలియాలి?...వెళ్ళకండి!...వెళ్తా రంటే...

రఘు : మా నూతిలో నీళ్ళుకూడా లేవులే పడి చావ డానికి!...అయితే ఏం చేయమంటావ్? అసాధ్యమయిన కోర్కెలు కోరుతున్నావే!

శారద : అత్తగారికి కూడా తెలియనివ్వకండి మన విషయం. ఎవరైనాసరే మనల్ని వేలెత్తి చూపించి నవ్వితే నేను భరించలేను.

రఘు : అంత పతివ్రతవు మరి ఈ వ్రతం దేనికి?

శార : మంచివారే నండి మీరు (నవ్వుతుంది)

రఘు : ఏం లాభం?...(ఆవలిస్తాడు)

శార : నిద్రవస్తోందా?...పడుకోండి...కాళ్ళు రాచేదా?

రఘు : (మంచంమీద పడుకోబోతూ ఆగి) అక్కర్లే దనసూయగారూ నే నేం ముసలివాణ్ని కాను. ఒంటిమీద చెయివెయ్యొద్దు.

శార : ఏం?

రఘు : వేశావంటే నీ పట్టుదల, నియమాలూ వన్నాప లేవు ముందే చెపుతున్నా-(నిట్టూర్పుతో ఒత్తిగిలతాడు)

శార : పోనీ లెండి!...ఆదిండు యిలా పారేయండి!

రఘు : నేల పండుకుంటావా?

శార : తివాచీ ఉందిగా!

రఘు : బావుంది! ఏం చక్కని శోభనం?...సరే యిందు (దిండు విసురుతాడు...ఆమె పరు చుకొని పడుకోబోతుంటుంది) జాగ్రత్త సుమీ నిద్రలో యిక్కడికి వచ్చిపోగలవ్!

[శారద చిరునవ్వుతో అటు తిరుగుతుంది]

అప్పుడే నిద్రా!...పోనీ మాటలైనా చెప్పు. అదీ కూడదా?

శార : చల్లగా నిద్రపోండి!

రఘు : ఎంత చక్కగా చెప్పావ్!...నీ పక్కడ ఉంటుంటే నాకెలా నిద్రపడుతుంది? (లేచి ఆమె ప్రక్కకి వస్తాడు. శారద కూడా లేచీ కూర్చుంటుంది)

శార : వెళ్ళి పడుకోండి!... నా మాట విని వెళ్లి పోండి! నేను రెండు మాటలు చెప్పేమనిషిని కాను!

రఘు : నే నొప్పుకోను...నువ్వు వచ్చి తీరాలి!... ఏమిటీ నాటకం?...రా!...యిలా రా!...లే!

శార : మీరు యింత కఠినంగా పిలువగలరని అనుకో లేదు నేను...మీ రేమనండీ!... నేనురాను !

రఘు : శారదా ! దేనికైనా హద్దుంది! నన్ను విసిగించకు ... నీవువచ్చితీరాలి !... బలవం తంగా...నీకు కష్టంగలిగినా సరే !

శార : మీకు మతిపోయిందా?...బలవంతం దేనికి? ఇదా మీ ప్రేమ అనురాగమున్నూ!... వెళ్ళండి! అల్లరిపెట్టకండి! వెళ్ళండి!

రఘు : ఏమిటీపంతం? నాకుకోపం వచ్చిందంటే...

శార : ఏమొచ్చినాసరే...క్షమించాలి! ఈ విషయంలో మీమాట వినదలచుకోలేదు... అంతే! నన్నుమరి విసిగించకండి మీకు పుణ్యముంటుంది...యిప్పటికే పాపం చాలా శ్రమపడ్డారు—నిద్రపొండి.

రఘు : భార్య చెప్పాల్సిన మాటలుకావివి!

శార : సరే?

రఘు : అయితే నామాట వినవన్నమాట!

శార : ఈ ఒక్క విషయం లోనే!

రఘు : సరే!...నీమాటే కానీ...అనుభవించేది నీవు.

శారద : కానీండి!

రఘు : మూర్ఖం! చెపితే వినకపోతే.. ఎందుకు నన్నిలా అల్లరిపెడ్తావ్ శారదా?...

శార : అనవసరంగా మాటలు వృధాచేయకండి! నాకు నిద్రొస్తున్నది. వెళ్లండి! చెప్పిన తరువాత...

[తిరిగి నిద్రపోతుంది.]

రఘు : (మంచంమీదికి కోపంగాపోతూ) సరే! నా ఒక్కడికే నేమిటి యీబాధ—చూద్దాం ఈ పంతం ఎంతసేపో!... [తెర]

రంగము: 3

* * రెండవ రంగంలోని దృశ్యం: పడక గది: ఇల్లమీది గడియారం మధ్యాహ్నం గం|| 2-45 లు సూచిస్తుంటుంది. శారద మంచం మీద పడుకొని చదువుతూ వుంటుంది. వీధి తలుపు తట్టి పిలిచిన శబ్దం...లేచి వెళ్తుంది! తలుపు తెరిచిన చప్పుడు... కొంత సేపటికి గదిలోనికి సుందరయ్యా, అతని వెనుక శారద ప్రవేశం. శారద ముఖం విప్పారుతుంది.

శార : ఈ బండిలోనేనా రావడం నాన్నా! ఉత్తరం కూడా రాశారుకాదు......స్నానం చేస్తారా?

సుంద : (కూర్చోకుండానే) అక్కర్లేదమ్మా! తొందరగా వెళ్ళాలి...అక్కగారేరీ?

శార : కోనెల కెళ్ళారు. గీతోపన్యాసాలు అవుతున్నాయట...కబురు పెట్టేదా...ఎందుకు?

సుంద : అక్కర్లేదమ్మా...ఆ...నీ వంట్లో ఎలా వుంది?

శార : నా వంట్లోకేం...నిక్షేపంగా వుంది.

సుంద : మీ ఆయనేరి? సెలవలేవా!

శార : మొన్ననే ఏదో కాలేజ పనిమీద వాల్తేరు వెళ్ళారు. నిన్ననే వచ్చేస్తానని చెప్పారు. రాలేదు! ఈ వేళా రాలేదన్న మాటే! మీరూ ఆ బండిలోనేగా వచ్చారు......అమ్మ బావుందా?

సుంద : ఎప్పట్లాగే! ఇప్పుడు సీతకీ, చంద్రకీ కలిపి ఒక్కసారే పెళ్ళి చెయ్యమంటూ గోల!

శార : స్కూలు మానిపించేశారేమిటి?

సుంద : లేదమ్మా! ఇంట్లో కూచుని ఏం చేస్తారు? వాళ్ళ గురించే యిప్పుడు రావడం. ఇక్కడే ఎవరో ఇద్దరు అబ్బాయిలు ఉన్నారట... మీ ఆయనే వ్రాశారు. వీలయితే కలిసివెళ్దామనుకున్నా, మీ ఆయన్ని...

శార : వొచ్చేస్తానన్నారు. వొచ్చేదాకా...

సుంద : వీలులేదమ్మా! వాళ్లు కాసు కూర్చుంటారు. వస్తున్నానని ఉత్తరంకూడా వ్రాసేశాను. నేను జంటనే వెళ్ళకపోతే ఆఖరి బస్సుకూడ తప్పిపోతుంది. అది కాకుండా యిక్కడికి రావడంలో యింకో విషయం కూడా వుంది తిరిగి వచ్చి మాట్లాడుతాలే!

శార : ఏమిటది నాన్నా?

సుంద : అమ్మాయి! నా దగ్గర మర్మం లేకుండా చెప్పు!...నిజం చెప్పాలిసుమా దాయకుండా.

శార : ఏమిటి నాన్నా?

సుంద : రఘు నిన్నెలా చూస్తున్నాడు?

శార : ఏం?...బాగానే చూస్తున్నారే!

సుంద : క్షేమంగా...ఏమీ కష్టం కలగకుండా?...

శార : ఆ! ... ఏం ? ... మీకెందుకా అనుమానం కలిగింది ?

సుంద : ఏమీ లేదూ! ఊరికనే అడిగా. రఘు యీ మధ్య ఒక ఉత్తరంలో...

శార : (గుండెలు కొట్టుకుంటుంటే) ఏమని వ్రాశారు ?

సుంద : కట్నం తీసుకున్నందుకు పశ్చాత్తాప పడ్తూ, క్షమించమంటూ, మనం ఇచ్చిన ఐదు వేలూ వడ్డీతో సహా త్రిప్పివేశాడు. (ఉత్తరము కూతురికిస్తాడు.)

శార : (చదువుకొని) అయితే ?

సుంద : ఛీ! సిగ్గుచేటు!...కక్కినది ముట్టామటన్నా... చీవాట్లు పెట్టి ఆ చెక్కు తిప్పేశాను.

శార : అలాగా! ... నాకు తెలీదు.

సుంద : నా ఉత్తరానికి వ్రాసిన జవాబు చూశావా (యింకో జాబు యిస్తాడు. చదువుతుంటే ఆమె ముఖం జేవురిస్తుంది) చూశావ్!... కట్నం తిరిగి తీసుకుంటే తీసుకోండి లేకుంటే మీ అమ్మాయిని మీ యింటికి తీసుకుపొండి అని రాస్తాడుగదా దీని అర్థం ఏమిటి?

శార : ఆ డబ్బు తీసుకోండి నాన్నగారూ, ఆయన అక్కర్లేదంటూ యిచ్చేస్తున్నారుగా!

సుంద : అమ్మాయి! డబ్బుశాశ్వతం కాదు. తెలుసా!

శార : అదికాదు నాన్నా! సీతకి, చంద్రకి పెళ్ళిళ్ళు తలపెట్టారా...

సుంద : తలతాకట్టుపెట్టి చేస్తానమ్మా!... కన్నవాణ్ణి నాధర్మం నేను చెయ్యనూ?...అసలు నాకు బాధిస్తున్న విషయం అదికాదు. మీ యిద్దరిలో ఏదో బెడిసింది. ఏవో పొరలు పెట్టుకొని బాధపడుతున్నారేమో అని నాధియం లేకుంటే యిలా రాయడానికి అవకాశం లేదు.

శార : మాయిద్దరి మధ్య ఏచికాకులూ లేవు నాన్నా!

సుంద : అమ్మాయి! నీవిషయం నాకు తెలీదూ? నాకళ్లే కప్పాలని చూస్తున్నావ్!...సరే! అసలు అనుమానానికి కారణం చెప్పేదా? ఈ కట్నం త్రిప్పివేయడం మీ అత్తగారికి తెలియనివ్వకూడదట!

శార : బావుంది!

సుంద : బావుందీ!...ఏమిటి బావుంది?

శార : నాన్నగారూ! ఈవేళ మిమ్మల్నడుగుతున్నా! నేను మెట్టమొదట మీతో ఏం చెప్పాను?...కట్నం యిచ్చిన పెళ్లి నాకక్కర్లేదని చెప్పలేదూ? దీని మాటలకేమ్య పెట్టకమా అన్న భావమేకదూ...రహస్యంగా, దొంగతనంగా కట్నం యిచ్చి మీ ఋణం తీర్చుకున్నామని చేతులు దులుపుకున్నారు. ప్రాణం అంటేతీపి...చస్తానన్నదేకాని నిజంగాచచ్చి పోతుందేమిటి అన్న ధైర్యమేకదూ మీది?...

సుంద : అమ్మాయి! నన్నేం చెయ్యమంటావ్? ఆ పరిస్థితిలో అలా చెయ్యక తప్పిందికాదు. ఇంకా కోపం ఉంచుకున్నావమ్మా మీ నాన్నమీద?

శార : కోపంకాదు నాన్నా! అపొరపాటే ఈ నాటికి మా మధ్య కదలని గోడయి నిలిచి పోయింది! మీ కర్థంకాదు!...నిజంగా బ్రతుకంటే అసహ్యం అయిపోతూవుంది! నాకూకష్టంగానే వుంది...మీరా కట్నం తీసుకున్నా సరే లేదా...నన్ను యింటికి తీసుకుపోయినా సరే...లేదా...;

సుంద : శారదా! ఏమిటంటున్నావ్? తెలిసే అంటున్నావా? ఇంతబాధపడుతున్నావటమ్మా నువ్వు?...అయ్యో!...

శార : మీరేమీ చెయ్యలేరు నాన్నా!...అది నేను నాచేతులారా చేసుకున్నదే...ఆయన గారిని అవరాని మాటలన్నాను...ఆయన హృదయానికి నొప్పి కలిగించాను. నన్ను నేను బాధ పెట్టుకున్నాను...

సుంద : బావుంది!...అందరిలో నువ్వే నయమనుకున్నా!

శార : సరే నాన్నా కాకున్నది కాకమానదు. మీరేం విచారించకండి.

సుంద : అటు అక్కగారి ఆత్తిరికం హద్దుమీరినా, అల్లుడు చేరదీస్తున్నాడు గదా అని యిన్నాళ్ళూ తృప్తిపడుతుంటినమ్మా!

శార : ఆవిడ తీరే అంత నాన్నా!...ఒక్క నామీదే కాదు...ఆయన గారి మీదకూడా అలాగే... ఆవిడ తత్వం అది!...అయితే ఈ విషయం అత్తగారికి తెలియనీయవద్దన్నారా?

సుంద : చూశావుగా ఉత్తరం!...ఈ పెట్టె ఈ ఉత్తరం, ఆ రెండో ఉత్తరం కూడా ఉంచు ...రేపుగాని, ఈ వేళ రాత్రికో గాని, వస్తే ఆలోచిద్దాం...రఘుతో చాలా మాట్లాడా లన్నమాట...బస్సు తప్పిపోతుంది...వచ్చానని అక్కగారితో చెప్పు...వస్తాను. (అంటూ లేచి తండ్రి, వెనుక కూతురూ వెళ్ళిపోతారు. అయిదునిమిషాల తర్వాత శారదవస్తుంది... పెట్టె, ఉత్తరాలూ మంచంమీద దిండు క్రింద ఉంచుతుంది. ఆలోచిస్తూ కూచుంటుంది. గడియారం మూడుగంటలు కొడుతుంది. లేవబోతుంటే వీధి తలుపు చప్పుడు ... వినిస్తుంది. రఘు సరసరా లోపలికివచ్చి కోటు విప్పి స్టాండుకి తగిలిస్తాడు. అతని వెనకే శారద ప్రవేశం)

రఘు : (ఆమెను చూడకుండానే) అమ్మ పురాణానికి వెళ్ళిందా?

శార : ....

రఘు : కాఫీ ఏమయినావుందా?

శార : ....

రఘు : జవాబు లేదేమిటి?

శార : ఎవర్నడుగుతున్నారు?

రఘు : ఆబీరువా నడుగుతున్నా!

శార : చెపుతుందేమో జవాబు చెవిచ్చి వినండి!

రఘు : ఇన్నాళ్ళా ఎలా వొచ్చేవి జవాబులు?

శార : ఈ రోజునుండీ ఈబీరువాలూ, మంచాలూ, చెంబులూ, తపేళాలూ, పుస్తకాలూ మౌనం వహిస్తాయట...పాపం! పూర్తిగా సంవత్సరం మధ్యవర్తిత్వం చేశాయి చాలదూ?

రఘు : పాపం! అందుకనే నేకదూ కారణం?

శార : మీరు కాదు నేను! సరా?

రఘు : ఏం యిలా మళ్ళింది గాలి?...యింకో తుపాను సూచన కాదు కదా!

శార : తుపాను వెలిస్తే చక్కని ప్రశాంతత వస్తుందిగా!

రఘు : ఒద్దుబాబూ! ఆ తుపానూ వద్దు! ఆ చక్కని ప్రశాంతతా వద్దు!

శార : ఏం అంత విరక్తితో మాట్లాడుతున్నారు?

రఘు : ఇదిగో శారదా!...

శార : శారీ! అని పిలువకూడదూ?

రఘు : ఎందుకు పిలవాలి?... నేను పిలవను!

శార : ఏమిటి చెప్తూ ఆగిపోయారు?

రఘు : మధ్య అడ్డు తగిలావు–మరచిపోయాను.

శార : కాలేజీలో యిలాగే చెపుతుంటారేమిటి?

రఘు : హాలులో నీవుంటే అలానే చెప్పాల్సి వస్తుంది.

శార : ఆ!

రఘు : నిన్ను చూస్తే చెప్పదలచింది మరచిపోతాను. ఈవేళ యింత దయకలిగిందేం ఈ దీనుని మీద?

శార : నిజమే!

రఘు : కాని...యిదిగో శారదా–

శార : శారీ! అనండి!

రఘు : సారీ... యిదిగో శారీ!... మళ్ళీ మరచిపోయా!

శార : నేను చెప్పేదా?

రఘు : చెప్పు!...

శార : "యిదుగో శారీ!... యిలా నీవు నన్ను అల్లరిచేసి విడిస్తే నేనొప్పుకోను... ఏమిటీ నాటకం?... నీకు తెలియదు నేనెంత బాధ పడుతున్నానో!... గృహస్థునై, చక్కని భార్యనుంచుకొని నాకీ బ్రహ్మచర్యంగడిపే గతేమిటి?... పగ్గాలుతెగిన రేసు గుర్రాల్లా కోర్కెలు పరుగెడ్తూంటే, వాటి పీకలు బలవంతాన నొక్కేస్తున్నా! ఎన్నాళ్లీ నరకం? ... నేనొప్పుకోను... నేనింక ఓర్వలేను... నీదింత బండబారిన హృదయం అనుకోలేదు! నీలో యింత కఠినత్వం ఉందనుకోలేదు...

శాకీ!... నీవు రాక్షసివి!... భూతానివి!...దెయ్యానివి!... మారివి!... మహామ్మారివి!... నీకు కనికరంలేదు!..."

రఘు : హియర్! హియర్!! ఎంత చక్కగా చెప్పావ్! ఎలా తెలిసింది నా మనసులోని మాట నీకు?

శార : మీకళ్ళే చెపుతున్నాయి!

రఘు : అయితే జవాబుకూడా నీవే చెప్పు!

శార : జవాబు మీరివ్వాలి!

రఘు : నేనా?... కోపం రాదుకదా... అయితే విను... "ఏమండీ!... మీకు తెలుసును... నేను మిమ్మల్నే అహర్నిశం కోరుతుంటానని...

శార : వేరింకేం పనులులేనట్టు?

రఘు : అన్యాయం!... నీవు చెపుతుంటే నేనడ్డొచ్చానా?

శార : అయితే చెప్పండి! అడ్డురాను.

రఘు : చెప్పను...

శార : చెప్పండీ!

రఘు : సరే! "చూడండీ!...మీరు కోపగించుకోవద్దు!...క్షమించరాని దోషం చేశారుమీరు. నేను క్షమించను. క్షమించలేను. అందుకు మీరు ఈ శిక్ష అనుభవించాల్సిందే! తిరుగు లేదు. దీనివల్ల మీకూ నాకూ బాధే!

శార : అంచేత...

రఘు : పూర్తిగా చెప్పనివే...

శార : మరి చెప్పనక్కర్లే! అన్నీ అబద్ధాలూ మీరూ!

రఘు : అదిగో! అబద్ధాలంటే నాకసహ్యం! ఈ నాటకాలంటే మరీ అసహ్యం! కదూ!

శార : కాదండీ!...మా నాన్న గారు వచ్చారు!

రఘు : స్టేషనునించి అలా కాలేజీకి వెళ్ళిరావడంలో ఆలశ్యమైంది...ఎక్కడికి వెళ్లారు.

శార : పల్లవరం...మీరేగా రాశారట!

రఘు : మీ చెల్లెళ్ల సంబంధంకోసం కదూ!...వాళ్ళిద్దరూ కాలేజీలోనే చదువుతున్నారు—యింటరొకడూ—బి. ఏ. ఒకడూ...తెలివైన వాళ్లే...బాగుంటారుకూడా?

శార : మీకేనేమిటి మన్మథమూర్తులూ, పెళ్లి పెద్దలూ!

రఘు : తప్పకుండా! రాణీగారి చెల్లెళ్లు.

శార : రాజాగారి కెంత అభిమానం;

రఘు : కట్నాలగొడవ ఉండదులే! యిద్దరూ సంస్కారులే!

శార : మీరుమాత్రం కారూ?

రఘు : ఆ! నేనూ ఒక సంస్కారినే! నిజం చెప్పాలంటే నీకున్న గుండె దిటవు నాకు లేదు.

శార : నాది రాతిగుండె అన్నారుగా!

రఘు : నిజం! దాపరికం ఎందుకు?...ఒక్క గదిలో మనం పడుకుంటూ యిన్నాళ్లయింది...క్రింద చాపమీద నిద్రపోతున్న నీ దగ్గరికి రావాలని ప్రతిరోజూ మనసు పీకుతుండేది!...ఎంత ఆపుకున్నా ఆగేది కాదు...నిద్రపట్టేదికాదు...అప్పుడప్పుడు నడిరాత్రి మెలకువవస్తే, నిశ్చలంగా నిద్రపోతున్న నీ అందాన్ని చూస్తూ, దగ్గరికి తీసుకొనే ధైర్యంలేక బాధపడేవాణ్ణి!...ఏనాటికైనా నీవు నా దగ్గరికి రాకపోతావా అని ఆ ముహూర్తానికై రోజూ ఎదురుచూస్తూ ఉండేవాణ్ణి!

శార : నిజం?

రఘు : ఒక్కొక్కప్పుడు ఒంటరి తనం భరించలేక డాబామీదికి పోయి గంటల తరబడి చీకటిలోకి చూస్తూ నిద్రకోసం వెతుకుతుండేవాణ్ణి! నీవుమాత్రం... హిమాచలం లాగు చలించక ఆ [illegible]చాప నంటిపెట్టుకొని నిద్రపోయేదానివి నిశ్చింతతో...ఆచాప తగలెట్టేయా లనిపించేది!

శార : తగలెట్టేసినా పాపం అది ఎదురు తిరుగుతుందా?...

రఘు : చివరికి అమ్మకంట కూడా పడనీయకుండా దాన్ని కాపాడేవు యిన్నాళ్లూ!...అయితే యింకెన్నాళ్లు ఆచాపతో కాపరం?

శార : నన్నడుగుతారేం?......యిప్పుడు పారవేసి రమ్మంటే పారేస్తాను.

రఘు : అయితే దీనికీనాటి విడాకులన్నమాట! నిజమా? ఊరికే ఆట పెడుతున్నావా?...ఏమో నిన్ను నమ్మలేం! ఇంతకాలం ఒడ్డునపడ్డ చేపలా కొట్టుకొంటున్న నన్ను చూస్తుంటే నీకు చీమయినా కుట్టినట్టు లేదు...నమ్మలేను!

శార : ఏం? నేను మాత్రం బాధపడలేదూ? మీతో సరిగ్గా నేనూ అవస్థలు పడ్డాను. నేనూ ప్రతి రోజూ అనుకునే దాన్ని 'ఈరోజు రాకపోతే నేనే వెళ్తాను తెగించి' అని...కాని వెళ్ళలేకపోయే దాన్ని! మీ అవస్థా, మీ చిరాకూ, మీ నిట్టూర్పులూ, నిద్రరాకుండా పడేపాట్లూ అన్నీ గమనించే దాన్ని...... ఒక్కసారి లేచివచ్చి హృదయానికి మరెప్పుడూ విడిపోమన్నట్లు హత్తుకోవాలనిపించేది! అభిమానం అడ్డుపడేది! ఇన్నాళ్లూ మీరు ముఖాముఖిని మాటలాడకపోయినా, కుర్చీలనూ, బెంచీలనూ ప్రశ్నలడుగుతున్నా, మీరు నిద్రలో 'శారీ' అని ప్రేమగా కలవరిస్తుంటే హృదయంనీరయ్యేది! ఏం చేసేది? మనిద్దరి మధ్య యవన తెర... మీరు రాలేదు... నేను రాలేకపోయాను.

రఘు : శారీ! యిదంతా కలా! నిజమా! చెప్పు! నిజం చెపుతున్నావా?...నా చెవుల్ని నేనే నమ్మలేకపోతున్నా!

శార : ఈ క్షణం కోసం ఎన్నాళ్లో తపస్సు చేశాను!

రఘు : ఎన్నాళ్లో తపిస్తూ బాధలో గడిపాం!

శార : మరి ఆ నరకం మనకొద్దు!

రఘు : నీవు కావాలన్నా నేనొప్పుకోను (దగ్గరకు తీసుకుంటాడు).

శార : (కౌగలినుంచి విడిపించుకొని) నాన్నగారు ఈ ఉత్తరాలూ, యిదీ ఉంచమని యిచ్చారు.

రఘు : (ఉత్తరాలూ, పెక్కు చూచి) ఒద్దు! యిదే మన బాధలకి కారణం!...అది నీది!... నీదగ్గరే ఉండనీ! నాకొద్దు-

శార : అత్తగారితో చెప్పొచ్చా?

రఘు : (ఆలోచించి) చెప్పు! భయం దేనికి?...వీధి తలుపు వేశావా?...

శార : ఏం?......వేశాను...కాఫీనీళ్లు పెట్టాలి కుంపటి ముట్టించి...

రఘు : కాఫీ వొద్దు—గీఫీ వొద్దు ఈ మధుర క్షణాలలో నిన్ను విడిచివుండలేను.

శార : (చిరునవ్వు నవ్వుతూ అతన్ని సమీపించుతుంది.)

[బైట తలుపుతట్టిన శబ్దం—"శారదా" అని అత్తగారి పిలుపు—శారద తలుపుతీయటానికి బయటికి వెడుతుంది. రఘు నిస్పృహతో నిట్టూర్పు]

[తెర]

* చివరిమాట:—కట్నాల నిరోధానికిది ఒక సూచన అనిమాత్రం పొరపాటున కూడా భావించవద్దని మనవి. —రచయిత.

నివృత్తి

'శండిల'

అనుకున్నంతా అయింది—

మేష్టారు పడుకున్న మంచం వార గోడ చీట వారి వుంటుంది—"దఢీ" మంది. అప్రయత్నంగా లేచారు. చీకటిలో తడుముకుంటూ వీధి గుమ్మంవైపు వస్తున్నారు. దారిలో మంచం ఎవరు ఎప్పుడు వాల్చారో తెలీదు. పట్టెకు తాకింది మోకాలి క్రింద పొడుచుకు వచ్చిన ఎముక. చటాలున పడిపోయారు మేష్టారు. పడిపోగూడదనుకుంటూనే, నిలవదొక్కుకోవడానికి తాపత్రయపడుతూనే పడిపోయారు. మేష్టారు మంచంమీద పడ్డారు. వడ్డపళంగా లేద్దామనుకో లేకపోయారు. కాళ్లు చేతులు, మెలి తిరిగి పట్లు, ఆయన మనసు ఇచ్చే ఆజ్ఞలను పాలించలేదు.

మంచంపై పడిన వెంటనే కోడుకోసకు ఆయన నుదురు కొట్టుకుంది. దిమ్మెక్కిపోయి వుంటుంది.

మంచంపై పడున్న వ్యక్తి లేచింది. మెళుకువ పొందింది. తన మీద నున్న వ్యక్తిని చివాల్న నెట్టి వెయ్యడానికి కలగద్రొక్కుకుంది. మేష్టారు లేవ గలిగారు. గడప దాకా నడవ గలిగారు—అగ్గిపెట్టెకోసం ఆయన చేతులు గూటిలో తడుముకుంటున్నాయి. ఇంతలో మంచంమీదినుంచి లేచిన స్త్రీ వ్యక్తి ఆవేశంతో కోపంలో అంటున్న మాటలు స్తంభీభూతులై వింటున్నారు మేష్టారు.

"—ఛీ! ఇన్నేళ్ళుగా కనిబూనిన త్రాచు పగను కానుకో లేకపోయాను. పురుషులు మాత్రం అంతా నీచంగా వుంటారా అని భ్రమించాను—ఎంత పని జరిగింది! ఒంటరిగా నిద్రలో వున్నదాన్ని, అర్ధరాత్రి వేళ, దీపం ఆర్పేసి—మీదబడడం—ఛీ! ఛీ! ఎంత దారుణం—ఎన్నేళ్లొచ్చి ఏం ప్రయోజనం? అంతా అంటూంటే అడిపోసుకుంటున్నారనుకున్నా గాని నిజం గమనించలేకపోయాను—" శిష్యురాలు సుశీల అంటున్న దూషణ వాక్యాలు వినలేక చెవులు గట్టిగా మూసుకున్నారు మేష్టారు. ఆయన అవయవా లేవీ పని చెయ్యడం లేదు. ప్రపంచంలో ఎందరు తన్ను గురించి ఎన్ని కట్టుకథలు ఎలాగ ప్రచారం చేసుకున్నా లక్ష్యం చెయ్యలేదు మేష్టారు. సుశీల నన్ను అనుమానించనంత వరకు ఈ సమాజం మధ్య నిర్భయంగా మసల వచ్చు ననుకున్నారు.

అంతపనీ అయి వూరుకుంది—సుశీలే ఆయన్ను అనుమానించేసింది— 'రేపు ప్రొద్దు మొగం చూడడం ఎలాగ? సుశీలతో మళ్ళీ మాట్లాడ గలనా? అరే— ఇప్పుడు నేను ఏ ముక్కన్నా వ్యర్థ వివరణ కాగలదో' మధనపడుతూ గడపకు అవతలనే కూలబడి పోయారు. అరిచి అరిచి నోరు నొప్పి పెట్టి ఊరుకుంది సుశీల. మిగిలిన రాత్రి ఇక అవతల మేష్టారికీ లోపల సుశీలకు నిద్ర కూడా లేదు.

తూరుపు రేఖలు పొడిచినై. సుశీలే ముందుగా ఈవలకు వచ్చింది-కాదు ఈసరికే మేష్టారు బయటనున్నారు. ఆమె ఆయన్ను చూసింది. ఆయనా చూశారు ఆమెను. అయితే సుశీలే మేష్టార్ని సరిగా చూడలేదనాలి. నిన్నటి సుశీలే అయితే ఆయ న్నీపాటికి ఎన్నో ప్రశ్నలు వేసి ఉండేది. ఆపరిస్థితిలో ఉన్న మేష్టార్ని చూస్తూ ఊరుకోవడం మటుకు ఆమె వశంలో ఉండదంటే అతిశయోక్తి కాదు. ఒకరినొకరు చూసుకుని మాట్లాడుకో లేదు. సుశీల ముఖంతీరు చూడగా మేష్టారు మాట్లాడకపోవడం ఆమెకు మరీ కలవర పెట్టినట్టు అవుపిస్తుంది. మంచం ఎత్తి గోడకు చేర వేసింది. చీపురు తీసుకుని వాకిలి ఊడ్చింది.

హాలుకూడా శుభ్రంచేసి మేష్టారి మంచం క్రింద గోడవార తుక్కు, సున్నపు బెల్లులూ ఉంటే తుడుద్దామని వంగింది. చేతిని చాచి చీపురు కొసను ఆడిస్తోంది "సుశీలా! ఇలావచ్చెయ్. తొందరగా! రావాలి" మేష్టారు అన్న మాటలు ఉరిమినట్టు ఆమెకు వినిపించాయి—ఆమెలో రాత్రినుంచీ గూడుకట్టుకుని

ఘనీభవించిన అనుమానాన్ని అనుకోకుండా శస్త్రం చేస్తూ, "హమ్మయ్య!" బ్రతికి పోయాను అనుకొంటూ ఆమె చే గాఢమగు నిట్టూర్పును విడిపిస్తూ, రాత్రి అనగా బీటలు వారిన గోడ 'ఫెడక్' మని ఒక్కసారి కూలి పోయింది. రెండు పెద్ద అంశాలుగా చీలిపోయిన గోడ పైన బడటంతో, మంచం, కోళ్ళుకోసకు విరిగి, చాప వత్తుగా నేలకరిచింది. నిజంగా ఆ క్షణంలో మేష్టారు మాట్లాడి ఉండకపోతే సుశీల ఈ పాటికి పచ్చడై పోయేది. ఈ ప్రమాదం చూడలేక చటుక్కున కళ్లు మూసుకుంది.

సుశీల కళ్లు తెరిచింది. విడివడ్డంతోనే ఆ నేత్రాలనుండి వికసించిన కలువలనుండి సౌరభం విరజిమ్మబడ్డట్టు అనిన నూతన కాంతుల్ని చూసిన మేష్టారు ఆవేళకు తొలిసారిగా చిరునవ్వునవ్వారు. సుశీల చుట్టు ప్రక్కల్ని సరిగా చూడగలిగింది. వస్తువులన్నీ కనబడ్డాయి- మేష్టారిని మరీమరీ చూసింది. "అయ్యో! ఎంత బొప్పిగట్టిందో" అంటూ అప్రయత్నంగా ఆయన నుదుటి మీదికి తనచేతిని పోనిద్దామని ముందుకు దూసుకు వచ్చింది. "రాత్రి దీపం కొండెక్కితే వెలిగిద్దామని వెడుతూంటే దారిలో మంచం తగిలి పడి పోయాను. నుదుటికి కోడుకొన తగిలి బొప్పిగట్టింది." ఆయన ప్రత్యుత్తరం అతిభారంగా దిగమ్రింగి "మోకాలు ఇలా చాచండి—అబ్బ! ఎంతదెబ్బతగిలిందీ!" సుశీల బాధతో ప్రశ్నించింది. మేష్టారు నవ్వారు. ఆ నవ్వు సుశీల వైపు అనవసరంగా అకారణంగా తాను అలిగిన మిత్రుడు రాజీకి వస్తున్నట్టు లీలగావచ్చింది. ఆ నవ్వును చూడలేక తల వొంచుకున్న ఆమెను కనిపెట్టినట్టు "ఎవరికి తెలుసు రాత్రి నీవు వచ్చావనీ, మంచం వాల్చుకు పడుకున్నావనీనీ! ముందే తగిలింది పట్టె మోకాలికి." అని పూర్తిచేశారు. సుశీలను ఎవరో ఎదలో పొడిచినట్లయింది. సిగ్గులో బిక్కచచ్చి పోయింది. ఈ మాటలే గనుక రాత్రిఎలాగైనా ఆయన తనకు చేరవేసివుంటే అవి తన అనుమానాగ్నిలో ఆజ్యమై దానితీవ్రతను ఇనుమడింప చేసి ఉండేవి. ఇలా తెల్లవారేదే గాదు.

సుశీల - ఎంతచెడినా ఆడుది గనుక - ఇట్టేమనసు తిరగేసుకుంది. ఏమీ జరగనట్టు: "ఎన్నాళ్ళనుంచో చెబుతున్నాను ఈ పాతకొంప వదిలెయ్యమని— ఎప్పుడూ ఇది మాతాతల నాటినుంచి వస్తున్న భవనమనీ, ఈ నడవలోకూర్చొని వేలాది విద్యార్థులు చదువుకొని పెద్ద పెద్ద హోదాల్లోకి వెళ్ళారని, తరతరాలనుంచీ ప్రసిద్ధికెక్కిన ఈ గొప్పయింటిని విడిచిపెట్టననీ భీష్మించి కూర్చున్నారు. ఇంకే వదలకేం చేస్తారు" అని తను పెడదోవన బట్టించిన బండికూడా వస్తోందా లేదా అన్నట్లు మేష్టారిముఖంలోకి చూసింది. ఆయన దీన్నంతను పసికట్టారు. ఇంక ఆమెను అట్టే కష్టపెట్టదలచుకోక "వదిలెయ్యవలసివస్తే తప్పకుండా సరే. బాగానే ఉంది" అని లేచారు. చుట్టుపక్కల నలుగురూ ఈ చోద్యం చూడ్డానికి విరగబడ్డారు. వారిలోకొందరు అమ్మలక్కలు తమలో "కాన— ఈవిడిక్కడేవుందా.అయితే రాత్రికూడాఇక్కడే.. ఆయన్నీ గ్రహం వదలనంతకాలం ఆకాపురం ఇంకెలా కుదుటబడుతుందీ!" అంటూ సాగదీసుకోవడం మేష్టారూ, సుశీలాకూడా ప్రశాంతంగానే — అది వారిరువురికీ పాతపాటే—విన్నారు.

* * * *

"విద్యాలయంలో ప్రమాదం జరిగిందిట విన్నారా?"

"విన్నాం."

"ఓసారి అటువెళ్ళి పలకరించలేకపోయారా?".

"అంత అవసరం మాకేం లేదు."

"ఔనుగానీ - అలాగే పంతంబట్టుకు కూర్చుంటారా? ఎంతచెడినా మీరు మామగారు గాదా వారు అల్లుడుగాదా? పట్టింపులు వస్తాంటాయి పోతూంటాయి. ఆడపిల్ల నిచ్చుకున్నారు. పైగా బావమరది; ఇవ్వాళ గాకుంటే రేపైనా కలుసుకుంటారా లేకపోతే కలకాలం అలాగే వుండిపోతారా" మేష్టారి బావమరిదిని సతాయిస్తున్నాడు ఓ పెద్దమనిషి. ఇంతలో మేష్టారి అప్పగారు, పిల్లనిచ్చిన అత్తగారూ ఇంట్లో వుండి వినివిని అమాంతంగా బయటికి దూసుకొచ్చి "మీకుగా మీరే వచ్చారా—లేకపోతే ఎవరేనా పంపారా?" అని అందుకుంది.

"ఒకళ్ళచేత చెప్పించుకోకుండా ఈపాటికి మీరే వెళ్ళి పలకరించి వుండాల్సింది. కష్టానికీ సుఖానికీ మానుకుంటారా? ఎవరేనా పంపేదాకా నాకేం పనమ్మా—అక్కా తమ్ముడూ ఎడముఖం పెడముఖం ఇలా ఎంతకాలం పడుంటారని అంటున్నా."

"ఏమోలే—ఆ సోమిదేవమ్మగానీ పంపిందేమో అనుకున్నా. పుడతారు భూమిమీద జాణలు, కాపురాలు పడేసుకోడానికి. కాకపోయినా దాన్ని అనవలసిన పనేముంది లెండి — మనబంగారం మంచిదిగాదు ఇంతకీ"—

"ఏంవమ్మోయ్ — ఎవరో అంటే కామోసు అనుకున్నా — సుశీలను అన్నవాళ్ళనోట పురుగులు రాలతాయి. చిన్నతనంలో పెనిమిటి ఆమె ముఖాన ఇంత బుగ్గిపోసిపోతే మానమర్యాదలకి కట్టుబడి పాము కాళ్ళవలసిన స్నేళ్ళ పాడుబతుకు బండలాగ ఈడ్చుకోస్తోంది. ఎన్నాళ్లో ఒకళ్లకు బరువుగా ఉంటానని నాలుగుముక్కలు నేర్చుకుంటూంటే చూసి ఓర్వలేని పాడులోకంతోబాటు నువ్వూ..."

"అవున్నాయనా! పొరబాటే—ఏదో ఉబక ఆపుకోలేక అన్నామగాని—ఇటు కూతురు. అటు తమ్ముడూ—కడుపుచించుకుంటే కాళ్ళమీద పడుతుంది."

"ఇంకంతే మనకేదితోస్తే అదే వాగడం. మంచీ చెడూ ఉండక్కర్లేదూ—నోటికి శుద్ధీబద్ధీ వుండాలి, కూతుర్ని కాపురానికంపక గువ్వపిట్టలా కులకబెట్టుకుంటున్నందుకు సిగ్గుపడక తనదునవమ్మా అని నాలుక బుజానవేసుకుని ఆడిపోసుకుంటున్నావు. తొందర పడకు—ముందున్నది ముసల్లి పండగ" విదిలించుకు వెళ్లిపోయాడు; పోనీ—ఈ సందర్భం పురస్కరించుకొనైనా—తనకు ఉభయపార్టీలమీదా చనవు, స్వతంత్రమూ ఉన్నాయి గనుక — మేష్టారికీ, పెళ్లానికీ పొత్తు కుదురుద్దామనివచ్చిన ఆసామీ.

లోగడ రెండుమూడు దఫాలు ప్రయత్నించి ఊరుకున్నాడు—అయితే మళ్లీ సుశీల బ్రతిమాలడం వల్ల, తనకు మేష్టారికీ ఏదో సంబంధం ఉన్నదని ఊరంతా గుణించుకునే అనుమానాన్ని ఎలాగ త్రుంచి వెయ్యాలా, ఏవిధంగా మేష్టారి జీవితాన్ని సుఖమయం చెయ్యాలా అన్న ఆమె ఆతుర్దానుబట్టి వచ్చాడు. కాని ఈ అస్త్రమూ పనిచేయకపోవడంతో సుశీల నిరాశ చెందింది. సాయంత్రం పనిగట్టుకుని నీలాటి రేవులో కాసి తనపిలుపును వినడానికైనా ప్రయత్నించని విశాలాక్షిని అడ్డుకుని బలవంతాన చెయ్యిపట్టుకు చింత చెట్టుక్రిందికి లాక్కెళ్లి "విశాలా! చిన్నదానివి. చెడగా చెడగా కాపురాలుకావు. ఇవి చేతులుగావు కాళ్లు. మళ్ళీ చెబుతున్నా—క్రింది భూదేవిసాక్షి—పైన ఆకాశంసాక్షి—చెరువులో కెరటమేసే గంగమ్మ సాక్షి. నే జేపాపమూ ఎరగను-మేష్టారు సాక్షాత్తు భగవంతుడు—ఒకళ్ళతో పనేఁవిటీ—నాతోవచ్చెయ్ ఆయన నిన్ను నెత్తిమీద పెట్టుకుంటారు." బ్రతిమాలి కంట తడిపెట్టుకుంది. "రంకు నేర్చినమ్మ బొంకు నేర్వదా?" అన్నధోరణిలో సుశీలమాటలను వింటున్నట్లు విశాల ఒక్కవిసురుతో ఆమెను కసరికొట్టి "చాలుచాలు ఇప్పుడంటే అన్నావుగాని ఇంకెప్పుడూ ఇలాగనకు. పైగా నీతులు గూడా చెప్పొచ్చావు" అంటూ తూలనాడింది. విశాలమాటలను సుశీల వినలేక పోయింది. కళ్ళవెంబడి నీళ్లుధారగట్టాయి. 'ఛా! ఏంబ్రతుకు నాది! నే నెవరికోసం జీవించాలి? ఊరు ఊరంతాడప్పుగట్టుకు చాటుతోంది. పాపం! మేష్టారు మటుకు ఏంచేస్తారూ—ఆయనకీవుంది, నేను తమకు దూరంగావాలని — నే నే — ఏఁవిటో ఆయనకష్టం చూడలేక పోతున్నా — నాకెందుకు ఈ బాధలు కల్పించబడుతున్నాయి? ఏదో నెపాన ప్రాణం తీసుకుంటే' అనుకొని చెరువుకేసి చూసింది. నిండావున్న నీటితో దబకలాడుతూ చెరువు ఆమెను ఆహ్వానించి నట్లై అటు గట్టువైపు నడిచింది.

చీకటి ఆవరించడానికి ఊరుమీదికి వల విసురుతోంది. గట్టుమీదినుంచి గంగ త్రుళ్ళింతలుమాచి చేయెత్తి ఆ అమ్మకు నమస్కరించి ఉరకడానికి ఉద్యుక్తురాలైంది. సాహసం స్త్రీలసొమ్మే అయినా సుశీల ఏమిటో దుమికేసేటంతటి దుస్సాహసానికి ఒడిగట్టలేక పోయింది—

"సుశీలా! ఆత్మహత్య అబలత్వానికి నిదర్శనం-చచ్చి నీవు ఏం సాధిస్తావు. నీవు మరణించినంతమాత్రాన నీపై నీలాపనింద పోతుందా-కాగా అది స్థిరపడుతుంది. సమాజం నీమీద ప్రచారం చేస్తున్న అనుమానం నివృత్తికావాలంటే ఇది మార్గం కాదు—లే—నెనక్కుమళ్ళి ఆత్మ విశ్వాసంతో కష్టాల నెదురించి విజయం సాధించు" ఆమె అంతరాత్మ అందించిన అమరసందేశాన్ని వింటూ ఆ పడుచు గడగడ వణికిపోయింది.తరం గాలవలె ఉవ్వెత్తుగా విజృంభిస్తున్న ఉద్రేక పూరితభావాలను అదుపులో పెట్టు

కుంది. త్రుటిలో ఆమెకు ఎక్కడలేని ధైర్యమూ వచ్చింది. చరచరనడుస్తూ విద్యాలయం చేరుకుంది.

* * *

"సుశీలా! ఇవాళ వంట ఎంత బాగాచేశావు! పాకంబాగా కుదిరిందిసుమా" అంటూ కొసరి కొసరి వేయించుకుని భోజనంచేసిన మేష్టారినిచూచి సుశీల మిక్కిలిగా తృప్తిపొందింది. ఆయన లేచిన తర్వాత ఆమెకూడా పూర్తిచేసుకుంది భోజనం. గిన్నెలు మూతపెట్టి హాలులో కొచ్చి సరికి పాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారు మేష్టారు.

ఎన్నడూ చెప్పనంత ఆసక్తితో చెబుతున్నారు పాఠం—గానంలో తుది స్వరం, తేనెలో చివరిబొట్టు, నృత్యంలో కడపటి అడుగు, కథానికలో ఆఖరి విరుపు మనోరాతి మధురంగా ఉంటాయి. పాఠం ముగిసిందో లేదో మేష్టారు ఏదో చెప్పడానికి ఆరంభంలో ఉపక్రమించారు.

"సుశీలా! ఇదే నేను నీకు చెప్పేపాఠానికి కడ అనుకుంటాను" సాహసించి ఆయన హృదయం బహిర్గతమొనర్చే భావాన్ని వ్యక్తీకరించలేకపోతున్నారు.

"మేష్టారూ!"

"ఔను—సుశీలా—నే నెందుకూ ఇంకా ఇక్కడ ఉండడం. ఎవరికోసం ఈ నిరీక్షణ—చూచి చూచి కళ్లు కాయలు కాశాయి. బయలుదేరిన ఇరువురూ ఒకరి కొకరు ప్రతిమార్గాలలో పయనిస్తున్నారు. ఇంక వీరి కలయిక..."

"మేష్టారూ! భూమి గుండ్రంగా వుంది. ఆవలి అంచునైనా రెండురేఖలూ కలియవూ?"

"ఇవి నిర్జీవమైన రేఖలుకావు. రక్తమాంసాలతో, చీము నెత్తురులతో, వెలుగు చీకట్ల అనుమాన ఆవేశాలతో మసలే మానవప్రకృతులు"

"మనసులు ఎప్పుడూ మారవనుకోవడానికి వీల్లేదు."

"అదే ఆశతో చూశాను. ఆమెకోసమని ఆయాసపడ్డాను. పోనీ—దానిమాట అటుంచు—ఇలాగైనా లోకం బ్రతికనియ్యడం లేదు. ఆప్తులైన శిష్యులు అనుమానించారు. బంధువులు ప్రతిఘటించారు. విధికి సైతం కంటగింపుగా వుంది. విద్యాలయం ఖాలీపోవడమేమిటీ లేకపోతే! నేను ఎవరిపైనేతే భరవసా ఉంచుకున్నానో వారూ నన్ను అపార్థం చేసుకుంటే?!?" ఆయన కంఠం రుద్ధమైంది. సుశీల వినలేకపోతోంది. ఆమెకళ్లనీళ్ళు గ్రమ్మాయి—,

"దుఃఖిస్తున్నావా?"

"లేదు—మేష్టారూ! నే చేసిన పాపానికి నిష్కృతి లేదు."

"సుశీలా! నీవు మనిషివని ఎందుకు మరిచిపోతున్నావు? ఎంతటి కాంతిమంతమైన వజ్రంకానీ దాకు లేకుండా పనికి తళుకు రాదు. శౌశీల్యానికి కించిత్తు వలుపులేనిదే పరిపూర్ణత్వం ఉండదు".

"ఇంతటి ధారణశక్తి భూమిమీద ఏ కొద్దిమందికో ఉంటుంది".

"నాపై అభిమానం అట్లా గనిపిస్తుంది".

సుశీల మేష్టారిలో ఆత్మవిశ్వాసం పాదుకొల్పాలని—

"సాయంత్రం ఒక సంగతి జరిగింది. విశాలను నీలాటిరేవులో కలుసుకున్నాను—ఆమెను ఎంతో ప్రాధేయపడ్డాను నా మనవి విని మా దగ్గిరి కొచ్చెయ్యమని" అంటూంటే "రానన్నదిగా - నాకు తెలుసు-సుశీలా! అట్లాంటి ఆడుదాన్ని బ్రతిమాలడంచేత నీ నొప్పడనానికి కూడా వెలితి—తుదకు నిన్ను సహితం బాధ పెడుతున్నాను. అందుకే ఇంక ఎంతమాత్రం ఆలశ్యం చెయ్యకూడదని ఒక నిర్ణయాని కొచ్చేశాను. సుశీలా! నే చేసేది నేరం కాదనుకుంటున్నాను. అయినా చేసేముందు ఆప్తులతో చెప్పేస్తే ఆ దోషం నివృత్తి అవుతుందనుకుంటున్నాను — నేను రేపు నీకు కనుపించను. నీకే నేమిటి—ఈ ఊరికే కనబడను" సుశీల వజ్రకఠోరమైన ఈ నిశ్చయం విని వణికిపోయింది. 'ఓహో! ఈయన దీన్ని వెల్లడి పరచడంవల్ల ఎంత మేలు కలిగిందీ!' అనుకొని "నన్ను పాంతం చెప్పనియ్యండి".

"చెప్పూ"

"విశాల నా అభ్యర్థన పాలించకపోవడంతో నాకు జీవితంపై ఆశపోయింది. ఆ సంజ చీకటిలో చెరువులో కురికి ఆ గంగాభవానికి తనువు అర్పిద్దామని గట్టెక్కాను", మేష్టారు చకితులయ్యారు. మెరుపువలె భావ వీచిక ఏదో ఆయన ఉష్ణతీక్ష్ణ హృదయాన్ని దూసుకు

పోయింది. "సుశీలా! నిజంగానా! అంతటి అఘాయిత్యానికెందుకు ఒడిగట్టావు?"

"మేష్టారూ! నేను ఎవరికోసం బ్రతకాలీ— ఊహ తెలిసే సరికే పసుపూ కుంకుమా భ్రష్టమయ్యాయి. గానుగెద్దులాగ బరువుగా బ్రతుకులాగుతున్నా, ప్రపంచం గ్రుడ్లల్లో నిప్పులోసుకుంటోంది. నన్ను నమ్మినవారి వారిలో ముళ్ళకంచెనైనా ఇంకా బ్రతకాలా".

"అందుకని ఆత్మహత్యకు—".

"ఆఁ-అందుకే తెగించాను. కాని ఆరీత్యాగూడా ఈ ప్రాణి విరగడకాలేదు. గట్టుమీద నిలబడీ నీటిలోకి దుముకలేకపోయాను. ఆశ చెడ్డది. ఏమూలనుంచో ఆత్మ విశ్వాసాన్ని పుంజుకొస్తుంది. నాలోంచి ఎవరో బలంగా బయటకు నెట్టేసినట్లై తిరిగి వచ్చేశాను".

"సుశీలా! నీ తెగువ సాటిలేనిది. పిరికివాళ్ళకు ధైర్యం అందించావు" మేష్టారుకి అప్పటివరకు ఉన్న ఊహ దీనితో తారుమారైపోయింది. చావుకు తెగించిన ఒక ఆడుదానిలో ఉవ్వెత్తుగా లేచిన భావతరంగం లోకాన్నెదిరించి బ్రతుకలేక పలాయనం చిత్తగించే పారుబోతైన పురుషుని నిలవమని సవాలు చేస్తోంది. పురుషుడి అభిమానం గాయపడింది. "ఛా! ఎంతటి చెడు నిశ్చయం చేసుకున్నాను" తన్ను తానే అసహ్యించుకున్నారు మేష్టారు - చదువుకుని, పెరిగి పెద్దవారై, లోకానుభవం గడించి, కష్టసుఖాల్ని చవి చూచిన మేష్టారు క్షణంక్రితం తనను చుట్టివేసిన బలహీనత అనే వలనుండి బయటికొచ్చివేశారు.

"ఇంకెప్పుడూ అలాంటి నీచకృత్యం చెయ్యనని ఒట్టుపెట్టు"—చేతిని ముందుకు చాచారు. "చెయ్యను" సుశీల కుసుమ కోమలహస్తం మేష్టారిచేతిని అదిమింది. పరస్పర సుహృద్భావ సహకారాలతో జీవితంలోని దుఃఖసాగరానికి సేతువు బంధించనిడింది. స్త్రీ పురుషుల వాగ్దానంతో "మరి మీరు" అతిబాలిగా, నాటిగా ఈ నాలుగక్షరాలు ఆమెనుండి వచ్చి ఆయన హృదయంలో చీకటిగదిలో వెలుగుకిరణాలు పాకుచున్నట్లు ప్రతిధ్వనించాయి. మేష్టారు సిగ్గుపడిపోయారు. "లేదు-సుశీలా! నేను నిన్ను ఎన్నటికి విడిచివెళ్ళను. ఇంతటి బలమైన ఆధారంపై నిలబడి దీక్షే వజ్రాయుధంగా లోకపు మూగ విమర్శలను ఎదుర్కొని విజయం సాధించగలనని హామీ ఇస్తున్నాను". సుశీల మందహాసం చేసింది.

* * * *

మర్నాడు ప్రొద్దుటనే సుశీల పినతల్లి దుఃఖిస్తూ విద్యాలయానికి రావడం మేష్టార్ని ఆశ్చర్యంలో ముంచితేల్చింది. మేష్టారి చిరునామా ఉన్న కవరును ఆమె ఆయనకు చూపించి: "రాత్రి ప్రొద్దు పోయీదాకా ఇక్కడే ఉన్నదట. భోజనంకూడా ఇక్కడే చేసిందట. ఎంతోసేపు ఈ గొడవే చెప్పింది. తెల్లారి మాస్తే లేదండీ" అంటూన్న ఆమెను ఆపి.

"లేదంటే — ఎక్కడికెళ్ళినట్టు" అడిగారు మేష్టారు.

"మొదట్లో నేను ఏమీ అనుకోలేదు. ప్రక్కమనుస్తూంటే తలగడ క్రిందవున్న ఈ కవరు చూడ్డంతోనే అది ఏదో అఘాయిత్యానికి ఒడిగట్టిందని తేల్చుకున్నాను. వారం పదిరోజుల్నుంచీ దిగులుతోనే వుంటోంది. కారణం అడిగితే ఏఁవీ చెప్పేదిగాదు. ఎంతసేపూ మీ గొడవే-పోతే ఊరంతా ఆడిపోసుకుంటున్నారని వాపోయేది-చిన్నప్పుడనగా తల్లిదండ్రీ పోతే, ప్రాయం వచ్చీరాకుండానే మొగుడు ముక్కలైతే నా కూతురొకటీ, మా అప్పగారిపిల్ల ఒకటేనా అని కడుపులో దాచుకు పెంచుకుంటూ వచ్చాను— దానిరాత అలా బ్రద్దలౌతుందని కలగన్నానా? ఎక్కడికి పోయిందో ఏఁవిటో...."

మేష్టారు తలవంచి నేలవైపు చూస్తూ పాలుపోని ఆలోచనలో పడ్డారు. రాత్రి అన్నికబుర్లుచెప్పి తనను నిలబెట్టిన సుశీల తెల్లారేసరికి మాయమవడంలో ఆంతర్యం ఆయనకు అర్థంకావడంలేదు. ఏడ్చి ఏడ్చి ఆమెపినతల్లి వెళ్లిపోయింది— "పాపం! ఆమె కేం కష్టమొచ్చిందో" అని సానుభూతి ప్రకటించారు ఆమె హితులు. అదేపనిగా ఇతరుల్ని ఆడిపోసుకొనేవాళ్లు: "శని విరగడైంది. ఇంక బాగుపడుతుందేమో ఆయన సంసారం. ఔనూ తప్పుచేసి లోకానికి ముఖం చూపెడుతూ ఎలా మసుల్తుంది. పోయిందో పీడా పోయింది" అని లోపల్లోపల తుచ్ఛసంతృప్తి పొందారు. మేష్టారి అప్పగారికి, భార్య విశాలకీ ఈ వార్త చేరింది. "ఇంక దారికి రాకేం చేస్తాడు. చచ్చినట్టు వస్తాడు కుక్కలాగ మనింటికి. ఇన్నాళ్లూ అంటే అది వండి డిపేసి అడ్డమైన చాకిరీచేసి, అతగాడి ఇష్టమొచ్చిన

ట్లా అడిందిగనుక చెట్టుచూపేడు—రేపటినుంచీ తెలుస్తుంది అయ్యగారిపని" అని అదికూడా తమ మేలుకే వచ్చిందని ఆనందించారు. ఇవన్నీ తెలిశాయి మేష్టారికి. మౌనమే ఆయనకు శరణ్యమయ్యింది.

సుశీల వెడుతూ మేష్టారికి వ్రాసిన లేఖ—

పూజ్యపాదులు మేష్టారికి !

సాదర నమస్కారములు. నేను ఎక్కడికి వెడుతున్నానో ప్రస్తుతం వ్రాయలేను. కాని ఒక ప్రత్యేక కార్యార్థమై ముందుకెళ్లుతున్నాను. నా సంకల్పం మంచిదిగనుక తప్పక విజయం సాధించితీరుతానని ధీమా నాకు ఉంది. నేను మళ్ళీవచ్చి మిమ్మల్ని కలుసుకొనేదాకా మీరు విద్యాలయంలోనే ఉండవలసినదిగా నా ప్రార్థన. దీన్ని తప్పకుందురని నా విశ్వాసం. నా తలంపు నెరవేరిననాడు మీ నా బ్రతుకు బాటల్లో ముళ్లకంచెలు వాటంతట అవే వైదొలగిపోతాయి. ఇది తథ్యం. ఇంతకన్న ఇప్పుడేమీ వ్రాయలేను. వ్రాయగూడదు.

పునఃపునః ప్రణామాలతో శెలవుతీసుకుంటున్న
భవదీయ,
సుశీల.

ఉత్తరం మళ్లీమళ్లీ చదువుకున్నారు మేష్టారు. సుశీల సాహసానికే ఒడిగట్టుంటుందన్నది ఖాయపడింది. కాని అది దుస్సాహసంకాదని తేలిపోయింది. ఇంక ఆమెరాకకై నిరీక్షించడం వినా ఆయనకు కర్తవ్యమింకొకటిలేదు.

సుశీల ఎక్కడికో ఎందుకో వెళ్ళిపోయిందంటే ఊరికొకవార్త. కాదు అనేకవదంతి. వారంరోజుల పాటు చాలామందినోట ఇదేపలుకు. ఆడాళ్లగుసగుసలు సరేసరి. మేష్టారు ఇవన్నీ వినివిని రాటుదేలారు. తొలి చినుకుకే వొళ్లు పులకరిస్తుందిగాని, జడివానలో తడిశాక వణుకుపుండదు. ఎవ్వరికీ ఎట్టిప్రత్యుత్తరమూ ఇవ్వడంలేదు. ఆడా మగా వందమందికిపైగా వచ్చే విద్యార్థులు సగానికితగ్గి పదిహేనుదాకా పడిపోయారు. వాళ్లూ వస్తున్నారంటే ఎందుకొస్తున్నారో వాళ్లకే తెలియనట్లుంది. "మీరు ఏఁవనుకుంటున్నార్రా?" అని ఆయన వాళ్లను నిగ్గదియ్యనేలేదు. "ఇకేఁవిటండీ" అని వాళ్లు ఆయన్ను అడగనూలేదు. నెలరోజులు అలాగే చెయ్యికాల్చుకుంటూ మేష్టారు బిరుసుగానే వుండిపోవడం, వెనకటివలె మధ్యవర్తులెవరు తన కాపురం పొత్తు చెయ్యడానికని రాకపోవడం విశాలాక్షికీ, తల్లిదండ్రులకీ నిరాశనే సూచించింది. ఇదీ కనిపెడుతూనే వున్నారు మేష్టారు.

సరిగా నెలదాటింది సుశీల వెళ్లిపోయి. మేష్టారికి విజయనగరంనుంచి ఒక కార్డు వచ్చింది.

ప్రియమైన మేష్టారికి

మీ మిత్రుడు వెంకటేశ్వర్లు నమస్కరించి వ్రాయునది. సుశీలను గురించి భోగట్టా చేయవలసిందంటూ మీరు వ్రాసినఉత్తరం అందింది. ఆవిషయమై దర్యాప్తుచేయడం కారణంగా మీకు వెంటనే సమాధానం వ్రాయలేకపోయాను.

మీరు అనుకున్నట్లు ఆమె ఇక్కడకు వచ్చిన మాట వాస్తవమే. మొన్న ఆఫీసునుంచి వస్తూంటే సుశీల కనుపించింది. ఆమె, మా ఆఫీసులో గుమాస్తా కలిసి జట్కాలో వెడుతున్నారు. నిన్న మధ్యాహ్నం ఆగుమాస్తాను సుశీలనుగూర్చి అడిగాను. ఆమె ఈయనకు దూరపుబంధువట. వివాహానికై ప్రయత్నిస్తున్నదట. సంబంధంకొరకు దర్యాప్తుచేస్తున్నట్లు తెలుస్తోంది. మళ్ళీ ఆమె నాకు కనబడలేదు—శెలవు—

భవదీయుడు,
వెంకటేశ్వర్లు

ఉత్తరం చదువుతూంటే మేష్టారు వణికిపోయారు. ఉన్నట్టుండి సుశీలకు ఆ ఊహ ఎలా తట్టింది. భర్త పోయిన ఇన్నేళ్ళకు మళ్ళీ పెళ్లిచేసుకోబోతోందా? ఏఁవిటీ వైపరీత్యం? మేష్టారుకేమీ పాలుపోవడంలేదు. తనను, తాచేసుకోబోయే భర్తను నేను ఆశీర్వదించాలనేనా ఆమె తాను తిరిగి వచ్చేవరకు నన్ను ఎక్కడికీ వెళ్ళవద్దని అభ్యర్థించింది? ఇప్పుడేఁవిటీ చెయ్యడం? ఎక్కడికేనా పోవడమా? లేక ఆమెకై పడివుండడమా? సుశీల సతీసమేతంగా వస్తే ఊళ్ళో అంతా ఏమనుకుంటారు—తుదకు ఒకే ఒక సందేహం తటుక్కుమన్నది ఆయనహృదయ ఫలకంపై—సుశీలగానా ఈ మార్గం ద్వారా తనపై సంఘంవేసిన అనుమానాన్ని నివృత్తి చేసుకోదలచిందా?

* * *

ఒకనాడు విద్యాలయంలో మేష్టారు వంటకోసమని పొయ్యి ఊదుకుంటుంటే ఊడిపడింది సుశీల "ఏఁ మండోయ్-ఏం చేస్తున్నారు?" అంటూ.

"ఇదిగో చూస్తున్నావుగా—నీవు వెళ్ళినప్పటి నుంచి ఇదేవరస?" మేష్టారి కంఠంలో కోపం ధ్వనించ డానికి ప్రయత్నించింది. "ఊఁ ఇదేనా రావడం?" అడిగారు.

"ఔను—ప్రొద్దుట బండిలో వచ్చాను. ఇంకా ఇంటికేనా వెళ్ళలేదు" నవ్వు త్రోసుకువస్తోంది సుశీల ముఖంలోనుంచి.

"కుదిరినట్టేనా" నిష్ప్రమేయంగా వచ్చిన ప్రశ్నకు ఆమె తట్టుకు నిలిచి

"ఆఁ" అంది నదురు బెదురూ లేక.

"విజయనగరంలో నేనా?"

"ఊఁహూఁ—ఆముదాలవలసలో"

"స్థితిగతులు బావున్న సంబంధమేనా?"

"బ్రతికి చెడ్డకుటుంబం-ప్రస్తుతం పేదరికంలో వున్నారు"

"నీకు నచ్చినట్లేనా?"

"ఆహా"

"పోనీలే—బ్రతికాం"

"ఇంకా అడగరేం?"

"ఏఁవిటి అడగడం-చెప్పదలుచుకుంటే చెప్ప నీకే"

"స్కూలు ఫైనలుదాకా చదువు. వయసు పాతి కుంటాయి. అంతా క్రొత్త ఫేషను"

"ఓహో—ఇంకనేఁ? రేపటినుంచి మన పని మూడు పువ్వులూ, ఆరు కాయలూను"

"అలాగన్నమాటే"

"ముహూర్తం స్థిరపరచినట్టేనా?"

"అది పెళ్లికుమారుల చేతిలోమాట" గేలిచేస్తూ నవ్వింది.

"ఏఁ—ఏఁ వంటూ లేఁమిటివారు?" ఈ ప్రశ్న గూడా నిష్ప్రమేయమూ లేకుండానే వచ్చింది. సుశీల ముఖంలో హాసరేఖలు మరుగుపడుతున్నాయి.

"మీకు పెళ్ళి సంబంధం కుదుర్చుకొచ్చాను మాష్టారూ" అని ఆత్రంగా ఆయన ముఖంలోకి చూసింది. మేష్టారు నిర్ఘాంతపోతూ "పెళ్ళాముండగా పెళ్ళిమీద మళ్ళీ పెళ్ళా?" అన్నారు.

"మరేఁవిటనుకున్నారు — నాకు ఈ చిక్కు విడిపోవడానికింతకన్న మరొక మార్గం కనుపించ లేదు." తన్నుతాను సంబాళించుకోవాలని విశ్వప్రయత్నం చేశారు మేష్టారు.

"దీనివల్ల సమస్య పరిష్కరింపబడుతుందో లేక మరొక బిడ్డను ప్రసవిస్తుందో యోచించావా?"

"నాకు మటుక్కు బాగా తర్కించుకున్నట్టే వుంది. మీరు మాత్రం ఈ జీవితాన్ని పాతకొత్తల మేలుకలయికగా స్వీకరిస్తే నాకదే పదివేలు"

మేష్టారు మౌనం వహించారు. సుశీల తన యింటికి వెళ్ళిపోయింది.

* * *

ఆముదాలవలసలో ఆడంబరమేమీ లేకుండా మేష్టారికి రెండో పెళ్ళి జరిగిపోయింది. తమ కుమార్తె కన్నె చెరవిడిపించినందుకు కమల తల్లిదండ్రులు సుశీలను ఎంతగానో శ్లాఘించారు. ఈ తంతు ప్రథమకాండలో ఉన్నందువల్లనో మరేలకో మేష్టారికి తీయగానే రుచించింది.

ఒక సుముహూర్తాన మేష్టారు రెండవ భార్యతో విద్యాలయంలో గృహప్రవేశం చేయడం విచిత్రంగా ఊరుఊరంతా చూచింది. విశాలాక్షి గొంతులో చేదైనమాత్ర, మేష్టారి అక్కగారి నోటిలో విషపు గుళిక జారినట్లయింది. వాళ్లు కిమ్మనలేక పోయారు. "ఇదంతా ఆ సుశీల చేసింది సుమా! చాబాసురా!— ఏం తెగువ!" అని కొమ్ములు దిరిగిన మగాళ్ళు కూడా ముక్కుమీద వ్రేలేసుకున్నారు. ఇప్పటి వరకు మేష్టారికి బాగానే వుంది.

మరి నెలనాళ్ళకు మళ్ళీఒక్కరొక్కరే విద్యాలయంలో తిరిగి ప్రవేశించడం ప్రారంభించారు. కొనేస్తేగాని మందులేదని భ్రమించిన, పోరు కంతకు గూడుకట్టుకొని ఉబకపెట్టిన సుశీలమీది అనుమానం మంచులాగ విడిపోతోంది. అయితే అది మేష్టారి అక్కయ్యకు బావకు క్రోధాన్ని నానాటికి అతిశయింప జేస్తోంది. విద్యాలయం మళ్ళీ బాగు చెయ్యడానికి మేస్త్రీలను నియమించి తీర్చిదిద్దినట్లు కట్టించడానికి సుశీలే ఖంజాయింపు చేస్తోంది. అదిమీదా అల్లుడి మీదా పగతీర్చుకోవడమెలాగా అని కొరాలు మిరియాలు నూరుతున్నాడు ఆయనబావగారు. క్రొత్త భార్య సుశీల దర్శకత్వంలో తన కాపురానికి ఎలాగ

తీరుతెన్నులు మలుస్తుందో, మళ్ళీ తన మేనమామ బ్రతుకులో నూతన వసంతశోభ ఎలా విరుస్తుందో విని విని విసిగిపోయిన విశాలకు బెంగపట్టుకుంది. తాను ఎంతో పొరబాటుచేసినట్లు ఆమె అంతరాత్మ ఘోషించడం మొదలయ్యింది. "అన్నప్పుడూ ఆ పాతపట్టింపులు పెట్టుకు కూర్చుంటే సాగుతుందా. ఏదో మారే కాలంతో మనమూ సరిపెట్టుకోవాలి" అని ఎన్నాళ్ళ క్రిందటనో సుశీల ఆ సంజవేళ చెరువుగట్టువార చింత చెట్టుక్రింద అన్నమాటలు గుర్తుకు వస్తున్నాయి. ఆనాడు అవి కేవలం నోటిమాటలే అనుకుంది. మరి ఇవ్వాళో! అవి కటిక సత్యాలు. హితవు అంటేనే అదేమో, మొదట చేదుగా వుంటుంది. ఉత్తరోత్రా మేలుచేస్తుంది. తాను ముష్కరంలో మునిగి మందువంటి ఆమెహితోపదేశాన్ని ఆమె తన చేతులు బట్టుకు బ్రతిమాలినా పెడచెవిని బెట్టింది. ఇప్పుడు దాని ఫలం అనుభవించాలేమో! ఆ శిక్ష ఎంత కఠినంగా వుంటుందో — విశాల సింహావలోకనం చేసుకోలేక పోతోంది. ఈ భావాలన్నీ ఆమె తరుణ హృదయంలో మసిలిపోతున్నాయిగాని అవి బహిర్గతమయ్యే మార్గం లేదు. అటు అమ్మా నాన్నా చూస్తే రోజురోజుకీ బిగిసిపోతున్నారు.

ఒకనాడు మేష్టారికి ప్లీడరునోటీసు వచ్చింది. విశాల యిప్పించింది. అందులో వకీలు విశాలను మేష్టారు సరిగా యేలుకోనందుకు పరిహారం కోరుతూ హెచ్చరించారు. మేష్టారూ సుశీలా సాంతం చదువుకున్నారు.

"చూశావా! ఏంచేస్తే బావుంటుందంటావు?"

సుశీల ఆలోచించి "ఆమె బుద్ధిపూర్వంగా దీనికి అంగీకరించదు. పైవాళ్ళ ఒత్తిడి దీనికి కారణం అయి వుంటుంది."

"ఏది ఏమైతేనేం-కాగితం నాలుకలు కోరుతూ వచ్చింది"

"రానీండి-ఫర్వా లేదు"

"సక్రమంగా సమాధానం ఇచ్చేద్దామా?"

"మేష్టారూ! మీరు - విశాలకు-అంటే మీ భార్యకు సమాధానమిస్తారా? వద్దు. అది మంచిపని కాదు."

"ఊరికే కూర్చుంటే మెడకు చుట్టుకుంటుంది."

"ఫర్వా లేదు. ఏమౌతుందో చూద్దాం"

"ఏఁవిటి సుశీలా నీ వెర్రి భరవసా? ఇది కోర్టు వ్యవహారం."

"కానీండి. కోర్టువ్యవహారం బ్రతుకు చిక్కు-కంటే గడ్డుదా. అయినా సరే చూద్దాం"

మేష్టారుకి ధైర్యం కలిగింది. వెంటనే ఆ నోటీసు ముక్కముక్కలుగా చించిపారేశారు.

తర్వాత రెండుమూడు దఫాలు సుశీల ఏకాంతంలో విశాలను కలుసుకువచ్చింది.

* * *

రెండునెలలకు విద్యాలయం రూపురేఖలు మార్చివేయబడ్డాయి. మరమ్మత్తు చేయబడ్డది ఆ పురాతన మందిరమేనా లేక నూతనంగా నిర్మింపబడ్డదా అనే శంక చూపరులకు అనివార్యమైంది. పైన అంతస్తు వేశారు. ఈ ఖర్చంతా సుశీలే భరించుకుంది. మూడు వేలుపై దాటింది మొత్తం.

పని పూర్తిఅయి లెక్కలు తేల్చుకుంటున్నారు మేష్టారూ సుశీలానూ—వద్దంటున్నా వప్పుకోక వ్రాసి యిచ్చారు. ఆమెకు నాల్గువేల అయిదువందల రూపాయలకు ప్రామిసరీనోటు-అయిష్టంగానే ఆ నోటు మడచి పుచ్చుకుంటోంది సుశీలా ఇంతలోనే "మేష్టారూ!" అంటూ బయటనుంచి కేకవినపడింది.

తీరా చూస్తే కోర్టు అమీనా. ధావాసమ్మను బట్టుకు సిద్ధం "నేఅనుకున్నంతపనీ అయింది. విశాల చేత వ్యాజ్యం వేయించారు. సుశీలా" అన్నారు మేష్టారు.

"మీరూహించినదైతే అయిందేమో-నేను అనుకున్నంత పనీ ఇంకా కాలేదు. పుచ్చుకోండి సంతకం చేసి సమ్మను" అంది ధీమాతో. మేష్టారు సమ్మను అందుకున్నారు. అమీనా ఆయన బావగారింటికెళ్ళి మామూలు వసుక్కుని చక్కాబోయాడు. సుశీల మేష్టారికి అంతులేని ధైర్యం కూర్చింది. అయితే కమలకు మాత్రం ఇదేమీ అర్థంకావడంలేదు. సుశీలనుగాని, పెనిమిటినిగాని కదిపితే "నీకెందుకమ్మా ఊరుకో-అంతా చూస్తూవుండు" అనేవారు. కమలకు లోలోన గుబులుగా వుండేది కాని ఈ విషయాలజోలికి ఆమె మనసు పోయేదికాదు. అసలు ఆమెకు ఈ పితలాటాలు గిట్టవు.

విశాల భర్తపై దాఖలుచేసిన దావా విచారణకు వచ్చింది. పిలిచారు మేష్టారిని. మళ్లీ ఇతఃపూర్వం

మాతిపోసినవే మేష్టారికి చెప్పి ముందుకుపంపింది సుశీల. ఆయన బోనెక్కారు.

"దేవుని యెదుట ప్రమాణంచేసి అంతా నిజం చెబుతాను. అబద్ధం చెప్పను" ప్రమాణంచేసి, విశుద్ధమై వెలిగేచిత్తాన్ని తనలో ప్రతిబింబింపజేసే విప్పారిన నయనకమలాలతో శోభించే ముఖమెత్తి న్యాయాలయమంతా కలయజూశారు మేష్టారు. పుట్టినాక ఆయన బోనుఎక్కలేదు— కాళ్లు కొంచెం వణికాయి-సుమి గూడిన ప్రేక్షకుల్ని, కురుక్షేత్ర సంగ్రామంలో పదును పెట్టుకున్న ఆయుధాలతో కదనానికి సన్నద్ధులైన యోధాగ్రేసరుల్ని జ్ఞప్తికి తెచ్చే వకీళ్లను, అవలివైపున నిలబడ్డ తన బావగారిని— ఇంకొ మూలనొదిగి ఎట్టిపరిస్థితులలోనూ తాను ఆమెను అవిఘ్నంగా చూడ గూడ దనుకొన్న విశాలను ఆయనకళ్లు వెదకి పట్టుకొన్నాయి. "పేరు...వయస్సు...వృత్తి" మొదలగు పరిచయ వాక్యాలు అయ్యాయి. న్యాయాధిపతి ప్రశ్నిస్తుంటే నదురూ బెదురూ లేకుండా ప్రత్యుత్తర మిస్తున్నారు.

"ఏమండీ మీకీదావాగురించి తెలుసునా."

"చిత్తం తెలుసునండి."

"మరి ప్లీడరును తీసుకురాకుండా వచ్చారేం."

"నాకు ప్లీడరు అక్కరలేదండి. నిజం చెప్పేవారికి న్యాయవాదు లెందుకండి?"

"అయితే మీరు స్వయంగానే వాదించుకుంటారా?"

"ఇందులో నేను వాదించుకునే దేమీ లేదండి. తమ ప్రశ్నలకు ఖుద్దునే సమాధానా లిచ్చుకుంటాను."

"అయితే అడగండి ప్లీడరు గారూ!" న్యాయాధిపతి ఎదిరివకీలును ఆజ్ఞాపించారు."

"చూడండి మేష్టారూ! మీరు విశాలాక్షి అనే ఆమెను ఎరుగుదురా?"

"ఎరక్కేమండి?"

"ఆవిడ మీకేమౌతుంది?"

"నా భార్య" విశాలకండ్లలోకి చూస్తూ మేష్టారు ఈ వాక్యం నొక్కి అంటూంటే అప్రయత్నంగా రెండు వేడికన్నీటి బిందువులు ఆయన నయనాలనుండి వెలువడి విశాలను గడగడ వణకించాయి."

"అగ్ని సాక్షిగా పరిణయ మాడిన భార్యయేనా?"

"ఆ ఁ హాఁ."

"మరి ఆమె ఉండగా మీరు మళ్లీ పెళ్లి ఎందుకు చేసుకున్నారు."

"ఆమెను ఎన్నిసార్లు కాపురానికి రమ్మన్నా రాలేదు. తుదకు ఈ దారి త్రొక్కాను."

"దానివల్ల సంభవించే పరిణామాలు యోచించారా?"

"బాగా ఆలోచించే ఈపని చేశాను."

ఇంకేమీ అడుగలేదు వకీలు— మేష్టారికి సాక్ష్యం ఏమీ లేనందువల్ల వెంటనే పిలిచేశారు న్యాయాధిపతులు విశాలను.

విశాల బోను ఎక్కింది. ఆమెతరపు వకీలే ఆమెను అడుగుతున్నారు.

"అమ్మాయీ ఆయన్ను నీవెరుగుదువా?"

"ఎరుగుదునండి"

"నీకూ ఆయనకు సంబంధం?"

"ఆయన మా మేనమామ"

"అంతేనా?"

"నాకుభర్తగూడా"

"ఆయనతో నీవు కాపురం ఎందుకు మానుకున్నట్టు?"

విశాల మౌనందాల్చింది.

"పోనీ— ఇప్పుడు ఆయనతో కలసిమెలసి వుండడానికి నీ కభ్యంతరం?"

"ఏ...మీ...లేదు. —వకీలు త్రుళ్ళిపడ్డాడు—

"లేనేలేదా?"

"లేదండి" గట్టిగా చెప్పింది. మేష్టారి అనుమానాన్ని ఈ మూడక్షరాలు నివృత్తిచేశాయి.

"బాగా ఆలోచించుకు చెప్పవమ్మా" న్యాయాధిపతి గద్దించారు.

"అయ్యా— నేను బాగా ఆలోచించుకునే చెబుతున్నాను. నాభర్తలో నేను కాపురం చేసుకోవడానికి నాకెట్టి అభ్యంతరము లేదు" స్పష్టపరిచింది విశాల స్థిరచిత్తంతో.

"మరైతే ఈ దావా ఎందుకు చేసినట్టు" ఉరిమినట్టు గర్జించాడు వకీలు కళ్లెర్రజేసి. విశాలమౌనం దాల్చడం ఆమెవైపు వక్కీలును చెంపమీద కొట్టినట్టయింది.

"నేను ఈ దావాను బర్తరఫ్ చేస్తున్నాను" తీర్పు చెప్పేసి లేచాడు న్యాయాధిపతి. వకీళ్లు వెలవెలబోతూ ఒకరిముఖాలొకరు చూసుకుంటున్నారు. "శభాష్— భలేబాగా చెప్పిందిరా" అంటూ ప్రేక్షకుల్లో కలకలం అధికమయ్యింది. మేష్టారుపడుతున్న ఆశ్చర్యానికి అంతు లేదు. సుశీల మిక్కిలిగా ఆనందంపొందింది.

"కేసు అభాసు చేశావు. ఇంతదానికి దావాగూడా తగలెయ్యడమెందుకూ. సరే—కాపురంచేసుకో మొగుడుతో" రుసరుసలాడుతూ విశాలవకీలు వెళ్ళిపోయాడు బయటకు. ఆమెతండ్రికి ఎటూపాలుపోవడం లేదు.

సుశీల జట్కాబండి కుదిర్చింది విద్యాలయానికి. విశాల, సుశీల, మేష్టారు ముగ్గురు చటుక్కున బండి ఎక్కెయ్యడం, ఒకకొరడాదెబ్బతో జట్కాను గుర్రం పరుగున లాక్కుపోవడం చూపు ఆనినంతవరకు మ్రాన్పడి పరికిస్తున్న మేష్టారి బావగారినిచూసి చుట్టూమూగినజనం నవ్వుకున్నారు. అతిగాడికెంతైనా కోపంవచ్చింది. సుశీలమీద, బావమరదిమీద, మించి విశాలమీద, అంతకుమించి తననుచూస్తూ తనదురవస్థకు సానుభూతినైనా ప్రకటించక విరగబడినవ్వే జనంమీద—అయితే ఆక్షణంలో దాన్ని వ్యక్తం చెయ్యడం ఎలాగో అర్థంగాలేదు. ఇది ఆయనకు భరింపరాని అవమానం పాపం! ఆగ్రహాస్తు కనులవెంట నీళ్లుగారినా పరిసరసమాజానికి జాలికలుగలేదు. మరి అతిగాడుచేసిన నేరమెంతటిదో కాని!!

* * * *

విద్యాలయంలో క్రిందిభాగంలో విశాలాక్షికి పైన కమలకీ ఉండేటందుకు కేటాయించబడింది. విద్యార్థులహోలును పాఠశాలగా మార్చుకున్నారు. అనుకోకుండా తమ సంసారంలోవచ్చిన మార్పుకు మేష్టారు అమితంగా ఆనందిస్తున్నారు. సుశీలకృత్యంవల్ల విశాల, కమల పరస్పరమూ ఎట్టిస్పర్థలు లేక పాతకొత్తలవలె కలిసిమెలసి బ్రతుకును సుగమం చేసుకున్నారు. ఒకనాడు సుశీల ప్రబోధించిన మేలు కలయికను మేష్టారి అనుభూతి ప్రదర్శిస్తోంది. తన తల్లిదండ్రులు నూరిపోసిన సంకుచిత స్వార్థభావాలకు, ఛాందసత్వానికి తనకుగా తాను చిన్ననాటినుండి గుణించుకొన్న మూఢవిశ్వాసాలకు క్రమేపీ విశాలాక్షి తిలాంజలి ఇవ్వగలిగింది. రోజురోజుకు తనకళ్లెదుట మార్పుచెందుతున్న క్రొంగ్రొత్త పోకడలతోబాటు విశృంఖలంగా విజృంభించే విప్లవాత్మక భావాల్ని కమల అదుపులో పెట్టుకోగలిగింది.

విద్యాలయ వార్షికోత్సవ సభాసమావేశంలో ప్రసంగిస్తూ కొందరు "సుశీల తన సంయమనంతోను, త్యాగదీక్షలతోను ప్రాచీన విద్యాలయాన్ని సంస్కరించి, ఒడిదుడుకులలోపడి నలిగిపోనున్న అధ్యాపకుల జీవితాన్ని చక్కబరిచింద"ని శ్లాఘించారు. మేష్టారు గూడా సుశీలను ప్రస్తుతించారు. ఈఆచరణలో తనపై వేసిన నీలాపనిందలను సరకుసేయకుండా ఆదర్శసిద్ధికి ఎలాకృషిచేసిందో వర్ణించారు. సుశీల దానికి ప్రత్యుత్తరంగా "మీరింతగా ప్రశంసించడానికి నాలో ఆధిక్యత ఏమీ లేదు. నా బ్రతుకును, నా ప్రవర్తనను లోకం అనుమానించింది. తన్నివృత్తికి నాకు భగవంతుడు చూపినమార్గాన శ్రమించి కర్తవ్యం నిర్వహించాను. దైవకృపవల్ల విజయం సాధించగలిగాను. నివృత్తితోబాటు నవజీవనంకూడా విద్యాలయానికి ప్రసాదించబడింది. నేను స్వార్థంకోసమే పాటుబడ్డా సంకల్పంలో దోషంలేనందువల్ల పెక్కుసత్ఫలితాలు సిద్ధించాయి. మనకీనాటి సౌభాగ్యాల్ని ప్రసాదించిన దేవదేవుని మనమంతా సంస్తుతిద్దాం" అనగా సభాస్థలి అంతా కరతాళధ్వనులతో ప్రతిధ్వనించింది. ఈ విజయోత్సవంలో తన తల్లిదండ్రులు సంతోషంలో పాల్గొనడం 'వీళ్లెప్పటికైనా మారుతారా' అనుకొన్న విశాలసందేహాన్ని వెంటనే నివృత్తిచేసింది.

ఉద్యోగాలు

శ్రీ బలివాడ కాంతారావు

ఒకప్పుడు "అలాంటి ఉపకారి మరి పుట్టబోడని" అన్న పెద్దమనిషే ఇప్పుడు ప్రకాశరావును గురించి "ఆఫీసరై కూర్చున్నాక కళ్లు నెత్తిమీది కొచ్చాయని" నలుగుర్లో దూషించాడు. మొన్న తన మేనల్లుడి వుద్యోగంవిషయం తన ఇంటికి వెళ్తే ప్రకాశరావు క్రుద్ధుడై "ఇలా పెరటిత్రోవన వచ్చే బదులు అంగటిత్రోవను వీరునిలా వచ్చి వుద్యోగంలో చేరకూడదూ" అని మందలించాడట!

ప్రకాశరావు చాలా పేద కుటుంబంలో పుట్టాడు. చదువుకున్నది మెట్రిక్. చేరింది గుమస్తాగిరిలో. కానీ తన సహజమైన తెలివితేటలతోనూ, వినయ సంస్కారాలతోనూ అతి చురుకుగా పైకి లేచాడు. తను ఆఫీసరై సంవత్సరం రెండు నెలలే అయింది. ఆఫీసరుగా లేనివాడు కూడా తన దగ్గరకు ఎందరో వుద్యోగాలవిషయంలో వచ్చేవారు. ప్రాధేయపడి తమ కష్టాలను చెప్పుకునేవారు. ఆయన శాంతిస్వభావం, కష్టాలను చెప్పుకునేటప్పుడు చూపే సానుభూతి, యెదుటవాళ్ళను, ఒకప్పుడు వుద్యోగాలు చూపించలేకపోయినా, సంతుష్టిపరచేది. వుద్యోగం ఇప్పించలేదని యీర్ష్య చూపించేవారు కాదు.

ఏమి చేసినా కేవలం పరోపకార దృష్టితోనే చేశాడు. తన దగ్గర బంధువులు తిప్పించి ఎటువంటి వారు వెళ్ళినా చేతకాదు అనకుండా యేదో చూద్దాం అనేవాడు. ఆ మాట ఆయన నోటి వెంబడి వచ్చిందీ అంటే సరి ఉద్యోగం దొరికిందన్నమాటే! ఎవరైనా తప్పి జారీ డబ్బు ఇస్తే పుచ్చుకోడని యేమైనా పళ్ళూ కాయలూ పంపిస్తే తిరిగి పంపించేసేవాడు. ఇంట్లో తనూ, భార్య, యిద్దరు పిల్లలుకాక పెద్దతండ్రి పిల్లవాడొకడు, పేదవారైన దూరపుబంధువుల పిల్లలు యిద్దరూ చదువుకు ఉన్నారు. ఉద్యోగం పెరుగుతున్నకొద్దీ ఖర్చు ఇలాంటి విషయాల్లో పెరుగుతునే వుంది. ఎవరో యే మారుమూల నుంచో ఉత్తరాలు వ్రాస్తుంటారు—ఏదో బంధుత్వంకూడా కల్పిస్తుంటారు. అందులో చాలా పొగిడి వ్రాస్తుంటారు. ఈ రకం ఉత్తరాల్లో ఉద్యోగం లేని యువకులు, యెవరూ అక్కరచెయ్యని ముదుసలులు కూడా ఉంటారు. తనకు తోచిన సహాయం యెవరికీ తెలియకుండా చేయటమే తన పని. తనకు ఒకటే గర్వం—ఇటువంటి విషయాల్లో అడ్డు తగలకుండా చేయూతనిచ్చే అర్థాంగి దొరికిందని! తను డబ్బు లేక చికాకు పడే రోజులు లేకపోలేదు – ఉద్యోగం పెద్దదికదా ఆ మాత్రం అడిగితే అప్పు యివ్వడా అని తెలిసినవాళ్లు వస్తే తను తెల్లమొగం వేస్తే భార్య ఇంటి ఖర్చుల్లో పొదుపు చేసింది సర్దుబాటు చేస్తోంది!

ఇలా తను బ్రతుకుతూ చుట్టూ వున్నవాళ్లకూడా బ్రతకాలనే పట్టుదలతో తనకు తోచిన సహాయం చేసి గౌరవంగా బ్రతుకుతున్న ప్రకాశరావు యిప్పుడిలా యెందుకు మారాలి? ఇంత శాంతమూర్తి, తన ముఖం చూడగానే ఎవరికోపమైనా పటాపంచలౌతుందే అలాంటివాడు ఎవరైనా ఉద్యోగంకోసం వెళ్తే ఖస్సుమంటాడేం? తన్ను గౌరవించే పెద్దలను వెంటబెట్టుకొని వెళ్లినా చికాకుపడి లేదని సమాధానం చెప్పగల పరిస్థితి వచ్చిందేం? ఇతను గాఢంగా ప్రేమించే యిల్లాలిద్వారాకూడా చెప్పించలేక పోతున్నారు! ఇదివరకు తను ఒకరికి చెప్పి యెందరినో వుద్యోగాలలో వేయించాడు. ఇప్పుడు తను ఒకర్ని ఉద్యోగంలో వెయ్యాలంటే వెయ్యగల స్థానంలో వున్నాడు.

కొంతమంది తను డబ్బుకు ఇబ్బందిపడుతున్నట్లు తెలుసుకొని రాత్రిమీద యింటికి వెళ్తే "వెంటనే బయటికి పోతారా లేక పోలీసులను పిలిపించమంటారా?" అని జడిపించాడు.

ఆ పెద్దమనిషి కళ్ళు నెత్తిమీదికి వచ్చాయన్నాడని తెలిసింది. ఇంకా ఊళ్లో యెందరో తనను దుమ్మెత్తిపోస్తున్నారని వీరు వారు చెవిలో వేస్తున్నారు. తెలుగువాడికి సింహాసనంమీద కూర్చునే అర్హత యెక్కడుంది? అదే ఇంకో తెగవాడైతేయీ సరికి ఆ తెగవా రెందరినో ఉద్యోగాలలో వేయించే వాడని తన చెవుల్లో పడేటట్లు అనుకుంటున్నారు. రాను రాను యీ దూషణలు హెచ్చిపోతున్నయ్. తను ఇదివరకు ప్రజల్లో ఎంతగౌరవంగా బ్రతికి వాళ్ళ గౌరవానికి పాత్రుడయ్యాడో ఇప్పుడు అంత అధ్వాన్నంగా వారిచేతనే దూషింపబడుతున్నాడు. పై అధికారులకు, తనపై పక్షపాతం, లంచాలు మొదలైన అబద్ధాల పుట్టలను సృష్టించి, ఆకాశరామన్న ఉత్తరాలు వ్రాస్తున్నారు.

ప్రకాశరావు మొదట్లో కొంత బాధపడినా వెనువెంటనే గతంలోని గొప్పవాళ్ళ జీవితాలు జ్ఞప్తికి వచ్చి ధైర్యాన్నీ స్థైర్యాన్నీ చేకూర్చేవి. తనలో తనే ధర్మాధర్మ విచక్షణ చేసుకునేవాడు. ఉద్యోగాల విషయంలో తప్పించి యింకేవిషయంలోనూ తను మారలేదని ధైర్యంతో వుండేవాడు. ఎవరైనా ఉద్యోగం విషయం తప్పించి యింకే విషయంలో వచ్చినా ఇదివరకు కన్న యెక్కువగా గౌరవించి సత్కరిస్తున్నాడు.

అయితే ప్రకాశరావును యిలా మార్పించడానికి యేదైనా బలమైన సంఘటన జరిగిందా అంటే జరిగిందనే చెప్పాలి! అది తను ఆఫీసరు అయ్యాక మొదటి నెలలోనే ఐదే ఐదు ఖాళీలు ఒకే శాఖలో వచ్చాయి. 'ఎంప్లాయింమెంట్ ఏక్స్చేంజి' ద్వారాయేభైమంది యింటర్వ్యూకు వచ్చారు. తనే ఐదుగుర్ని వాళ్ళ మార్కుల ప్రకారం యెంచుకున్నాడు. రేపు లిస్టు పంపిస్తాననగా ఆ రాత్రి ఒక ముసలాయన తన ఇంటికి వచ్చాడు. స్వగ్రామంలోవున్న ప్రకాశరావు తండ్రి దగ్గరనుంచి ఒక సిఫారసు ఉత్తరం తెచ్చాడు. అతి వినయంగా చేతులు నలుపుతూ ఆ ముసలాయన అన్నాడు. "బాబూ! అనాడు మీ తండ్రికి గడవని రోజుల్లో యెలా చూశానో ఆ పరమాత్ముడికెరుక! నువ్వు పాలులేక గిజగిజ గింజుకుంటుంటే ఆ రాత్రి మీద ఆవుపాలు పితికి యిచ్చేవాడిని. అంతా సరి—చితికిపోయాను. ఇంకా పెళ్ళికి ముగ్గురు ఆడపిల్లలున్నారు. ఉన్న ఒక మొగపిల్లవాడికి ఉద్యోగం సద్యోగం లేదు. యింకా నెలరోజుల్లో వాడి వయసు కూడా మించిపోయి యే గవర్నమెంటు నౌఖరీకి పనికి రాదు. ఈ రోజుల్లో యెంత తెలివితేటలున్నా పనికి రావు—ఎవరో చేపట్టేవాడుండాలి. నీవు ధర్మం కట్టుకోకపోతే యింక బ్రతుకుమీద ఆశ చాలించుకోవాలి..." ఈ ధోరణిలో ఏదో చూద్దాం అన్నా ఆ చూద్దాం అన్నమాట ప్రకాశరావు నోటివెంబడి వచ్చిందంటే యేమిటో అర్థం తెలుసుకోలేని ముసలాయన చాలా రాత్రివరకూ బ్రతిమాలాడు.

మరుసటిరోజు వుదయం ముసలాయన కొడుకు పేరు చూస్తే నలభయ్యోవరుసలో వున్నాడు. ముసలాయన కష్టాలే తన మనస్సులో తిరగటంవల్ల జాలివేసి యిదివరకు మెరిట్ ప్రకారం యెంచిన ఐదు పేర్లలో చివరిపేరు తీసి యీ పేరు వేశాడు. ఈ యైదుగురూ ఉద్యోగాలలో చేరారు.

ఆ వారం రోజుల్లోనే ఆఫీసులో తన్ను చూడటానికి ఒక వ్యక్తి వచ్చాడు. రాగానే నమస్కరించాడు. మనిషి చిక్కిపోయి ఉండటంచేత వెంటనే ప్రకాశరావు జాలిగా "జబ్బుపడ్డారా?" అన్నాడు.

"లేదు బాబూ!" అంతలో ఆపగానే గ్రహించిన ప్రకాశరావు "అయ్యో! పాపం! నేను రోజూ ఆఫీసుకు వస్తుంటే ఆ త్రోవలోనేగా మీ యిల్లు మిమ్మల్ని చూస్తుంటాను—ఇంకెక్కడో చూసినట్లు కూడా..."

"ఇక్కడే......"

"అవునవును......మీరు క్రిందటి నెలలో యింటర్వ్యూకి వచ్చారుకదూ?"

"అవును బాబూ! నాకు చాలామంది చెప్పారు- నా బాధలు చూడలేక మిమ్మల్ని ఇంటర్వ్యూకి వెళ్ళక ముందు కలుసుకొని నా బాధలు చెప్పుకుంటే మీరు తప్పక కనికరిస్తారని......"

ప్రకాశరావు జాలిగా చూశాడు. ఆవ్యక్తి అతి దీనమైన స్వరంలో స్వవిషయం చెప్పుకపోతున్నాడు-

"ఎస్. ఎస్. ఎల్. సి. ప్యాసయిన వెంటనే నాకు పెళ్ళిచేశారు. పై చదువు చదువటానికి వుబలాటమే కాని డబ్బులేదు. ఎక్కడా సరియైన ఉద్యోగం లేదు. చేసినా రెండుమూడు నెలలే. అప్పుడే నాకు ఇద్దరు

పిల్లలు బాబూ! నాకు కొద్దిగా సాహిత్యంతో పరిచయమేర్పడింది. ఈ కటిక దారిద్ర్యంతోనే కథలు వ్రాస్తున్నాను. దానివల్ల వచ్చే రాబడి శూన్యమనే చెప్పొచ్చు. దానిమీద బ్రతుకుతాననే ఆశలేదు. నేను అసలు రాయటానికే బ్రతుకున్నాను! నేను బ్రతకాలంటే తిండికావాలి—దానికోసం డబ్బుండాలి—డబ్బుకోసం నేను వుద్యోగంచెయ్యాలి."

అలా చెప్తానే ఆవేశంలో గొంతుక పట్టుకపోయింది. మళ్ళీ ప్రయత్నంమీద సవరించుకుంటూ "ఉద్యోగంకోసం అందుకే నా ప్రాకులాట. అంతా మిమ్మల్ని చూడమన్నారు—కానీ నా మనసు యీ దొంగతనానికి మనస్కరించలేదు. నా తాలూకు శక్తి సామర్థ్యాలు చూపించి అందరిలో నిల్చుంటే న్యాయాన్ని ధర్మాన్ని నిలిపే మీలాంటి అధికారుల హృదయాలు అన్యాయానికి పాల్పడవని నాకు తెలుసు. అంచేతనే నేను మిమ్మల్ని ముందుగా చూడలేదు. కాని నా దురదృష్టవశాత్తూ ఆయేభైమందిలో యెందరో పట్టభద్రులున్నారు—నాకంటే తెలివైనవారున్నారు. వాళ్ళకు ఉద్యోగాలు దొరికాయి. లోకం యింత పచ్చగా వున్నప్పుడు పేదరికంచేత చచ్చిపోవటం అంటే బాధగా వుంటుంది. బహుశః అలా చచ్చిపోతానన్న క్షణంలో చేసిన ధైర్యమే యిలా తీసుకవచ్చింది."

ఆయాసంతో అలసిపోతున్న ఈ వ్యక్తివైపు చూశాను. కళ్ళల్లో నీళ్లు అలముకొనివున్నాయి. ప్రకాశరావు శాంతంగా మీ పేరు అన్నాడు.

"ఎస్. సత్యనారాయణ."

"సరే! ఓక్షణం బయట ఉండండి" అని తను యింటర్వ్యూ కాగితాలు తీశాడు. సరిగ్గా తను తీసివేసిన ఐదోవ్యక్తే యితను. ఇతని పేరు తీసివేసే ముసలివాని కొడుకును వేసుకున్నాడు.

ఒక్కసారి మనస్సు చివుక్కుమన్నట్లయింది. ఈతని కష్టాలే యిదివరకు తెలిసివుంటే అంతపని చెయ్యలేక పోయేవాణ్ణే అనుకున్నాడు. ఉద్యోగాలు వేసుకోవటంలో ఒకపద్ధతి అంటూ పెట్టుకున్నాక ఆ పద్ధతినే అనుసరించకుండా వ్యక్తుల కష్టాలతో ఉద్యోగాలు ముడిపెట్టటం సబబు కాదని యిదివరకు అనుకున్నా యిప్పుడు నిర్ధారణకు వచ్చినట్లయింది. ఉద్యోగాలకు వచ్చిన వందలాదిలో ఎవరికష్టాలు వాళ్లకే వుంటాయి-కష్టాలనేవి హెచ్చుతగ్గులూ భరించే వ్యక్తుల బట్టే వుంటాయిగానీ కష్టాలన్నీ నిజానికి ఒకేస్థాయిలోనివే!

మళ్లీ సత్యన్నారాయణను పిలిచి "ప్రస్తుతానికి నేనేమీ చెయ్యలేను. మిమ్మల్ని దృష్టిలో పెట్టుకుంటానని చెప్పగలను—అందాక ఒకస్నేహితుడు అవసరానికి ఆదుకున్నాడని యీ పదిరూపాయలూ తీసుకవెళ్లండి"ని యిచ్చాడు.

సత్యన్నారాయణ పుచ్చుకోలేదు.

"సంశయిస్తున్నారా! ఫరవాలేదు—ఒక మిత్రుణ్ణి కాదన గలరా!"

సత్యన్నారాయణ చేతులు వణకడంచూసి ప్రకాశరావు "పోనీ! నాదగ్గర అప్పుతీసుకువెళ్లండి. ఎప్పుడో మీకు కలిగిన్నాడు తిరిగి యిచ్చివేయండి."

అనగానే ఆ పదిరూపాయిలు మౌనంగా తీసుకొని అలానిల్చున్నాడు. ప్రకాశరావు ప్రశ్నార్థకంగా చూడగానే సత్యన్నారాయణ మెల్లగా "క్షమించండి మీ కాలాన్ని చాలావరకు నాకష్టాలను చెప్పుకొని తీసుకున్నాను"

"అబ్బే!"

"ఒక్క కోరిక" అన్నాడు.

"చెప్పండి—సంశయించకండి"

"మరేమీ లేదు! అంతమంది యింటర్వ్యూకి వచ్చారుకదా పరీక్షలో వాళ్లలో నాస్థానం తెలుసుకో వచ్చా అని..."

ఓ క్షణకాలం ప్రకాశరావుముఖం యెర్రబడిపోయింది. మనస్సులో మథన ప్రారంభమైనా యీ యువకుడెదుర తన తల యెత్తుకు నిలబడాలనే వుబలాటంతో "క్షమించండి! ఇటువంటివి అధికారీరత్యా గాని చెప్పకూడదు!" అన్నాడు.

"ఒక స్నేహితునిగా భావించి పదిరూపాయలు అప్పుకూడా యిచ్చారు. అంచేత అనధికార రీత్యా చెప్తారనే వుబలాటంకొద్దీ మిమ్మల్ని కష్టపెట్టి వుంటాను. క్షమించండి" అంటూ వెళ్లిపోయాడు.

ప్రకాశరావు ఆవేళంతా యేపనీ ముట్టుకోలేదు. ఇంటికివెళ్లినా, వాకిట వాలుకుర్చీ వేసుకొని కూలబడిపోయాడు.

ఆ వారంరోజుల్లో ఆఫీసుకువెళ్ళేటప్పుడు వచ్చేటప్పుడూ ఆ యింటి వేపు చూసినా సత్యనారాయణ కనపడలేదు. నెలరోజులుదాటినా, రోజూ తన తలపుకు వచ్చినా సత్యనారాయణ అగపడలేదు. ఎంత తొందరగా యీయనకు ఉద్యోగం చూపిద్దామని ఆతృత పడ్డా సరియైన ఉద్యోగం ఖాళీ రాలేదు.

ఒకనాడు ఉదయం పదకొండుగంటలకు ఆఫీసులో ఉండగా బంట్రోతు ఒక కవరుతెచ్చి టేబిలు మీద యెదరగా పెట్టాడు. "పేరుచెప్పకుండా దొరగారికి యిచ్చేయమని చెప్పారు" అన్నాడు బంట్రోతు. ప్రకాశరావు కవరువిప్పి "ఆయనను వేగంగా పిలుచుకురా" అన్నాడు. బంట్రోతు హడావుడి వృథా అయింది. ఆ చుట్టుపట్టున సత్యనారాయణ ఎక్కడా అగుపించలేదు. ఆ వుత్తరంలో యిలావుంది:—

"మిత్రులు ప్రకాశరావుగారికి సత్యనారాయణ నమస్కరించి వ్రాయునది:—

ఆవేళ ఆఫీసులో మిమ్మల్ని కలుసుకున్న నాటి నుంచీ నామనస్సు బాధపడుతోంది. నాకు నేనే దొంగనై పోయాను. ప్రతిక్షణం నాలో యెవరో నా నీచత్వాన్ని ఎత్తిపొడుస్తూనే వున్నారు. నేను నా కథల్లోనిజాయితీ, సత్యం, ధర్మం, న్యాయం అనే వున్నత ఆదర్శాలను పాఠకులకు బోధిస్తాను. నేనుచేసే బోధనలకు నాప్రవర్తనలకు సామ్యం లేకపోతే నేను రచయితనని అనిపించుకో అక్కర్లేదు—నిజానికి నేను కలం ముట్టుకోనక్కర్లేదు. నేను చేసినపని ప్రతిక్షణం పశ్చాత్తాపపడునట్లుచేసి సిగ్గుతో మీకు ముఖం చూపించకుండా చేసింది! జీవితం అంటే కడుపే కాదు అది నీతి నియమములకు కూడా స్థానం అని నానమ్మిక" ఇక నా కష్టాలంటారా? రచయిత కష్టపడాలి—తనకు జీవితకాలం ఆవేదనే. ఆ ఆవేదనే లేకపోతే కోటిజీవుల ఆవేదనను గుర్తించలేడు - కష్టపడకపోతే హృదయం నుంచి చెప్పలేడు. హృదయంనుంచి చెప్పలేనివాడు నిజమైన రచయిత కానేకాడు. ఒక చక్రవర్తి హృదయాలాపమే యీ ప్రపంచంలో యిప్పటికీ సాటిలేని సుందరమైన మహల్ ని సృష్టించింది! అలాగే కలకాలం నిల్చేదదైనా నా హృదయంనుంచే సృష్టింపబడాలి. అంచేత, నా కీకష్టాలే బలాన్ని చేకూరుస్తున్నాయి - ఆలోచనలు పుంఖానుపుంఖంగా వస్తున్నాయ్. నా కీప్రపంచమే పెద్దగ్రంథాలయం. ఇందులో ప్రతీవ్యక్తీ ఒకగ్రంథం. ప్రతిగ్రంథం చదివితే యెలా మనసు వికసించి క్రొత్తక్రొత్త విషయాలు తెలుస్తాయో అలానే ప్రతివ్యక్తినీ పరిశీలిస్తే నా కలాంటి వికాసం కలుగుతుంది. నాచుట్టూ వున్నవాళ్లు ఆధారంగా నవల వ్రాస్తున్నాను- అందులో మిమ్మల్ని ఒక పాత్రగా తీసుకుంటున్నందుకు మీరు అభ్యంతరం పెట్టరని నాకు తెలుసు-దీనికోసం రాత్రింపగళ్ళూ కష్టపడుతున్నాను. నా ఆరోగ్యం యేమైనాసరే—నాకుటుంబం యేమైనాసరే...నన్ను ఆవరించి నాలో యేదో దేవత్వాన్ని చొప్పించి పొంగిపొరలించే ఆనందంతో ఉత్సాహంతో నన్నీపనికి పూనించిన ఆ కవితామతల్లికి పుష్పాంజలులు ఘటించకుండా యెలావుంటాను? ప్రకాశరావుగారూ! నేనేమీ వ్రాయలేదండీ! నేనెవణ్ణి వ్రాయడానికి?—ఆక్షణాల్లో ఆమే ఒక తేజస్సులావచ్చి నాలోచొచ్చి...తరవాత నేవ్రాసింది నేనే చదివి..."ఇది నేనేవ్రాశానా"అని ఆశ్చర్యం చెందుతుంటాను. కోటిమానవులు వారి కర్మని వారు అనుభవించుతుంటే వాళ్ల బాగోగులనుబట్టి వాళ్ళని గౌరవంచేసే మనం—అందులో నేనుకూడా ఒకణ్ణి, మంచివాణ్ణి భూషించి చెడ్డవాణ్ణి దూషించడానికి అలవాటుపడిన కోట్లకొలది మానవుల్లో ఒకడిని—ఒక న్యాయాధిపతిలా ప్రతిపాత్రను అలా తనబాటనుండా పోనిచ్చి చివరకు ప్రతిమానవుడిలోనూ మానవత్వం వుందని యెలా నిరూపించగలను?—అది నాసృష్టి యెలా ఔతుంది? రానురాను నా నిష్కల్మషమైన మనసులో ఆమెకు నే బ్రతికినంతకాలం స్థానం యేర్పరచుకో గలిగితే అంతకంటే భాగ్యం నాకింకేం కావాలి?

నా ఆవేశంలో ఆనందంలో యింతవరకూ వ్రాసుకున్నాను. నేనువ్రాసిన ఒక కథకువచ్చినదీ పదిరూపాయల కాగితం! కృతజ్ఞతతో ఈకవరులో పెట్టి అప్పు తీర్చుకుంటున్నాను. నా ఉద్యోగం విషయం మీకు శ్రమ పెట్టకూడదనే నిశ్చయమే యీవుత్తరాన్ని వ్రాయించింది. ఎప్పుడోమళ్ళీ నేను అంగట్రోవ రాగలిగినప్పుడే వుద్యోగం చేస్తాను—అవసరమైతే!

భవదీయుడు
సత్యనారాయణ."

ప్రకాశరావు వుత్తరం మళ్లీ రెండుసార్లు చదివాడు. ఆనాడు మాసినబట్టలలో చింపిరిజుత్తుతో నీర

సంగాఉన్న వ్యక్తిలో యిలాంటి గుణగణాలున్నాయని పొరపాటునైనా వూహించలేదు. అతను నరకాన్ని స్వర్గంచేసుకు నే వ్యక్తనితోచింది. అయనను తను సుఖ పెట్టామన్న ఊహ తుడిచిపెట్టి అయన కుటుంబానికెలా సహాయం చెయ్యాలనే పట్టుదల తనలో చొచ్చుక పోయింది. అలాంటి ఖాళీయేవచ్చినప్పుడు సత్యనారాయణను ఆఫీసుకు తీసుకవచ్చి తనుచేసిన తప్పిదం ఒప్పుకొని మరీ ఉద్యోగం యివ్వాలని నిశ్చయించుకున్నాడు. అప్పుడు ఆ నవలలో తనపాత్రకు తను న్యాయంచేసిన వాడౌతానని అనుకున్నాడు.

రెండు నెలలు గడిచిపోయాయి. సత్యనారాయణ ఒక్కసారీ కనిపించలేదు. ప్రకాశరావుకు వాళ్ళ ఇంటికివెళ్ళి పిలవటానికి యెందుకో అనుమానం వేసింది. తనముఖం ఊరకనే ఆయనకు యెలా చూపించటమని వెళ్ళలేకయాడు.

ఒకనాటిఉదయం ఎండ తీక్షణంగా కాస్తోంది. ఆఫీసుకు ప్రకాశరావువెళ్తూ అంతదూరంనుంచే మామూలుగా సత్యనారాయణఇంటివేపు చూశాడు. అక్కడ చాలామందిజనం మూగివున్నారు. ఆజనంలో కాషాయవస్త్రాలలో నిల్చున్న ప్రేమసమాజీకులను కూడా చూచి గబగబ అక్కడకు వెళ్లాడు.

వాకిట కట్టెమీద సత్యనారాయణ! ఆకట్టెమీద యిల్లాలు యిద్దరుపిల్లలు తలకొట్టుకొని బావురుమంటున్నారు. పెద్దపిల్ల నాన్నా నాన్నా అని గోలపెడ్తోంది. శాశ్వతి నిద్రపోయిన ఆముఖం అరుణింపులో చిరునగవుతో మెరుస్తున్నట్లుంది! ప్రకాశరావుగుండె కంపించింది. అక్కడిమనుష్యులను తప్పించుకొని కట్టెదగ్గరకు వెళ్లాడు. చుట్టూవున్నవాళ్లతనికేసి సగౌరవంగా చూస్తున్నారు. ఆబిడ్డలనుతీసి ఎత్తుకొని యింట్లో కూర్చోబెట్టినా గోలగా ముందుకుపరుగుతూ దొర్లుతూ వస్తున్నారు. అప్పుడు ఇరుగుపొరుగు అమ్మలక్కలు సత్యనారాయణ భార్యను ప్రక్కకుతీశారు. తను ఒక ప్రక్కకొశాడు. కట్టెకదిలిపోతుంటే అంతదూరం శోకంతో పరువత్తే ఆ యిల్లాలిని ఆపలేకపోయారు.

తిరిగివచ్చాడు. ఇరుగుపొరుగు మనిషోమాట. "తిండి తిప్పలువుంటేనా—ఏదోవున్న నాకు వేళకు యిన్ని మెతుకులు నమిలాడా? నీరసంగావున్నా ఆకాగితం కలంఒదిలాడా? ఒంట్లో జీవంలేనిది యిలాంటిపనులుచేస్తే... రాత్రిమీద రాస్తూ రాస్తూగుండె ఆగిపోయింది! పెళ్లాం పిల్లలు వున్నారని ఏదో వుద్యోగం సద్యోగం చేసి తరవాత అదేదో రాయ కూడదా?...సమయానికి ఆ ధర్మరాజు ఆదుకోకపోతే యిలా తల్లీ పిల్లలూ సముద్రంలో పడాలి గానీ ఇంకేం ఆదరువుఉంది"—ఈమాటలన్నీ ప్రకాశరావు విన్నాడు. సత్యనారాయణ యింటిపొరుగు వాకిట నిల్చొని ఒక వయసుమళ్ళిన వితంతువుంది. సహాయం చెయ్యడానికి ముందుకొచ్చే మనిషి. పెద్ద పిల్లను బుజ్జగించి అన్నంతినేటట్లు చేశాడు. చిన్నపిల్లకు ఆవిడ చేతనే పాలు పట్టించాడు. రెండు రోజులు దగ్గర వుండమ్మా అని ఆమెచేతి కొంతడబ్బు యిచ్చి యింటికి వెళ్ళాడు.

చీకటి పడ్డవరకూ దిగులుగా ఒక దగ్గర కూర్చున్నాడు. మూడుసార్లు భార్య యెందుకలా వున్నారని తర్కించితే చిరాకు పడగానే ఆమెదగ్గరకు రాలేదు. తరువాత వాకిట వాలుకుర్చీమీద కూర్చున్నాడు. ఆ రోజు చూచిన దృశ్యాలన్నీ మళ్ళీ అగుపిస్తున్నాయ్. ఆ పిల్ల, తండ్రి శవంమీద పడి "నాన్నా... నాన్నా..." అని గగ్గోలు పెడుతున్న దృశ్యం—నిజంగా తను యేడుస్తున్నాడు. ఇప్పుడూ కళ్లు చెమ్మగిలి పోయాయి. మనసు త్రిప్పాలనే ప్రయత్నంతో తల పైకెత్తాడు. చందమామ లేనిరాత్రి—ఆకాశం నక్షత్రాలతో నిండిపోయివుంది. ఓక్షణం రెక్కలు కట్టుకొని అనంత విశ్వంలోనికి ఎగిరి ఆ లోకాలన్నీ విహరించినట్లయింది. సత్యనారాయణ అగుపిస్తున్నాడు. మానవత్వం అనే త్రాసులో యింత కీర్తి ప్రతిష్ఠలు గడించుకున్న తను—ఒక మారుమూల అనామధేయుడుగా చింకి గుడ్డలతో పేదరికంతో పడివుండిన సత్యనారాయణను వేస్తే ఆ మిత్రునివేపే మొగ్గ కనిపిస్తోంది! నిజంగా తను ఆయనదగ్గర నేర్చుకోవలసినదంతైనావుందనుకున్నాడు. బహుశః తను యెలా వుండాలో నవలలో కొంతవరకైనా వ్రాసి వుంటాడు.

భార్య చాలసేపటినుంచి తన దగ్గరనే కూర్చుందని గమనించలేదు. ఆమె ప్రాధేయపూర్వకంగా "భోజనానికి రారా?" అని అడగ్గానే ఉలిక్కిపడి చూశాడు.

"భోజనమా?...వద్దు!" అన్నాడు.

"మీరు భోజనం చెయ్యలేదని పిల్లలుకూడా..."

చప్పున సత్యనారాయణకు అపిల్లల పరిస్థితీ యిలాగే వుంటుందేమో అని తట్టింది. లేచాడు నాలుగు మెతు

కులు పడిలి లేచిపోయాడు. అర్ధరాత్రి వరకూ ప్రయత్నించినా నిద్దర రాలేదు. భార్య కన్నీరు తెచ్చుకోవటం చూచి "ఒక నిజమైన ఉదారుడైన స్నేహితుడు పోయాడు. ఆయనకూ నాలాగే పెళ్ళాం యిద్దరు పిల్లలూ వున్నారు......ఆకలితో చచ్చి పోయాడు—ఆ ఆకలి నేనే కల్పించాను—నేనే ఆయన చావుకు కారకుడయ్యాను......"

బొలబొలా కన్నీరు కారుతోంది. భార్య యెదురగా కాసింతైనా సిగ్గు పడలేదు—వెక్కి వెక్కి యేడ్చేస్తున్నాడు—ఆ యేడుపుతోనే "ఇదిగో నీ యెదుట ఆయనసాక్షిగా ఒట్టు వేసుకుంటున్నాను...నాజీవితంలో మళ్లీ యిలాంటి పాపాన్ని వడిగట్టుకోను...లోకం అంతా నామీద దుమ్మెత్తిపోసినా...న్యాయం ధర్మమే నా దీక్ష—నిజాయితీ సత్యాలే నాకు రక్ష!"

అని భార్యను గట్టిగా పట్టుకొని యేడ్చాడు. ఆమె అతనిని హత్తుకుంటూ తల నిమిరింది... అలా ఆమెఒడిలో తల పెట్టుకొని వెక్కుతూ మాగన్నుగా నిద్దర పోయాడు.

తెలతెలవారింది. ఒక సారి భార్యా భర్తలిద్దరూ సత్యనారాయణయింటికి వెళ్లారు. వెళ్లే సరికి పిల్లలు యేడుస్తున్నారు—పెద్దపిల్ల ఓక్షణం తండ్రిని విడిచిపెట్టి వుండేదికాదట. నాన్న నవల రాస్తుంటే దగ్గరవుండి ఒక్కొక్క కాగితం అందుకొని దారంలో మాలంగా గుచ్చేది. ఈ వేళా అలవాటే పట్టుకుంది—యేడుస్తోంది! ఆపిల్లను ఎత్తుకొని ఇంటికి తీసుకవచ్చాడు. తండ్రిని మరిపించడానికి యెన్నోవిధాల భార్య ప్రయత్నాలు చేస్తుంటే ప్రకాశరావు గబగబా ఆ వ్రాసిన ఎనభై యెనిమిది పేజీలు చదివి పెద్ద నిట్టూర్పు విడిచాడు.

తను ఒక్క సత్యనారాయణకే ద్రోహం చెయ్యలేదు. లోకం అంతటికీ అపకారంచేశాడు. ఆ నవలే పూర్తయి వుంటే...ఎన్ని భాషల్లోకి తర్జుమా అయ్యేది! యెందరిపై దీని ప్రభావం పడేది!...ఇందులో ఆ ఆఫీసరు పాత్ర...గర్వంలేని మనిషి—బయటచూస్తే వినయవిధేయతలతో ఆడంబరంలేని వ్యక్తి—పలుగురు ప్రజలలో తానొకడు. కానీ ఉద్యోగరీత్యా చూస్తే అతనిది కోడిపిల్లకుండే గుండెకాయకాదు! తుఫానులో ఒంటరిగా ఓడనడిపే నావికుడు. లోకాన్ని కాల్చివేస్తున్న హాలాహలాన్ని మ్రింగే గరళకంఠుడు. చెడ్డవాణ్ణి హతమార్చే మనిషికాడు—ఆ చెడ్డవాడు తనలాంటివాడేకావీ వాడికి పుప్పిపన్ను వుంది—ఆ పన్నును పూడిచెరికి మిగతా పళ్ళను రక్షించటమే తన కర్తవ్యం! వాడికి కడుపు నొప్పి—ఆ కోరిసిన పేగును కత్తిరించిబాధ నయంచేసే సర్జను ఈ ఆఫీసరు! జాలి, దయ యివి బయటకు కానరావుగానీ శరీరం లో స్త్రీ రక్తంఅంతా వాటితోనే నిండివుంటుంది! హృదయ సంస్కారంతో మెసలి సమస్యలనే పరిష్కరిస్తాడు గానీ మనుష్యుల్ని మాత్రం సమస్యలుగా చెయ్యడు. ఇలాంటి ఆఫీసరు న్యాయాన్ని ధర్మాన్ని ప్రతిష్ఠించేవాడిలో లోటు ఒకటి వుంటుంది. ఆ లోటేమో కలం ముందుకు సాగి వుంటే తెలిసేది.

ప్రకాశరావు అదేమిటని వూహించసాగాడు. బహుశః ఒకోసారి ఆ ఆఫీసరుకు అహంభావం ఆవరిస్తుందేమో! నిజంగా తనకు ఎంత ప్రయత్నించినా ఒకోసారి అహంభావం ఆవరించేది. పలుగురూ మెచ్చుకుంటే తనకు తానే ఆత్మస్తుతి చేసుకునేవాడు. అలా మెచ్చుకోవాలనేకదా తను నిజానికి వీళ్ళందరికీ వుపకారం చేసేవాడు! మనిషి స్వలాభాపేక్ష లేకుండా బ్రతకటం దుర్లభం—కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యాలే మనిషియొక్క స్వరూపం! ఇవి యెప్పుడైతే సరియైన పాళ్లలో వుండవో మనిషిఅప్పుడే పతనం చెందుతుంటాడు. వీటిలో ఏది హెచ్చయినాచిక్కే!

ప్రకాశరావు యేపనిచేసినా యీసారి ఆ ఆఫీసరుతో పోల్చుకునేవాడు. తను కనీసం ఆ పాత్ర దరిదాపులకయినా కొన్నాళ్ళకు చేరగలనా అన్న తాపత్రయంతో మెసలేవాడు. సత్యనారాయణ భార్యకు యీ వూళ్లో ఆ వూళ్లో కథలు పోసుచేసిన కొద్దిడబ్బును పంపిస్తున్నారు. నాలుగునెలలు దాటి పోయాయి. ఈలోగా ఆమె పెదతల్లి కొడుకు వచ్చి చేరాడు. ఆమెను పిల్లలను తనకేదో వుద్యోగం దొరికితే చేరదీసి పెంచాలని తాపత్రయం.

ఒకనాటి సాయంత్రం సత్యనారాయణభార్య ప్రకాశరావుఇంటికి వచ్చింది. అసలు విషయం ఆయనభార్యతో చెప్పుకుంది. ప్రకాశరావు ఆఫీసునుంచివచ్చేక ఆమె ప్రాధేయపడుతూ అంతా చెప్పింది. భర్తను తల్చుకుని యేడ్చింది. ఆయన వుంటే...... తన కన్నీరుమాని యెంప్లాయిమెంట్ ఆఫీసరే లిస్టులో

పేరు యిరికించాడట. ఎంచుకునే వారు కనికరించక పోతే బ్రతుకలేమని బ్రతిమాలింది. ఆవేళనే ఆ వచ్చిన వారిని పరీక్ష చేశారు. సత్యనారాయణకు చేసిన పాపం పరిహారం చేసుకోడానికి సరియైన అదను దొరికింది. తను ఇప్పుడు వుద్యోగాలు వెయ్యటం తన ఒక్కరిచేతులలో పెట్టుకోలేదు. తనతో ముగ్గురు వున్న కమిటీని పెట్టారు. దానికి తను పెద్దయినా అంతా బాహాటంగా న్యాయంగా చెయ్యాలన్న ఉబలాటం హెచ్చిపోతోంది. తను ఇదివరకు ఈమెకు సహాయం చెయ్యాలన్న పట్టుదల జ్ఞప్తికి వచ్చింది. తనలోని బాధ చాలా వరకు కప్పడిపోతోంది—తను కొంతహాయిగా బ్రతుకగలడు—ఇలా ప్రకాశరావు ఆలోచించుకుని ఒక నిర్ణయానికి వచ్చాక అన్నాడు.

"ఆయన రేపు ప్రొద్దున్న పెళ్ళిచేసుకుంటే మిమ్మల్నీ మీ పిల్లలను సరిగ్గా చూస్తాడా అని."

"ఆ అనుమానం వద్దుబాబూ. పెదతల్లి కొడుకయినా మొదటినుంచీ నేనంటే స్వంత చెల్లెలికంటే అభిమానం ఎక్కువ—ఊరూర ఉద్యోగంకోసం తిరుగుతూ బాధపడుతూ వచ్చాడు. నాకింతకంటె మరే సహాయం చెయ్యమని మీ గడపకు రాను. నా పిల్లలు నేనూ బ్రతకడానికి ఇంతకంటే యింకేం సహాయం నాకు అక్కర్లేదు."

"రేపొకసారి కనుపించమ్మా" అని ఆ అబ్బాయి పేరు వ్రాసుకుని ఆమెను పంపించాడు. ఆ రాత్రంతా సరిగా నిద్దరపట్టలేదు. తను యిన్నాళ్ళకు మచ్చ మాపుకుంటున్నాననే సంతోషమే తన్నలా చేసింది—ఇది పాపపు పనికాదని పాపాన్ని తుడిచిపెట్టుకుంటున్నానని ఈ పనితో ఆమె భర్తకు ఆత్మశాంతి కలుగజేస్తున్నానని అనుకున్నాడు.

ఆఫీసులో అడుగు పెట్టాడు. నిన్నటి కాగితాలు ఆ మార్కులు అన్నీ సంతోషంతో తిరగవేశాడు. ఈ పేరు ఎక్కడ వుందని చూశాడు—అదిగో పదిహేనవది...తీసుకోవలసిన నలుగురు పేర్లు పైన వ్రాశారు మిగతా ఇద్దరు మెంబర్లు—వాళ్ళని సరే వెళ్ళండి అన్నాడు. ఎర్రసిరా కలం పట్టుకున్నాడు ధైర్యంగా. కాగితం మీదకు ఇంకా చేరలేదు...చెయ్యి గజగజ వణకడం ప్రారంభించింది...సరిగా ఆ నాలుగవ పేరు మీద కలం చివర ఆన్చాడు...శరీరం అంతా కంపింప సాగింది...ఎందుకో ముచ్చెమటలుపోసేస్తున్నాయ్... కళ్ళు మూతలుపడి పోతున్నాయి. ఆపేరు కొట్టివేయడమనే పని చేసేద్దామనే కళ్ళకు ఆమె దీనాలాపం... సత్యనారాయణకు తను చేసిన ద్రోహం అంతా కూడి మనసును చురకలు వెయ్యిస్తున్నాయ్. కాని మనసు కంటే అతీతమైన శక్తి లోపలనుంచి వణికించివేస్తోంది. ఆ కళ్ళు మూసినా ఆ లోపలి తెరలో ఒక ఆకారం—దీనాతిదీనంగా "నా పేరు కొట్టివేస్తున్నావా? నా బాధలు నీకేం తెలుసు? బాధలు చూశా వుద్యోగాలు ఇస్తావ్? నన్నింకొక సత్యనారాయణను చేస్తున్నావా? నీలో న్యాయం ధర్మం ఇదేనా? సత్యనారాయణ నీపనికి రవ్వంతైనా సంతోషిస్తాడా? ఆవేళ రాత్రి యేడుస్తూ ఆయనసాక్షిగా చేసిన వాగ్దానాలన్నీ ఏమయ్యాయ్?" మళ్ళీ ఆ ప్రతిబింబం పకపక నవ్వుతూ హేళనచేసింది. ఈ ప్రశ్నలన్నీ బాధగా యీ జాలిగొన్న హృదయములో గ్రుచ్చుకొని రక్తం చిమ్మినట్లయింది. ఆ బాధలోనే ఆగాథ జ్ఞాపకంవచ్చింది. కళ్ళు తెరచాడు—తను ఆఫీసరు! హాలాహలాన్ని నవ్వుతూ మింగే గరళకంఠుడు కావాలి!

ఆ బాధలోనే నవ్వాడు—నవ్వుతూ గుండె మీద చెయ్యి వేసుకుని దొంగకూపిరితీస్తూ గట్టిగా లోన అనుకున్నాడు "న్యాయం ధర్మమే నా దీక్ష! నిజాయితీ సత్యాలే నాకు రక్ష! ఈ అన్యాయం జరుగదు. జరగడానికి వీల్లేదు" అని అంటూ కలం టేబిలుమీద పడేశాడు.

ఆంధ్ర సాహిత్య పరిషత్తు
కాకినాడ.
TELUGU ACADEMY, COCANADA

విశ్వనాథవారి కిష్కింధము

శ్రీ టి. సత్యనారాయణ

విశ్వనాథ కిష్కింధము కోమల చమత్కృతిశోభనము. రమ్యభావ రససామగ్రీ సమగ్రము. ఉద్ధిలేని రస ప్రవాహోల్బణము. సుద్దిలోని సమస్తభాసురగుణము. ఇవి కిష్కింధకి ప్రత్యేకతను కూర్చిపెట్టుచున్నవి. రామాయణమును ఒక మహాకావ్యముగను, ఉత్తమ కావ్యముగను రచింప తలంపుగొన్నపుడు, ముఖ్యముగ మహాకవియైనవాడు రచనాశిల్పమును సంతరించు కొనును. రస ధ్వనులను వాక్యములోను, శబ్దములోను, రచనలోను చూపును. ఈ కిష్కింధలో వ్యక్తమైన సమ్యక్పరిశీలనాబుద్ధి యిది. ఇది పంపాసరోవర్ణనము. కోమల చమత్కృతిశోభనము.

శిల్పము రెండు రకములు. వాక్యశిల్పము, శబ్ద శిల్పము. ఇవి రచనలో ఉండవలెను. కవి స్వతంత్రుడైనగాని యీ శిల్పాన్ని సుష్ఠుగాను, సమృద్ధిగాను, ఔచితీస్ఫోరకముగాను ఉపయోగించలేడు. ఈ ప్రయోగ పద్ధతి, యీ లోకజ్ఞత విశ్వనాథకి నన్నయ్య గారివల్ల యలవడ్డది. నన్నయ్య ఆద్యుడైన ఋషి. ఆ నన్నయ్యయొక్క ఋష్యాత్మ విశ్వనాథలో ఉన్నది. ఆ యున్నదనుకొనిన కోమల చమత్కారపథమే యిది. రాముడు సలక్ష్మణుడు పంపాకాననాభిన్న దేశముల సౌభాగ్యాన్నీక్షించుచు, ఋష్యమూక ప్రాంత సంచారి యగును. ప్రకృతియొక్క తునకలు సీతాదేవి శరీరపు సొగసులవలె రామున కగపడును. ఒక కరుణా పూరితమైన, దర్శనీయమైన సంఘటన శ్రీరాముని హృదయాన్ని అచ్చికొట్టినది. ఇక్కడ ఆ పద్యాన్ని ఉదహరించిననేగాని అందులోని అందము కనులకు పట్టదు. "ఆ చెట్టున కౌతీనకు రాచి పెనంగొనిన ప్రణయరాగము గలుగన్, వీచీ దక్షిణ వాయువు ద్రోచెన్ మృదువల్లి దూరదూరమ్మునకున్" ఆ లత కూన ఆ వృక్షాన్ని రాచి పెనంగొని ప్రణయరాగాన్ని నెరపుచుండగా దక్షిణ దిఙ్మారుతతరంగము ఆ లత కూనను దూరదూరముగా ద్రోచివైచినది' అని పైపద్యము యొక్క తాత్పర్యము. ఇది కందమున వెల్లడిచేయబడి నది. ఇది చమత్కృతిశోభమైన లోకాతిశాయి రచనా శిల్పసౌభాగ్యము. దీనిలో రెండు సమాసపదాలు వాడబడినవి. ప్రణయరాగము. వీచీ దక్షిణవాయువు. ఈ రెండు పదాలవల్ల కమనీయమైన భావము వెల్లడి చేయబడుచున్నది. ఒకటి స్నేహానుబంధమైన ప్రేమ. ఇది సుకుమారము. దీని విశేషణము 'రాచి పెనంగొనిన' అను తెలుగు పలుకుల కూడిక. ఇది ఒక సూక్తి వైచిత్రి. అందుకొఱకు కవి మృదువైన పదాన్ని వాడినాడు. రెండవది. వీచీదక్షిణవాయువు అన్నది. దీనిలోని మగణము, క, ష, సంయోగము కొంచె మౌద్ధత్యమును సూచించును. ఇది కరుణరస వ్యంజకమైన ఘటనము. ఔద్ధత్యమునకు తావులేదు. అయినను ఆ యుద్ధతి ధ్వనించవలెను. దక్షిణ దిఙ్మారుత మన గానే దక్షిణ దిశాక్రాంత పరమోద్ధతుడైన రావణు డని ధ్వనించక తప్పదు. ఈ వాయువు అనగా రావణుడు, మృదువల్లిని సీతను, దూరదూరమ్మునకు ద్రోచెను. సీతాపహరణము జరిగినది. ఈ అనంతమైన శిల్పమార్గమే కోమల చమత్కృతి. ఇక్కడ వాల్మీకి దృష్టి వేరు విశ్వనాథ దృష్టి వేరు. ఇతిహాసపు దృష్టి వాల్మీకి రచనలో కనబడును. మహాకావ్యోచితము లైన ధ్వని వ్యంగ్య శిల్పసృష్టి విశ్వనాథలో కనబడును. కేవల రామ విరహ వర్ణనము పాఠకుల మనస్సు దూర గొనదు. పంపా సౌందర్యము చేత ఉద్దీపితుడు రాముడు ఈ దృశ్యములైన లతాపాదపములను వీక్షించగానే దక్షిణదిక్కు స్మృతిలో తిరుగును. ఇది యొక విభిన్న సౌందర్యము. ఇది నాన్యతో దర్శనీయమైనది.

మరియొక పద్యాన్ని ఉదహరింతును. 'ముని కాళ్ళ నిలచి కుందేలు, నను పరకాయించి చూచి నలినాక్షికథల్, తనకుం దెలిసిన చెప్పను తిన చేతం గాక పోవు దక్షిణ దిశకుఁగా' కుందేలు రాముని చూచినది. సీతా విషయము తనకు తెలిసినను, చెప్పుట చేతగాక

దక్షిణ దిశగా వెడలిపోవుము' అని దీని భావము. కుందేలు దక్షిణ దిశగా యెందులకు పోవలెను? ఆ దిక్కున రావణు డున్నాడు. వాడు సీత నపహరించినాడు. వాడు రాక్షసుడు. మహాబలుడు. లంకాధిపతి. ఈ దృశ్య భావోన్మీలన చమత్కారార్థ సంయోజన లింగున నిక్షేపింపబడినవి. కుందేలు రాముని దీనావస్థకు జాలిపడుట, రామునితో సంభాషణకు దిగబడుట, మాటలురాక సంజ్ఞాపూర్వకముగా దక్షిణ దిక్ప్రత్తిని మాయముగుట. ఇంతిభావుకతతో నిండి చమత్కృత్యంత మైనది యీ ఒక్క పద్యము. దీన నానారుచిరార్థములు వెలిగినవి. ఈప్రకారమైన రచనకు నన్నయ్య యాద్యుడు. విశ్వనాథ తదనుయాయి. తనకు సహజమైన శయ్యామాధుర్యముతో పంపాసరః పవిత్రతను మంచిపద్యాలతో రచించును. అది భాస్కరునికి పట్టలేదు. వాల్మీకి అతిశయముగా వర్ణించినాడు. విశ్వనాథ సహజ భావుకతతో రసస్వనుల నింగుపట్టె యాచినాడు. నన్నయ్య ఋష్యశృంగఘట్టమున నిట్టివి ప్రసన్నము చేసినాడు.

ఇంకొకచోట కవి భాషారుచిని వెల్లివిరియింప జేసినాడు. కావ్యగతిమైన దృష్టితో అలంకారికముగ రచనను నిబద్ధము చేయుట. భాషాదృష్టితోడనే రచనను చేయుట. ఈ రెండును రెండైన కవితాపద్ధతులు. భాషాదృష్టితో కావ్యగతి కథారీతులను పరిశీలించి భావించినపుడు 'ఇది సమాసము, ఇది తెనుగు, ఇది సంస్కృతము, ఇది లక్షణవిరుద్ధము, ఇక్కడ శయ్య కుంటు వడినది" ఇత్యాదులు స్ఫురించును. ఇది రెండవ రకమైన కావ్యము. ఈమార్గము పలువురు కవులకు పరిచితమైనట్టిది. ఇందులో గొప్పదైన శిల్పమేమియు లేదు. కావ్యగతిమైన శిల్పదృష్టితో భాషావిషయాన్ని పరామర్శించునప్పుడు రసానుభూతులు మానబడుచుండును. 'ఇక్కడ భావము బాగున్నది. ఇది పాత్రయొక్క యౌద్ధత్య శృంగారాదులను చక్కగ వ్యక్తము చేయుచున్నది. ఇక్కడి భావశబలతతో మధుర తరమైన ఘట్టము నిష్ఠాత్మ్యదశలో సాగిపోవుచున్నది. ఇది పరమానంద రసార్ణవమున కందము చేకూర్చినది' ఈరీతిగా దృష్టి సాగుచుండును. ఒక మహాకవి రసార్ణవ మహాదృష్టితో కావ్యపథమును సుష్ఠుగను, సుందరముగను, ఆదర్శ సంయుతముగను దిద్దునప్పుడు అక్కడ స్వల్ప దృష్టి, విమర్శయోగ్యము కానేరదు. అఖండమైన గంగానదిలో, 'ఇవి మణికర్ణికనీళ్లు, ఇవి హరిశ్చంద్ర ఘట్టపునీళ్లు,అను వ్యాప్తికలుగరాదు. ఇది అఖండమైన గంగాస్రోతస్విని. ఆరీతిగనే 'ఈగ్రంథము నిరవధి కావ్యాంధ్రదసమ్మిశ్రిత మహాచితీయుత మహాభాషా ప్రవాహమును సూహయుండవలెను. ఈమార్గాలు మహాకవులకు క్రొత్తలుకావు. కవితాదృష్టి యెప్పుడు నాలంకారికముగ నుండును. ఔచిత్య పరిస్ఫోటనమై యుండును, రసమయమైయుండును. లాక్షణికదృష్టి యొప్పారియుండును. ఈదృష్టి సర్వత్ర యిందు జూపింపబడినది.

ఇంకొక చమత్కార మార్గాన్ని చూపి విరమింతును. గ్రంథమంతయు విచిత్రత్వములు గలది యైనను స్థాలీపులాక న్యాయమున పరిశీలింతును.

రాముడు వాలిని చంపుదునని ప్రతిన చేయును. అయినను ధర్మభంగ భయమును శంకించును. రామ సుగ్రీవుల మైత్రీగాథలు అంగదుని మూలమున వారికి తెలియునట్లు చేయును. ఈవిషయములు వాల్మీకి, యుద్ధమున కేగబోవు వాలికి తారచేత అంగదుని వచనములుగా సూచించినాడు. భాస్కరు డా మార్గము నే యనుసరించెను. విశ్వనాథ ఆ విషయమున చమత్కారము నవలంబించి పరివర్తన కల్పించినాడు. ఇందు రసికులు లోనారసి మేలు అనునట్లు చేసినాడు. సుగ్రీవానుచరులు మధ్యే కొనవమున అంగదు నాపినారు. శ్రీరాముని విషయమును చెప్పినారు. ఇక్కడి పద్యశిల్ప మనంతప్రతిభ గలది. శిల్పమనగా పద్య సౌందర్యము. పద్యము యొక్క యారంభదశ బాగుండవలెను. పద్యాంత మందలి దింపుగడ యతిశయ మాధుర్యము కలిగియుండ వలయును. ప్రాసయతి ప్రదేశములు శోభలు వాకలుకట్టినట్లుండవలెను. ఔచిత్యము సర్వత్ర నిండినట్లు పాటసూప వలయును. ఇట్టిది పద్యశిల్పముగను. ఈపద్యము నీలుడు అంగదునితో అన్నది. "మన వనదేశ మందిసహానున పరాక్రమవహ్ని కోసలేసుని తనయుండు రాముడను శూరుడు, శౌర్యుడు, ధర్మభంగశోపనమతి చాప ధూర్జటి, ప్రభాజలజాప్తుడు, తాదృశానుజుండును మరి తా జరించెడు గమ్గొనినావె వనాంతవీథులన్" ఇది పద్యము. ఇందులోని అన్ని మాటలు దశసార్థకత గలవి. అయినను ఇందులోని రెండు విశేషణములలోని విశేషములను కదిలింతును. ఆరాము డెట్టివాడు? ధర్మభంగశోపనమతి. ధర్మమునకు భంగము కలిగిన

సహించలేడు. "సహించక ఏమిచేయును అన్నది. అతడు చాపధూర్జటి. ఈమాటలో ఎంతైనా అర్థమున్నది. ధనుర్ధారియగు పరమేశానుడు అని. శివుడు చాపమును ధరించినది త్రిపుర దహన కాలమందు మాత్రమే. అయ్యర్థము రామునిలో ధ్వనిస్తున్నది. వాలి ధర్మేతరుడు. ఎంత దుందుభి మాయావులను నిర్జించినను చాపధూర్జటి యైన శ్రీరాముని పురోభాగమున నిలువబడలేడు. ఈమాత్మమతికై, లోనారయవలయును. ఇంతే కాదు. "వట్టిపరకేకాదు. ఆయన ముట్టిన బాణంబు వేగమున క్రౌంచాద్రిం ఘట్టించిన భార్గవశర పట్టాభిషవణము వ్యయ్యపరచినది సుమా" ఇది భయ సంసూచి. అంగదుని మనస్సుకి బాగుగా తగిలినట్లున్నవి. ఈ దృశ్య రచన సర్వరసములను మూటకట్టి తెచ్చి పరచునట్లుండును. విశ్వనాథయొక్క అనంతప్రతిభ కిది యొక చక్కనైన రూపకల్పన. పై పద్యములోని సమాసము అన్ని రసములను వెల్లడిచేయు అనంతముఖమైన వాక్కు గలిగిన మహాకవిని ప్రత్యక్షము చేయును. ఆ ఘట్టమును ముందు చదివిననేగాని పాఠకున కిందలి రుచిలోని యాథార్థ్యము గోచరించదు. ఆ వానరు లింకొక మాటయని అంగదునితో "నీ కొక మాట చెప్పుటకు నేనిట నిల్చితి రాముడన్నవాడా కుటిలోగ్రభూమి భుజగాభుడు నీ పినతండ్రితోడ నేస్తై, కరముల్ కరమ్ములను పగ్గియు సాకిరి గాగకట్టినారు, ఆకపిలోక రాత్ముసు దహంయువు నీ హిత యేమి కావలెన్" అని జాలి తలంచుకురు. అంతియకాక, వనమున కపద్రవమే యైనచో వ్యాఘ్రముమైనను చంపును, వానరేశుడైన వాలినైనను చంపును. తనకు మాటుగ మీ పినతండ్రి యుండెను సుమా! రాముడు క్రూరుడైన వేటకాడై యున్నాడు! ఇదంతయు చదువుతుంటే యిందులోని గడుసు పలుకుబళ్లు మనలను విముగ్ధులను జేయుచునుండును. ఇది రామాయణమున నిజముగా చమత్కృతీసంసూచియైన ప్రథానాన్వయము. నాటకములోని నాలుగు పాత్రలు నటన చేసినట్లుండును.

సుగ్రీవుడు పట్టాభిషిక్తుడయినాడు. తాదృశానంతభోగపరిలోలుడై రాముని మరచినాడు. ఇంతలో వర్షర్త్వాగమన మయినది. ఇక్కడ ఒక చమత్కారము. సహజ సుందరములై పరవళ్లు త్రొక్కిన కవీశ్వరుని లోకోత్తరభావనామధురిమలు జబ్బన జూరలాడుచున్నవి. ఇక్కడి శయ్య సుందర సుషమమునుగా ఉన్నది. ఆ తీర్చిన తీర్పు నాన్యతో పరిదృశ్యమానమైనట్టిది. ఈ భావుకత నిర్వ్యాజముగ్ధాకృతి గలది. ఇట్టి పట్టులలో కవిరచనా చమత్కృతినే చూడవలయును. రసహాభాగ్యానికిది చోటుగాదు. అయినను తన సర్వతోముఖప్రతిభవల్ల విశ్వనాథ రసమును పద్యశిల్పంతో మేళనము చేయుచు, శిలలనుగూడ చిగురింపజేయగలుగును. వర్షాగమనమును పీసమున మూసకట్టి చూపించును. ఆ పద్య మిది.

"ఒక మబ్బు గిరిశృంగనికటమ్ము విడిపోదు
  క్ష్మాధరేంద్రుని కంట గ్రాగినట్లు
ఒక మబ్బు గిరిపాదనికటాన జీరాడు
  మన్నింప ప్రార్థించుచున్న యట్లు
ఒక మబ్బు గిరిమహాశికటిస్థ యూగాడు
  సంభోగ శృంగార చలిత యట్లు
ఒక మబ్బు గిరిపంచ నూరక తిరుగు ని
  రాకృతి ఆశ వల్లాడునట్లు
తానా యేడాది కొకసారి కానుపించు
  నవమనోజ్ఞుడు దక్షిణనాయకుండు
మబ్బుకన్నెలి ట్లొందుట యబ్బురంబె
  పరమశృంగారమూర్తియే ప్రస్రవణుడు."

ఇట్టివే, శేషములు లెక్కకు మిక్కుటములు. ఇవి భాస్కరునిలో మార్గణ పరిదృశ్యమానములు. వాల్మీకినిగూర్చి మాదృశులేమీ పలుకలేరు. విశ్వనాథలో సముచితములు. ఇవి కిష్కింధలోని కొన్ని చమత్కార సన్నివేశ నిపుణములు ఇంక రసమార్గమున నడచి, అందలి వింతలను కనుగొనవలెను.

సుగ్రీవుడు రెండవమారు వాలిపైని బొబ్బలు రేపును. వాలి సుగ్రీవ కృతము రావము విని మండిపడి లేచినాడు. ఈమారు తార కన్నుంగొనలందు భీతి యురిమినది. వాలి నాటంకము చేసినది. నీతిని మూడు మార్గముల ప్రబోధించినది. నీతిపథము, సధర్మమైన భయహేతుత్వమార్గము శ్రీరామచైతన్యమందలి విశ్వాసతా నిష్కర్ష. ఇక్కడి పద్యాలు ఇరువది. అన్నియు శార్దూల మత్తేభములు. ఆయా రసప్రదర్శక పరమహేతు వైవిధ్యములు! వాని భావములు సంగ్రహపరచి పరిచయమొనర్చుట యప్రస్తుతము కాదు. సుగ్రీవుడు మహాధిషణా భావుకు తాను చేయు పనినిగూర్చి పరమాలోచనా పటువు. వృథాకృత్యమును చేయనివాడు. నీ యెదుట నిలువలేనని తెలిసియు నెందులకు వచ్చినాడు. దీనికి

మన అంగదుడు నుడివిన మాటలు మహాబలమైనవి. రాముడు బలశాలి. ఈ చెట్లుకూడ అతని శౌర్యరేఖా విస్ఫూర్తిశాలను గానము చేస్తున్నవి. అతడు భార్గవ రాముని నిర్జించినాడు. మహాధర్మనిర్దేశ్యతాపరిణత ధీరుడైన రాము డిక్ష్వాకుల వంగడము బిడ్డడు. మహర్షి కల్పుడు. అతనితో మైత్రి సుగ్రీవుని యదృష్టమే.

ఎక్కడ నిష్కామమహాధర్మము గూడు కట్టుకొని యుండునో, ఆపదలు పెల్లగించుటకే మహాత్ములు రాజ్యములైనను త్యజించి వత్తురు. ఆరాముడు మొదట సీతయొద్దకైనను రాలేదు. సీతతో మైత్రి రాణించదు. సుగ్రీవునిలో నిన్నుమించిన యుదాత్తమైన, జగద్విస్ఫోటనమైన బలమును చూచెనా! లేదు. ఇదే ధర్మమార్గము బహు విచిత్రాన్వయములు గలది. ఊహించుటకు గొప్ప ఆలోచనాశక్తి సుగ్రీవునకున్నది. అతని బాహుబలము ఏతన్మాత్రము కాదు. పండితమౌళి హనుమంతుడున్నాడు. అతడే మైత్రి కలిగించియుండును. ఆ సుగ్రీవుని యువరాజపదమున స్థాపించి సామరస్యమును ప్రదర్శించుము. ఆరాముని కోపకోనలలో తిరుగనిమ్ము. “నీవు కులాచలేంద్ర సమ నిశ్చల దేహ బలుండవద్రి నీపై విసరన్ మరింగదలబారవు, శౌర్యకుడయ్యు గూడ నోహో! వెస సప్తతాళదళనోగ్రము బాణము సెంచ గుండెలో నావులు తీరు నిల్వగలవా! రఘురాముని యంపరివ్వవన్” సుగ్రీవులు వందలు వచ్చినను భయపడను. శ్రీరాము డేవేళనో వృక్షాంతర్గతుడై బాణము దూయును. అప్పుడు నిన్ను కాచుకో గలుగుదునా యని నా యిప్పటి యూహ” ఈ మొదలు గాగలవి తారమాటలు. ఇవి నీతిధిషణాభావప్రగల్భములు. ఆలోచనాచారువులు. భావశబలతా మయములు. ఈదృశములైన ఘట్టములు మరి రెండున్నవి. అవి అనంతములైన రసధ్వనుల కొదమరంగములని నుడువవచ్చును. వాలికి తన యొద్దలో నిధి నిర్ధరయొక మార్గము బాగుగ తెలియవలెనని తార అత్యంత మా వముగాను, మందిముగాను మాటాడి, వెనువెంటనే మార్దవకాఠిన్యతలను సమపాళమున నుపయోగించి మాటాడును. ఇది వాలిని యుద్ధవిముఖునిగా జేయుటకు కూర్పబడిన అతి సుందరమైన, రస వ్యంజకమైన యొకమార్గము. రాముడన భయము. వాలి పరాక్రమముపై నమ్మకము. సుగ్రీవుని యాలోచనా శక్తిమీద తీక్ష్ణతాపటుబుద్ధి. ఈవైచిత్రి యంతయు తారా వదనములయందు ప్రస్ఫుటించినది. ఈపట్టున విశ్వనాథ. తన కలమును సూక్ష్మపరిజ్ఞాతలైన మహాకవులయూహా గమ్యముగ జేయగలిగినాడు. ఇందలి వృత్తౌచిత్యము, శబ్దార్థగత గౌరవప్రపత్తి, తెనుగుతనములోని యందము, ఇవి దీనిని మహాకావ్యముగ నొనరించినవి. కొన్ని శబ్దములు వాచ్యములై గభీరార్థ వ్యక్తీకరణములగుచు మరికొన్ని వ్యంగ్యమర్యాదా సంపత్సంయుతము లగును.

ఊహాలపై నూహలను సృజింపజేయు రసవద్ఘట్టము వాలి శ్రీరాముని నిందించుట. ఈ నింద 25 పద్యములలో చేయబడినది. అన్నియు త్రికాలోగ్రాభీలములు. వాలియొక్క అంతరాంతరమనస్సంకల్పజన్యములు. మాట చిన్నది. భావము గుండెలోని నెత్రుకండలను కదలించును. ఒక మూడు పద్యముల నుదహరింతును. అవియైనను కందములు. “నీకేమిటికి శ్రీరామా! యీ విమతేతరము కార్యమేమిటికి రామా! నే విన్నదాని కెంతో పైనెలసిన దీ మహానుభావత చూడన్”. “ఇదియేమి చేసినాడవు. త్రిదివారోగ్యంబు కర్మ దుష్పరమున్, శిష్టి దమును, నింద్యంబును దుర్మదు లస్వర్గ్యలు పొనర్చు మలినంపుం గృతిన్”. “అలఘు భుజాబలసారోజ్వలుడై విదలించి సప్తసాగరముల లోపల ముంచి, యొత్తిగల్గుదు, కలితమహాకశి పంక్తికంధరు నేనై”. ఇటువంటివే అన్ని పద్యములు నిబంధింపబడినవి. ఇవి భావరస సామగ్రీ సమగ్రములు.

శ్రీరాముడు వాలిని మందలింపుగా ప్రతి సమాధానములు పలుకుట కేవలము రసస్రోతస్వినియే. తారా విలాపము, సుగ్రీవుని రోదనము, ఇవి కరుణరసోల్బణములు. సుగ్రీవుని కీ శ్మశానదృశ్యమదృష్టపూర్వము. సర్వకిష్కింధయు రోదనపరిభూషితము. అది పట్టశక్యము కానిది. సుగ్రీవునకు వైరిభావము నశించినది. కరుణార్ద్రుడైనాడు. ఒకమాట రామునితో పలికినాడు. “నీవు దంస్యుని దండించినావు రాజవు, ఏను చేసిన పనియేమి యీశ్వరా! మహానుభావుని జంపించినాను సర్వకపిజగత్పరమేశు నగ్రజుని రాజు” ఇంత యౌచిత్యమే కావ్యమున కనంబడును? ఇవి విపుల రచనా పరిద్యోతితములు. లోకమున కోపము రాగా కఠినముగ మాటలాడుదురు. కావ్యమున నంతియే. లోకమున మోదము రాగా, మృదువుగా, హాయిగా, శృంగారాభివ్యంజకముగా మాటలాడెదురు. కావ్యమున నంతియే.

కావున లోకవ్యవస్థయే కావ్యమునకూడా ప్రతిబింబిత మగుచుండును. ఇంకొక్క విషయమును వ్రాసి ముగింతును. అది భాసురఘట్టోపేతమైనది. మహనీయమైనది. సుగ్రీవుని యంతిపురిలోనికి లక్ష్మణుడు గమించును.

లక్ష్మణునకు అక్కడి భోగలాలసుడు సుగ్రీవు డగపడినాడు. లక్ష్మణుడు పడగవిప్ప ప్రయత్నించు పసిగ్రాచువలె నైనాడు. దక్షిణహస్త సంగృహీత సశరకార్ముక లస్తకుండు దక్షిణపాదమున నిబ్బరముగ నిలచినాడు. ఎంతగనో తూలనాడినాడు. ఈ పద్యము భావుకతకు నిదర్శనము. "అన్న మాటపై నిలుతువో, అంప నిప్పు సెగలయందున సర్వకిష్కింధ బూది బుగ్గిగాం జూతువో, చెప్పుము, శితశరము తాళియున్నది నీ సమాధానమునకు" దీన సుదగ్రవ్యగ్రుడైన లక్ష్మణుడు సాక్షాత్కరించినాడు. ఆ తెలుగు సమాసానికి ఎంతైన వేడిమి యున్నది. తీక్ష్ణత ఉన్నది. భావపు వెలుగు, బిగువులు ఉన్నవి. లక్ష్మణుడు కిష్కింధాప్రయాణమాదిగా, సుగ్రీవ ప్రతివచనాంతమువరకు గల కథాగతమైన రీతి యొక నాటకశిల్పము. ఈ నాటకమున స్త్రీ తార. అఘటన ఘటనాచతురిమలు గల ప్రౌఢాంగన. నాగరక స్త్రీ. అంతిపురి సెరజాణ. ఆమె మాటల చమత్కార ప్రవాహమున రాముడులే నిలువలేకపోయిరి. ఇంతగా ఔచిత్యమును ప్రదర్శించి తారని తారాపథాని కెత్తినాడు కవి. ఇది కావ్యపథాని కొక భాసురగుణము.

హనుమంతుడు జాంబవంతునిచేత ప్రబోధితుడగును. ప్రబోధితుడైన హనుమంతుడు విజృంభించును. అతని పరాక్రమము పట్టరానిదైనది. పట్టరాని ఆ పరాక్రమమును వెడలగక్కుటయను నొకమార్గ మాతనికి గోచరించినది. ఇక్కడి పద్యములు విరియపు తునుకలు. ఆవేశపటువులు. మర్యాదా విజృంభమాణములు. సంస్కృతము, తెనుగుల యొక్క సుందరములైన విస్పష్టములైన రూపములు అభ్యుదయాధ్వమున తీర్చిన తీర్పుగా ప్రయోగింపబడినవి. ఇవి కిష్కింధాంతభాగమున సృజింపబడి సుష్ఠుగా నిలుపబడినవి. ఈ దృష్టిలో రచింపబడిన యొక పద్యమును రుచికై చూపించెదను.

"ఎంతటివాడు కావలయు
 నెప్పుడు యత్ప్రతిభా విశిష్టుడై,
యంతటి వాడు నేనగుదు
 నిప్పుడు తత్ప్రతిభావిశిష్టుడై,
అంతిక ప్రాంగణ స్థితి మ
 హోగ్రజవజృంభదంహ తీవ్రతన్
చింతిత కార్యముల్ తవర చేయగ
 కల్పతిరూప్యమానుషన్".

ఈ పద్య మంతటికి అపూర్వ రమణీయతను సాక్షాత్కరింపజేయు, ఆ యచ్ఛబద్ధ తిచ్ఛబద్ధ ప్రయోగములలోని గడుసుదనము పాఠకులయొక్క లోరొపడలను పట్టియుంచగలదు. ఎప్పుడు, అప్పుడు, ఎంత, అంత, మున్నగు తెనుగు సర్వనామముల యొక్క యొదుగులు పాఠకులను చమత్కృతచిత్తోన్ముఖులనుగా నొనరించును.

కవి తన యనంతప్రతిభావ్యుత్పత్తులచేత బహుమార్గములుగా భాషను సృష్టించును. అది తలమానికమగును. విశ్వనాథ యాకోటిలో గణనకెక్కినాడు. ఈ సృష్టించిన భాషలో ఎంత సూక్తి. 'నవతి కొలుకును తండ్రి సోదరుల సెల్ల జంపుటన్నది యుండు మ్లేచ్ఛజనవృత్తి, మంత్రిజనుల, యిష్టంబుగా మహిని తమ్ములైన పొందిగ జనుట ఆర్యజనవృత్తి' ఇందులోని 'విన పొందిగ జనుట' యను తెనుగు నుడికారపు సొంపు గొప్ప రచనను తెలియజేయును. ఇట్టివి విమర్శనాపరమోద్దీప్తములైన వాక్యాలంకారములగును. ఇది విమర్శించును. ఇది కేవలము తెనుగుజాతిని జ్ఞాపకము చేయును. "అన్నయన్న, విరోధంబు, అన్న కొడుకులన్న బడి చచ్చుటయు నున్నదియ్య జగతి" ఈదృశ రచనను కవి తనదైన లౌకిక విషయమునోపరి జ్ఞానముచేత రమణీయార్థప్రతిపాదకములైన శబ్దములతో నింపును. తెలుగు వాక్యరచన మెట్లుండవలెనో, జాతీయతలు, నుడికారములు ఎట్లు ప్రయోగింపవలెనో, తెలుగు సంస్కృత మర్యాదలనెట్లు రక్షణముచేయవలెనో, కవి గమనించుచు కావ్యగ్రథన చేయగలిగి యుండవలయును. కొన్ని ప్రయోగములు తెనుగుజాతి వాడినట్లు ప్రయోగింపవలయును.

విశ్వనాథ కిష్కింధను బహుధా ఖండముచేసినాడు. ఆయా ఖండములలో బహు రహస్యముల నిమిడ్చినాడు. నిజమైన తెనుగు రామాయణమును మన కందించుచున్నాడు. ఏ కథకు, ఏ భావమున కే శబ్దము, ఏ రచనము, ఏ శయ్య నిసర్గసుందరమై ప్రతిభ వెలార్చునో, తెలిసిన కవి సమ్రాట్టు విశ్వనాథ. ఇది అపరిమేయ వైచిత్రీపరిదక్షురాలైన సరస్వతి యొక్క ప్రసాదమును అనుభవించిన కవికి సిద్ధము. కిష్కింధా ఖండములలో నియ్యది స్ఫురించును. ఈ కిష్కింధను విమర్శించి పరామర్శించు కొలందిని రమణీయములైన రసభావసామగ్రులు సమగ్రములై మన మనోవీథికి గోచరించును.

స్వయంవరం

శ్రీ రావి కొండలరావు

** శుభ్రంగా అలంకరించిన పెద్ద గది. ఒకమూల పుస్తకాల రాక్, చిన్న బల్లా, దానిమీద పుస్తకాలూ, కాయితాలూ, కలాలూ అన్నీ శుభ్రంగా వున్నయ్. ఒకప్రక్కగా బుద్ధవిగ్రహం ఒకటి వున్నది. ఎదురుగా గోడకు 'బెర్నార్డ్ షా' పటం పెద్దది కనుపిస్తున్నది. దానికి రెండు వేపులా ఓ ప్రక్క గాంధీ, ఓ ప్రక్క అబ్రహాం లింకన్ పటాలు—గదిలో రెండు ప్రక్కలా సోఫాలూ, మధ్య అందంగా ఓ చిన్న స్టూలు; దాని మీద 'ఆష్ ట్రే' తప్ప యింకేం లేవు. సోఫాలకు మధ్యగా ఎదురుగా పడక కుర్చీ—దాంట్లో ఓ వ్యక్తి కాళ్లుజాపుకుని పడుక్కునివున్నాడు. అతని మొహంలో బెర్నార్డ్‌షా పోలికలు కనుపిస్తున్నయ్. అతను పుస్తకంచదువుకుంటున్నాడు. బాగా వదులుగా వున్న చారల పైజామా పైన పల్చని సిల్కుచొక్కా వేసుకున్నాడు. పైప్ కాలుస్తున్నాడు. వయస్సు 50 సం॥లు దాటాయి. గడ్డం పూర్తిగా నెరిసిపోలేదు. ఆయన పేరు రఘునాథం.

రఘు : (లేచి కూచుని పుస్తకంమూసి, అటూయిటూ చూసి—'పైప్' గట్టిగాపీల్చి పొగవొదుల్తూ) గుమాస్తాగారూ ... గుమాస్తాగారూ (ఆగి గట్టిగా) హనుమాన్లుగారూ!

[హనుమాన్లు లోపల్నించి ప్రవేశం. నలభయ్ దాటింది వయస్సు. ఐనా ముసలితనం కనుపిస్తున్నది. తెల్లటిబట్టలేకాని, మాసి వున్నై. గడ్డంకూడా కొద్దిగా మాసింది.]

హను : (ఆత్రుతగా వస్తూ) పిలిచారా?

రఘు : మూడుసార్లు పిలిచాను—కూచోండి.

హను : (కూర్చుంటూ) ఈ మధ్య చెవుడుకూడా వొస్తున్నట్టుంది.

రఘు : అన్నీ వొస్తాయి — (హనుమాన్లు మొహంలోకి వోక్షణం చూసి) అదిగో. మళ్ళీ మరిచిపోయారు.

హను : ఏమిటి?

రఘు : లక్షసార్లు చెప్పాను.

హను : (భయంతో) ఏవిషయం అంటారు?

రఘు : ఏవిషయమన్నాసరే—చెప్పగానే మీరు గుర్తుపెట్టుకోవాలిగాని—

హను : చిత్తం.

రఘు : ఇటువంటిచిత్తాలు ఎన్నయివయో తెలుసా?

హను . క్షమించండి—నాకు గుర్తుదొరకటంలేదు.

రఘు : చేత్తో మీగడ్డం రాసుకుని చూడండి.

హను : (ఆవిధంగాచేసి) తప్పే—ఇవాళ గడ్డం తీయిద్దామనుకున్నానుగాని—

రఘు : ఏదో అవాంతరం వొచ్చిపడిందంటారు. పెంచితే పూర్తిగా షాలాగా (పటం చూపుతూ) పెంచెయ్యండి — లేకపోతే శుభ్రంగా వుంచండని చాలాసార్లు ప్రార్థించాను. మాసినగడ్డంవాళ్ళను చూస్తే నాకు వొళ్లుమండుతుందని మీతో చెప్పేవుంటాను.

హాసు : చిత్రం—చాలాసార్లు అన్నారు.

రఘు : అంటేమాత్రం ఏంలాభం? వినేవాడుంటేనే చెప్పినదాని ఫలితం. సరే—నేను చెప్పిన ఆవిషయం ఏంచేశారు?

హాసు : (ఆలోచిస్తూ) ఏ...ది...?...

రఘు : అదిగో మరిచిపోయారు. మీరు పుస్తకాలు విరివిగా చదివితే జ్ఞాపకశక్తి అలా నశించదు.

హాసు : చిత్రం—

[నౌకరు ప్రవేశం]

నౌక : ఎవరో వొచ్చారు సార్—

రఘు : ఎవరూ?...సరే—రమ్మను.

[నౌకరు వెళ్లాడు.]

హాసు : చిత్రం—అమ్మాయి పెళ్ళి విషయంకోసం ఐవుంటుంది.

రఘు : ఊఁ—

[వొక్క క్షణం నిశ్శబ్దం. తర్వాత వో వ్యక్తి ప్రవేశించాడు. గంభీరంగావున్న విగ్రహం. లాంగుకోటు, షరాయి వేసుకున్నాడు. పెద్ద మీసాలున్నయ్. నెత్తిన టోపీవున్నది—చేతిలో వో పొన్నుకర్ర. ఆయనకు సుమారు 60 ఏళ్లుంటాయి. కాని ఎవరూ అన్నివుంటాయనుకోరు. ఆయన వొస్తూనే, నమస్కారం అన్నాడు.]

రఘు : నమస్కారం-రండి ఇట్లా దయచేయండి.

ఆ వ్యక్తి : (సోఫాలో కూచుని) మిమ్మల్ని చూడగానే బెర్నార్డ్ షా ఏమో అనుకున్నాను.

రఘు : ఏమిటి- మీరు ఆయన్ను చూశారా? (లేచి కూచున్నాడు).

వ్యక్తి : అబ్బే- ఫోటోలో చూడటమే!

రఘు : అవును- ఆయన్ను చూసే అదృష్టం కలగటం కష్టం. ఐతే నన్ను మీరు 'షా' అనే అనుకున్నారూ? అనుకోవాలనే నా కోరిక. ఆయనంటే నాకు చచ్చేంత ప్రీతి. మొహం ఆయనలాగా వుండకపోయినా గడ్డం, మీసాలూ జుట్టూ అట్లా పెంచాను.

వ్యక్తి : (అక్కడున్న పుస్తకం చూస్తూ) ఈపుస్తకం కూడా ఆయనదే!

రఘు : ఆఁ ఆఁ- ఎప్పుడూ ఆయనపుస్తకాలు చదువుతాను. ఆ లోపల లైబ్రరీలో పుస్తకాలు చూశారా? అందులో ఎక్కువ ఆయనవే... ఆఁ...మిమ్మల్ని నేను ఎరిగినట్టులేదు.

వ్యక్తి : ఎరగరు. మిమ్మల్నికూడా ఇంతకుపూర్వం నేను ఎరగను. నిన్న వొకాయన వోమాట చెబితే, ఆ విషయం కనుక్కుందామనీ-

రఘు : మీ పేరు వినివుంటానేమో!

వ్యక్తి : నా పేరు భూషణం. మీరు వినివుండరు. నేను పూర్వం జమీందారును. ఐతే ఇప్పటికీ ధనానికీ హోదాకూ ఏ తక్కువా లేదులెండి. నాకు యిద్దరు అమ్మాయిలు సంతానం. పెద్దమ్మాయిని వో జమీందారుకే ఇచ్చాను. రెండో అమ్మాయికి యింకా పెళ్ళికాలేదు- ఆ ప్రయత్నంలో వున్నాను. నా స్నేహితుడు డాక్టరాయన మీరు చాలా ఉత్తములనీ, మా కంటే అన్ని విషయాల్లోనూ చాలా మెరుగయినవాళ్లనీ- పేరు రఘునాథంగారనీ అన్నాడు.

రఘు : కాదులెండి. రఘునాథ్ షా అని మార్చుకున్నాను. ఐతే అంతా పాతపేరే వాడతారు.

భూష : పోనీండి. నేనుమాత్రం మీ యిష్టపూర్వకంగానే అంటాను. అసలు విషయం- మీ అబ్బాయికి నా రెండోఅమ్మాయిని యివ్వాలనీ—

రఘు : అనుకున్నాను, మీ రా విషయంలోనే వొచ్చారని. కాని వాడియిష్టం. అన్ని విషయాల్లోనూ వాడికే పెత్తనం ఇచ్చేశాను. వాడిష్టం వొచ్చిన అమ్మాయిని చేసుకోటానికి నా అభ్యంతరం ఏమీలేదు.

భూష : ఇప్పుడాయన ఇక్కడలేరా?

రఘు : వాడెప్పుడూ ఇక్కడవుండడు. నేనే వుండనివ్వను, వాడిపని దేశాలుతిరగటమే!

భూష : ఆయన చాలా చదువుకున్నాడని కూడా విన్నాను.

రఘు : ఆ చదువుల్లో నాకు నమ్మకం లేదు. అంచేత వాడేమీ చదువుకోలేదనే అంటాను. ఐతే, మీకు డిగ్రీలే ప్రధానం అంటారా- వాడి పేరువెనుక యం. యస్‌సి. వుంది. డిగ్రీ వున్నంతమాత్రాన వాడు జ్ఞానవంతుడు కాడు. ఒకవాడుకూడా నాకు 'షా' పుస్తకం ముట్టుకోలేదు—నేను చెప్పి చెప్పి విసిగాను.

[సుమస్తా లోపలకు వెళ్లాడు]

భూష : ఐతే ప్రస్తుతం ఆయన ఎక్కడుంటారు?

రఘు : సరిగ్గా తెలీదు. బహుశా...ఆఁ—ఆమధ్య అమెరికా వెళ్లొచ్చాడు-ఈమధ్య ఇంగ్లండు వెళ్లొచ్చాడు. వొచ్చినతర్వాత నాకు కొన్ని 'నిమిషాలు' మాత్రమే కనుపించాడు. ఎక్కడున్నాడో సుమస్తాగారికి తెలియొచ్చు. (గట్టిగా) హనుమాన్లుగారూ!

హను : (అత్రుతగా వచ్చి) చిత్తం—

రఘు : అబ్బాయి వుత్తరాలు రాస్తున్నాడా?

హను : చిత్తం - వారం రోజుల క్రిందట ఒకటి వొచ్చిందండి. అదీ, రాజ్యంగారికి రెండు ముక్కలు రాశారు. ఆయన అప్పటికి పాట్నాలో వున్నారు.

రఘు : ఐతే, ఈపాటికి అక్కడ వుండడు. ఆఁ— ఈమధ్య ఎవరెస్టు శిఖరం ఎక్కాలని పట్టుపట్టున్నాడు. ఏమయినా - కావాలంటే వాణ్ని కనుక్కోవొచ్చు.

భూష : మీ అబ్బాయికి వయస్సు ఎంత వుంటుంది?

రఘు : పాతిక దాటాయి - ముప్ఫయ్ యింకా రాలేదు.

హను : చిత్తం - ఇరవై ఎనిమిదండీ.

రఘు : అదిగో!...వాడి మొహం అచ్చంగా ఆండ్రో క్లిస్ మొహంలాగా వుంటుంది!

భూష : ఆయనేకగూ మీ పెద్దబ్బాయి?

రఘు : వాడే. తర్వాత వో అమ్మాయి. అది క్వీన్ మేరీస్‌లో చదివి, ఈమధ్యే వచ్చింది. దానికీ పెళ్ళి కాలేదు. దానిష్టం - ఎప్పుడు చేసుకున్నా - ఎవర్ని చేసుకున్నా నా అభ్యంతరం ఏమీ లేదు.

భూష : ఆమె కూడా ఇక్కడ లేదా యిప్పుడు?

రఘు : ఇంట్లో లేదు. ఇప్పుడు దాని పెళ్ళిగొడవల్లోనే వున్నాను.

భూష : ఆహోఁ—

రఘు : ఆఁ - "పెళ్ళి చేసుకోవాలనుంది. ఎవర్ని చేసుకోమంటారు?" అని అడిగింది ఈమధ్య. 'నీ యిష్టం' అన్నాను. 'కాదు మీరే చెప్పా' లంది. ఐతే దాని తల్లి చచ్చిపోతున్నప్పుడు కూడా తన తమ్ముడికే 'మన అమ్మాయిని ఇవ్వండి-' అంటూ వెళ్ళిపోయింది.

భూష : ఆహోఁ-ఎన్నాళ్లయింది పోయి?

రఘు : చాలాకాలం ఐంది. ముప్ఫయ్ వొకటిలో కాబోలు. బెర్నార్డ్ షా 'టూ ట్రూ టు బి గుడ్' రాస్తున్న రోజుల్లోనే అనుకుంటాను.

భూష : మరి షాను మీరెందుకు చూడలేకపోయారు?

రఘు : చెప్పానుగా అదృష్టం వుండాలని. ఎప్పటికప్పుడు వెళదామనే అనుకునేవాణ్ణి. ఒంట్లో ఏదో జబ్బు. సరి—తర్వాత తర్వాత శక్తి మరీ సన్నగిల్లిపోయింది - ఆయనా పోయినాడు!

భూష : 50 లో కాబోలు ఆయన పోయాడు?

రఘు : (కపీమని కూచుని) అరే. ఆ తేదీ నేను మీకు గుర్తు లేదూ? నవంబరు రెండు, పందొమ్మిదివందల యాభయ్. అవాళ లక్ష్మివారం. చనిపోయే నాటికి ఆయనకు 95 ఏళ్లు దాటిపోయినయ్. ప్చ్...మహానుభావుడు. అన్నేళ్లు ఆయన భూమ్మీద వున్నా - నేను చూడలేకపోయానంటే - అదంతా నా దురదృష్టం!

భూష : ఉఁ—ఐతే అమ్మాయికి సంబంధం వుందన్న మాట!

రఘు : ఉండనే వుందిగా మరి! కానీ మా రాజ్యానికి ఆ కుర్రాడొద్దట—

భూష : సరిపోయింది.

రఘు : అందుకు నేనేమీ బలవంతం చెయ్యలేదులెండి. 'నీ యిష్టం' అన్నాను. "నా యిష్టం కాదు. మీరే చెప్పండంది—చెప్పమందని వాళ్ళమ్మ మాట చెప్పి—ఆమెమీది గౌరవం చూపితే బావుం

టుందని సలహాఇచ్చాను. 'వాడొద్దంది. 'ఐతే ఏం చెయ్యమంటావ్?' అనడిగాను. తనకు వెంటనే పెళ్ళి జరిగిపోవాలట— గొప్పకోసం కాదుగాని—ఆమె చాలా అందంగా వుంటుంది.

హను : (కాయితాలు చూసుకుంటూ అవి మడత పెడుతూ తపీమని) చిత్తం—చాలా తెలివయినవారండీ!

రఘు : అదీ నిజమే! అంచేత తనకు పెళ్ళనీ పెళ్ళికొడుకులు కావాలనీ పేపర్లలో వేయించమన్నది. వేయించాను. చాలా దరఖాస్తులొచ్చిపడ్డాయి. కొన్నిటిని అమ్మాయి ఎంచి, వాళ్ళను స్వయంగా ఇంటికి పిలవమంది. సరే—గుమస్తాగారు ఈరోజు నే ఫలానాగంటకు-అంటే ఇదేవేళ—రమ్మని రాశాడు. ఈపాటికి వొచ్చేవుంటారు. మీ రొచ్చారనగానే అమ్మాయికోసమే కాబోలు అనుకున్నాను.

భూష : (నవ్వాడు)

[వీధివేపునుంచి నౌకరు ప్రవేశం]

నౌక : సార్—ఎవరెవరో వొచ్చారు సార్—

రఘు : ఎవరో కనుక్కున్నావా?

నౌక : తమరు పిలిపించారుట—

హను : పేర్లు కనుక్కోలేకపోయావు?

రఘు : పోన్లెండి.

హను : చిత్తం—

రఘు : (నౌకరుతో) సరే—వొకాయన్ని రమ్మను. (నౌకరు వెళ్ళాడు.)

భూష : అమ్మాయి లేనప్పుడు వీళ్ళుమాత్రం వొచ్చి ఏం ప్రయోజనం?

రఘు : మొదట నన్ను చూడమంది. వొచ్చినవాళ్ళను అన్నీ అడిగి—నాకు నచ్చినవాళ్ళను కూచో పెట్టమంది. తనొచ్చి ఆఖరుకు ఎంచుకుంటుం దిట!

భూష : బావుంది. (లేచి) మరి నేను వెళ్లొస్తాను.

హను : చిత్తం—అబ్బాయిగారితో ఆ విషయం రాసి కనుక్కుంటాను బాబూ!

భూష : సరే లెండి! (రఘునాథంగారితో) నమస్కారం!

రఘు : (నమస్కరించాడు)

[భూషణం వెళ్లిపోతూవుంటే నిటారుగా సన్నగానున్న వో యువకుడు ప్రవేశించాడు. భూషణం. అతన్ని చూస్తూ వెళ్ళిపోయాడు. ఆ యువకుడికి కామలు లేని కళ్ళజోడూ, మెలికలు తిరిగిన క్రాఫింగూ వున్నయ్. సిల్కుచొక్కా, తెల్లగావున్న పల్చని పంచ కట్టుకున్నాడు]

యువ : (వొస్తూ,) నమస్కారం—

రఘు : రండి—

యువ : మేష్టారూ! రాజ్యలక్ష్మి తండ్రిగారు మీరే కదూ?

రఘు : ఆఁ!

యువ : నన్ను రమ్మన్నారు — పెళ్ళివిషయం...

రఘు : ఆఁ అవునవును. మీ పేరు ఏమిటన్నారు?

యువ : నా పేరు రాజేశ్వర్. (కూచుంటూ) ఇప్పుడీ సినిమాల్లో హీరోవేషాలూ అవీ వేస్తూ వుంటాడు చూశారూ—

రఘు : నేను చూడలేదులెండి. నేనీ సినిమాలు చూడను. పాకథలు గలవి ఈవూరు ఎప్పుడో వొస్తాయి. ఆఁ—ఐతే?

రాజే : అహాఁ...ఆయన మా పెద్దబావగారి పెద్ద నాన్నకూ—

రఘు : సరే—

రాజే : అంటే నాకు వరసకు—హుఁ—(ఆలోచిస్తున్నాడు)

రఘు : ప్చ్—ఆయన సంగతెందుకు! మీ సంగతేదో చెప్పండి.

రాజే : ఆఁ—నేను బి.ఏ., పాసయ్యాను. ఉద్యోగం బాధ నాకు లేదు — కావల్సినంత డబ్బుంది కాబట్టి. ఐనా 'పురుషలక్షణం' అన్నారని ఏదో చేస్తున్నాను.

రఘు : హూఁహుఁ—ఎందులో?

రాజే : అంటే అమన్య చేశానులెండి — వో పత్రిక్కి కరస్పాండెంటుగా—

రఘు : ఇప్పుడు?

రాజే : మానేశాను చెప్తారూ! అంతా చికాకు! ఐనా నాకు వుద్యోగంతో నిమిత్తం లేదుగా!

రఘు : అవును! మీకు కథలూ నాటకాలూ యిష్టమేనా?

రాజే : చంపేశారు. అవంటే చచ్చిపోతాను.

రఘు : ఎవరు మీ అభిమానులు?

రాజే : ఇంగ్లీషులో షెల్లీ, కీట్సూ — తెలుగులో చలం......

రఘు : ఇంగ్లీషులో అంతే?

రాజే : అంటే ఫ్రాయిడ్‌వీ ఎల్లిస్‌వీ వ్యాసాలు కూడా......

రఘు : సెక్సుగోల. వూఁ—(వేల్తో షా పటం చూపిస్తూ) ఈయనెవరో తెలుసునా?

రాజే : (వో క్షణం చూసి) 'బెర్నార్డ్‌షా' అనుకుంటాను.

రఘు : అనుకుంటానా? (ఛటుక్కున కూచుంటూ) అయ్యో—ఆయనే అది. అది తెలీదూ?

రాజే : ఎప్పుడో చిన్నప్పుడు చూశాను బొమ్మ.

రఘు : ఐతే మీకు షా పుస్తకాలే తెలియవన్నమాట!

రాజే : పుస్తకాలు తెలియకేం! ఆయన బొమ్మను సరిగ్గా చూడలేదు.

రఘు : మా యింటికొస్తే ఏనాడో చూసివుండేవారు—

రాజే : ఇహమీదట రోజూ చూడొచ్చులెండి.

రఘు : (వినిపించుకోకుండా) ఆ విగ్రహం — ఆయనా — ఆ మొహంలో తేజం......

రాజే : షా రాసిన కొన్ని పుస్తకాలు చదివాను కాని చెప్తారూ—అంత జాగ్రత్తగా చదవలేదు.

రఘు : నా దగ్గిరున్నయ్-తీసుకెళ్లి చదవండి.

రాజే : అట్లాగేలెండి. ఆఁ—మరి రాజ్యలక్ష్మి విషయం....

రఘు : అదే అదే-అమ్మాయి లేదు-మీరు ఆ గదిలో కూచోండి-వొస్తుంది.

రాజే : అంటే?

రఘు : అంటే-ఆమెకు కావలసిన వరుడొక్కడేగా-మీ వంటివాళ్లింకా కొందరున్నారు. వీ అందర్నీ వోసారిచూసి ఎవర్నో చేసేసుకుంటుంది!

రాజే : అందుకా అవతలవాళ్లున్నారు!

రఘు : అమ్మాయితో మీకేమన్నా పరిచయం వుందా?

రాజే : అంత అదృష్టం ఎక్కడ చెప్తారూ? మొట్ట మొదట మహిళామండలిలో ఆమె ఒకనాడు ఉపన్యాసం యిస్తూవుంటే విన్నాను— విని నీరయిపోయాను. ఆమె వాక్చాతుర్యం, అంతకుమించిన ఆమె సౌందర్యం చూసి, చకితుణ్ణయిపోయాను. ఆ నాటినుంచీ 'ఆమె'ను పెళ్లి చేసుకోవాలనే తలంపులోనే వున్నాను.

రఘు : తర్వాత మళ్లీ మీరు చూడలేదా ఆమెను?

రాజే : చూశాను. ఓసారి ఓ యువకుడితో వెళ్తూవుంటే చూసి ఆశ్చర్యపోయాను—ఆమెకు కొంపతీసి పెళ్లయిపోయిందేమోనని. కాని లేదని తర్వాత ఎవరో చెప్పారు.

రఘు : (ఛటాలున కూచుని) షాకు పెళ్లెప్పుడయిందో తెలుసా?

రాజే : అచ్చే తెలీదండీ.

రఘు : ఆఁ?-1898లో. (వెనక్కువాలుతూ) ఐతే ఏమంటారూ?

రాజే : ఏమిటంటాను? మీ అమ్మాయిని వివాహం చేసుకోవాలని తహతహలాడుతున్నానంటాను.

రఘు : సరే ఐతే, ఇట్లా లోపలికిపోయి కూచోండి. గుమస్తాగారూ! ఈయన్ని లోపలకు తీసుకెళ్లండీ?

హను : చిత్తం—

[హనుమాన్లు వెనకాలే, రాజేశ్వర్ లోపలకు వెళ్లాడు.]

రఘు : ఒరేయ్!

నౌకరు : (వీధివేపునుంచి వొచ్చి) సార్!

రఘు : ఇంకా వున్నారుకదూ అక్కడ?

నౌకరు : వున్నారండీ.

రఘు : ఇంకోర్ని రమ్మను.

నౌకరు : (వెళ్లాడు.)

[వెళ్లిన కొన్ని క్షణాల్లో ఇంకోఆయన ప్రవేశించాడు. ఆయన సన్నగా పొడుగ్గా వున్నాడు. మనిషి నలుపు. ముప్ఫయ్ఏళ్లు దాటిపోయాయి. పంచె, సాధారణమైన చొక్కా వేసుకున్నాడు. త్వరత్వరగా వచ్చి కూచున్నాడు.]

రఘు : (ఓ క్షణం తెల్లబోయి అతనికేసి చూసి) మీరు... పెళ్ళి విషయమయి వొచ్చారా?

ఆయన : అవునండి. (లేచి నిలబడి) నా పేరు మొట్టమొదట (గట్టిగా) అంటే—చిన్నప్పుడు మా యింట్లో...

రఘు : కూచోండి, కూచోండి.

ఆయన : ఫరవాలేదులెండి. నిలబడి చెబితే 'ఫోర్స్' వొస్తుంది. మా యింట్లో చిన్నప్పుడు నన్ను 'గోపూ' అని; 'గోపీ' అనీ పిలిచేవారు. పేరు గోపాలరావు. తర్వాత 'గోపాల్' అయ్యాను. ఇప్పుడు 'గోపాలోవ్.'

రఘు : అదేమిటి?

గోపా : అంతే! ప్రపంచంలోవున్న ఇన్ని దేశాల్లోనూ నా అభిమాన దేశం రష్యా. నా అభిమాన వ్యక్తులు-లెనిన్, మార్క్స్! వీళ్ళు నాకు పూజ్యులు కూడా! (కూచున్నాడు).

రఘు : మీరు కమ్యూనిస్టు-(అని చూశాడు).

గోపా : అవును. ఐనంత మాత్రాన ఇతర పార్టీలమీదా వ్యక్తులమీదా నాకు విద్వేషభావమూ, ద్వేషమూ లేవు. (పా పటాన్ని చూసి) ఆ ప్లేస్‌లో, ఇదే నా యిల్లయితే-అక్కడ ఆ పటాన్ని తీసేసి-

రఘు : అమర్యాదగా మాట్లాడకండి. ఐతే మీరు మా అమ్మాయిని పెళ్ళి చేసుకోవాలను కుంటున్నారు?

గోపా : నిస్సంశయంగా అనుకుంటున్నాను. అమ్మాయి అందచందాల్నీ తెలివితేటల్నీ చూసి నేను ప్రేమించలేదు. ఆమెకున్న ధనాన్ని చూసి ప్రేమించాను.

రఘు : ఏమిటీ?

గోపా : అవును. పెళ్ళయిన తర్వాత ఆ ధనాన్ని బీదవాళ్లకూ, ప్రపంచానికీ పంచేస్తాను. అం-గుర్తుందా? 'కామ్రేడ్ గోపాలోవ్' నా పేరు!

రఘు : ఉంది లెండి. ఐతే ఇంతవరకూ మీకు పెళ్లే కాలేదూ?

గోపా : కాలేదు. ఎంచాలెంటాలా-డబ్బున్న అమ్మాయిని చేసుకోవాలనే నా అభిలాష. ఇంతవరకూ అటువంటి అమ్మాయి ఎక్కడా దొరకలేదు. ఈ అమ్మాయిమీద ఏనాడో నా కన్ను పడ్డది. అవకాశం ఇవాళొచ్చింది.

రఘు : సరే-అమ్మాయి వొస్తుంది. ఆ గదిలో కూచోండి.

గోపా : థేంక్స్!

రఘు : ఆమెవొచ్చి అడిగితే మీ వృద్ధికాలు చెప్పండి.

గోపా : (లేచి) ఊరికే చెప్పటమా? ఉపన్యాసాలు దంచుతాను. నా జీవితంలో ఎక్కువ భాగం ఉపన్యాసాలు ఇవ్వటంలో గడిపాను. నేను లేచి నిలబడి 'కామ్రేడ్స్' అన్నానంటే—హైడ్రోజన్ బాంబ్ పేలినట్టు - యావత్తు భూప్రపంచమూ గడగడలాడుతుంది! (చెయ్యెత్తి) 'కామ్రేడ్ గోపాలోవ్' అంటే..

రఘు : అవునవును. (లోపలకు చూపిస్తూ) అట్లా కూచోండి. గుమాస్తాగారూ (గుమాస్తా వచ్చాడు). ఈయన్ను కూర్చోపెట్టిరండి. (గుమాస్తా గోపాలోవ్ వెళ్ళారు. గుమాస్తా తిరిగొచ్చాడు).

రఘు : ఈయన మూడోరా-కమ్యూనిస్టట.

హాను : వింటున్నాను.

రఘు : కూచోండి.

హాను : (కూర్చుంటూ) నేతిబీరకాయలో నెయ్యి ఎంత వుందో కమ్యూనిజంలో నిజం కూడా అంతే వుందంటారు! ఈయన్ను అమ్మాయి వరిస్తుందటారా?

రఘు : ఏమో చెప్పలేం. దానిష్టం. ఎవడిని తను తెచ్చుకున్నా అల్లుడుగా స్వీకరించటానికి నాకేమీ అభ్యంతరం లేదుకదా-ఇవాళ వచ్చిన

వాళ్ళల్లో ఎవర్నో ఒకర్ని చేసేసుకుంటుందిట మరీ-ఒక డొచ్చినా వాణ్నే చేసుకుంటా నన్నది.

హను : (నిట్టూర్చి) ఏమిటో-నిక్షేపంలాంటి కుర్రాడు మీ బావగారు. ఈడూ జోడూ చదువూ ధనమూ అన్నిట్లోనూ ఇద్దరూ సరిపోతారు. అమ్మగారుకూడా పోతూపోతూ తనతమ్ముణ్నే చేసుకోమంది. చేసుకుంటే ఆమె ఆత్మకు శాంతి వుండిపోను.

రఘు : అమ్మాయి కిష్టంలేదు పోనీండి. వాడంటే దీనికెందుకో అంత అయిష్టం!

హను : అంతా ఏకో...(అనబోయి ఆగిపోయాడు)

రఘు : చూడండీ. ఇంకెవరున్నారో చూసి-ఇంకో అయన్ను రమ్మనండి.

[గుమాస్తా వెళ్ళాడు. వెళ్ళిన కొన్నిక్షణాల్లో తెల్లగా పాలిపోయిన దేహంగల వ్యక్తి ప్రవేశించాడు. వొదులుగా పొట్టిగావున్న పైజమా. చౌక్కా భుజంమీద చిరుగు. జుట్టంతా రేగి వుంది. చేతిలో పుస్తకాలు)

ఆయన : (వొస్తూ) వందనసహస్రాలతో...

రఘు : దయచేయండి.

ఆయన : (కూమని షా పటంకేసీ, ఆయనకేసీ చూసి) ఆ పటం మీదా-లేక మీరు 'షా'నా-లేక నా కళ్ళముందు పల్చటి గాజు తెరలు వాలాయా?

రఘు : అదేమీ కాదు. ఆయన 'షా' నే-నేను నేనే. ఆయనకూ నాకూ పోలికలుండొచ్చు మీ పేరు...

ఆయన : వస్తున్నాను. నన్ను 'రుధిరశ్రీ' అంటే పలుకుతాను.

రఘు : అదేమిటి?

రుధి : ఏముంది? ఏమీ లేదు. తల్లిదండ్రులు చిన్నప్పుడు ఏ ముహూర్తంలోనో - దుర్ముహూర్తంలో-నాకు నామకరణం చేసివుంటారు-నన్నడక్కుండా. నేను స్వతంత్రుణ్నయ్యాక అది చెరిపి, అక్కడ 'రుధిరశ్రీ' అనే నాలుగు అక్షరాలు రక్తంలో చెక్కినట్టు ప్రతిష్ఠచేశాను. తమ నామధేయం రఘునాథం అని విన్నాను.

రఘు : (కాదన్నట్టు తలూపి) రఘునాథ్ "షా!"

రుధి : శభాష్! ఈ నాటికి మీవంటి మానవుణ్ణి చూపినందుకు దేవుడికీ, చూసినందుకు మీకూ నా కృతజ్ఞతలు. స్వోత్కర్ష పనికిరాదంటారు. ఐనా కవుల విషయంలో పరవా లేదన్నారు మావాళ్లు. షా అన్నాట్ట—"తనను గురించి వ్రాసుకునే శక్తి తనకే వుంటున్నప్పుడు ఇంకోడు ఎందుకు వ్రాగడాలి" అని.

రఘు : అవునవును!

రుధి : అంచేత ఆ శక్తి నాకుండిగా, మహాకవులంతా వాళ్ల గొప్పతనాన్ని వాళ్లే వర్ణించుకున్నారు. పెద్దన్నగారు రాయలవారితో ఏమన్నాడు? "పెద్దనబోలు పండితులు...

[రాగవరసన చదవబోతాడు.]

రఘు : సరేలెండి - మీరు కవులని బోధపడ్డది.

రుధి : తెలివయినవాళ్లుకాబట్టి మీరు ఇట్టేగ్రహించగలిగారు. కవినే కాదు. పత్రికాధిపతిని. అభ్యుదయంకోసం అటుమటించి - ఆయురారోగ్యాలు అర్పించే అధివాస్తవిక కారుణ్ణి. కవిని! పత్రికల్లో రాస్తాను. ఈ మధ్యనే "చెత్తా - చీపురూ" అనే నాటకం రచించాను. దాన్ని ప్రదర్శించటానికి ఏర్పాట్లు కూడా చేస్తున్నాను. నన్ను చూసి చాలామంది పిచ్చివాడనీ, వెర్రివెధవనీ అన్నారు. నేను లక్ష్యపెట్టను లెండి. ఏనుగు నడుస్తున్నప్పుడు కుక్కలు మొరగటం సహజం!

రఘు : (అవన్నీ ఎందుకన్నట్టు మొహం పెట్టి) మీరు షా నాటకాలు చదివారా?

రుధి : కొన్ని చదివాను.

రఘు : ఏవి?

రుధి : గుర్తులేదు.

రఘు : పోనీ వాటిల్లో మీకు నచ్చిందేదో చెప్పగలరా?

రుధి : వూఁ..."సీజర్ అండ్ క్లియోపాట్రా-"

రఘు : అందులో మీకు నచ్చిన పాత్ర ఏది?

రుధి : అదంతా తెలీదుసుమండీ! షాకు నేను సమకాలికుణ్ని కాను. ఆయన పోయిన తర్వాత నేను కవిని కావలిసొచ్చింది!

రఘు : బావుంది. పోనీండి- 'ఆంద్రోక్లిస్ అండ్ ది లయన్; చదివారా?

రుధి : సినిమా చూశాను.

రఘు : సరే. అందులో ఏ పాత్ర బావుందంటారు?

రుధి : సింహం.

రఘు : మరి ఆంద్రోక్లిస్‌ను ఎవడికిస్తారు?

రుధి : వాడికంటె గొప్ప దా సింహం-

రఘు : మీకు తెలిసిన షా నాటకాల పేర్లు కొన్ని చెప్పండి.

రుధి : ఇట్లా పరీక్ష చేస్తారని ముందే తెలిస్తే బట్టీయమన్నా వేసుకొచ్చేవాణ్ని. పెళ్లిచూపుల కనుకున్నానుగాని, ఎగ్జామినేషన్ హాలనుకోలేదు. ఐతే ఒకటి తెలిసింది. పెళ్ళి అన్నా పరీక్షే—'అగ్నిపరీక్ష'! ఐనా మీకు సమాధానాలు ఇస్తాను కాని ఓ విషయం అడుగుతాను చెబుతారా?

రఘు : అడగండి.

రుధి : మరేమీ అనుకోరుగదా—

రఘు : అబ్బే—అడగండి.

రుధి : ఏమీ లేదు. ఇదివరకు ఎక్కడన్నా మీరు స్కూలు మేష్టరీ ఉద్యోగం చేశారా?

రఘు : భలేవారే!—మామూలుగా మీ శక్తి చూస్తున్నాను. అంతే!

రుధి : సరే. ఐతే ఇందాక అడిగిన ఆ యక్ష ప్రశ్నేమిటి?

రఘు : యక్ష ప్రశ్న నేనేమీ అడగలేదే!

రుధి : మామూలు ప్రశ్నేనా?

రఘు : ఆఁ- షా రాసిన రెండు మూడు పుస్తకాల పేర్లు చెప్పమన్నాను.

రుధి : మీరు కొనుక్కునేందుకా?

రఘు : సరిపోయిందయ్యా-లక్ష పుస్తకాలున్నాయ్. నీ శక్తి యింతేనని తేలిపోయింది.

రుధి : చెబుతున్నాను. 'మాన్ అండ్ సూపర్ మాన్', 'పిగ్ మాలియన్' వూఁ...

రఘు : 'విడోయర్స్ హౌసెస్.'

రుధి : అవును.

రఘు : అదే అతని మొదటి నాటకం అనుకుంటాను. ఆఁ—అతని మొదటి నవల చెప్పూ.

రుధి : చెప్పలేను.

రఘు : 'ఇమ్మెచ్యూరిటీ'. సరే—నువ్వు షాను 'స్టడీ' చెయ్యలేదు. నేను బోలెడంత చేశాను. ఐనా నాకే కొన్ని కొన్ని విషయాలు తెలీవు. సరేలే-నీ పేరు...?-అన్నట్టు ఏదో చెప్పావు. నీ వుద్యోగం?

రుధి : కవిత! పద్యాలూ గేయాలూ రాయటం ప్రచురించటం.

రఘు : వాటివల్ల వొచ్చే ఆదాయం నీకు సరిపోతుందా?

రుధి : ఏమాత్రమూ చాలదని—నా స్వరూపాన్ని బట్టీ-నా చొక్కాను బట్టీ మీరు తెలుసుకోవొచ్చు. ఐనా నేను బ్రతకటానికి కాదు కవిత రాయటం. బ్రతికివున్నాను కాబట్టి!

రఘు : మరి నీకు పెళ్ళి అవసరం కాదూ?

రుధి : పెళ్ళి అవసరం అంటారేమిటి? జీవిత గ్రంథంలోని మధురాతి మధురాధ్యాయం అక్కడే వుందంటారు. నేను పెళ్ళి ఏనాడో చేసుకునివుందును. కాని నన్ను నేనే పోషించుకునే శక్తిలో లేను. ఆమెనుకూడా ఎక్కడ అని మానేశాను. రాజ్యలక్ష్మివంటి గొప్పయింటి పిల్లయితే పరవాలేదు చూడండి- ఇద్దరమూ హాయిగా వుండొచ్చు! అందులోను మీ రాజ్యలక్ష్మిని అమర్య ప్రేమించాను కూడా. ఆ రోజుల్లోనే వో చిన్న గేయం అల్లాను. (తీసి చదువుతూ)

రాజ్యంనా
సామ్రాజ్యం
ఈ అగ్నికి
నివ్వే ఆజ్యం
నాకెంతో పూజ్యం...

రఘు : బావుంది బావుంది. ఐతే యిప్పుడు ప్రేమించటం మానేశావా ఏమిటి?

మధి : ఇంచుమించు నిన్నటిదాకా మానేశాను.

మీరు రమ్మన్నారు చూడండీ—ఆక్షణం నుంచీ మళ్ళీ మొదలెట్టాను.

రఘు : అంతా నీయిష్టమల్లే నే వుంది.

రుధి : నేను ప్రేమించుకోటానికి ఆమె యిష్టంతో పనేమిటి?

రఘు : అవున్లే. (గుమస్తా వొచ్చాడు. ఆయనతో) ఈయన్ను కూడా కూచోమనండి.

రుధి : ఎక్కడ?

రఘు : ఆ గదిలో కూచోండి, అమ్మాయి వొస్తుంది.

రుధి : ఐతే చక్కటి కొన్ని గేయాలు తయారు చేసి వుంచుకుంటాను. (గుమస్తా వెనకాలే రుధిరశ్రీ వెళ్లాడు. గుమస్తా తిరిగొచ్చాడు)

గుమ : చిత్తం — ఇంకొక్కడే వున్నట్టున్నాడు. పిలవమంటారా?

రఘు : ఆఁ—ఇవాళ ఇదోగోల వచ్చిపడ్డది. పిలవండి.

[గుమస్తా వెళ్తున్నాడు]

రఘు : అమ్మా యింకా రాలేదండీ?

గుమ : (ఆగి వెనక్కు తిరిగి) చిత్తం—ఈపాటికి కొస్తూవుండాలి; చాలాసేపయింది వెళ్ళి. (వెళ్లాడు)

[లావుగా పొడుగ్గా వున్న వ్యక్తి ప్రవేశం. పాంటు, బుష్‌కోటు, బూటు వేసుకున్నాడు. నెత్తిన 'ఈవినింగ్ హాట్' వుంది. సన్నగా పొడుగ్గా మీసం. చేతిరుమాలుతో మొహం తుడుచుకుంటూ]

వ్యక్తి : 'గుడ్ డే సర్'

రఘు : సరే కూచోండి.

వ్యక్తి : (కూచుని) రాజ్యలక్ష్మి 'ఫాదర్' కదూ మీరు?

రఘు : (ఔనన్నట్టు తలవూపాడు)

వ్యక్తి : మిమ్మల్ని వోసారి ఎక్కడో చూశాను. బహుశా మీ తోటలో ఓసాయంత్రం అనుకుంటాను.

రఘు : ఐవుంటుంది.

వ్యక్తి : ఆఁ—ఏదీ మీ అమ్మాయి?

రఘు : వస్తుంది, వస్తుంది. మీ పేరు...ఉద్యోగం...చరిత్రా...

వ్యక్తి : చెబుతాను. నా పేరు సుకుమార్, యం. ఏ.,

రఘు : మీకు మా పుస్తకాలు ఎప్పుడన్నా పాఠాలుగా పెట్టారా?

సుకు : ఏడిశారు. ఎప్పటిమాట! పాఠాలు ఏమేమిటున్నాయో అప్పుడే తెలిసేదికాదు—ఇప్పుడేం తెలుస్తుంది? అయినా మెదడున్నవాడికి పాఠాలతో పనేమిటి? ఆఁ నాకు చాలా డబ్బుంది. మానాన్నకు ఇద్దరు పిల్లలం. మాఅన్నయ్య బి. ఏ. చదివి, జర్నలిస్టుల్లో కలిసిపోతానని వెళ్లి—వో పత్రిక పెట్టి దివాలా తీసి ప్రస్తుతం యింటిదగ్గిరే కూచున్నాడు. వాడికి ఎప్పుడో పెళ్లయింది—ఇప్పుడిద్దరు పిల్లలు. పెద్దవాడు మూడోఫారం చదువుతున్నాడు — రెండోవాడు ఫస్టుఫారం కాబోలు. మానాన్న పోయి ఆరేళ్ళయింది. ఆయనపోవటమే మేలుగావుంది. బతికుంటే నన్ను నాయిష్టంవొచ్చినట్టు తిరగనిచ్చేవాడు కాదు—పైగా యిటువంటి పెళ్ళిళ్ళకు ఛస్తేవొప్పుకోడు. మీకు చెప్పానా—రాజ్యలక్ష్మి యింటర్‌లో నాకు క్లాస్‌మేట్ అప్పట్నుంచీ ఆమెను నేను ప్రేమిస్తూనే వున్నాను. ఆ అమ్మాయినితప్ప ఇంకొకర్ని పెళ్ళిచేసుకో దల్చుకోలేదు!

[రఘువాక్‌షా కుర్చీలో పడుక్కుని 'పైప్' పీలుస్తూ వింటున్నాడు] ఈడూజోడూ ఎట్లా వుంటుందంటారు? బావుంటుందని చాలామంది అన్నారు. నిజంకూడా అంతే! నేను రాజ్యలక్ష్మి అన్న పేరు మార్చేస్తాను. 'గ్రీక్ గాడ్‌సెస్'లాగా ఏదో పేరు పెడతాను. ఎట్లావుంటుంది?

రఘు : చాలా బావుంటుంది. మీరు ఉద్యోగం చేస్తున్నారా?

సుకు : ప్రస్తుతం మీ అమ్మాయిని ప్రేమించటంతప్ప ఇంకోవుద్యోగం చెయ్యటంలేదు. నాకు వుద్యోగాలకు లోటులేదులెండి. 'తాతాస్' చూశారూ. ఏవాడో నాకు జనరల్ మానేజర్ పదవి యిస్తామన్నారూ—

రఘు : అంటే మీకే వొద్దన్నట్టున్నారు.

సుకు : నా కెందుకండీ అవుద్యోగం?

రఘు : అవునవును. మీ నాన్నగారు ఏం చేసేవారు?

సుకు : ఆఁ—ఏదో ఏడిసేవాడు. వాడు గొప్ప కోతలరాయుడులెండి. తనకు వాడెవడో ఉద్యోగం యిస్తానన్నాడనీ, వీడెవడో లక్ష పెట్టుబడిపెట్టి తనను వ్యాపారం నడిపించాలని కోరాడనీ—ఐతే తనుమాత్రం అయిష్టంగా వుండేవాణ్ణనీ కోసేవాడు. అంతకు తప్ప ఇంకేమీ ఆయన చెయ్యలేదు. డబ్బుందిగా—వాళ్ళనాన్న ఆర్జించింది. అది మింగుతూ కూచునేవాడు!

రఘు : మా రాజ్యలక్ష్మి మీకు క్లాస్ మేట్ అన్నారు కదూ!

సుకు : అప్పుడే మరిచిపోయారా? ఆమెకు నేనూ, నాకు ఆమే క్లాస్ మేట్సు. ఆరోజుల్లో ఆమెకున్న గ్లామర్ ఈనాడు ఈ సినిమా తారలకు ఏకోశానా లేదు. అంటే ఐతే యిప్పుడు మాత్రం లేదనా?—

రఘు : వుంటుంది లెండి. మీ రాగదిలో కూచుంటారా?

సుకు : అలాగే (లేచి) అక్కడ యింకెవరన్నా వున్నారా?

రఘు : మీలాంటివాళ్లే వున్నారు.

సుకు : ఏడిశారు (లోపలకు పోయాడు)

[రఘునాథం శ్వాసవిడిచి, బద్ధకంగా వొళ్లు విరుచుకొని, కుర్చీలో కాళ్లుజాచి పుస్తకం తీసి విప్పాడు. రెండు క్షణాల్లో గుమస్తా వీధి వేపునుంచి ప్రవేశించాడు]

రఘు : (అతన్ని చూసి) ఇంకా రాలేదా అమ్మాయి?

హను : లేదండీ. పొద్దున్నే వెళ్ళిపోయారు. ఎక్కడికెళ్లారో మరి.

రఘు : సరిగ్గా ఈ వేళకు రావాలే—

[లోపల్నుంచి ఏదో గోల వినపడుతున్నది.]

రఘు : (విని) ఆ శబ్దం ఏమిటో చూడండి.

హను : చిత్తం. వాళ్ళంతా ఆ గదిలో చేరి మాట్లాడుకుంటున్నారల్లే వుంది.

రఘు : పోట్లాడుకుంటారో ఏమిటో—వాళ్ళందర్నీ యిక్కడికే రమ్మనండి.

[హనుమాన్లు 'చిత్తం' అని వెళ్ళాడు. తర్వాత రాజేశ్వర్, గోపాలోవ్ రుధిరశ్రీ, సుకుమార్ వొచ్చి కూచున్నారు]

రుధి : (గోడమీది పటాలకేసి చూసి) ఆ రెండు పటాల్లో—అంటే 'మా' పటం తప్ప—అటున్న గాంధీ యిటున్న లింకనూ ఏమిటి చెబుతున్నారు?

సుకు : నీ మొహం చెబుతున్నారు.

రుధి : నా మొహమా? ఆ పటాలు పెట్టటంలో పెద్ద నిగూఢమయిన అంతరార్థం దాగివుంది. ఏమిటంటారా—అటున్న గాంధీ—ఇటున్న లింకనూ అంత గొప్పవాళ్ళయినప్పటికీ—ఇద్దరూ గుండుదెబ్బలవల్లే మరణించవలసొచ్చింది!

గోపా : గొప్ప పాయింట్ చెప్పావ్—(రఘునాథంతో) ఆఁ—ఇంకా రాలేదండీ మన అమ్మాయి?

రఘు : రావాలి మరి.

రుధి : వొచ్చే వేళయిందా?

రఘు : ఐంది.

రాజే : ఇంకేమన్నా ఆలస్యం వుంటుందా?

రఘు : వుండదు.

సుకు : నాకు టైమైపోతూంది. ఇవాళ సాయంత్రం 'కల్చరల్ అసోసియేషన్'లో మీటింగ్ వుంది—మన అధ్యక్షతన.

గోపా : (ఆశ్చర్యంగా) మీ అధ్యక్షతనా?

సుకు : ఆఁ—ఇంకా తెలీదా మీకు?

రాజే : ఎక్కడా వినేలేదే!

సుకు : సారీ! వూరంతా మోతగావుంటే, ఇంకా మీకు తెలియదంటే మీరు ఎంత అజ్ఞానంలో వున్నారు!

రుధి : మీరు మహోజ్ఞానిలాగే మదించినట్టు మాట్లాడుతున్నారు—(రఘునాథం ఈమాట లేవీ పట్టించుకోకుండా చదువులో నిమగ్నుడయిపోయాడు)

సుకు : (లేచి) ఏమిటీ! నీకూ నాకూ సాటా? నువ్వా నీవేషం—నీ చొక్కా — నీమొహానికి రాజ్యలక్ష్మి కావాలని పరుగెత్తుకొచ్చావ్. రాజ్యలక్ష్మి! నీకేమాత్రం డబ్బుంది? ఏమాత్రం పలుకుబడి వుంది? ఎంతనీకు...

రాజే : (ఆపుతూ) కూచోండి మేష్టారూ—అనవసరంగా ఎందుకు!

సుకు : అనవసరం కాదండీ (కూచుని) అవసరమే! లేకపోతే ఇతనికెందుకు చెప్పండి—ప్రతివాడూ ఈరోజుల్లో కవివనటం ఏదో రెండక్షరాలు పేరు పెట్టుకొని వెనక్కు శ్రీ తగిలించుకోటం — రుధిరశ్రీట—రుధిరశ్రీ—నాన్సెన్స్! స్పెల్లింగ్ గాని ప్రతీవాడికి ప్రేమే ఈరోజుల్లో!

రుధి : అదే నేనూ అంటున్నాను—ప్రేమ ఎంత చవకయిపోయింది? దానికున్న విలువ నాశనమయిపోయింది! దాని పవిత్రతంతా మట్టి కొట్టుకుపోయింది. (సుకుమార్ వేపు చెయ్యి చూపిస్తూ) అడ్డమయినవాడూ ప్రేమించటం మొదలెడుతున్నాడు!

రాజే : అందుకే నేను మానేద్దామనుకున్నానుగాని - ఎవర్నో 'వొకర్ని' ప్రేమించటంలో తప్పు లేదనుకున్నాను.

సుకు : మీకేం తెలుసునండీ ప్రేమసంగతి?

రాజే : మీకు మాత్రం ఏం తెలుసూ?

రుధి : మీకెవ్వరికీ ఏమాత్రమూ తెలీదు.

గోపా : అసలు ఎవ్వరికీ ఏమీ తెలీదు. మీరంతా కేవలం 'ఆమె'నే ప్రేమించారు. అందులో స్వార్థం లేదూ? నేను—నేనేం చేస్తాను? ఆమె ధనాన్ని పొంది లోకంలో విరజిమ్ముతాను. నా ప్రేమ నిస్స్వార్థం—అదంతా లోకకళ్యాణంకోసం!

సుకు : కోయ్—

గోపా : అబ్బాయ్! నువ్వు అనవసరంగా అందరితోటి పోట్లాట కొస్తునావ్—నేను కోస్తున్నానంటావా? నువ్వు కొయ్యలేదూ? ఇవాళ అక్కడెక్కడో ప్రెసిడెంట్ గిరీ వెలగబెడతానన లేదూ—ఇది ఎలాటికోత?

రుధి : చాలా లేతకోత—

సుకు : మీరంతా అజ్ఞానులు! మీతో నాకు వాదనేమిటి?

రాజే : ష! నోరుముయ్యండి అవతల ఆయన చదువుకుంటున్నారు (క్షణం ఆగి) కాని మేష్టారూ! నిన్ననో జ్యోతిష్కుడు చెప్పాడు—'రేపు నీకు కావల్సిన భార్య దొరుకుతుంద'ని.

గోపా : అసంభవం! నే నొకణ్ణి ఇక్కడున్నప్పుడు అట్లా ఎవ్వడూ అనడు.

సుకు : రాజ్యలక్ష్మిని నేను ఏనాటినుంచో 'లవ్' చేస్తున్నాను. కాబట్టి ఆమె నాది.

రుధి : 'నీది' ఏమిటయ్యా నీ మొహం—నీది కాదు నాది!

గోపా : ఛప్. నీది కాదు—నాది!

సుకు : (గట్టిగా) నాది!

రాజే : యిళ్ళ...నా జోస్యం నిజం మేష్టారూ. మీ ఎవ్వరిదీ కాదు. నాది!

గోపా : జోస్యాలు నిజం అయ్యే కాలం కాదయ్యా ఇది—

సుకు : అయ్యా. టైమ్ అయిపోతోంది.

రుధి : అవునవును. మీరు మీటింగుకు అధ్యక్షులవారు కావాలి!

[నౌకరు ఓ ఉత్తరం తీసుకొచ్చి రఘునాథ్ షా కు ఇచ్చాడు. ఆయన చూసి, కపీమని లేచి కూచుని]

రఘు : అబ్బాయిలూ! అంతా యిది వినండి.

సుకు : ఏమిటది?

రఘు : 'షా' తనకు ఇష్టమయిన అమ్మాయినే పెళ్ళి చేసుకున్నాడు. ఆఁ-నేను మీకు మొదటే చెప్పాను. చూశారూ-అమ్మాయి యిష్టమే ఆమె పెళ్ళివిషయంలో అని.

రుధి : అవునవును. ఆమె యిష్టమే మంచిది. ఆడవాళ్ళకు కవులంటే మహాయిష్టం!

సుకు : నాన్సెన్స్! చదువంటే వాళ్ళకిష్టం. అందులోనూ మనిషి నాలాగా నీటుగా వుంటే మరింత ఇష్టం.

యాత్రా మార్గదర్శి: హిందూ, బౌద్ధ, జైన చారిత్రిక, పౌరాణిక బదరి, కేదారి, అమరనాథ్, పశుపతినాథ్ కైలాస మానససరోవరాది క్షేత్రములనుగూర్చి వివరించు గ్రంథము. క్రౌనులో 1026 పుటలు, 300 బ్లాకులు, రెండు భాగములు. భాగము 1 కి రు. 4/- పోస్టేజిరు. 1-10-0. శ్రీరామనామక్షేత్రము, గుంటూరు 1

గోపా : ఐతే ఆమె వొస్తున్నదా యిప్పుడు ?

రాజే : ఆలశ్యం చేయించకండి-ముహూర్తం దాటి పోతూంది.

రఘు : సరే. ఇది వినండి. మిమ్మల్ని కష్టపెట్టి నందుకు చాలా విచారిస్తున్నాను.

రుధి : అఁ....కష్టం ఏముందిలెండి-మాకోసమేగా !

గోపా : అదేమిటి-కష్టం అంటారేమిటి ?

రఘు : మా అమ్మాయి రాసిన వుత్తరం యిది.

సుకు : ఏమని ? నన్ను చూడకుండానే చేసుకుంటా నటుందా ఏమిటి ?

రఘు : వినండి. ఆమె రాసినది చదువుతాను. (చదువుతూ) నాన్నగారికి – మీరు అంతమందినీ నా పెళ్ళి విషయమయి ఆహ్వానించి వుంటారనుకుంటాను. కాని ఎవర్నయితే మొదట్నుంచీ వొద్దంటున్నానో ఆ మామయ్యనే చేసుకోటాని కిప్పుడు నిశ్చయించుకున్నాను. సాయంత్రమే పెళ్ళికి ఏర్పాటు చెయ్యండి. మనింటి కొచ్చిన పెద్దమనుషుల్ని ఏమీ అనుకోవద్దని చెప్పి ఈ ఆశాభంగం కలిగించినందుకు క్షమించమనండి.

–రాజ్యం

[ఈ వుత్తరం విని అంతా కొయ్యబారి పోయారు.]

సుకు : (కూలబడుతూ)గొప్పడిసప్పాయింట్ మెంట్! నా జీవితంలో ఎప్పుడూ ఎరగను.

గోపా : ఇంత న్యూసెన్స్ ఎక్కడా నేను చూడ లేదు.

రాజే : నన్ను ఖూనీ చేసేశారు–

రుధి : క్లోరోఫారమన్నా ఇవ్వకుండా ఎందుకు చెప్పారండీ నాకీ ఘోరవార్త ? ఇహ నేను వెళ్ళి ఆత్మహత్య చేసుకుంటాను.

రఘు : అది పిరికితనం. కాని వొకటి - ఇందాకే వొకాయన వొచ్చి ఆయన కో కూతురు పెళ్ళికి వుందని అన్నాడు. అక్కడ 'ట్రై' చెయ్యండి. ఆయన పేరు భూషణంగారు- పెద్ద జమీందారు–

గోపా : ఐతే వెళ్తున్నాను-(కోపంగా పోయాడు)

రుధి : నాకు మరెవరూ వొద్దు. అంతా ఘోరం-ద్రోహం-మోసం. నాకే గనక కన్నీరుంటే అదంతా ఒలకబోసేందుకు సిద్ధపడాలి !

రాజ్యం నా
ప్రేమ సామ్రాజ్యం
ఈ అగ్నికి నువ్వే అజ్యం
నా కెంతో పూజ్యం (పోయాడు)

సుకు : (లేచి) రాజ్యలక్ష్మివంటి కూరుపిని నేనా చేసుకుంటాను ? ఛీ-రా-జ్య-లక్ష్మి-(పళ్లు పటపట కొరుకుతూ పోయాడు)

రాజే : సెలవ్ మేష్టారూ-ఆడవాళ్ళ మనస్సులు క్షణక్షణానికీ మారుతూంటాయని కవులు వూరికే అన్నారా ? హుఁ...(నిట్టూరుస్తూ నిష్క్రమణ)

రఘు : (అటూ యిటూ చూసి) గుమాస్తాగారూ-గుమాస్తాగారూ–

[గుమాస్తా ఆత్రుతగా ప్రవేశిస్తూ వుంటే తెర వాలిపోతుంది]

ఇలా, నే నాలోచిస్తూండగా నాన్న వచ్చారు. ఆయన చేతిలో కూడ అదే పత్రిక ఉంది.

"అమ్మాయి...శారదా. ఈ ప్రకటన చూశావా" ...అన్నారు.

"చూశాను నాన్నా" అన్నాను.

"నీ ఫోటో కూడ ఒకటి పంపుదాం" అన్నారు.

నేను మౌనంగా ఊరుకున్నాను...నాన్న కేమో ఆశ. పదిరాళ్ళు వేస్తే...ఏదో ఒకటి తగులుతుందని... నా ఫోటో ఒకటి ఫుల్ సైజులోను, మరొకటి బస్టు వరకు,...రెండూ పంపాము.

ప్రఖ్యాత చిత్రకారుడు...ఎలాంటి స్త్రీనైన చలింపజేయగల రూపం గల రవికుమార్, అందరిచేత నిరాకరింపబడ్డ నన్ను వరిస్తాడని నే నెలా అనుకోను!

వారంరోజులు గడిచాయి. ఆ రోజు ఆదివారం. అప్పుడే స్నానంచేసి, హాల్లో ఈజీఛైర్ లో కూర్చుని, నవల, "అరక్షణీయ" చదువుతున్నాను. 'జ్ఞానద' పడే బాధలకి నా మనసు చలించింది. "ఎంత నిండైన హృదయ మామెది......! నేను కూడా జ్ఞానదవంటి దాన్నే. కాని ఆమెకు ప్రేమించడానికి 'అతులు' డున్నాడు. నిర్భాగ్యురాల్ని!...నా కెవరూ లేరు," అని ఆలోచిస్తూ కథాగమనంలో మునిగిపోయాను.

"టెలిగ్రాం" అన్న కేకలో నేను పుస్తక ప్రపంచంలోనుంచి బయటపడ్డాను. ఎక్కడనుంచి వచ్చి ఉంటుందా అని ఆలోచిస్తూ, టెలిగ్రాం చించి చూశాను. ఆశ్చర్యంలో నా నోట మాట రాలేదు. "ఇది సంభవమా" అనుకున్నాను. కళ్ళు నులుముకుని మళ్ళీ చూశాను....అదే......"సంతృప్తుడను....ఈ రోజు మెయిలులో వస్తున్నాను......రవికుమార్" అని ఉంది.

నాన్న వచ్చాడు. నా చేతిలోవున్న టెలిగ్రాం తీసుకుని చదివాడు...ఆయన ఆశ్చర్యానికి మేర లేదు. నాకు ఒకవైపు అవ్యక్తమైన ఆనందము...మరోవైపు కించిత్ భయము కలుగుతున్నయ్. నాలో ఏం చూసి నన్ను ఎన్నిక చేసుకున్నాడు...అతను నా నిజ స్వరూపాన్ని చూశాడంటే....ఇంకేముంది...తిరుగు రైలుకే వెళ్ళిపోడూ! ఈ విషయం తెలుచుకున్నప్పుడు బాధ కలిగింది...అతన్ని మోసం చేశామేమో...అని. రైలుకు వేళ అవుతూన్న కొద్దీ...నా గుండె వేగంగా కొట్టుకోవటం ప్రారంభించింది.

రైలు వచ్చింది. రవికుమార్ రానేవచ్చాడు! ఇంట్లోకి రాగానే...మా నాన్న వారికి స్వాగతం చెప్పారు. ఇద్దరూ హాల్లో కూర్చున్నారు. నేను నాగది లోనుంచి బయటికిరాలేదు. ఏదో చెప్పలేని సిగ్గూ, భయమూ నన్నావరించివేశాయి. ఆక్షణంలోని మానసిక స్థితిని వర్ణించలేను. మనసు ఉయ్యాలలా ఊగుతోంది. ఒక రక్తపుచుక్కని మైక్రోస్కోప్‌లో చూస్తే...అందులోని వేలకొద్దీ కణాలు...ఒకదాని నొకటి గుద్దుకొని ఎలా వేగంగా, ముందుకి, వెనక్కి తిరుగుతూంటాయో...అలా నా మనస్సులో అస్పష్టమైన భావాలు అనేకం సంచరిస్తున్నాయి.

ఈ వ్యథలోనుంచి తేరుకుని...ద్వారానికున్న తెర కొద్దిగా పక్కకు తొలగించి చూశాను...అబ్బ! ఎంతందంగా ఉన్నారు. అబద్ధమెందుకు చెప్పాలి... ఆయన్ని చూచిన ఆ క్షణంలో నే...ప్రవరాఖ్యుని చూచిన వరూధినిలా అయిపోయాను! నాన్న నన్ను గమనించి...

"శారదా!...బయటికి రామ్మా" ... అన్నారు.

నేను సిగ్గుపడుతూ ... భయంతో ... మెల్లిగా అడుగులోఅడుగు వేసుకుంటూ వచ్చాను ... నేను గదిలోనుంచి వస్తూంటే రవి...నా వైపు చూశాడు... అయ్యో...సిగ్గుతో, భయంతో చచ్చిపోయినంత పనైంది నాకు. ఆయన రెప్పవాల్చకుండా ఆపాదమస్తకమూ నన్ను పరిశీలించారు.

నాన్న ప్రక్కన కుర్చీలో కూర్చున్నాను. ఆయన తన చూపుల్ని నా వైపునుంచి మరల్చలేదు. ఆయన కళ్ళు మెరుస్తున్నాయి. తలెత్తి ఆయనవైపు చూశాను. ఆయన మొహంలో అనాదరభావం గోచరించలేదు. అసహ్యత కనపడలేదు. నే ననుకున్నట్టు అతను నన్ను చూచి నిశ్చేష్టితుడు కాలేదు. పరవశుడైనట్టు కనిపించాడు. కారణ మేమిటో...నాకు బోధపడలేదు. ఒక మహాశిల్పి హస్తాల్లో తయారైన శిల్పాన్ని చూచినట్టు నన్ను చూస్తున్నాడు.

నాన్న టైం చూచుకొని..."భోజనానికి లేవండి పన్నెండు కావస్తూంది" అన్నాడు. ముగ్గురం లేచాం. వాళ్ళిద్దరికి నేనే వడ్డించాను. భోజనాలైనయ్. ఆయన, మా నాన్న వరండాలో కూర్చుని తాంబూలం వేసుకుంటున్నారు. నేను ఇంట్లో సర్దవలసినవి సర్ది...అప్పుడే బయటికి వస్తున్నాను. రవికుమార్ మాటలు వినిపించి

నయ్. అక్కడే ఆగి విన్నాను. "రిజిష్టర్ మ్యారేజి అయితే బాగుంటుందండి. మామూలు ఆట్టహాసాలు నాకు అంతగా నచ్చవు" అన్నాడు.

"మీ యిష్టం? అలా చేసేకానిద్దాం. నేనుకూడా ఆడంబరాలు వాంఛించేవాణ్ణి కాను" అన్నాడు మా నాన్న.

అబ్బ! నాకూ పెళ్ళి జరుగబోతుంది. చీకటి... నిరాశా తప్ప మరొకటిలేదనుకొన్న నాజీవితంలోకి... వెలుగు రాబోతోంది...క్రొత్త ఆశలు చిగురిస్తున్నాయి. శిశిరం వెళ్ళిపోయింది. వసంతం రాబోతోంది. ఆనందం పట్టలేక...గదిలోకి వెళ్ళి పరుపుమీద పడుకునిదొర్లాను. ఆ సంతోషంలో అన్నం, నీళ్లుకూడా మరిచాను.

3

మా పెళ్ళి నిరాడంబరంగా జరిగిపోయింది. మర్నాడే, నేనూ, రవీ బెంగుళూరుకి బయలుదేరాము. ఫస్టుక్లాస్ కంపార్ట్మెంటుని, స్టేషన్మాష్టర్కి ఫోను చేసి రిజర్వు చేశాడు రవి. అశ్రునయనాలతో నాన్న దగ్గర సెలవు తీసుకున్నాను.

రైలు వెళుతోంది. కంపార్ట్మెంటులో మేమిద్దరమే ఉన్నాం. రవి నావైపు తిరిగి......

"శారదా" అన్నాడు.

"ఊ" అన్నాను తలవంచుకొని. నాకు యింకా వారితో మాట్లాడాలన్నా, వారివంక చూడాలన్నా సిగ్గుగా ఉంది. నాదగ్గరకు వచ్చి, ప్రక్కన కూర్చుని నాచేతిని తన చేతిలోకి తీసుకున్నాడు. నాభుజంమీద చేయివేసి..."వెన్నెల చూడు ఎంత అందంగావుందో" అన్నాడు. ఒక్క క్షణం ఆయనవేపు తన్మయత్వంలో చూశాను. అప్పుడు నాకు...అతను మహావృక్షము వంటి వాడని... నేను...మారుతోద్ధతికికంపించే లతనని అనిపించింది. అవృక్షం, లతకి ఆశ్రయమిచ్చింది. లత వృక్షాన్ని గట్టిగా పెనవేసుకుంది. నాహృదయం చాలా సున్నితమైంది...ఆనందాన్ని గాని, దుఃఖాన్ని గాని...దేన్నీ...భరించలేను. దుఃఖంలో ఉన్నప్పుడు ...తుపాను ధాటికి ఆగలేక...చిగురాకులాగ విలవిలా కొట్టుకుంటాను. మహావాయు తీవ్రతకు ఆగలేక... ఏక్షణంలోనో... ఆరిపోవడానికి...సిద్ధంగావున్న... జ్యోతిలాగ బాధపడతాను.

అదే...ఆనందంలో ఉన్నప్పుడు.....ఊతరాక ...నీళ్ళలో మునిగి...అవస్థపడుతూన్న, వ్యక్తివలె ఉక్కిరిబిక్కిరవుతాను.

అలాంటి సమయంలో...మరో వ్యక్తి...మరో హృదయం...మరో మనస్సు...ప్రక్కన ఉండి... దుఃఖాన్ని గాని... సంతోషాన్ని గాని...పంచుకుంటే ...నాకు...ఏదో భారం తగ్గినట్టు...ఏదో పెన్నిధి లభించినట్టు తోస్తుంది. రవిని కౌగిలించుకొనే...కిటికీ లోనుంచి బయటకుచూశాను. శీతల చంద్రకిరణాలు ...పెన్నానదిలో ప్రతిబింబిస్తున్నాయి. క్షీర సాగర తరంగాల నుండి ఎగిరివస్తున్న తుంపురులవలె, ... విశ్వకర్మ ... దేవేంద్రుని నాట్యశాలా ప్రాంగణంలోని రజత స్తంభాలకి మెరుగులు పెడుతోంటే...రాలిన పొడివలెఉంది...వెన్నెల.

తెల్లని వెన్నెలను కల్మషంచేస్తూ...నల్లనిపొగని వదులుతూ...దూసుకుని వేగంగా వెళుతోంది రైలు. ఇంజనువదిలినపొగలు... మేఘాలతో కలసి...చంద్రుని మీద దండెత్తడానికి వెళుతున్నాయి...! చంద్రుడు తప్పించుకునిపోకుండా ఉండటానికి......మేఘాలు వ్యూహాలు పన్నుతున్నాయి. వాటి వ్యూహాలనుంచి తప్పించుకొని అతడు బయటకి వస్తూనే ఉన్నాడు.

నా బుగ్గమీద చల్లగా ఏదో తగిలినట్టయింది. ఉలిక్కిపడి చూశాను!...రవి పెదవులు నా బుగ్గల్ని తాకుతున్నాయి. నా ఊహలు స్తంభించిపోయినై. రైలు ఏదో స్టేషన్లో ఆగి మళ్ళీ కదిలింది...

"ఏస్టేషనండీ" అని అడిగాను.

"అనంతపురం" అన్నాడు రవి.

కిటికీలోనుంచి చూశాను...కొద్దిదూరంలోనే పెద్దభవనాలు కనబడుతున్నాయి. అవి ఏమిటని అడిగాను. అవి గవర్నమెంటు ఆర్ట్సుకాలేజి భవనాలట. వెన్నెల్లో ఆ భవనాలు చాలా అందంగా కనబడుతున్నాయి. కొద్దినిమిషాలలో......అనంతపురం వెనకే ఉండిపోయింది. మేము ముందుకు వెళ్ళిపోతున్నాం. చెట్లు, గుట్టలు మమ్మల్ని ఆహ్వానించటానికేమో అన్నట్టు దగ్గరకువస్తున్నాయి. మా రైలు వాటి నేమీ గమనించకుండా పరుగెడుతోంది. అవి పాపం...నిరాశతో......మావైపే చూస్తూ వెనక్కి వెడుతున్నాయి.

నిద్రవస్తూంటే......బ్లాంకెట్ తీసి కప్పుకుని, నిద్రపోయాను. మేము బెంగుళూరు చేరేటప్పటికి...తెల్లవారి...ఆరున్నర అయింది. టేక్సీలో ఇంటికి వెళ్లాము.

ఇల్లు చామరాజ నగర్‌లో ఉంది. ముచ్చటగా మాకు సరిపోయే డాబా. ఇంటిముందు...చిన్నతోట ఉంది. తోటలో రెండు పాలరాతి అరుగులు కూడా ఉన్నాయి. ఇల్లు నాకు బాగా నచ్చింది.

నేనాపూరికి క్రొత్తగాబట్టి...నాకు ఊరంతా చూపించాడు, రవి...రోజులు ఆనందంగా గడుస్తున్నయ్. కాని మొదటి నుంచీ నామనసులో దాక్కొని ఉన్న...ఆత్మక్లేశం...నేను అందవిహీనను అనే బాధ నన్ను వదలలేదు ... అదొక పెద్ద వ్యాధిలా లోపల పట్టుకుంది. నేను రోజూ రవి గదిలోకివెళ్ళి...అతని కుంచెలు శుభ్రపరిచేదాన్ని. అతను ఎప్పుడూ ఏవో బొమ్మలు గీస్తూ కూర్చునేవాడు. మధ్యాహ్నం వేళ రంగులను కలుపుతూ...రవికి సాయపడేదాన్ని.

“శారదా...నేను చిత్రం గీసేటపుడు నీవు నా ప్రక్కన ఉంటే నాకు ఎంతో ఉత్సాహంగా ఉంటుంది” అనేవాడు. చిత్రం గీస్తూ మధ్య మధ్య నావేపు చూసేవాడు. నన్ను చూస్తే తనకి ‘ఇన్‌స్పిరేషన్’ వస్తుందనేవాడు.

మధ్యాహ్నంపూట ఎప్పుడన్నా రవి నిద్రపోయేవాడు. నాకు మధ్యాహ్నం నిద్రపోయే అలవాటు లేదు. పుస్తకాలు చదువుతూనో, లేక...‘ఆల్బం’ చూస్తూనో కాలంగడిపేదాన్ని. ఆల్బం చూసేటప్పుడు మాత్రం...అణగిపోయి ఉన్న నాలోని ఆత్మక్లేశం మళ్లీ తలయెత్తేది.

ఒకరోజు మధ్యాహ్నం...నేను పత్రిక చదువుకుంటున్నాను. రవి మంచంమీద నిద్రపోతున్నాడు. అతని వైపు చూశాను. ప్రశాంతంగా నిద్రపోతూ ఉన్నాడు. ఏ ఊహాసుందరిని కల్పించుకుంటున్నాడో!...నిద్రలోనే నవ్వుతున్నాడు! అతని అందం...ఎలాంటి స్త్రీనైనా సమ్మోహపరుస్తుంది. ఈ మన్మథాకారుడు కోరి నన్ను పెళ్లి చేసుకున్నాడు. ఒకోసారి...ఇదంతా నిజమేనా! అన్నంత భ్రాంతి కలుగుతుంది నాకు. ఆల్బం చూశాను. దాల్లో...ఎంతోమంది...సుందరాంగుల ఫోటోలు అంటించబడి ఉన్నాయ్. అవన్నీ అతని ప్రకటనకి సమాధానంగా వచ్చినవే...ఒకరిని మించి మరొకరు అందంగా ఉన్నారు. ఆ ఫోటోలన్నీ ఒకసారి తిరగేస్తే కన్ను చెదరిపోతుంది. నాఫోటో మాత్రం అందులో ఉంచలేదు. దాన్ని ప్రత్యేకంగా ఎన్లార్జి చేయించి, తన క్యాన్వాస్ పక్కనే మరొక బల్లమీద ఉంచాడు...తన కెప్పుడూ కనపడేలాగ...ఈ సాక్ష్యం చాలు...రవి నన్నెంతగా ప్రేమిస్తున్నదీ తెలియచెయ్యడానికి. అతనిదగ్గర నాకేలోటు లేదు. అతనిప్రేమలో, అతను నాకందించే సౌఖ్యంలో...ఆనందంలో...కొరత లేదు. నాకోసం...కారుకూడ కొంటానన్నాడు!

నా జీవితం యింత ఆనందమయంగా ఉన్నా...నాబాధనన్ను వదలిపోలేదు. వచ్చినకొత్తలో...అంతగా అనుకునేదాన్ని కాదు. అద్దంలో నన్ను నేను చూసుకున్నపుడు...నేనెంతో తక్కువదాన్నని...నన్నెదో ఉద్ధరించడానికి...రవి పెళ్ళి చేసుకున్నాడేమోనని అనిపించేది. స్త్రీలను చపలచిత్తలన్న మహాకవులు నిస్సందేహంగా పొరబడలేదు. మరో స్త్రీ అయితే...తనకిదొరికిన పెన్నిధానంతో హాయిగా జీవితాన్ని గడిపేది... నాలాగ ... ఆత్మ హీనతాభావంతో,...బాధపడి...సౌఖ్యమయజీవితాన్ని విషాదమయంగా ఎవరు చేసుకుంటారు!

4

రవి నన్ను నిజంగానే ప్రేమిస్తున్నాడా...! అప్పుడప్పుడు ఈ ప్రశ్న మనసులో ఉదయించేది. ఈ ప్రశ్నకి అర్థమేలేదు. నన్ను పెళ్ళిచేసుకున్నందుకు ... అతను ... విచారిస్తున్నాడేమో అనుకునేదాన్ని. కాని...అతను నిరుత్సాహంతో ఉండగా... నేనెప్పుడూ చూడలేదు. విసుక్కోవడమనేది లేనేలేదతనికి. అనేక ప్రదర్శనలలో అతనిచిత్రాలకి వెండి కప్పులు...పతకాలు...బహుమానాలువస్తే...“ఇవన్నీ నీవే...శారదా...నీవు లేకపోతే నాకివన్నీ లభించేవి కావు” అనేవాడు.

“ఏమండీ!...నేను నిజంగా మీకంటికి బాగున్నానా” అని అడగాలనుకునేదాన్ని. కాని అడగడానికి ధైర్యంచాలదు. అతని చిత్రాలని...జమీందార్లు...డబ్బుగలవాళ్లు కొనేవారు. ఒకో చిత్రానికి ... వెయ్యి...పదిహేనువందలు ... వచ్చేవి. ఒకోచిత్రం అమ్ముడుపోయినప్పుడల్లా నాకు బహుమానం తప్పదు నెక్ లేసో — టాయిలెట్ సెట్టో పట్టుకొచ్చేవాడు. నేను నిద్రపోయేటప్పుడు...

నెక్‌లేస్ నా కంఠానికి అలంకరించేవాడు. ఉదయం నేను లేచినప్పుడు... మెడకి ఏదో బరువుగా ఉంటుంది. ఏమిటా అని చూసుకుంటే హారం! ఇలా ఉంటుంది... అతని బహూకరణ. నాపైన అతని ప్రేమ నిత్య నూతనంగా ఉండేది. అతను నన్ను తన ప్రేమలో, ఉక్కిరిబిక్కిరి చేసేటప్పుడు కూడ... ఆ ప్రశ్న నన్ను వదిలిపెట్టి పోయేదికాదు. సంతోషమనే అమృతపు సముద్రంలో ఒక విషబిందువులాగ... ఆ ప్రశ్న నన్ను నా మనస్సుని కల్లోలపరిచి బాధించేది.

ఆ రోజు... లాల్‌బాగ్‌కి షికారు వెళ్లాము. అతని ప్రక్కనే... నేను నడుస్తున్నా. అతని అందమెక్కడ ... నా అందమెక్కడ ...! దారిలో అందరు... మమ్మల్నే చూస్తున్నారేమో అనిపించింది. అందమైన ఆడవాళ్లు... మావైపు పరకాయించి చూచి... నవ్వుతున్నట్లు తోచింది. వాళ్ల నవ్వు నన్ను వెక్కిరిస్తున్నట్టుంది. అంత అందగానికి... ఈవిడ ఎక్కడ దొరికిందిరా... అని ఆశ్చర్యపోతున్నారేమో! గ్లాస్ హౌస్ దగ్గర... ఒకచోట కూర్చున్నాము... మా చుట్టూ అందమైన చెట్లు ... రంగురంగుల పూలు... లతలు ఉన్నాయ్. మేము కూర్చున్నచోట గడ్డి, తివాచీ పరచినట్లుంది... మెత్తగా. ఎక్కడ చూసినా అందమే...!

"ఏమండీ..."అన్నాను, అడగటానికి భయం... ఏమనుకొంటాడోనని.

"ఏం? శారదా" అన్నాడు.

"నేను, మీకు......"

"చెప్పు భయపడతావేం?..." అన్నాడు.

"నేను... మీ కంటికెలా ఉన్నాను..." అని ధైర్యం తెచ్చుకుని అడిగాను.

"ఇప్పుడెందుకు శారదా... ఈ ప్రశ్న "అన్నాడు.

"నేను నల్లగా ఉన్నానుకదా... మీకెలా నచ్చాను."

రవి నవ్వాడు... నన్ను దగ్గరకు తీసుకున్నాడు. నేను సిగ్గుతో, భయంతో కుంచించుకుపోయాను.

"శారదా... నువ్వు... ఎంత అమాయకురాలివి! చిత్రకారుడికి ... నలుపురంగంటే ఎంత ఇష్టమో తెలుసా!" అన్నాడు.

ఈ జవాబు నన్ను తృప్తిపరచలేదు. చిన్న పిల్లల్ని మభ్యపెట్టినట్టుంది...!

అమాయకంగా... అర్థంకానట్టు ... అతనివైపు చూశాను.

"శారదా... నీలో ఉన్న సౌందర్యం సామాన్యమైందికాదు. నీ నలుపులోపల... ఎంత సౌందర్యం నాకు కనుపిస్తోందో... తెలుసా! నీ శారీరక రేఖలపై... అంగసౌష్టవంపై ... అంతస్సౌందర్యకాంతులు ప్రతిఫలిస్తున్నాయ్. నీలోని కళ నలుపుకాదు... నీ భావాలు నల్లనివికావు... నీ గుణం నల్లనిదికాదు... నీవొక శిల్పసుందరివి! నీవు ... శాపవశాత్తు ... అచేతనత్వాన్ని పొంది... శాపావసానసమయంలో... చేతనత్వాన్ని పొందిన పుత్తడిబొమ్మవు!

నీవు తెల్లగా ఉండి... బంగారపు రంగుతో నిగనిగలాడుతోంటే... అద్వితీయ సౌందర్యరాశివైన నీవు ఏ మహారాజుల అంతఃపురంలోనో... ఉండిపోయేదానివి. నా అదృష్టంవల్లనల్లనిదానవై... నాకు లభించావు. నాకు మహాసౌందర్యరాశి లభించింది... పిచ్చి పిచ్చి ఆలోచనలతో మనసు పాడుచేసుకోకు... పిచ్చిదానా!... నీ నిజమైన రూపాన్ని చిత్రించానంటే... నిద్రిస్తున్న నీ సౌందర్యప్రభని మేల్కొల్పితే......లోకం విభ్రాంతమై పైమరచిపోతుంది..."

నాకు నోట మాట రాలేదు. ఆయన్ని గట్టిగా కౌగలించుకున్నాను... అబ్బ!... నా అనుమానం పటాపంచలైపోయింది... హృదయం తేలికపడింది.

ఆ రాత్రంతా రవి అన్నమాటలే చెవిలో గింగురుమంటున్నాయి. రాత్రంతా నిద్రపట్టలేదు. రవిని చూస్తూ ఆలోచిస్తూ కూర్చున్నాను ... తెల్లవారింది. నాకళ్లు ఎర్రగా ఉన్నాయ్. ఇన్నిరోజులుగా నా మనసులో ఉన్న అనుమానం నివృత్తి అయింది. కాని ఒక క్రొత్తకోరిక చిగిర్చింది. కాని ఆ పాడుకోరికే నా జీవితాన్ని నాశనం చేస్తుందని నాకేం తెలుసు!

రవి నిద్రనుంచి లేవగానే "ఏమండీ నా బొమ్మని అహా... నా నిజమైనసౌందర్యాన్ని చిత్రించరూ?..." అనడిగాను.

రవి... నాకేసి... చూశాడు. అతనిచూపుల్లో సానుభూతి ప్రదర్శితమౌతోంది.

"వద్దు. శారదా!... అలాంటి పిచ్చికోరిక కోరకు. లేనిపోని అనర్థాలు ప్రాప్తిస్తాయి. నీసౌందర్యము నీలోనే ఉండనీ," అన్నాడు.

ఎన్నోవిధాల... వద్దని రవిచెప్పినా నేను వినలేదు... స్త్రీచాపల్యం!... నాసౌందర్యం..... ఎలాఉంటుందో

చూడాలనేఆ కాంక్ష...వీటిని అణచుకోలేకపోయాను. నా చిత్రం గీయమని బ్రతిమాలాను. బాధించాను, విసిగించాను. రవికూడా తన మనస్సును తాను అరికట్టుకోలేకపోయాడు. నా మనోవీధి తేజోమయమై పోయేలాగా వెన్నెలాలా ఒకచిరునవ్వునవ్వి, కుంచ తీసుకుని నిగనిగలాడుతున్న నల్లరంగులో కుంచ ముంచాడు.

5

నా జీవితంలో మరో ఘట్టం...అప్పటి నుంచే ప్రారంభం అయింది. నన్నొక వింతభంగిమలో నిలబెట్టి...అనేక కోణాలనుంచి చూస్తూ...నన్ను చిత్రింపసాగాడు రవి. ఆ చిత్రంలోని సౌందర్యానికి మెరుగులు దిద్దటంలో నిమగ్నుడైపోయాడు. అన్నం, నీళ్లు మరిచాడు. ఆ చిత్రానికి ఎంత మెరుగులు దిద్దినా...అతనికి తృప్తిలేదు...రానురాను...అతను.. మాట్లాడ్డంతగ్గించాడు. ఎప్పుడూ ఆలోచిస్తూ...వింతగా ...పిచ్చిగా...బొమ్మకేసి చూస్తూ కూర్చునేవాడు. ఏవో ఉన్మత్తభావాలలో పరవశుడైపోయేవాడు. చిత్రం నించి చూపు మరల్చి నావైపు పిచ్చిగాచూసేవాడు. మళ్లీ చిత్రరచనలో...నిమగ్నుడైయేపోవాడు. నిద్రపోవటంకూడాతగ్గించాడు. ఎప్పుడూ ఆచిత్రంముందేకూర్చోవటం.. తనలో తాను నవ్వుకోవటం...... మొదలైనవన్నీ ప్రారంభమైనయ్!

నా మనసులో భయాందోళనలు ... కలుగసాగినయ్. రెండునెల్లకి...చిత్రం పూర్తయింది.

"శారదా" అని గట్టిగా అరిచాడు నన్ను చూసి. చిత్రాన్ని చూశాను.

అబ్బ!...ఎంత సౌందర్యం! నేను నమ్మలేకపోయాను. అది నా చిత్రమేనా...అని! నా బాహ్యశరీరాన్ని దూసుకునివచ్చి ఆత్మసౌందర్యం...రూపం దాల్చినట్లుంది. అద్భుతం ... సాక్షాజ్జగన్మోహిని ఆ చిత్రంలో అవతరించింది! నీలనీరదసుభాంగి! ఇంత సౌందర్యం...నాలో ఉందా! నాకు నాకే విభ్రాంతి!

కాని, ఆ రోజునుంచీ...నాకు మనశ్శాంతి పోయింది. సుఖంలేదు. రవి మాట్లాడడం పూర్తిగా తగ్గించివేశాడు. ఎప్పుడూ ఆ చిత్రం ముందు కూర్చుని...ఏదో ఆలోచిస్తూ...కాలం గడిపేవాడు. ఉత్సాహంతో ఇతర చిత్రాలు గీయటానికి... అతనికి మనసురాలేదు. నిరంతరం ఆ చిత్రంలో సౌందర్యరసాస్వాదనమే ... తప్ప ... అతను వేరే పనిచేయడంలేదు. అతన్ని మామూలు స్థితిలోకి ఎలా తీసుకురావాలో నాకు తోచలేదు. భయంతో నా గుండె కొట్టుకోసాగింది. అతని దగ్గరకు వెళ్లటానికి... మాట్లాడటానికి...భయం.

"ఏమండీ ... లాల్‌బాగ్‌కి వెళ్దాం రండీ... మీకు హాయిగా ఉంటుంది" అన్నాను ఎలాగో. రవి గట్టిగా నవ్వాడు.

"ఇంకా ఏం లాల్‌బాగ్. ఎందుకు వెళ్లాలి... అక్కడికి? ఏ ముందక్కడ, ఇంతకుముందు సౌందర్యాన్వేషణకై వెళ్లేవాడిని. ఇప్పుడు ప్రపంచంలో ఎక్కడా లేని సౌందర్యం...నాదగ్గరే...నాయింట్లోనే ఉంది! నేను రాను...కావలిస్తే...నువ్వు వెళ్లు అన్నాడు.

ఏమనటానికి నాకు మాటరాలేదు. ఎప్పుడూ అతన్నిగురించి ఆలోచిస్తూ కూర్చునేదాన్ని. ఒక రోజున ఒక జమీందారు...తను కొత్తగా కొన్న భవనంలో అలంకరించడానికి...ఏవైనా చిత్రాలుకొందామని వచ్చారు. గదిలోని నా చిత్రాన్ని చూచి... ముగ్ధుడై...ఎంత వెల అయినాసరే...ఆచిత్రాన్ని కొంటానన్నారు. రవి అతనివైపు పిచ్చిగా చూశాడు. "ఏమిటీ...... నా భార్యని......అమ్మమంటారా! నాభార్యను ధరకు అడుగుతారా ... ఇక్కడనుంచి ముందు బయటికి వెళ్ళండి" అని అరిచాడు. అతని కేకతో ఇల్లు ప్రతిధ్వనించింది. ఆ జమీందారు భయపడి ... బయటికి పరుగెత్తాడు. ఇలానే ... ఇంకా కొంత మంది ఆ చిత్రంకోసం వచ్చి...రవిచేత బాగా తిట్లు తిన్నారు.

ప్రసిద్ధ చిత్రకారుడు....రవికుమార్‌కి....తాను రచించిన చిత్రంవల్లనే మతిభ్రమించింది...అని అక్కడక్కడ అనుకోవడం మొదలుపెట్టారు.

ఏడ్పుని ఆపుకోలేకపోయాను. రవిని...ఎలా తీసుకురావాలి...మామూలుస్థితికి? ఒక ఆలోచనతట్టింది. ఆచిత్రాన్ని నాశనంచేస్తే?..కాని నాశనం చేయటంకన్న ..ఆరోజువచ్చిన జమీందారుగారికే... లేక మరెవరికో అమ్మివేస్తే...బాగుంటుంది. ద్రవ్యలాభమూ ఉంటుంది ...అనుకున్నాను.

వెంటనే జమీందారుగారికి...కబురు పంపించాను. నా భర్తకి మతిస్థిమితం తప్పిందనీ...ఆయనకు

తెలియకుండా - చిత్రం తీసుకువెళ్ళమనీ.. వ్రాశాను. ఆ చిత్రం ఎదురుగా లేకపోతే...అతను బాగుపడ తాడని ఆశించాను.

అదేవిధంగా ఒక రోజు రాత్రి...జమీందారు వచ్చారు. రవి నిద్రపోతున్నాడు. నేను...నా అద్భుత చిత్రాన్ని...జమీందారు కిచ్చేసి...పది వేల రూపాయలు పుచ్చుకున్నాను. ఆయన చిత్రాన్ని తీసుకొని వెళ్ళిపోయాడు. ఇక రవికి...ఏమని సమాధానం చెప్పాలి? అతను ఎలామార్గానికి వస్తాడు. ఈ ఆలోచనలతోనే గడుపుతున్నాను...

ఇంతలో నే...రవి లేచాడు. చిత్రంకోసం బల్ల వైపు చూశాడు. అది కనుపించకపోయేటప్పటికి ... "ఏదీ! నా సౌందర్యరాశి ... నా ప్రియురాలు ఎక్కడ?... నా చిత్రసుందరి...ఏది?" అంటూ గదంతా వెదకుతున్నాడు. గబగబా వెళ్ళి అతనిని పట్టుకుని... మెల్లగా "పోతేపోయింది లెండి...అంతకన్న మంచిచిత్రం...మరొకటి వ్రాయవచ్చు...ఇదో! యిలా చూడండి...పది వేల రూపాయలు..." అన్నాను.

"ఆ! ఎక్కడివి?"

"ఆ చిత్రానికి...ఒకరు...ఇచ్చారు" అన్నాను.

రవి మండిపోయాడు: "ఒసే రాక్షసీ! ...నా భార్యను అమ్మివేశావా? ఎవడువాడు...వాడిని చిత్రవధచేస్తాను. నా సౌందర్యాధిదేవతకి...ఒకధరా? ఛీ ఛీ నీచురాలా! ... అసలు నీకు దాని నమ్మడానికి చేతులెలావచ్చాయి" అని రవి రౌద్రాకారంతో అరుస్తూ కళ్ళన్నీ నోట్లన్నీ ఇవ మెచ్చినట్లు గదంతా చిమ్మేశాడు.

అమితమైనభయంతో నేను గట్టిగా అరిచాను. ఆ అరుపు విని చుట్టుప్రక్కలవాళ్ళంతా వచ్చారు. రవి యింకా "నారాణి, నా సౌందర్యం...నా చిత్రం అంటూ అరుస్తూంటే వాళ్లు అతన్ని పట్టుకున్నారు. అంతే ... అప్పటినుంచీ ... నా రవికి ... నేను నా సర్వస్వము...అనుకున్న రవికి, పిచ్చాసుపత్రి శరణ్యమైంది. నేను చేసిన పనికి ఎంత విచారిస్తే ఏం లాభం చేతులారా... నే నే...నా జీవితాన్ని పాడుచేసుకున్నాను. నారవిని పోగొట్టుకున్నాను. గుప్తంగా ఉన్న నా సౌందర్యాన్ని చిత్రించమని అతన్ని ఎందుకు బాధించానాఅని అహోరాత్రాలుఏడ్చాను. హాస్పిటల్ నివాసం ఆ సుకుమార దేహం భరించలేకపోయింది. నిరంతరమూ ఆ చిత్రాన్నిగురించి కలువరించేవాడు. గోలగా కేకలు వేసేవాడు. ఒకరోజున అతనికి తీవ్రంగా జ్వరంవచ్చింది. నేను...అతని ప్రక్కనే కూర్చుని... పాలు చల్లార్చుతున్నాను...

"శారదా" ... అన్నాడు-అలా పిలిచి ఎన్నాళ్ళయింది!

అతని వైపు ఆశగా చూశాను. దీనంగా ఉంది అతని ముఖం. ఒకనాడు ఎంతో సౌందర్యంతో వెలిగిపోయిన ఆ ముఖం...అప్పుడు...ఎంతో దీనంగా... మాసిపోయిన గడ్డంతో ఉంది. నాగుండె తరుక్కుపోయింది. కన్నీళ్లు ఆపుకోలేకపోయాను — అతను నూతిలోనుంచిలా మంద్రస్వరంలో:

"నీ సౌందర్యాన్ని చిత్రించమని ఎందు కడిగావు శారదా!...ఎంతో శ్రమించి ... రేయింబవళ్లు కృషి చేసి...చిత్రిస్తే...దాన్నెందుకు నానుంచి...దూరం చేశావు?..."

"నన్ను...క్షమించండి...క్షమించరూ?...మీ పాదాలు పట్టుకుంటాను ... క్షమించరూ?... మీకు త్వరగా బాగవుతే...చాలు" అన్నాను ఉద్వేగంలో.

"అహ్హహ్హ...శారదా...పిచ్చిశారదా...ఇంకా నాకిక్కడేముంది...అదో...చూడు...ఆ సౌందర్య లోకం...అక్కడినుంచి...నాకు పిలుపువచ్చింది... వెళ్ళిపోతా...వెళ్ళిపోతా...మళ్ళీ అక్కడ కలుసుకుందాంలే...ఏమనుకోకు...నిన్ను వదలిపెట్టి ముందు వెళ్తున్నందుకు! ... శారదా! ... భగవాన్!..." అంటూ కళ్ళుమూశాడు. అంతే! నా జీవనజ్యోతి ఆరిపోయింది. లతకి ఆశ్రయమిచ్చిన మహావృక్షం కూలిపోయింది.

ఆయన్ని ఆ సౌందర్యలోకంలో కలుసుకునే ఆ శుభసమయాన్ని నాకు భగవంతుడెప్పుడు ప్రసాదించుతాడో!...కాచుకుని ఉన్నాను.

విచిత్రప్రసవము

శ్రీ రాళ్లపల్లి గోపాలకృష్ణమాచార్యులు

ఇటీవల వార్తాపత్రికలలో ప్రకటించబడిన వింత వార్త నొకదానిని పాఠక మహాశయులు గమనించి యుందురు. పూర్వ సముద్రతీరమందలి పుదుచ్చేరి పట్టణ సమీపమున, కోసపాళయమను గ్రామమునందలి శ్రీ రాధ అను గృహస్థుని భార్య శ్రీమతి కమలమ్మకు ఈలోగా పురుడువచ్చినది. ఆ కుటుంబినికి ఇది అష్టమ గర్భమట ? శ్రీకృష్ణజననమువలన దేవకీవసుదేవులకు సంభవించిన తొందరలను స్మరించుటచే కాబోలు, ఎనిమిదవ మాలుకలిగినప్పుడు, సాధారణముగా, దానిలో ఏదోవైశిష్ట్యము ఉండునని గర్భిణులు మనదేశమున కొంతభయపడుట వాడుక. ఈ దుర్ముఖ సంవత్సర మార్గశిర్ష కృష్ణద్వాదశీ శుక్రవారమునాడు, అనూరాధా నక్షత్రమున, (1956, డిశెంబరు, 28 వ తేదీన) రాత్రి రమారమి 1-30 గంటల కాలములో ఆ ఇల్లాలు ప్రసవించినది. ఆ ప్రసవములో, ఆశ్చర్యకరముగా, ఒకరివెనుక నొకరుగా, వెనువెంటనే అయిదుగురు స్త్రీ శిసువులు జనించిరట! ఆ శిసువులందరు బాగుగా పెరిగి, సరిఅయిదుపౌనులు తూకముతో, ఆరోగ్యముగా నుండిరట ! ఆ కుటుంబిని ఆరోగ్యముతో సుఖముగ నున్నది. ఖండాంతరములలో ఇట్టివింతలు అప్పుడప్పుడు వినవచ్చుచున్నవి. కాని, మన భారతదేశములో పంచ శిసు ప్రసవములు లోగడ మనము విన్నవికావు. కాని, మూడవదినమున ఒకశిసువు, మరుసటిదినమున (1-1-1957) మరి ఇరువురు, జీవితమును చాలించుకొనిరని తరువాతివార్తలు చెప్పుచున్నవి. దైవచిత్రము !

జ్యోతిశ్శాస్త్రదృష్టిలో ఈ విచిత్ర సంఘటనకు గొప్పవిలువకలదు. అనగా, పరిశోధనదృష్టిగల విద్యార్థుల కనుట. తాత్కాలిక గ్రహభావాదిస్థితి ఎట్టిదో, ఈ అపూర్వ ప్రసవమును అది ఎట్లు సూచించగలదో, అందలి వైశిష్ట్యమేమెా, గమనించుటకై ప్రయత్నింతము.

ఉపదిష్టమైన ప్రసవకాలము (1-30 A. M.) నిష్కర్షగా స్పష్టకాలమనలేము—జన్మకాల శోధన పద్ధతుల నుపయోగించి స్పష్టపరచినచో, 1-38-14 (A. M.) (I. S. T.) శుద్ధకాలమని ఏర్పడగలదు. వ్యత్యాసము అతిస్వల్పమగుటచే, దీనిలో అసంభవము చూపట్టదు.

ఈ కాలమునకు గుణించిన సాయనకుండలి ఈ క్రింద నున్నది.

	కు 11-54	కే 26-58	
	జన్మకుండలి — [సాయనము] ...		X 25-52
బు 26-18 రవి 7-6			వరుణ 6-4 (వ)
శు 11-16 శ 8-57 చ 0-20	ఇంద్ర 2-13 రా 26-58	గు 1-15 I 27-33	

ద్విస్వభావరాసులలో మిథున, ధను, మీనములు, గ్రహములలో బుధుడు, ఇట్టి జన్మముల విషయములో ప్రాధాన్యము వహించుననుట జ్యోతిశ్శాస్త్ర మర్యాద. ఈ కుండలిలో, చంద్ర, శని, శుక్రులు ధనుస్సులో నున్నారు. లగ్నము తులారాశిలోని మిథునాంశలో నున్నది. ఇతర గ్రహములలో, రవి మీననవాంశలో, శని మిథుననవాంశలో నుండుట, ఈ కారణములకు తోడు లగ్నముపై గల బుధ కేంద్రదృష్టిని చేర్చినచో, ఒక విధముగా కార్యకారణ సమన్వయము చేయవచ్చు ననుకొందును. కాని, ఇంచుక విమర్శించితిమేని, ఇంతటి స్వల్పసామగ్రి ఆ దినమునందే ఎన్నియో వేళలలో సిద్ధముగ నుండునని సులభముగా గ్రహింపగల్గు

దును. అంతే ఏల? లగ్నము సయితము ద్విస్వభావ రాశిలోనే, అందులో ద్విస్వభావ నవాంశయందే, ఉండగల కాలము ఇంతకంటె అధికముగా ఇట్టి ప్రసవములకు అనుకూలముగా నుండునుగదా? అట్టి నవాంశలు 12 కలవు. వానిలో కన్యా నవాంశలు వదలినా, మిగిలిన 9 టిలో అనాకు అథమపక్షము 5000 శిశువులు జనించియుండగలరు. దినమున సరాసరి అరువది వేల శిశు జననములు కలుగుచున్నవని గణితశాస్త్ర వేత్తలు అంచనా వేసియుండుట సుప్రసిద్ధ విషయము కదా? అగుటచే, అయిదు వేల శిశువులకు పై యోగము అన్వయించవచ్చును. అనగా, వేయిమంది స్త్రీలు ఆ నాడు ఇట్టి శిశు పంచక ప్రసవ మహోత్సవమును అనుభవించి యుండవలయుననుట! ఇది అసంభవమని వేరుగా విన్నవించుట అనవసరము. ఖండాంతరములలోనైనా, ఇన్ని వింత జననములు సంభవించియుండినచో, కొన్నింటినైనా వార్తాపత్రికలలో ప్రకటించి యుండక పోరు.

పోనిండు. కవల జన్మమునకు కాని, బహు శిశు ప్రసవమునకు కాని, కారణములను సూచించు గ్రహ సంపత్తి ఆధానకాలములో చూపట్టవలయునే కాని, జన్మకాలములో కాదు. ఇట్టి జననములను సూచించు యోగము లన్నియు, ఆధానకాలపు గ్రహస్థితికి సంబంధించినవేయని 'సాగావళి' మున్నగు గ్రంథములు చెప్పుచున్నవి. కనుక, ప్రశంసలోనున్న ప్రసవమునకు ఆధాన కాలమును సాధించవలసియున్నది.

జన్మకాలమునుండి ఆధానకాలమును సాధించు పద్ధతి యొకటి 'బృహత్ పరాశర హోరాసారము' అను గ్రంథములో చెప్పబడియున్నది.

"యస్మిన్ భావే భావవిష్ఠః,
    తస్య మాందే ర్యదంతరం,
లగ్న భాగ్యాంతరం యోజ్యం,
    యచ్చ రాశ్యాది జాయతే."

"మాసాది స్తన్మితం జ్ఞేయం,
    జన్మతః ప్రాఙ్నిషేకజం.
యద్యద్దృశ్య దశేం గేశః,
    తదేందో ర్భుక్తభాగయుక్."

"తత్కాలే సాధయే ల్లగ్నం,
    శోధయే త్పూర్వవ త్తనుః"

ఇవి అందలి ముఖ్యసూత్రములు.

ఈపద్ధతియొక్క ప్రయోగ రహస్యము అగమ్య గోచరముగ నున్నది. ప్రాచీన సంప్రదాయజ్ఞులగు పండితు లెవరైనా, ఈ రహస్యమును విద్యార్థుల ఉపయోగముకొరకై ప్రకటించగలరను గంపెడాసతో, 1945 వ సంవత్సరమున 'భారతి'లో విన్నవించుకొంటిని.* నా ప్రార్థనము నేటిదాక సఫలము కాలేదని తెలుపుటకు విచారముగుచున్నది.

సమరసింహుడను హోరాశాస్త్ర నిపుణుడు రచించిన 'మనుష్యజాతక'మను ప్రాచీనగ్రంథములో యవనసంప్రదాయమునుండి స్వీకరించిన పద్ధతి యొకటి క్లుప్తముగా నిర్వచించబడి యున్నది. ఇట్టి అంశమునే పాశ్చాత్యశాస్త్రవేత్తలు దర్శించి, విపుల పరిశోధనలతో విమర్శించి, అనుభవములవలన కనుగొన్న విషయములను క్రోడీకరించి, సమగ్రమయిన పద్ధతి నొక్కదానిని సాధించి వ్యాప్తికి తెచ్చియున్నారు. దీని ననుసరించి సాధించగల కాలమునకు "ప్రినేటల్ ఎపోక్" (Pre-natal Epoch) అని వారు వ్యవహరించుచున్నారు. లగ్నశోధనమునకు, జాతకఫల సమన్వయమునకు సహా, ఈపద్ధతి ఎంతో ఉపయోగపడుచున్నది.

పై సంప్రదాయమున ప్రశంసలో నున్న జన్మములకు కారణమైన ఆధానము 1956, మార్చినెల 27 వ తేదీనాడు 3—54 A. m. (G. M. T.) కాలములో జరిగియుండవలెనని తేలుచున్నది. అనగా, మొత్తపు గర్భకాలము 277 దినములగును. పది నాక్షత్ర మాసములు, లేక తొమ్మిది సౌరమాసములు, కడచిన తరువాత నాల్గుదినములకు ప్రసవము జరిగిన దనుట. ఇది, సాధారణముగా, యుక్తకాలమే. కాని, కడపటి శిశువు ఏకాలమునకు ప్రసవమైనదో, తెలియదు. శిశువులందరు వరుసగా వెనువెంటనే జనించిరని వింటిమి. కనుక, ఈజననములన్నియు రమారమి 15 నిమిషముల కాలములోనే జరిగియుండునని మనము భావించుట నిర్హేతుకముగా నుండదు. ఈ సమన్వయమును ఆధారముగా గ్రహించినచో, ఈశిశువులందరికిని ఆధానకాలమొక్కటే అనియు, ఒకటే క్షణమునందు

(*)తారణ సంవత్సర మాఘమాసపు 'భారతి' సంచికలో 184 వ పుట చూడుడు.

అయిదు విధములుగా జరిగిన శుక్రశోణిత సంయోగపు ఫలముగా ఆధానములు జరిగియుండునవనియు, ఏర్పడు చున్నది.

పైన చెప్పిన కాలమునకు సరి అయిన స్థానిక మధ్యమ కాలము 9-13'-12'' A. M. (L. M. T.) అగును. ఇది సంభవమా అని శంకించువారుందురు. నిషేకక్షణము వేరు, ఆధానకాలము వేరు. ఈ రెండింటికి కొంతకాలవ్యవధియుండుట అసంభవము కాదు. ప్రశంసలో నుండునది ఆధానకాలము. అప్పటికి సాధించిన సాయనకుండలి ఇదే:

బు 27-55	ర 7-8	శు 22-9	I 0-20 కే 11-30
X 21-16	ఆధాన కాల కుండలి — [సాయనము] ...		వరుణ 28-15
కు 18-18			గు 22-9 (వ)
రా 11-30 శ 2-36 (వ)		చ 27-33 ఇంద్ర29-39 (వ)	V 24-17

ఇపుడు ఆధానలగ్నము ద్విస్వభావరాశి మిథున మైనది. లగ్నాధిపతి బుధుడు మరియొక ద్విస్వభావ రాశియగు మీనములో, అందులో మీననవాంశయందే నిలిచియున్నాడు. నవమదశమాధిపతి అగుటచే యోగ ప్రదుడైన శని వేరొక ద్విస్వభావరాశియగు ధనుస్సును చేరుకొన్నాడు. ఈ శనికిని, లగ్నమునకుసహా, తోడుగానున్న ఛాయాగ్రహములు (రాహుకేతువులు) సైతము ద్విస్వభావ రాసులలోనే. ఇంతేకాదు. శని, శుక్ర, గురువులు తప్ప ఇతర గ్రహములన్నియు ద్విస్వభావ రాసులగు మిథున మీనములలో ఏకోరొకదానిని నవాంశలో ఆశ్రయించియుండుట గొప్ప విశేషము. అనేక శిశు ప్రసవములకు కారకుడగు బుధుడు వర్గోత్తమాంశలో నుండి, లగ్నమును కటాక్షించుచున్నాడు. ఈ కుండలిలో, లగ్నాధిపత్యము మాత్రమేకాక, పంచమ (సంతాన) స్థానాధిపత్యము సయితము ఈ బుధుడికే సంక్రమించుట మరింత విశేషము. బహు శిశుప్రసవము నకు కారణమైన ఆధానము జరుగుటకు అప్పటి ఖగోళ స్థితి ముఖ్య హేతువని మనము సులభముగా విశ్వసించ వచ్చును.

మరియొక్క విశేషము చిత్తగింపుడు. గర్భోత్పత్తి హేతువులగు శుక్రశోణితముల స్వభావమును సూచించు 'బీజము' 'రక్తము' అను బిందువులు కలవు. శుక్రరవులయొక్కయు, కుజచంద్రులయొక్కయు, స్థానములకు సంతానకారకుడగు బృహస్పతి తోడి సంబంధము ననుసరించి ఈ బిందువులు ఏర్పడుచున్నవి. ఆధానకాలపు కుండలిలో 'బీజము' తులారాశి 21°-26' లో, 'రక్తము' మకరములో 8°-0' లో, ఉన్నవి. బీజాధిపతి శుక్రునికి స్వక్షేత్రబలమున్నది. అభివృద్ధి కారకుడగు బృహస్పతినుండియు, సత్త్వకారకుడగు ప్రబల (ఉచ్ఛ) కుజునినుండియు, ఈ శుక్రునిపై దృష్టి కలదు. ఇట్టిశుక్రుడు కళకళలాడుచు లగ్నములో ఉదయోన్ముఖుడై యుండుటచే, ఈ బిందువు ప్రభావ సంపన్నమైనది. ఈ గురుశుక్రుల మధ్యమందే రక్త బిందువు ఉన్నదని చదువరులు కనుగొనియే యుందురు. ఇట్టి సౌభాగ్యముతో ఈ బిందువు శిశుబాహుళ్యమును సూచించు మీననవాంశలోనుండుట గమనించదగినది. కలిగిన ఫలమునకు ఈ బిందువుల స్థితి ఎంతో రమ్యముగా తగియున్నది కదా? ఈ బిందుద్వయము సూచించు శుక్రశోణితముల సంయోగమునకు అవశ్యకమైన పరస్పరాకర్షణశక్తి ఈ బిందువుల మధ్యప్రదేశము నందు కేంద్రీకృతముగా నుండుట అస్వాభావికము కాదు. అట్టి కేంద్రస్థానము సంతాన బాహుళ్యమునకు పేరుమోసిన వృశ్చికరాశిలో 29°-43' లో నున్నది. అందులోనూ, మీననవాంశం పైగా, బుధ వరుణుల పరిపూర్ణ త్రికోణదృష్టి! ఆ బుధుడో, శిశుబాహుళ్యకారకుడు; వరుణుడు అఘటనఘటనాచాతుర్యముగల గ్రహము. ఈఇరువురు మీననవాంశములోనే నిలిచియుండుట! ప్రశంసలోనున్న ఆధానమునకు ఈబిందు ధర్మము వ్యాపించుట న్యాయముకదా?

సరేకాని, ఈ ఆధానచక్రము కవలపిల్లలను తెలుపకూడదా? శిశుత్రయమును సూచించరాదా? అట్లు కాక, ఐదుగురు శిశువులకు ఆధానము జరిగినదను సూచన దీనిలో ఎచటనున్నది? అనుప్రశ్న రావచ్చును.

చాలాసమంజసమైనదే ఈప్రశ్న. ప్రత్యుత్తరమిచ్చుట సులభముకాదు. తగిన సమాధానము ఈ కుండలియందే లభించవలయునని నాహృదయము చెప్పుచున్నది. కాని అది స్ఫురించలేదు. ఒక్కఊహ. ఈ కుండలిలో సంతాన (పంచమ) భావము కన్యారాశిలో సింహ నవాంశలోనున్నదికదా? భచక్రములో సింహము ఐదవ రాశి అగుటచే, ఆసంఖ్యయొక్క ప్రభావము ఆధానమునకు వ్యాపించె నేమో? అవుననుటకు ధైర్యముచాలదు, మరి, కాదనుటకు మనస్సురాదుకూడ. రాశిచక్రమందలి 360 భాగలలో ఒక్కొక్కదానిలో ఒక్క విశిష్ట ధర్మమున్నదని పాశ్చాత్యపండితులు కొందరు నిర్వచించియున్నారు. మారిస్ వెమిస్ పండితుని మతమున, కన్యారాశిలో 25 వ భాగకు 'బహుత్వము' (plurality) అను ధర్మమున్నది. ఈకుండలిలో పంచమభావ మధ్యబిందువు నికరముగా ఆ విశిష్టభాగలోనే ఉన్నదనుట ఈ ఆధానకాలపు విశేషము. మరియు, ఈరక్తబీజ మధ్యకేంద్రమునకు శనిసంయోగము, బుధ వరుణుల త్రికోణదృష్టి, శుక్ర, గురువుల కేంద్రవీక్షణము, కలవని గమనించితిమేని, మనప్రశ్నకు సదుత్తరము లభించినదనవచ్చును. ఆబిందువుల పరస్పరాకర్షణము ఈ గ్రహపంచక ప్రభావములో జరిగెను. కనుక పంచశిశు ప్రసవము కలిగినది. ప్రకృతి యింతటితో తృప్తిచెందుదను గాక.

ఆధానకాలములో చంద్రుడు స్త్రీలింగద్యోతక ఖగోళభాగలోనుండి, నిర్లింగప్రదేశములోనున్న లగ్నములో స్త్రీగ్రహముగు శుక్రుడు ఉదయించుచున్న కారణమున, అందరు స్త్రీ శిశువులే జనించిరి. ఆధాన కాలమున లగ్న చంద్ర స్థానములనుండి లింగ నిర్ణయము కావలయుననుట ఈ పద్ధతిలోని ముఖ్య సూత్రములలో నొక్కటి. వసంత విషువద్బిందువునుండి 28 తారా ప్రదేశములుగా భచక్రమును విభజించు సంప్రదాయముపైన ఆధారపడినదే ఈ లింగవిభాగము. అది యట్లుండె.

ఈ చక్రములో చంద్రునిస్థితి శుభకరముగాలేదు. గండసంధిలోనున్న విప్లవకారియగు వరుణ మహాశయుని క్రూరదృష్టిపాతమునకు చిక్కి, మాయలమారి ఇంద్రుని సంయోగమును ఆత్రముతో అభిలషించుచు ఈ చంద్రుడు ఆరవభావములోనుండి బాలారిష్టమును సూచించుట విషాదకరము. లగ్నముపైన శనికిగల ప్రబల సమసప్తక విషమదృష్టి రూపమగు దైవ దుర్విపాకము సయితము శిశువులకు ఆరోగ్యభంగమును తెలుప జాలినదే.

ఈ ఆధాన చక్రమునకు 31-12-1956 నాటికి దైనిక జాతకమును సాధించినచో, దైనిక లగ్నము కుంభరాశిలో 22½ భాగలో రాగలదు. అనగా, ఆధాన కాలములో అష్టమ (మృత్యు) భావాధిపతియగు బృహస్పతి స్థానమునకు ఒక రకముగా ఎదుట (సమసప్తకముగా) నిలిచినదనుట! మృత్యుదేవతను ఆహ్వానించుటయే ఇది. ఆ కాలములోనే ముగ్గురు శిశువులు మృత్యువువాతబడినారని విన్నాము. సాధించిన ఆధానకాలము సాధువనుట కిది యొక్క తార్కాణ.

ఇంత చాలును. కాని, నిరయనపద్ధతిలో సాధించిన గ్రహోదులనుండియే ఫలముల నూహించుట సహేతుకమనియు, సశాస్త్రీయమనియు, విశ్వసించువారు మన జ్యోతిశ్శాస్త్రవేత్తలలోనే పలువురున్నారు గదా? వారి సౌకర్యార్థమై, నిరయన జన్మకుండలి ఈ క్రింద చూపితిని.

కాని, ఇప్పటికి అయనాంశలెన్ని అను విషయమున నిరయనవాదులలో ఐకమత్యము కుదరలేదనుట అందరు ఎరుగుదురు. ఎన్నటికైనా, ఇది సర్వసమ్మతముగా, నిర్ణయము కాగలదో, లేదో, ఆ భగవంతునికే ఎరుక. కేతకీ 'జ్యోతిర్గణిత' గ్రంథానుసారముగా, ఈ జన్మకాలమునకు 23 భాగలు, 14 కళలు, అయనచలనమని ఏర్పడును. ఈ అయనాంశలను సాయన స్థానములలో తీసివేసి, ఈ క్రింది నిరయనకుండలి సాధించ

కు 18-40		కే 8-39	
	(నిరయన)		X 12-38 వ 12-48
బు 2-59	జన్మకుండలి		
ర 13-20	రా 8-39 చ 6-34 శ 15-43 శు 18-2	I 4-19 ఇ 8-27	గు 7-29

బడినది. వేరు వేరు అయనాంశలను ఉపయోగించువారు తగిన మార్పులు చేసుకొనవలసి యుండునని మనవి.

బహు శిశుప్రసవమును సూచించు ప్రబలయోగము లేమియు నాకిందు కానరావు. జన్మచక్రమునటచే, అట్టి యోగము లిచట చూపట్టుట, నా దృష్టిలో అనవసరమే. పాఠక మహాశయులు సయితము పరిశీలింతురు గాక.

వాడుకలోనున్న పద్ధతితో, చంద్రనక్షత్రమునకు వింశోత్తర (ఉడు) దశను గుణించినచో, జన్మకాల శని మహాదశాశేషము 14 సం॥ 4 నెలలు, 21 దినములగును. బుధాంతరములో, రాహువుయొక్క విదశలో ఈ ప్రసవము కలుగుట. ఈ దశల కధిపతులగు శని, బుధ, రాహువులలో ఒక గ్రహమైనా, ద్విస్వభావరాసులలో కాని, కడకు ద్విస్వభావ నవాంశలలో కాని లేకుండుట వింతగా చూపట్టుచున్నది. కాని, వేరు అయనాంశల నుపయోగించువారికి దశాశేషము భిన్నముగా వచ్చును కదా! అయనాంశలలో ఒక్క కల మార్చినచో, ఈ దశాశేషములో 8½ దినములు భేదము వచ్చుటంజేసి, భిన్న సంప్రదాయములవారిగణితములో అంతర్దశా, విదశలు విశేషముగా మార్పుచెందగలవు. ఇప్పటి నిరయన పద్ధతిలో ఇదిగొప్ప అవ్యవస్థ.

అదియట్లుండె. ఈజాతకమునకు పాశ్చాత్యపద్ధతి నుపయోగించి ఆధానకాలమును సాధింపజూచుట హాస్యాస్పదము. ఆపద్ధతి రాశిచక్రముపై నాధారపడినది కాని, జ్యోతిశ్చక్రములపై కాదు. ప్రాచీన సంప్రదాయములో ఆధానకాల సాధనము జ్యోతిశ్చక్రముపై నాధారపడినదని భావించువారు దానిననుసరించి ఆధానకాలనిర్ణయ మొనరించినచో, అందలి గ్రహస్థితిలో యోగములు తగినవి కలవేమో, పరిశీలించవచ్చును. ప్రాచీన సంప్రదాయవేత్తలు ఇది సాధించవలసి యున్నది. వారి అనుగ్రహముకొరకై మనము వేచి యుందము గాక.

ఒక్కమాట. మునుపటికాలములో మూడు తొమ్మదులని, గజగర్భమని, వ్యవహరించబడుచుండిన దీర్ఘకాల ప్రసవములు ఉండెడివట! ప్రాచీన వైద్య, జ్యోతిష, గ్రంథములలో వానికి సూచనలు కలవు. కాని, ఇప్పటికాలమున మనకు అట్టి విచిత్రములు కానరాకున్నవి. అంతేకాదు. అట్టిప్రసవములు అసహజములని, అసంబద్ధములని, అభిప్రాయపడుట ఇప్పటివాడుక. పోగా, రానురాను, బహు శిశుప్రసవముల సంఖ్యమాత్రము హెచ్చుచున్నట్లు క్రమక్రమముగా చూపట్టుచున్నది. సృష్టిలో, ఈ మార్పునకు హేతువేమో? ప్రపంచహితమునకై ప్రజాబాహుళ్యమును తగ్గించగోరు రాజనీతి విద్యావిశారదుల ఉపదేశముల మూలముగా నేమి, హితకాంక్షులగు పాశ్చాత్య వైద్య విద్యాప్రవీణుల సలహాలవలన నేమి, ఆధునిక నవనాగరక తరుణీతరుణులు కొందరు స్వభావవిరుద్ధములు, ధర్మదూరములునగు కృత్రిమోపాయములవలన సంతాన నిరోధమును సాధించుచుండుటచే, యుక్తికి ప్రతియుక్తిగా, సృష్టికర్త ఇట్టి బహుశిశుప్రసవములకు హెచ్చుగా ఇపుడు అవకాశమును కలిగించు వాతావరణమును సృజించినాడు కాబోలు! ఏల కారాదు? రెండవ ప్రపంచ సంగ్రామమువలని ఘోరపరిణామపు ఫలముగా, యూరోపుఖండమందలి జర్మనీదేశమున పురుషులసంఖ్య అపరిమితముగా తగ్గిపోయినదికదా! ఈలోటు పూర్తియగుదాక, తరువాతి కొన్ని సంవత్సరముల కాలము, ఆదేశములో కలిగిన ప్రసవములలో, సరాసరి, ఒకస్త్రీశిశుజననమునకు అయిదుగురు వంతున పురుషశిశువులు పుట్టుచుండిరని వింటిమి. సృష్టికర్త యొక్క మహత్తరశక్తిముందు మన కొంచె యుక్తు లెందుకు పనికివచ్చును?

"ఈశ్వరో రక్షతు."

ఓహో అదేమిటామాట!

సంతానం కుళ్లి కృషిస్తూ ఉంటే తల్లికి క్షోభ కాదూ?

భారతీ-భారతాంబ, బొల్లి, సమస్త చర్మవ్యాధులచే పీడింపబడుచున్న తన సంతానం కో సం ఎంతని విచారిస్తూఉందో?

(స్థాపితము 1920 సం॥రం)
ఇదుగో మా చిరకాల అనుభవంతో ఇస్తూ ఉన్న అభయం.

మాకు నేడే వ్రాయండి

రెడ్డి అండ్ కో.,
గోపాలపురం. (తూ.గో.జి)

కలగూరగంప

నాట్యధర్మి

శ్రీ పోతుకూచి సుబ్రహ్మణ్యశాస్త్రి

లోకధర్మి, నాట్యధర్మి అను రెండు ధర్మములు గలవని నాట్యశాస్త్రమున భరతుడు చెప్పినాడు. ఈ ధర్మములు లోకస్వభావము ననువర్తింపచేయునవి. లోకశబ్దమునకు జనపదములలో నివసించు ప్రజలు అని అర్థము చెప్పవలెను. ఈ ప్రజల ప్రవృత్తులకు యోగ్యములగు వాచికాహార్యాది విషయములను చెప్పు ప్రసంగమున లోక, నాట్య ధర్మముల విచారణను భరతుడు గావించెను.

లౌకికధర్మమునకు వ్యతిరేకమైన ధర్మము నాట్యమున కన్పించ వీలులేదని భరతుని ప్రధాన సిద్ధాంతము. ఈ సిద్ధాంతమే అరిస్టాటిల్ లోగూడ కన్పించును. ఈ లోకగతమగు ప్రక్రియాక్రమము కవి, నట వ్యాపారమున వైచిత్ర్యమువందుచు రంజనాధిక్యప్రాధాన్యము నందగా రూపకమున నాట్యధర్మి కలదని యనుచున్నాము.

స్వభావభావోపగతం శుద్ధం తు వికృతం తథా
లోకవార్తాక్రియోపేత మఙ్గలీలా వివర్జితమ్
స్వభావాభినయోపేతం నానాస్త్రీ
పురుషాశ్రయమ్
యదీదృశం భవే న్నాట్యం లోకధర్మీ తు
సా స్మృతా.

అని భరతుడు ముందు లోకధర్మిని వివరించెను. స్వాభావికముగానున్న స్థాయి వ్యభిచార్యాదిభావములతో నున్నది, శుద్ధము, స్వవికల్పితవ్యామిశ్రితము, లోకప్రసిద్ధమగు వ్యవహారముచే శుద్ధము, వర్తనాద్యంగలీలారహితము, స్వాభావికమగు బలపతనప్రహారాద్యభినయములలో కూడినది, నానాస్త్రీపురుషాశ్రయము నైన నాట్యమున లోకధర్మి కన్పించును.

యథావృత్తవస్తుమాత్రము కవి వర్ణించగా, నటుడు ప్రయోగించగా లోకధర్మి ప్రతీతమగును. ఇట్టి ప్రయోగమున భావవ్యాపారము గాని, రంజనా వైచిత్ర్యము గాని కన్పించవు. కాని ఇచట లోకధర్మాశ్రయత్వముండుటచే నిది లోకధర్మి యనబడుచున్నది.

అతివాక్య క్రియోపేత మతిసత్త్వాతిభావకమ్
లీలాఙ్గహారాభినయం నాట్యలక్షణ లక్షితమ్
స్వరాలఙ్కార సంయుక్త మస్వస్థ పురుషాశ్రయమ్
యదీదృశం భవే న్నాట్యం నాట్యధర్మీ తుసా
స్మృతా.

అని తర్వాత నాట్యధర్మి చెప్పబడినది. ఇతిహాసాది వాక్య విలక్షణముగా గావించబడు అతిరంజకతివృత్తకల్పనాత్మకమగు క్రియ ఇచట కన్పడును. స్వాభావికచిత్తవృత్తికి విలక్షణమగు కవికల్పితచిత్తవృత్త్యంతరముతో కూడినది, శోభా ప్రధానముగా మనోహరములగు అంగహారములతో కూడిన అభినయము, నాట్యలక్షణలక్షితమగు ప్రయోగము, స్వరాలంకార సంయోజనతో కూడినది, స్త్రీపురుషానౌచిత్యవిభావాత్మకమునై కన్పించునది నాట్యధర్మి.

లోకే య ఉభియోజ్యం చ పద మత్రోపయుజ్యతే
మూర్తిమ త్సాభిభాషం చ నాట్యధర్మీ తు సా
స్మృతా.
ఆసన్నోక్తం చ యద్వాక్యం నశృణ్వంతి పరస్పరమ్
అనుక్తం శ్రూయతే యచ్చ నాట్యధర్మీ తు సా
స్మృతా.
శైలయాన విమానాని చర్మవర్మాయుధ ధ్వజాః
మూర్తిమంతః ప్రయుజ్యంతే నాట్యధర్మీ తు సా
స్మృతా

లోకమున గర్హింపబడిన విషయమును పదమాత్రమున తెలియజేయునది, లోకమున కలాశిల్పకల్పనాకలితమైన విషయమునుగూడ మూర్తిపంపాదనవశమున ప్రయోగయోగ్యముగా జేయునది నాట్యధర్మి. దగ్గరగా నున్న ఒకపాత్ర జనాంతికముగా పలుకు వాక్యము రెండవపాత్ర వినజాలకపోవుట, ఆకాశభాషణాదికమున అనుక్తమగు వాక్యమును వినగల్గుట నాట్యధర్మిలో కన్పించగలవు. శైలము, యానము, విమానము చర్మవర్మాయుధధ్వజములు సాక్షాత్తుగా కన్పించకపోయినను, రూపవంతములుగా భాసించునట్లు నాట్య

ధర్మియం దభినయింపబడుచున్నవి. చారువస్త్ర చిత్రాది రూపములతో ఖేటకాదులు అభినేయములు కాగలవని భావము.

లలితై రఙ్గవిన్యాసై స్తథోత్క్షిప్తపదక్రమైః
నృత్యతే గమ్యతే చాపి నాట్యధర్మీతు సా స్మృతా.
యోఽయంస్వభావో లోకస్య సుఖదుఃఖ
క్రియాత్మకః
సోఽఙ్గాభినయసంయుక్తో నాట్యధర్మీ ప్రకీర్తితా.
యశ్చ కక్ష్యా విభాగోఽయం నానావిధిసమాశ్రితః
రఙ్గపీఠ గతః ప్రోక్తో నాట్యధర్మీ తు సా భవేత్.

ఆవేష్టితాది చతుర్విధకరణములలో స్వీకరింపబడిన వర్తనాదులయందు వ్యాపృతములైన లలితాంగవిన్యాసములతో, చతుస్తాలాద్యుత్క్షిప్తములగు పద పరిక్రమములతో పోవుచున్నట్లు, నర్తించుచున్నట్లు నటీనటులను భాసింపజేయునది నాట్యధర్మి. ఏతత్ప్రతిపాదితమగు నాట్యము సుఖదుఃఖక్రియాత్మకమగు లోకస్వభావము నంగాభినయసంయుక్తముగా జూపగా నాట్యధర్మి సంకలితమగుచున్నది. అంగాభినయమనగా తోద్యాదికముతో కూడిన అభినయమని అర్థము. ఈ అభినయము లోకస్వభావమును తెలుపునది. కాగా లోకస్వభావత్వము, అనుభావవిలాసోపేతత్వము అనునవి నాట్యధర్మివిధాయకము లగుచున్నవి.

నాట్యధర్మి సర్వాభినయప్రకాశసారము. నానావిధసమాశ్రితమగు కక్ష్యావిభాగమువ, రంగపీఠగతమై అభినేయమగునదియే నాట్యధర్మి యని ఇంతటితో స్పష్టమగుచున్నది.

నాట్యధర్మీ ప్రవృత్తం హి సదా నాట్యం
ప్రయోజయేత్
నహ్యఙ్గాభినయాత్కించి ద్ఋతే రాగః ప్రవర్తతే.
సర్వస్య సహజో భావః సర్వో హ్యభినయోఽర్థతః
అఙ్గాలఙ్కారచేష్టా తు నాట్యధర్మీ ప్రకీర్తితా.

నాట్యధర్మిప్రవృత్తమగు గతివిశేషముగల నాట్యమునే ఎల్లప్పుడు ప్రయోగింపవలెను. గీతాతోద్యాంగములు, అభినయవిశేషములు లేనిచో సామాజికులకు ప్రీతిగాని, రసాస్వాదముకాని కలుగజాలదు. కవిగతము, నాట్యగతము, వాగంగాలంకారనిష్ఠము, నాట్యధర్మిరూపము, సర్వప్రాణభూతమునగు ప్రయోగము ప్రయోజనాపేక్షతో ప్రవర్తించుచున్నది. ఈ ప్రయోజనమును నిర్వర్తింపజేయవలెననిన లోకధర్మి పరిత్యాగము కూడదు. సహజమగు భావాదికముతో నున్న లోకధర్మి పునాదివంటిది. దానిపై అంగాలంకారాత్మకముగా యోజింపబడు అభినయము నాట్యధర్మి నిష్ఠమగుచున్నది.

భరతుడు లోకధర్మి, నాట్యధర్మి అని రెండు విధములుగా ధర్మిని స్వీకరించుచు లౌకికజగత్తుకు, కావ్యజగత్తుకు విశిష్టధర్మ్యంశమునసాదృశ్యమును ప్రతిపాదించుచున్నాడు. లౌకికధర్మజనితములై తదాశ్రితములైనవి అభినయములు. అనగా నాట్య లోక ధర్ములకు విషయసంపద సమానమే. కాని సూత్రబద్ధమై, అభినయాత్మకమై, సత్త్వగుణోపేతమై యుండునది నాట్యధర్మి. కాగా, నాట్యమున లోకస్వభావము పరిష్కరింపబడుటయేగాక, కేవలము సత్త్వగుణాత్మకముగా ప్రదర్శింపబడుచున్నది.

స్వభావసిద్ధమైనది లోకధర్మి. తత్సంస్కారరూపమైనది నాట్యధర్మి. మరణవధాదులు నాట్యమున ప్రదర్శింపబడక, కేవలము సూచింపబడుచున్నవి. అనగా రజస్తమోగుణములు నాట్యమున విడబడినను, సత్త్వమే దర్శనయోగ్యము.

నానాభావసంపన్నము, నానాక్రియాత్మకము నైన బాహ్యజగత్తునకు సత్త్వగుణానుసార్యితమగు ఏకత్వానేకత్వాశ్రయత్వవైశిష్ట్యమును కూర్చునది కావ్యజగత్తు. బుద్ధీంద్రియ వ్యాపృతమైన లోకము కావ్యమున భావనాశ్రితమగుచు పూర్ణతను, శుద్ధతను పొంది లౌకికజగదుత్పాదక హేతు వగుచున్నది. నాట్యధర్మి విశిష్టమైనదగు కావ్యజగత్తు దేశకాలాద్యతీతము.

లోకమున మనము నిత్యము చూచునది, అనుభవించునది లోకధర్మి. కాని నాట్యమున నదియంతయు ఇముడజాలదు గనుక కొన్ని మార్పు లవసరము. ఈ మార్పులను నాట్యధర్మి యందుము. శబ్దమున, గానమున, వేషమున నాట్యధర్మియొక్క వైశిష్ట్యము గలదు. ఉదారములు, మధురములు నగు శబ్దములనే కవి ప్రయోగించును. ఈ శబ్దము లర్థముతో సమన్వితములై యుండవలెను. అనగా కవి శబ్దస్వరూపమునుజూచి విభ్రాంతుడై శబ్దముల నుపయోగించరాదు. శబ్దము భావార్థద్యోతకమగునా? కాదా? యని విమర్శించి ప్రయోగింపవలెను. అర్థవశానుగమమైన శబ్దము కావలెను. భవభూతి యనినట్లు మహాకవులకు, ఋషులకు "వాచమర్థోఽనుధావతి." వారేశబ్దము నుపయోగించినను, అది వారి భావవ్యక్తీకరణకు యోగ్యముగా కన్పించును. నిగూఢమగు భావమును చెప్పు శబ్దములు పనికిరావు. శ్రీహర్షాదుల కృతులలోని శైలి, వసుచరిత్రాదులలోని పదవిన్యాసము యోగ్యమైనవికావు. విద్వజ్జనులకు సౌఖ్యమొసగునవి, నృత్యమున కుచితమైనవియు నగు శబ్దములు ప్రయోగింపబడవలెనని భావము. కమండలుధారులైన సన్యాసులవద్ద వేశ్య ఏవిధముగా రాణించజాలదో, అట్లే శ్లేషయమకానుప్రాసాదులతో నిండిన కావ్యనాటకములు శోభించజాలవు. ఇది శబ్దవిషయక

మైన నాట్యధర్మి. లోకధర్మికి నియమములు, నిబంధనలు లేవు.

వాచికాభినయమున గల సంగీతమును గమనింతము. ఇది నాట్యధర్మిగా పరిగణింపబడవలెననిన స్వరాలంకారములతో కూడియుండవలెను. ఇందలి శబ్దములు పైన చెప్పబడిన నిబంధనలచే నియంత్రితము లైయుండక తప్పదు.

ఇక రంగస్థలమున్నది. జీవితములోని సన్నివేశములను కవి గ్రహించుచున్నను, రూపకములలోని పాత్రలు రంగస్థలముననే ప్రదర్శింపబడునవి. ఇందుచే జీవితమున గల రంగస్థలము నాట్యములోనికి అనువదింపబడజాలదు. జీవితమున కన్పడు ఇండ్లు, మేడలు, ప్రయాణములు మొదలగు ముఖ్యసన్నివేశములు రంగస్థలమున చూపబడజాలవు. కావున వీటికి ప్రత్యామ్నాయముగా కొన్ని కల్పించబడుచున్నవి. సుమనస్కులగు ప్రేక్షకులు వీటిని భావించుకొనవలెను. శైలయానము, విమానగమనము, అయుధప్రహారణాదులు, మృతి, నిద్ర మొదలగునవి చూపబడలేకపోవుట నాట్యధర్మిలో విశిష్టముగా గలదు.

తర్వాత వేషము గలదు. వేషభాషాదులద్వారా రంగస్థలమున చూపబడినవి, ప్రేక్షకులు భావించుకొనవలసినవి, తెలపికొనబడుచున్నవి. ఇట్లే స్వగతాకాశభాషితాదులలోని ప్రవృత్తిని అన్వయించుకొనవలసియున్నది. ఇదియంతయును నాట్యధర్మి.

లౌకికధర్మవ్యతిరేకమైన ధర్మమేమియును నాట్యమున లేదు. కాని లోకములోని ప్రక్రియాక్రమము నధికరంజనాత్మకముగా, విచిత్రముగా, విశిష్టముగా జూపునది నాట్యధర్మి. అనగా లోకానుసరణమును వైచిత్ర్యయోగ్యత్వమున విశిష్టముగా కవి ప్రదర్శించవలెను. స్వభావసిద్ధము, స్వతఃసిద్ధము నగు లోకధర్మిని విశిష్టతతో తెలుపునది నాట్యధర్మి. ఈ వైశిష్ట్యముంగా భినయాశ్రితమై కలదు. కాగా కవికి కావలసిన సాధన సామగ్రి జగత్తులో నున్నదని, జగమున కన్పించు ప్రతివిషయము కావ్యజగమును ప్రవేశించలేదని, కావ్యజగములోనికివచ్చు విషయము విశిష్టముగా పరిణమించునని నిశ్చయించవలెను, ఈ వైశిష్ట్యము భావనాను ప్రాణితము. భావనావశమున నాట్యము లౌకికపదార్థములకన్న భిన్నమైనదగును. లౌకికజగమునకు కావ్యజగ మనుకృతికాదు, ప్రతిబింబము కాదు, చిత్రీకరణకూడ గాదు. వీటికి ఆరోపాధ్యవసాయ సంబంధము కూడలేదు. కావ్య జగముత్ప్రేక్షితము కాదు, స్వప్నతుల్యమైన అసత్యము కాదు. కావ్య విశ్వము మాయ కాదు, ఇంద్రజాలము కూడ కాదు. సమ్యగ్జ్ఞానాకారమై, విజ్ఞానస్వరూపమై, జ్ఞానాస్వాదనద్వారా సంవిత్స్వంవేద్యమైన రసప్రాణకముగునది కావ్య జగత్తు. నాట్యధర్మిద్వారా దేశకాలప్రమాతృభేదానియంత్రితమైనజగత్తు కావ్యమున ప్రతీయమానముగుచున్నది. కావుననే సర్వశాస్త్రార్థసంపన్నము, సర్వశిల్పప్రవర్తకము నైన నాట్యము ముల్లోకములకు భావానుకీర్తనమై విలసిల్లునదని భరతుడనినాడు. లౌకికజగత్తునకు కావ్యజగమే మూలము. భావనావ్యాపారప్రధానమైన కావ్యజగము బహిర్దృశ్యమాన నానాత్వభిన్నత్వముల కేకత్వసమత్వముల నాపాదించగలుగుచున్నది. కావ్యజగమును ప్రవేశించి పారిశుద్ధ్యమునందని దేదియు లౌకికజగములో లేదు గనుక బాహ్యజగత్తుకూడ భావనావిశిష్టమైనపుడే వ్యవహారయోగ్యముగునని తేలుచున్నది. కావ్యజగమున లేని జ్ఞానముకాని, శిల్పముగాని, ప్రవృత్తిగాని లౌకికజగమున లేనేలేవు. యాస్కుడనినట్లు మహాకవి సాక్షాత్కృతధర్ముడు.

ఈ సాక్షాత్కారసర్వాత్మవాప్తికి ఆత్మసంస్కారము అవసరము. మానసికాభివృద్ధి, నైతికబలము, సంస్కృతి కలిగియున్నపుడే బాహ్యజగమును పరిశీలించి, తదంతర్యామిగా నున్న ధర్మమును కవి సాక్షాత్కారగోచరముగా జేసికొనగలుగును. ఇందుచే నైతరేయబ్రాహ్మణము "దేవశిల్పానుకృతివలననే మానవశిల్పము జన్మించుచున్న"దని పల్కుచు, "ఈ దేవశిల్పము లాత్మసంస్కృతు" లని, "వీటిచేతనే మన ఆత్మసంస్కరించబడుచున్న" దని చెప్పుచున్నది.

కవికోకిల విజ్ఞాన బహుమతులు

శ్రీ శ్రీపాద గోపాలకృష్ణమూర్తి

నవ్యాంధ్ర సాహిత్యోద్యమాన్ని నలుదైపులా వినబడేటట్లుచేసిన వైతాళికుల్లో దువ్వూరి రామిరెడ్డిగారొకరు. రామిరెడ్డిగారు నూతన భావాలను సహితం తెలుగు జాతీయతతో రంగరించి స్పష్టంగానూ, విస్పష్టంగానూ వెలిబుచ్చగలరు. తన భావాలను అక్లిష్టంగా పఠిత కందించి నందువల్ల వీరి కవిత్వంలోని ప్రసన్నత "అర్థమ్ముకాని భావగీతిసుమ్మ"ల జోలికి పోనఅచే రసిక హృదయాలను తన వైపుకి ఆకర్షించుకుంటుంది. ఈయన కృషీవలుని జీవిత విధానం వైపు మ్రొగ్గి, గరిక పోచ కదలికతో హృదయం శ్రుతికలిపి, సందెము తైసువు సరిగవలిపాన్ని వరి వెన్నులనే పాపలు పట్టి లాగితే వాత్సల్యంతో పైకి వంగిందా అనేటట్లున్న చేలపై అలమిన చెంగావి నిగ్గులలో ఐక్యమై పోగలరు. ఆంగ్ల

ఫారసీ వాఙ్మయాలని తరిచి, వానిలోని సారాన్ని గ్రహించిన వీరు ఫారసీ వాఙ్మయపుష్పమైన 'ఉమర్ ఖయాం' ని యథానువాదంగా కాకుండా, తెనుగు జాతీయతా సుగంధం కలిసిన చక్కని స్వతంత్ర సృష్టిలాగ రూపొందించి, ఉమర్ ఖయాం భావాలు భావకవు లందరిలోనూ వెదజల్లేసేరు.

కృషీవలుడు, జలదాంగన, వలజారమ్మ అగ్ని ప్రవేశము, నక్షత్రమాల, నైవేద్యం, వనకుమారి, పాన శాల—వంటి ఖండకావ్యాలమూలంగా తెలుసు వారు వీరిని కవిగా ఎరుగుదురేగాని వీరిలో వైజ్ఞానిక తృష్ణ ప్రబలంగా వుందన్న సంగతిని ఎరుగరు.

దువ్వూరి రామిరెడ్డిగారు పుట్టుకతో వైజ్ఞానికు డనడం సారస్వతప్రియులందరికీ సాహసంలాగే కన బడుతుంది. కాని ఇది పరమసత్యం. పరిస్థితులే ఆయనని కవిగా మార్చేయి. రామిరెడ్డిగారికి చిన్నతనంనుండీ విజ్ఞాన సాధనంమీద తృష్ణహెచ్చు! రెండవఫారం చదువుకొనే రోజుల్లోనే వీరు తనకు కావలసిన సబ్బులు తానే స్వయంగా చేసికొనేవారట. అదే వయస్సులో వీరు అట్టలతో కెమేరా నిర్మించి, దానితో ఫోటోలు తీసి, అవి కడగడానికి సాయంకాలం ఫోటోగ్రాఫరు కిచ్చి, రాత్రి పన్నెండు గంటలవేళకి అవి సరిగ్గా వచ్చేయో లేదో కనుక్కోడానికి వాళ్ళ యింటికి వెళ్ళి తలుపుకొట్టి 'నీకు నిద్రపట్టకపోతే మేము నిద్రపో నక్కరలేదనుకున్నావా?' అని అతనిచేత తిట్లుకూడా తిన్నారట.

ఈ వైజ్ఞానిక దృష్టివల్లనే ఆయన ప్రాచ్య పాశ్చాత్య సిద్ధాంతాలను నిష్పక్షపాతంగా పరిశోధించి, సమన్వయించి వానిలోని నిజానిజాలు తెలిసికొనే నిశిత విమర్శకులైనారు.

చౌదరి ప్రచురణలు

"కళోద్ధారకులు"—శ్రీ అంగర సూర్యారావుగారి నాటికల సంపుటి 120 పేజీలు రు. 1-4-0

"అంతరాత్మ"—శ్రీ బలివాడ కాంతారావుగారి కథల సంపుటి 100 పేజీలు రు. 1-0-0

రెండు పుస్తకాలూ చక్కని గ్లేజు కాగితం, ముచ్చటైన మూడురంగుల కైటిల్సుతో వెలువడినై.

అన్ని బుక్ స్టాల్సులోను లభిస్తాయి.

చౌదరి పబ్లికేషన్సు—మండపేట,

తూర్పు గోదావరి జిల్లా.

వీరిలోని ఈ తృష్ణ ఎంత బలవత్తరమైనదో అవసానకాలంలో వీరు ఆంధ్ర వైజ్ఞానిక రచయితలకు చేసిన దోహదంవల్ల తెలుస్తోంది. హెచ్చు రక్తపు పోటుతో బాధపడుతున్న వీరు 1947 సెప్టెంబరు పదవ తేదీన వారి మిత్రులైన ఒక న్యాయవాదిని పిలిపించి, తాను స్వశక్తితో సంపాదించినదానిలో పదివేలరూపా యలను ఒక ట్రస్టుగా ఏర్పరచి, దానిమీద వచ్చే మూడువందల రూపాయల వడ్డీని ప్రతిఏడూ తెలుగు విజ్ఞానశాస్త్రం గురించి వ్రాసే ఉత్తమ రచయితకి ఇచ్చేటట్టు ఒక వీలునామా తయారుచేయించేరు. విషయం ఇచ్చి పోటీజరిపించి అందులో గెలుపొందిన వ్యక్తికిగానీ, ఒక నిర్ణాయకసంఘంవారు నిర్ణయించిన రచయితకి గానీ ఆబహుమతి చెందాలని వారి ఆశయం. వారి కుటుంబమంతా ఆయన కోరికకి అంగీకరించేరు. వారు మరణించేరోజులు దగ్గర కొచ్చేయి, ఆ విల్లు ఇంకా రిజిస్టరు కాలేదన్న ఆవేదన వారిని పీడించింది. తత్ఫలితంగా రక్తపు పోటు ఎక్కువై పడుకొండవ తేదీ అర్ధరాత్రి వారు కీర్తిశేషులైనారు.

వారి ఆదేశాన్ని వారి కుమారులగు శ్రీ దువ్వూరి వేణుగోపాలరెడ్డిగారు అక్షరాలా పాటిస్తూ, తెలుగు వైజ్ఞానికావరణలో కృషిచేసిన ఒక్కొక్క రచయితకీ ప్రతీ ఏడూ మూడువందల రూపాయల మొత్తం గల ఈ "కవికోకిల దువ్వూరి రామిరెడ్డిగారి విజ్ఞాన బహు మతి"ని అందజేస్తున్నారు. గొబ్బూరి వెంకటానంద రాఘవరావుగారు, కాళీపట్నం కొండయ్యగారు, వసంతరావు వెంకటరావుగారు, విస్సా అప్పారావు గారు ఇంతవరకూ ఈ బహుమతినందిన ప్రముఖులు. 1955-వ సంవత్సరపు బహుమతి సూర్య కుటుం బము, విజ్ఞానవేత్తలు, శాస్త్రవేత్తలు, విసుపీథి అనే పుస్తకాలనీ, విజ్ఞానపీఠంలు విజ్ఞానదీపిక అ పత్రిక లలో పెక్కువ్యాసాలని వ్రాసి ఆంధ్రులకి నిర్దుష్టమైన విజ్ఞానాన్ని అందజేసిన ఎ. వి. ఎస్. రామారావుగారికి ఇచ్చినారు.

వాస్తుశిల్పమూ, సాహిత్యమూ మొదలైన కళలను పోషించి అభివృద్ధికి తెచ్చిన రెడ్డిరాజుల వంగడంలో పుట్టిన రామిరెడ్డిగారు కళలనేగాక, విజ్ఞానాన్ని కూడా ఆదరించి, దాని అభివృద్ధికి జీవించియున్నప్పుడేగాక కీర్తిశేషులయికూడా తోడ్పడడం ముదావహం. ఈ సదవకాశాన్ని పురస్కరించుకుని తెలుగు చదువరులపై నిర్దుష్ట విజ్ఞాన జ్యోత్స్నని వెదజల్లడమే కాకుండా, రామిరెడ్డిగారి విజ్ఞానబహుమతిని పొందిన ఆనందాన్ని సాధించడానికికూడా వైజ్ఞానికరచయితలు కలంపట్టాలని హెచ్చరిస్తున్నాను.

గ్రంథ విమర్శనము

ఎమర్సన్ వ్యాసావళి

అనువాదం: శ్రీ బి. వి. శ్రీనివాసాచార్య; ప్రచురణ, గుండిమెడాస్, ఏలూరు. వెల 1-14-0.

కావ్యరచనలో ఉన్నంత బలవత్తరమైన సంప్రదాయం మనకు వచనరచనలో లేదు. ముఖ్యంగా వ్యాసరచనలో మనం చాలా వెనుకబడి వున్నామంటే యిందుకు ఎవ్వరూ కించ పడరనుకుంటాను. దీనికి తగిన కారణం లేకపోలేదు. ఈ దేశంలో అనాది కాలం నుంచీ కావ్యరచనకు వున్న గౌరవం వచనానికి లేదు. వచనంలో వ్రాస్తే ఆ వ్యక్తి పండితుడు కానట్లే లెక్క. లేకపోతే వైద్యశాస్త్రాల వంటి గ్రంథాలను కూడా పద్యాలలో వ్రాయడం ఎందుకు పడుతుంది? కావ్యరచనకు వుండే అవధులేమిటో, వ్యాసరచనకు వుండే అవధులేమిటో మనం అంచనా వేయగలిగితే, ఈనాడు వ్యాసరచనా సంప్రదాయాన్ని పెంపొందించుకోవలసిన అవసరం ఎంత వున్నదో బోధపడుతుంది. ఒకొక్క పాశ్చాత్యదేశంలో ఎంతెంత వ్యాససంచయరూపమైన వాఙ్మయం వున్నదో, ఆ దేశాలను సముద్ధరించటానికి అవి ఎంతెంత కృషి చేసినాయో పరిశీలనచేస్తే మనకు నిజంగా విభ్రాంతి కలుగుతుంది. అలాంటి సంప్రదాయం ఏ ఆధారం లేకుండా ఒక్కసారి జాతిలో పుట్టుకురావాలంటే అసంభవం. ఇందుకు ఆయా దేశాల విజ్ఞానవేత్తలయిన రచయితలు ఈ రంగంలో సాధించిన పరిణామాలను మనం అనుభవానికి తెచ్చుకోవలసి వుంది. ఆ దృష్టితో ఈ ప్రయత్నాన్ని అత్యంతాహ్లాదంతో అభినందించుచున్నాం.

ఒక నూతన శిల్పవిశేషాన్ని వాఙ్మయ రంగంలోకి తెచ్చుకునే ప్రయత్నమలా వుండగా 'ఎమర్సన్' ప్రపంచ పూజ్యపురుషులలో ఒకరు. మానవ విజ్ఞాన వ్యాప్తికి తన జీవిత సర్వస్వాన్నీ ధారపోసినవాడు. ఆయన సందేశాలు మానవజాతికి సర్వదా శిరోధార్యములు. ఎమర్సన్, ఎన్నికలలాంటి ఏవో తాత్కాలిక సమస్యలను గురించి చర్చించినవాడు గాదు. అందుచేత వారి రచనలకు కాలావధులు లేవు. రాజనీతి అనే వ్యాసంలో, నూరు సంవత్సరాలనాడు ఆయన వ్రాసిన ఈ దిగువ వాక్యాలను చిత్తగించితే, అవి యీనాటికీ ఎలా పరమసత్యాలుగా నిలచివుండి ప్రపంచ రాజకీయవేత్తలను ఎలా ముఖంమీద బాదుతున్నాయో ప్రతి ఒక్కరూ ఇట్టే గ్రహించగలరు.

'నాకు తగిన పనిలోనే నేను ప్రవర్తించుచు తగనిపనినుండి నివర్తించుచూ ఉన్నంతకాలము నా పొరుగువాడునూ, నేనునూ మా విధానములలో తరచు ఏకీభవించుచూ, ఒకే లక్ష్యముకొరకు కొంతకాలము కలసి పనిచేయగలుగుదుము. కాని, ఎప్పుడైతే నా కార్యాచరణపరిధి నాకు చాలక వానిపరిధిలోనికి గూడా అతిచరింతునో అప్పుడు నేను సత్యపథమును అతిక్రమించినవాడ నగుదును. నా పొరుగు వానితో నాకు గల సంబంధాలలో అసత్యము అడుగుపెట్టును. అతనికంటె నేను యుక్తిశాలిని, బలశాలిని అయి వుండవచ్చును. అతడు తనకు జరిగిన అన్యాయమును తగినవిధముగా ప్రకటింపనుగూడా లేకపోవచ్చును. అయినా అది అసత్యమే! అసత్యము మరి అతనినీ నన్నూ సరిసమానముగ బాధించును. మానవుని స్వభావము ఎంతోకాలము తన అభినయమును కొనసాగించ లేదు. అది కార్యరూపము దాల్చిన అసత్యముగా, అనగా దౌర్జన్యముగా వ్యక్తముకాక తప్పదు. ఇట్లు పరుని వ్యవహారాలలో జోక్యము కలుగజేసుకొనుటే

జాతీయ రచనలు

ఖండకృతి 0-12-0 వ్యాసవాణి	... 0-6-0
కవిత (పద్యగేయ రత్నాలు)	... 0-8-0
నవగీతాలు	... 0-3-0
వయోజన విద్య	... 0-4-0
ఆంధ్రసేవ (జీవితాలు)	... 1-0.0
కాంగ్రెసు విజయము (చరిత్రాత్మక నాటకము)	1-0-0
ప్రజారాజ్యము (సామ్యవాద నాటకము)	1-0-0
జయభేరి (జాతీయఖండ కావ్యము.)	0-12-0

జాస్తి వేంకటనరసయ్య,
ఉభయభాషా ప్రవీణ.
చిలకలూరిపేట - గుంటూరుజిల్లా.

ప్రపంచ ప్రభుత్వా లన్నిటిలోను అత్యంత వికృతంగా కనుపించే మహాపరాధము. ఇద్దరి మధ్యఅది ఎంత తప్పో, చాలామంది విషయంలో కూడా అంతే తప్పు!——

నేటి అంతర్జాతీయ పరిస్థితుల దృష్ట్యా ఇది ఎలాంటి ఆశ్చర్యకరమైన హెచ్చరిక!

ఈ సంపుటిలో (1) రాజనీతి (2) కళ-విమర్శ (3) సత్యము, (4) మహాపురుషులూ, అనే నాలుగు ప్రధాన వ్యాసాలున్నాయి. కళ - విమర్శ అనే వ్యాసంలో సాహిత్య సంప్రదాయాలనూ, విమర్శ సంప్రదాయాలనూ నిర్మించుకోవడానికి ఉపకరించే విషయ సంచయం ఎంతో జిజ్ఞాసువుకు లభించుతుంది.

సరళమైన గ్రాంథికంలో, అనువాదం ప్రసన్నమై హృద్యంగా వుంది. ఎమర్సన్ వంటి మహామహుని గంభీరభావనను, ఇలా సువ్యక్తం చేయగలిగిన అనువాదకులను నిజంగా అభినందించవలసి వుంది. అనువాదకులు, గ్రంథాంతంలో ఎమర్సన్ జీవితచరిత్రను సంగ్రహంగా యిచ్చారు.

* * *

మొదటిమెట్టు

వివిధరచనా సంపుటి: ప్రచురణ: అభ్యుదయ సాహితి, సమితిస్థానం రాధారమణ్ కార్యాలయం పాలకొల్లు: వెల. 0-8-0.

దీల్లో శ్రీయుతులు తంగిరాల వెంకటేశ్వరరావు, కోరశ్మ వెంకటేశ్వరరావు, బి. వి. రాధారమణగుప్త, రామకృష్ణ యల్. యస్., ఆరేటి, 'జానకి', కె. పి. బాబు, దంతులూరి సుబ్బరాజు, పోలా ప్రగడ గోపాలకృష్ణ, కె. వి. యస్. యస్. రాజు, పెమ్మరాజు రామ సుబ్బారావు, మొదలైన యువరచయితల రచనలు పదిహేనువరకూ వున్నాయి. వీటిలో కొన్ని పద్యాలూ, కొన్ని గేయాలూ, కొన్ని కథలు, కొన్ని వ్యంగ్యరచనలు ఇత్యాదయః రకరకాలుగా వున్నాయి.

ప్రాథమిక రచయితల పురోగమనానికి దోహదంగా ఇలాటి గ్రంథాలను ప్రకటించటం వగైరా కార్యక్రమంకొరకు అభ్యుదయ సాహితీసమితి స్థాపించబడినట్లు ప్రకాశకులు పరిచయ వాక్యాలలో తెలియజేశారు. ఈ యువరచయితలు త్వరలో విఖ్యాతులు కాగలరనీ, ఆంధ్రసాహిత్యరంగంలో సుసంప్రదాయాలను స్థాపించగలరనీ ఆశించుతున్నాం.

'ప్రేయసీ! ప్రేయసీ!
పలుకవే ప్రేయసీ!
చిరునవ్వు చిలుకవే
మనసార పలుకవే
ప్రేయసీ! ఊర్వసీ.'

మొదలైన దచ్చురకం అనుకరణలు, 'ప్రణయంలో ప్రళయం' మొదలైన శీర్షికలలో కనుపించే చవుకపారు అభిరుచులూ పురోగమన కాంక్షులైన ఈ రచయితలకు అవశ్యం పరిహార్యములు.

* * *

గాథా సప్తశతి

అనువాదకులు: శ్రీ గట్టి లక్ష్మీనరసింహశాస్త్రి; ప్రాప్తిస్థానము:కూచి బోట్ల వీరరాఘవశాస్త్రి కళ్యాణీ ప్రెస్, తెనాలి. వెల రు. 3-0-0.

ప్రాకృతభాషా వాఙ్మయంలో గాథా సప్తశతి, మహత్తర గ్రంథంగా ప్రపంచ విఖ్యాతిని ఆర్జించుకుంది. ఆంధ్ర సామ్రాజ్య సంస్థాపకుడైన హాల సాతవాహనుడు ఈ గ్రంథాన్ని సంపుటీకరించినట్టు, నాటికి దేశవ్యాప్తంగా చెల్లాచెదరైయున్న అనేకమంది మహాకవుల రచనలను ఆయన అనేకమంది పండితులద్వారా కృషిచేసి సంపాదించి గ్రంథస్థం చేసినట్టూ చెబుతారు. ఈ గ్రంథం ఆనాటి మన నాగరికతా సంస్కృతులను సువ్యక్తం చేస్తుంది.

ఇది ముక్తక వాఙ్మయశాఖకు చెందింది. అంటే ఇతర పూర్వోత్తర గద్యపద్యాదికముల ఆవశ్యకత

కవితకు, కల్పనకు, వ్యక్తిత్వానికి, అనువాదములకు
మా ఉత్తమ సాహితీ రచనలు
1. కథావళి 2. భావగీతములు 3. రాజతరంగిణి
చదవండి ఒక్కొక్కటి రూపాయి పోస్టేజి ప్రత్యేకము
కళాకల్లోలినీ గ్రంథమాల, కొల్లపల్లి, కృష్ణాజిల్లా.

సుందర భారత యాత్ర
కన్యాకుమారి మొదలు కాశ్మీరు వరకు నలుదిశల గల వందలాది క్షేత్రములు, నదీనదములు, చారిత్రక నగరములు, రాష్ట్ర రాజధానులు, శిల్పవిశేషములతో 280 చిత్రపటములు 770 పైగా పేజీలు గలవు. వెల రు. 4-0-0. పోస్టేజి 1-4-0.
సాధన గ్రంథ మండలి, తెనాలి.

దానికి లేదు. చెప్పదలచిన గాథను స్వతంత్రముగా చెప్పివేయగలరు. ప్రతిపద్యమూ స్వతంత్రంగా ఒక కావ్యం - ఇది అభినవ గుప్తాచార్యుల నిర్వచనం. ముక్తక వాఙ్మయం శృంగారసాన్ని ఆశ్రయించి వుండటం గమనార్హం.

శ్రీ లక్ష్మీ నరసింహ శాస్త్రిగారు సంస్కృతాంధ్ర ప్రాకృతములలో విశేష పాండిత్యంగల ప్రతిభావంతులు, వీరి సంస్కృతానువాదాలు ఇదివరకే మనం చాలా చవిచూచియున్నాం. ఈముక్తకానువాదానికి పద్యనిర్మాణదక్షత ఎంతో అవసరం. ముచ్చట గొలిపే తెలుగుపదాలతోనూ తెలుగు సమాసమేమోనని భ్రమగొల్పే సంస్కృత సమాసతోరణాలతోను రచన పెళ్లిపందిరిలా కళకళలాడుతోంది. ఉదాహరణకు:

"పాప మాపిల్ల నీకునై రేపురూపు
గ్రంథుకొని గృహద్వారతోరణమునందు
బొందుపరచియు వంచినమాల చందమునను
వాడిపోవుచున్నది యెల్లపవలు గుట్టి"

ప్రతి పద్యంముందూ, ఆ పద్యంలో చెప్పబోయే గాథను, చక్కని తెలుగు వచనములో టూకీగా వివరించారు. గ్రంథానికి అత్యంత ప్రయోజనకరమైన పీఠికను కూడా స్వయంగా సంపుటీకరించారు.

* * *

అవిమారకము

మహాకవి భాసుని రూపకమునకు ఆంధ్రానువాదము : అనువాదకులు శ్రీ బలుసు సీతారామశాస్త్రి గారు. ప్రాప్తిస్థానము : రచయిత 22/234 ఇన్నీసుపేట రాజమహేంద్రవరము : వెల 1.4.0.

సంపూర్ణ నీతిచంద్రిక

మిత్రలాభము—మిత్రభేదము, ప్రథమభాగం, సంధి—విగ్రహము. రెండవభాగం. రచన : శ్రీ బలుసు సీతారామశాస్త్రిగారు. పబ్లిషర్సు : అడ్డేపల్లి అండ్ కో సరస్వతీ పవర్ ప్రెస్ రాజమహేంద్రవరము. వెల : ఒక్కొక్క భాగం ఒకరూపాయి. వీరు తొలినాటి, ప్రసిద్ధులైన నీతిచంద్రిక రచయితలను, చిన్నయసూరి, వీరేశలింగం ప్రభృతులను సంస్కరించవలసినది. ఏలకో అట్లు చేసినారుకాదు.

విదుల

పద్యకావ్యం : రచన : శ్రీ అకుండి వ్యాసమూర్తి శాస్త్రిగారు. ప్రాప్తిస్థానం : విమాపక విద్వాన్ అకుండి వెంకటశాస్త్రి. కొండూరివారి వీధి, తాడేపల్లిగూడెం. వెల : రు 0-6-0.

ఈ కథను సంస్కృత మహాభారతంలోని ఉద్యోగపర్వంనుంచి సేకరించి పద్యరచనగా సంఘటించారు. తిక్కన ఈ భాగాన్ని అనువాదం చెయ్యకుండా వదిలివేశారు.

భారతి సచిత్ర మాసపత్రిక

ప్రకటన రేట్లు

కవరు పేజీలు

4 వ కవరు పేజీ	కాజువల్	కంట్రాక్టు
2 లేక 3 రంగులు	రు. 125/-	రు. 100/-
2 లేక 3 వ కవరు పేజీ		
ఒకే (నలుపు) రంగు	90/-	75/-
లోపలి పేజీలు		
పూర్తి పేజీ	70/-	60/-
అర్థ పేజీ	35/-	30/-
పావు పేజీ	20/-	15/-

ప్రత్యేక స్థానములకు 25% అదనం.

సంవత్సరం వరుసగా 12 ప్రకటనలు చేయు వారికి కాంట్రాక్టు రేటు వర్తించును.

* కవులు, కళాకారులు, రచయితలు మొదలైన వారి ప్రకటనలు ఒక కాలం ఇంచికి లేపకు రు. 2/- చొప్పున ప్రకటించబడును.

మేనేజరు, భారతి,
మద్రాసు-1.

Printed & Published For Nageswara Rao Estates (Private) Ltd., by S. Radhakrishna, at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras—1. Editor: S. Sambhu Prasad.